శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం

కిష్కింధాకాండ

మందర మకరందం


వక్త

ఆంధ్ర వాల్మీకి - కవి సార్వభౌమ

శ్రీ వాసుదాసస్వామి

అనువక్త - వాచవి

వనం జ్వాలా నరసింహారావు



ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక విశిష్ట ప్రచురణ

శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం

కిష్కింధాకాండ
మందర మకరందం

వక్త
ఆంధ్రవాల్మీకి–కవిసార్వభౌమ
వావిలికొలను సుబ్బారావు
శ్రీ వాసుదాసస్వామి

అనువక్త–వాచవి
వనం జ్వాలా నరసింహారావు

"దర్శనమ్"
ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక సభక్తి పూర్వక సమర్పణం

కిష్కింధాకాండ మందరమకరందం

వక్త

ఆంధ్రవాల్మీకి–కవిసార్వభౌమ

శ్రీ వాసుదాసస్వామి

అనువక్త–వాచవి

వనం జ్వాలా నరసింహారావు

ప్రథమ ముద్రణ

జులై 2019

ప్రతులు 1000

వెల: రు. 300

ముఖచిత్రం: **రామోజు గణేష్**

లేఅవుట్ : **శ్రీనివాసరావు త్రిపురాన**

ముద్రణ: **సాయితిరుమల ప్రింటింగ్ ప్రెస్,**
చిక్కడపల్లి, హైదరాబాద్

ప్రతులకు:

మరుమాముల వెంకట రమణ శర్మ

దర్శనమ్ ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీరామసిద్ధాంతి భవనం, 29–105/4/1,

న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్,

సికిందరాబాద్–5000 56

ఫోన్: 94410 15469, 040–27220401

విషయసూచిక

జయభేరి

మ్రొక్కెద రామచంద్రునకు మోడ్చెద గేలు సుమిత్ర పట్టికిన్
మ్రొక్కెద దద్విదేహపతనూజకు శ్రీరఘురాము దేవికిన్
మ్రొక్కెద ధర్మ వాసవ మరుద్గణ మారుత రుద్రపాళికిన్
మ్రొక్కెద సూర్యచంద్రులకు మ్రొక్కెద దామరసాప్తు సూతికిన్''

★

''జయము జయంబు రామునకు సారపరాక్రమ ధన్యమూర్తికిన్
జయము జయంబు విద్విశద సహ్యత రస్వి సుమిత్ర పట్టికిన్
జయము జయంబు దాశరథి సంపరిపాలితుడౌ వలీముఖో
చ్చయపతి సూర్యపుత్రునకు సాహస విక్రమ కీర్తిశాలికిన్''

★

''దాసుడ సర్వసద్గుణ వితాన మనోహర రామమూర్తికిన్
గోసల దేశ వల్లభునకున్ హతశత్రుడ వాయుపుత్రుడన్
నాసరిగారు సంగరమునన్ దశకంఠులు వేవురేనియున్
వాసియడంతురాల ద్రుమ పాళుల నే హనుమత్సమాఖ్యుడన్''

★

''అయోధ్యాపుర నేతారమ్, మిధిలాపుర నాయకీమ్
రాఘవాణా మలంకారమ్, వైదేహానా మలంకియామ్'
రఘూణామ్ కులదీపంచ, నిమీనామ్ కులదీపికామ్'
సూర్యవంశ సముద్భూతమ్, సోమవంశ సముద్భవమ్'

★

పుత్రమ్ దశరధస్యాపి, పుత్రీమ్ జనక భూపతే
వసిష్టను మతాచారమ్, శతానంద మతానుగామ్'
కౌసల్యా గర్భ సంభూతమ్, వేదగర్భోదితామ్ స్వయమ్'
పుండరీక విశాలాక్షమ్, స్ఫురదిన్దీ వరేక్షణామ్'
మత్త మాతంగ గమనమ్, మత్తహమ్స వధూగతామ్'

★

సర్వలోక విధాతారమ్, సర్వలోక విధాయినీమ్'
లోకాభిరామమ్ శ్రీరామమ్ అభిరామాంచ మైధిలీమ్
అన్యోన్య సదృశా వేతౌ త్రైలోక్య గృహదమ్పతీ''

ముందుగా నా మాట

మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో రెండు దశాబ్దాల క్రితం అదనపు సంచాలకుడిగా పనిచేస్తున్న రోజుల్లో అక్కడి ప్రభుత్వ క్వార్టర్స్లో నివసిస్తుండే వాడిని. మా పొరుగునున్న శ్రీమాన్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు లేచింది మొదలు నిద్ర పోయేదాక రామనామం తప్ప దేని మీద మనస్సు పోనీయడు. ప్రతినిత్యం రామాయణ పారాయణం చేస్తూ వుంటాడు. నా కంటే వయస్సులో చిన్న వాడైనా, జ్ఞానవృద్ధుడు. నా నిత్య కృత్యాలు చాలవరకు ఆయనకు నచ్చవు. నేనంటే మాత్రం ఇష్టం. ఆయన ఉదయం అనుష్టానం చేసుకుంటుంటే, చనిపోయిన మా నాన్న స్వర్గీయ వనం శ్రీనివాసరావు గారు గుర్తొచ్చేవారు. నాన్నగారు వాసుదాసు గారు రచించిన ఆంధ్ర వాల్మీకి రామాయణం, మందరం అన్ని కాండల్నీ, కనీసం పాతిక సార్లకు పైగా పారాయణం చేసినవారు. వాసుదాసుగారూ ఆయన శిశ్యులు సుబ్బదాసుగారూ (దాసశేషుడు) ఖమ్మం జిల్లాలోని వనంవారి కృష్ణాపురం గ్రామంలో వున్న మా ఇంట్లో వారి పాదాలు మోపి మా ఇంటిని పావనం చేసారు చాలా సంవత్సరాల కింద. నేనూ మా నాన్నగారితో నా చిన్నతనంలో తెనాలి దగ్గర అంగలకుదురులోని వారి ఆశ్రమానికి వెళ్లాను ఒకటి-రెండు సార్లు.

మా శ్రీమతికి మా నాన్న గారి పూజ-పునస్కారాల వారసత్వం వచ్చింది. నాకంతగా అబ్బ లేదు. ప్రక్కనున్న విజయరాఘవ గారినీ, ఆయన భక్తి సంబంధమైన మాటలను ఎప్పుడూ వింటుంటే ఆమె: " మీరు అన్న గారి

మార్గంలోనన్నా పోతారు, లేదా, ఆయన మీ దారికన్నా వస్తారు" అనేది, మేమిద్దరం చర్చించుకుంటుంటే. అదే నిజమైంది కొద్ది రోజుల్లో. నేను రామాయణం చదువుతాను, మీదగ్గరుంటే ఇవ్వండి, అయితే వాసుదాసు గారు వ్రాసిన ఆంధ్రవాల్మీకి రామాయణం మాత్రమే కావాలన్నాను. అలా అడగటానికీ, అదే కావాలంటానికీ, ప్రత్యేక కారణం ఏమీ లేదు. కాకపోతే నా చిన్న తనంలో, మా నాన్న గారు "మందరం" పారాయణం చేస్తుంటే చూశాను కనుక అది మాత్రమే రామాయణమేమో అనుకున్నాను. అయితే నేను రామాయణం చదువుతానంటే ఆయన కొన్నాళ్ళు నమ్మలేదు. నేనూ గట్టిగా అడగనూలేదు. ఆయన ఇవ్వనూ లేదు. నేను ఆలోచన వచ్చిన వెంటనే చదవటమూ జరగలేదు.

మళ్ళీ నిత్య జీవితం. దైనందిన చర్యలు. మధ్యలో మా జిల్లాలోనే వున్న భద్రాచల రాముడినీ, పొరుగు రాష్ట్రంలో ఉన్న శ్రీరంగనాథ స్వామినీ, దర్శించుకొనే భాగ్యం కలిగింది, డిసెంబర్ 2002-జనవరి 2003 లో. "శ్రీ రామావతార సమయంలో శ్రీ సీతా రాముల దర్శనం ఏదోవిధంగా కలగందే ఈ జన్మలో శ్రీరంగనాథుని (శ్రీరంగం) దర్శనం కలగనే కలగదు" అన్నారు విజయరాఘవ గారు. జనవరి 15, 2003 న తన ఇంట్లోకి పిల్చి, స్నానం చేసి రమ్మని, వాసుదాసుగారి శ్రీమదాంధ్రవాల్మీకి రామాయణం సుందరకాండ మందరం నా చేతిలో పెట్టారు. రామాయణం మొత్తం చదవడం తర్వాత, ముందిది చదవమన్నారు. ఎందుకంటే, రామాయణం పఠనమో, పారాయణమో సుందరకాండ తోనే మొదలెట్టాలన్నారు. అవునేమోననుకుని చదవడం ప్రారంభించాను.

సరీగ్గా పది రోజుల్లో ఆసాంతం చదివాను. ఏరోజుకారోజు, వీలున్నప్పుడల్లా చదివేవాడిని. చదివిన విషయ సారాంశం ఎప్పటికప్పుడు బడి పిల్లాడిలా, విజయరాఘవ గారికి అప్ప చెప్పే వాడిని. వశిష్ఠుడి నోట బ్రహ్మర్షి అంటేనే విశ్వామిత్రుడు ఒప్పుకున్నాడట! నేను చదువుతున్నానన్న నమ్మకం ఆయనకు కలిగితేనే నాకెందుకో తృప్తనిపిన్చేది. పదిరోజుల్లో చదవడం గొప్ప కాదు. నన్ను ప్రేరేపించి, ప్రోత్సహించి చదివించిన ఆయన గొప్పతనం అది. వాల్మీకి సంస్కృతంలో వ్రాసిన ఇరవైనాలుగు వేల శ్లోకాలను ఎప్పుడంటే అప్పుడు ప్రతిపదార్థంతో సహా అప్పచెప్పగల సమర్థుడాయన!

ఆరువందల డెబ్బై పేజీల పద్య-గద్య-ప్రతిపదార్థ తాత్పర్య సహిత సుందరకాండ

మందరాన్ని చదవడానికైనా, పారాయణం చేయడానికైనా, నాలాంటి చాలామందికి తీరికా, ఓపికా వుండదేమో అనిపించింది. తెలుగు భాషలో కనీస ప్రావీణ్యత వున్నవారికి అర్ధమయ్యే రీతిలో వాసుదాసుగారి సుందరకాండ మందరాన్ని, ఆయనే "వక్తగా", నేను కేవలం "వాచవిగా"-"అనువక్తగా" సంక్షిప్తీకరించి నలుగురికీ అందించగలుగుతే బాగుంటుందేమో అనుకున్నాను

కొన్ని పేజీలు వ్రాసినతర్వాత విజయరాఘవగారు చూసారు. సుందర హనుమంతుడిని అర్థం చేసుకున్న దాఖలాకు నేను వ్రాసిన కొన్ని పేజీలు నిదర్శనమని వ్యాఖ్యానించారు. "బాగుంది, పెద్దల ఆదరాభి మానాలకు, ఆమోద-ప్రమోదాలకు పాత్రం కాగలదు" అంటూనే, మనం మాట్లాడే శిష్ట వ్యావహారిక భాషలో వ్రాయడం వల్ల మరింత శోభిస్తుందని ఓ చురక తగిలించారు. ఇంతలో అనుకోకుండా సిన్సినాటి (అమెరికా) లో వుంటున్న మా అమ్మాయి కిన్నెర దగ్గరకు మా ఆవిడతో సహా వెళ్లాల్సి వచ్చింది, మనుమరాలు పుట్టబోయేముందర మా అమ్మాయికి తోడుగా వుండేటందుకు. అక్కడ మళ్ళీ మొదలెట్టి ఓ నెల రోజుల వ్యవధిలో శ్రీరామానుగ్రహం వల్ల పూర్తి చేసాను. అయితే, అసలు-సిసలు శిష్ట వ్యావహారిక భాష అన్ని చోట్లా వాడలేక పోయాను.

అలా సుందర కాండ మందరమకరందం పూర్తి చేసిన తరువాత దాన్ని ఇప్పటికి మూడు పర్యాయాలు, తడవకు వేయి కాపీల చొప్పున ముద్రించడం, పదిమందికి పంచిపెట్టడం జరిగింది.

ఆ తరువాత చాలామంది, ముఖ్యంగా కోరమాండల్ సీతారామయ్య గారు, చిలకపాటి విజయ రాఘవాచార్యులు గారు, తదితర పెద్దల సూచన మేరకు రామాయణంలోని మిగతా కాండలు కూడా శిష్ట వ్యవహారిక భాషలో అనువక్తగా సంక్షిప్తీకరించడానికి నిర్ణయించుకున్నాను. 2009 సంవత్సరంలో మా అబ్బాయి ఆదిత్య, కోడలు పారుల్ కపూర్ అమెరికా, సాన్ ఫ్రాన్సిస్కో లో వుంటున్నప్పుడు, వాళ్లకు కూతురు (మాకు ఇంకో మనుమరాలు-కనక్) పుట్ట బోయే ముందు అక్కడికి పోవాల్సి వచ్చింది భార్యా సమేతంగా. అప్పుడు అమెరికాలో ఆర్నెల్లు, కొన్నాళ్లు అక్కడా, కొన్నాళ్లు మా అమ్మాయి వుంటున్న హ్యూస్టన్ లో వున్నాం. ఆ సందర్భంగా బాలకాండ మందర మకరందం రాయడం పూర్తి చేయగలిగాను. దాని మొదటి ముద్రణ 2010 లో త్రిదండి చిన

జీయర్ స్వామి (పుస్తకానికి వారి ఉపోద్ఘాతంతో) జీయర్ ట్రస్ట్ ద్వారా చేయించారు. పుస్తక ఆవిష్కరణ కూడా ఆయనే చేశారు. బాలకాండ ద్వితీయ ముద్రణ ఇటీవలే జరిగింది.

ఆ తరువాత అయోధ్యాకాండ మందర మకరందం రాయడం ప్రారంభించాను. ఆ కాండ చాలా పెద్దది. మందరమే రెండు భాగాలుగా రాశారు వాసుదాస స్వామి. 2010-11 లో మొదలు పెట్టిన అయోధ్యాకాండ హైదరాబాద్ లో కొంత, సింగపూర్లో కొంత, మళ్లీ హైదరాబాద్ లో కొంత రాశాను కాని చాలాకాలం వరకు పూర్తి చేయలేకపోయాను. అయోధ్యాకాండ సాగనివ్వదని కోరమాండల్ సీతారామయ్య గారు అనేవారు. మరోమారు మా అబ్బాయి, కోడలు వుంటున్న అమెరికా, సాన్ ఫ్రాన్సిస్కోకు వెళ్లాం 2017 లో. అప్పుడు తదేక దీక్షగా రాసి, అరణ్యాకాండ మందరమకరందం పూర్తి చేశాను. దాని ముద్రణ అమెరికా నుండి వచ్చిన వెంటనే 2017లో అయింది. ఆ వెంటనే అరణ్యకాండ మందరమకరందం రాయడం మొదలెట్టాను. అంతకు ముందు రాసిన మూడు కాండలు అమెరికాలో పూర్తవుతే అరణ్యకాండ మాత్రం పూర్తిగా ఇక్కడే రాశాను. దాని ముద్రణ కూడా గత ఏడాది జులై నెలలో అయింది. త్రిదండి చిన జీయర్ స్వామి దాన్ని ఆవిష్కరించారు.

ఇదిగో ఇప్పుడు కిష్కింధాకాండ కూడా రామానుగ్రహం వల్ల పూర్తి చేయడం, మీ ముందుకు తీసుకు రావడం జరుగుతున్నది.

సహృదయులు చదివి నన్ను ప్రోత్సహించాలని ప్రార్థన.

– వనం జ్వాలా నరసింహారావు

'వాచం హృదయ హారిణీమ్'

శ్రీరామ జయరామ కోదండరామ! కళ్యాణగుణధామ! సీతారామ!
సురవైరిగణభీమ! పట్టాభిరామ! శ్రీరామ జయరామ జయజయరామ!!

ఇది మన శ్రీ జ్వాలా నరసింహరాయల వారి మందారమకరంద 'మందర' రామాయణానికి అనువచనం. ఇప్పటికే బాల, అయోధ్య, అరణ్య, సుందరకాండలను రుచి చూపించే 'వాచవి'గా, 'అనువక్త'గా 'వాసుదాస' స్వామివారి 'మందరా'న్ని అందంగా చక్కని చిక్కని సంభాషణాశైలిలో, సంక్షిప్తసుందరంగా తెలుగువారికి అందించిన మాధుర్యవచో విలసన్మణి ఆయన. ఇప్పుడు కిష్కింధాకాండను మనకు విన్పిస్తున్న 'కల్యాణమిత్రుడు'. భారతీయులకు శ్రీరామాయణం–భాగవతం పవిత్రపారాయణ గ్రంథాలు. భారతం ఇతిహాసం, కాలక్షేప గ్రంథం. పురాణ పరిమళం. ఇవి సనాతన ధార్మిక త్రివేణి స్థావరాలు. వాల్మీక, వ్యాసాదులు అనుగ్రహించిన వరాలు. దారి దీపాలు. భారతీయ ఆధ్యాత్మిక ఔన్నత్యానికి దివ్య జ్యోతులు. ఇందులో వాల్మీకి రామాయణాన్ని'ఆదికావ్యం' అంటారు. మహర్షి వాల్మీకిని 'ఆదికవి' అంటారు. వారి అనుగ్రహప్రసాదమే ఈ వేళ కోట్లాది భారతీయులకు శ్రీ రామాయణం ఆజీవనపారాయణమైంది.భారత జాతి సమైక్యతకు మూలకందమైంది. సామాజిక జీవన సౌందర్యానికి 'కౌముది' అయింది. అక్షర సంపద గలవారికి 'శ్రీ రామాయణం' కల్పవృక్షమైంది. జ్ఞానపీఠమైంది.

మహర్షి వాల్మీకి విశ్వ వాఙ్మయానికి అందించిన సంస్కృత రామాయణం 'ఆంధ్ర వాల్మీకి రామాయణం'గా, ఆంధ్ర తాత్పర్య విశేషాలతో 'అపర

వాల్మీకి'గా, 'ఆంధ్ర వాల్మీకి'గా పండిత పామరులచే సంభావించబడిన శ్రీ వైకుంఠవాసులైన వావిలికొలను సుబ్బారావు గారిచేత 'మందరం'గా మలచబడి, అశేష ఆంధ్రలోకం చే సమాదరించబడి, నిత్యపారాయణ గ్రంథంగా ఆరాధించబడుతోంది. ఆ మహా మహానుభావులు సప్తకాండ సంశోభితమైన వాల్మీకంలోని 24 వేల శ్లోకాలకు 24 వేల పద్యాలతో తెలుగు అనువాదం యధాతధంగా చేశారు. శ్రీరామానుగ్రహప్రేరణతో తాము వ్రాసిన 24 వేల పద్యాలకు 'మందరం' అనే పేరుతో విశిష్ట విశేష విపుల వ్యాఖ్యానాన్ని అందించారు. మందరం 9 సంపుటాలలో ఆవిష్కరించబడింది. (వారి అవతార సమయం 23-01-1863 నుండి 01-07-1936). తమ 68 వ ఏట, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూనే మందరాన్ని ప్రారంభించారు. 'ఆంధ్రవాల్మీకి' రామాయణం 1904 లో ప్రారంభించి 1908 నాటికి పూర్తి చేశారు. రోజుకు 24 గంటలు శ్రమించారు. శ్రీవారి 'మందరా' నికి సంక్షిప్త రూపమే మన వనం జ్వాలా నరసింహారావు గారి 'మందర మకరందం'!

జ్వాలా నరసింహారావు గారే మొదట వారి 'మాట' గా చెప్పారు ఇందులో ఈ గ్రంథ నేపథ్యం గురించి. విశేషమేమంటే 'మందరం' జ్ఞానపిపాసికి విజ్ఞానసర్వస్వం. వాసుదాసస్వామి వారు ప్రయోగించిన ఛందోవృత్తాలు సాహితీ పిపాసికి 'వసంతకుసుమాకారాలు', 'పూర్ణచంద్రోదయాలు'. జ్వాలాగారు ఈ వృత్తాలను సైతం అవలోడనం చేసి, వేరొక ఆవిష్కరణ చేశారు. భక్తకవి పోతన్నగారు వాసుదాసస్వామి వారికి స్ఫూర్తిమూర్తి. అందువల్లే వాసుదాసస్వామి వారు వాల్మీకాన్ని 108 సార్లు పారాయణం చేయడం ఒక విశేషమైతే, శ్రీరామాయణంలో శ్రీ సీతారాములకు ఏ విధంగా మహా సామ్రాజ్య పట్టాభిషేకం చేయబడినదో, అదే విధంగా, యథాతథంగా ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి సన్నిధిలో 500 నదీజలాలను తెప్పించి పట్టాభిషేకం చేయడం అపూర్వమైన విశేషం.

ఆ విధంగా ఈ వేళ ఒంటిమిట్టలో -అంటే ఏకశిలానగరం- శిలాఫలకం మనకు సాక్షాత్కరిస్తోంది. మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో ఆంధ్రశాఖాధ్యక్షులుగా, ఆచార్యులుగా ఉద్యోగించి (1904-20), ఆ సమయంలో భార్యావియోగం పొంది, పదవీ విరమణానంతరం ఎన్నో మహా గ్రంథాలను రచించారు. శ్రీ కుమారాభ్యుదయం, కౌసల్యా పరిణయం, సుభద్రా విజయం, పోతరాజు

విజయం, ఆంధ్ర విజయం ప్రభంధాలు కాగా, వివిధ హితచర్యలు, ఆర్య కథానిధులు, పోతన్న నికేతన చర్చ, సులభ వ్యాకరణం వంటి ఇతర గ్రంథాలెన్నో ప్రచురించబడినాయి. వారు ప్రారంభించిన 'భక్తిసంజీవని' 'భక్తి, జ్ఞాన, కర్మ యోగములు తెలుపు మాస పత్రిక-యథాతథంగా 81 సంవత్సరాలుగా అవిచ్ఛిన్నంగా గుంటూరు జిల్లా, తెనాలి దగ్గర అంగలకుదురు "శ్రీ కోదండరామసేవక ధర్మసమాజం' పేరిట చక్కగా ప్రచురించబడుతోంది. ఆ పత్రిక చివరి కవరు పేజీ తప్పక చూచి, చదివితీరవలసినదే! వివేకముగల ఆర్తులు! ఇవన్నీ ఎందుకు ప్రస్తావిస్తున్నానంటే-మన వాసుదాసస్వామి వారి వైభవాన్ని గురించిగానీ, వారి 'మందారాన్ని' గురించిగానీ, మా జ్వాలా నరసింహారావు గారికంటే పరిచయం చేయగలవారు మరొకరు కన్పించడంలేదు శ్రీవారి శిష్యులు తప్ప! అంత పరిశోధన చేసిన వ్యక్తి 'జ్వాలా' గారు. నిష్కర్షగా చెప్పాలంటే-శ్రీ వాసుదాసస్వామి వారు 'జ్ఞానపీఠ'నికి, మరొక జాతీయ స్థాయి పురస్కారానికో-'పద్మ' పురస్కారానికో పూర్తిగా అర్హులు మరణానంతరమైనా!

పరిశోధన చేయగలవారికి 'మందరం' మహా జ్ఞాన పుష్కరిణి. శ్రీ వాసుదాస స్వామి వారు 'పరిశోధనా లక్ష్యం' గా ఎంతైనా పరిశోధన చేయవచ్చు. జ్వాలా గారు చేసిన, చేస్తోన్న కృషికి సైతం 'డాక్టరేట్' చక్కగా ఇవ్వదగునని నేను భావిస్తున్నాను.

ఇక ప్రస్తుత గ్రంథం విషయానికి వస్తే—ఇది కిష్కింధాకాండ. శ్రీ రామాయణంలో ఏమున్నదో, ఎందుకు చదవాలో వాసుదాస స్వామి వారి పీఠికతో బాటు తనదైన నిరుపమాన శైలిలో జ్వాలాగారు చక్కగా వివరించారు. శాబ్దిక విశేషాలనూ, శ్రీరామావతార వైభవాన్నీ, వైలక్ష్యాన్ని తెలియజేశారు. కావ్య 'అంతర ధ్వని'ని విగ్గడించారు. 'అవతారిక'లో అరణ్యకాండను కిష్కింధాకాండతో సందర్భాన్ని సూచిస్తూ అనుసంధించారు. కిష్కింధకాండ ప్రధానంగా ద్వయమంత్రమందలి 'చరణౌ' పదానికి వివరణమని పెద్దల నిష్కర్య. ఇది జ్ఞానకాండ. అరణ్యకాండ దీన సంరక్షణమనే ధర్మాన్ని శ్రీ రామచంద్రమూర్తి ఏ విధంగా అనుష్ఠించారోవివరిస్తుంది. మిత్రరక్షణమనే ధర్మాన్ని ఆవిష్కరిస్తుంది. శ్రీ రామచంద్రమూర్తి అసంఖ్యేయ కల్యాణ గుణాలను చక్కగా వివరిస్తుంది.

సరిగ్గా కాండ ప్రారంభంలోనే మహాద్భుతమైన, తాత్త్వికశబ్ద, అర్థ సంభరితమైన 'పంపా' వర్ణనతో మనల్ని ఆశ్చర్యపరుస్తుంది. బుద్ధిమతాంవరిష్ఠుడైన

ఆంజనేయస్వామి పరివ్రాజక రూపురేఖా విలాసాలతో దర్శనమిస్తాడు. కొందరు మహానుభావులు కిష్కింధాకాండను 'హనుమ'కాండ అనవచ్చునంటారు. ఈ కాండలో వర్ణనలు విశేశంగా కన్పిస్తాయి. వర్షఋతు వర్ణనము (28 సర్గ), నాలుగు దిక్కులలో ఉన్న భౌగోళిక ప్రదేశ వర్ణనలు (40–44 సర్గలు), భాషా ప్రియులకు, ఆలోచనామృతాన్ని అందిస్తాయి. శ్రీ రామ–సుగ్రీవ మైత్రి, వాలివధ విషయమై 'ధర్మ' చర్చ, సుగ్రీవునికి మొదటి యుద్ధములో వాలి వల్ల పరాభవం, తార ధర్మ, లౌకిక ధర్మ వివరణం, లక్ష్మణ స్వామి భ్రాతృ భక్తి—ఇలాంటివెన్నో ధర్మ సముచ్చయాలు కిష్కింధాకాండలో గ్రహిస్తాము.

వదినె గారి పట్ల మరిది ఎలా ప్రవర్తించాలో లక్ష్మణస్వామి పలికిన మాటలు మనస్సును ఆర్ద్రం చేస్తాయి. సీతమ్మగిరిపై పడవేసిన నగల మూటను చూచి, ఇవి మీ వదినెవేమో చూడమన్న రాములవారితో లక్ష్మణ స్వామి అన్న మాటలు.

శ్లో॥ నా హం జానామి కేయూరే నా హం జానామి కుండలే ।

నూపురేత్వభి జానామి నిత్యం పాదాభివందనాత్ ॥

సనాతన ధర్మ ప్రతిపాదితమైన భారతీయ సంస్కృతికి, సంప్రదాయాలకు ఇది మణిదీప్వం.

'అన్నా! ఈ కేయూరాలను, కుండలాలను నేను ఎరుగను. కానీ నిత్యమూ మా వదినెమ్మకు పాదాభివాదనం చేస్తాను గనుక, ఈ కాలి అందెలు వదినెమ్మవే అని చెప్పగలను'.

ఈ వేళ జాతీయ స్థాయి పరిపాలక శిక్షణ సంస్థలలో సైతం శ్రీ రామాయణాన్నిసోదాహరణంగా వివిధ సందర్భాలను, సన్నివేశాలను శిక్షణాంశాలుగా స్వీకరిస్తున్నారు. అందులో ప్రధానంగా సున్నితమైన నైపుణ్యాలను (softskills) శ్రీరామాయణం నుంచే సేకరించి, శిక్షణాంశాలుగా బోధిస్తున్నారు. శ్రీ ఆంజనేయస్వామి వారిని 'సంభాషణా కౌశలాలు' అనే శిక్షణాంశానికీ (communication skills), శ్రీ రామచంద్రస్వామిని 'జట్టుకట్టడం' (Team building) అనే అంశానికీ, 'ఇరువర్గాల మధ్య సయోధ్య' (Negotiation Technique) కూ, జాంబవంతుని 'ప్రేరణ'(motivation) కూ, 'ధర్మమీమాంస–మానవీయ విలువలు'

(Ethics & Human values) కూ—ఇలా ఎన్నో శిక్షణాంశాలకు కిష్కింధా, సుందరకాండలు అద్భుతమైన శిక్షణ సామాగ్రిని అందిస్తున్నాయి. జ్వాలా నరసింహారావు గారు మొదట శిక్షణవేత్తగా (Trainer) రాణించిన వ్యక్తి కావడం వల్ల కిష్కింధాకాండలో ఆయా సందర్భాలలో ఈ శిక్షణాంశాలను చక్కగా వివరించడం జరిగింది.

కిష్కింధాకాండలో ప్రస్తావించబడిన ధర్మ సూక్ష్మాలు ఈనాటి సమాజానికి ఎంతో ప్రయోజనకరం. వావి వరుసలు, సభ్యతా, సంస్కారాలు క్షీణించిపోతున్న కాలంలో చక్కని శైలిలో పామరులకు సైతం హాయిగా చదువుకునేందుకు దీనిని మలిచారు జ్వాలా గారు. ఉదాహరణకు వాలిని ఎందుకు చెట్టు చాటున నుండి వధించాల్సి వచ్చిందో శ్రీరామచంద్రస్వామి వాలికి వివరిస్తాడు.

శ్లో|| ఔరసీం భగినీం చాపి భార్యాం వాస్యమ జస్యయః |
ప్రచరేత నరః కామాత్ తస్య దండో వధఃస్మృతః ||

(ఎవడు కూతురు, చెల్లెలు, తమ్ముని భార్య మొదలైన వారిపట్ల కాముకుడై ప్రవర్తిస్తాడో వానిని వధించడమే సరైన దండన అని ధర్మశాస్త్ర వచనం).వాలి అంగీకరిస్తాడు. క్షమించమంటాడు. అలాగే వాలి తన చరమదశలో తన ప్రియపుత్రుడైన అంగదుడితో ఇలా అంటాడు.

శ్లో|| నచాతి ప్రణయఃకార్యః కర్తవ్యో ప్రణయశ్చతే |
ఉభయం హి మహాన్ దోషః తస్మాదంతర దృర్చవ||

(నాయనా ఎవ్వరినీ ఎక్కువగా ప్రేమించకు. ఎవ్వరిపైనా ద్వేషం పెంచుకోకు. ప్రేమద్వేషం రెండూ పెద్ద దోషాలే ! కాబట్టి అంతర్ముఖుడవై జాగ్రత్తగా ప్రవర్తించు)

తప్పు చేసినవారు చివరకు ఎలా అధోగతిపాలై అప మృత్యువాత పడిపోయారే, మిగిలిన అలాంటి వారు జాగ్రత్తగా ప్రవర్తించాలి. ఈ విషయమై సుగ్రీవుడితో అన్నమాటగా లక్ష్మణస్వామి చేసిన హెచ్చరిక.

శ్లో|| నచ సంకుచితఃపంథాః యేన వాలీ హతో గతః|
సమయే తిష్ఠ సుగ్రీవ| మా వాలి వధ మన్వగాః|

(సుగ్రీవా! మీ అన్న వాలి వెళ్లిన ద్వారం ఇంకా మూతపడలేదు. అన్నమాట నిలుపుకో! మీ అన్న వాలి పోయిన త్రోవనే ప్రయాణం చెయ్యకు!) సీతాన్వేషణ కర్తవ్యాన్ని మరచి భోగలాలసుడవై వుండదలిస్తే నీకూ చావు తప్పదని అంతర ధ్వని !)

అనేకానేక ధర్మ మర్మాలను, లౌకిక వ్యవహారాలను, మహా విషయాలను, మహామంత్ర అంతరార్థాలను నింపుకున్న కిష్కింధాకాండ జ్వాలా పాలిట 'కలకండ'గా మారి మనకు అందిస్తోంది. చాలా కష్టమైన పదాలతో నడిచే కాండ ఇది. వాసుదాస స్వామివారు 'గోవింద రాజీయ' వ్యాఖ్యానాన్ని అనుసరించి, దానిని మరింత పరిమళభరితంగా తెలుగుభాషలో మనకు తెలియపరిచారు. తొమ్మిది సంపుటాలలో విస్తరించిన విశేష వ్యాఖ్యానాన్ని క్లుప్త సుందరంగా మనకు రుచికరంగా వివరించారు జ్వాలా నరసింహరావు గారు. వారన్నట్లు వారి పితృపాదులు, పరమపదవాసులు శ్రీనివాసరావుగారు తనవలెనే కుమారుడు కూడా శ్రీరామాయణ పారాయణ పూర్వక ప్రవచన రచనను చేసినందున 'పితేవ పరితుష్యతి' అస్తు!

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో (హైదరాబాదు) వారు అదనపు సంచాలకులుగా, నేను ప్రొఫెసర్ గా సహవ్రతులం, ఇరుగు పొరుగులం, సహ పాఠకులం, సహోద్యోగులం కావడం అనే భాగ్య విశేషం వల్ల, 'శ్రీరామాయణం మాకు నిత్య సంభాషణం' కావడం వల్ల నాలుగు వాక్యాలు విన్నవించే సౌభాగ్యం నాకు కల్పించినందుకు, నా అయోగ్యతను విస్మరించి, నన్ను ఈ విధంగా సంభావించినందుకు కృతజ్ఞతలు తెల్పుకుంటున్నాను.

శ్లో॥ కృతం హి ప్రియమస్మాకం రాఘవేణ మహాత్మనా।
తస్య చేత్ ప్రతికారోస్తి జీవితం సఫలం భవేత్ ।। (కిష్కింధా)

విజయవాడ
17-06-2019

శ్రీరామ రామానుజ దాసానుదాసుడు
చిలకపాటి విజయ రాఘవాచార్యులు
చీఫ్ కన్సల్టెంట్,
నైపుణ్యాభి వృద్ధి, ఉద్యోగకల్పన శాఖ
అంధ్రప్రదేశ్ ప్రభుత్వం, విజయవాడ

చిన్నా-పెద్దా-అందరికీ కృతజ్ఞతలు

ఎందరో సహృదయులు, అందరికీ కృతజ్ఞతలు. ఈ అరణ్యకాండ మందర మకరందం వ్రాయడానికి వాడిన కలం కానీ, కాగితం కానీ, టైపు చెసిన కంప్యూటర్లు కానీ నావి కావు. అలాంటప్పుడు రాసింది నేను మాత్రమేనని, రాసిన విషయమంతా నా కృషివల్లనే జరిగిందని ఎలా అనగలను? నేనేంటి? ఆంధ్రవాల్మీకి రామాయణం అరణ్యకాండ మందరం చదవడమేంటి? చదివిన తర్వాత మందర మకరందం గా మలచడమేంటి? తెలుగు సాహిత్యంలో, రచనా వ్యాసంగంలో అంతో, ఇంతో ప్రవేశం వున్న మాట కొంత వాస్తవమే అయినప్పటికీ, ఆంధ్రవాల్మీకి అరణ్యకాండను మందర మకరందంగా మలిచే శక్తి నాకు కలగడమేంటి?

రామాయణం నేను రాయడానికి అనుక్షణం నన్ను ప్రోత్సహించిన మా శ్రీమతికి ధన్యవాదాలు.

మా పిల్లలు ప్రేమ మాలిని, కిన్నెర, ఆదిత్య, అల్లుళ్ళు విజయగోపాల్, కిషన్, కోడలు పారుల్, వాళ్ల పిల్లలు యశ్విన్, మేథ, మిహిర, అన్ష్, కనక్, ఇరాలకు కూడా థాన్క్స్.

ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడిన మరెందరికో ధన్యవాదాలు. ముఖ్యంగా కేవలం ప్రోత్సహించడమే కాకుండా ఆర్థికంగా మందర మకరందం పుస్తక ప్రచురణలకు సహాయం చేస్తున్న కోరమాండల్ సీతారామయ్య గారికి ప్రత్యేక

ధన్యవాదాలు.

ఆంధ్రభూమి ఆదివారం సంచికలో ధారావాహికంగా ప్రచురిస్తున్న సంపాదకులు సదాశివ శర్మ గారికి ధన్యవాదాలు.

దర్శనమ్ శర్మగారికి ధన్యవాదాలు. ముఖ చిత్రం వేసిన గణేష్ కు ధన్యవాదాలు. ముద్రించిన ప్రింటర్స్ కు ధన్యవాదాలు. పేజ్ మేకర్ శ్రీనివాస్ కు కృతజ్ఞతలు.

అక్షర దోషాలను సరిదిద్దిన శ్రీ కొమరగిరి శ్రీరామచంద్రమూర్తికి ధన్యవాదాలు.

చివరిగా, కానీ, ముఖ్యంగా,

మా నాన్న గారు ఇప్పుడు జీవించి వుంటే బహుశా ఆయన కంటే ఈ విషయంలో సంతోషించే వారెవరూ వుండరు! ఆయన బ్రతికున్నప్పుడు నేనెట్లా వుండాలని కోరుకున్నాడో అలా కొంతవరకూ వున్నానంటానికి ఈ పుస్తకం కూడా నిదర్శనం.

నన్నింత వాడిని చేసిన నా తండ్రి, తల్లి, స్వర్గీయ వనం శ్రీనివాసరావు గారికీ, స్వర్గీయ వనం సుశీలమ్మ గారికీ, వారి ద్వారా ముత్తవరం శ్రీసీతారామచంద్ర స్వామి వారికీ ఈ పుస్తకం అంకితం.

– వనం జ్వాలా నరసింహారావు

శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం...
కిష్కింధాకాండ

శ్రీ రామాయణం క్షీర ధార. వాసుదాసుగారి శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం, మందరాలన్నీ, మందార మకరంద మాధుర్యాలే. కవికులగురువు కాళిదాసు అన్నట్లు."చరిత్ర మా రాముడిది. రచన సాక్షాత్తు వాల్మీకులవారిది. గానం చేసినవారు కిన్నెర గాత్రులైన కుశ లవులు. ఇంతటి మహనీయమైన రామాయణ కావ్యంలో, శ్రోతలను పరవశింప చేయని అంశం అనేదేదీ లేదు.

భగవద్గీత, శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రం, శ్రీ రామాయణం భారతీయ సంస్కృతీ రూపాలు. సనాతన ధర్మ ప్రతిపాదకాలు. వీటి మౌలిక తత్వాలు ధర్మ–జ్ఞానాలు. ఈ రెండింటినీ వాచ్య–వ్యంగార్థాలతో శ్రీ మద్రామాయణం ఆవిష్కరిస్తోంది. వాల్మీకి ఆదికవి. రామాయణం ఆదికావ్యం. ఇది ధ్వని–అర్థ ప్రతిపాదిత మహా మంత్రపూతం. గాయత్రీ బీజసంయుతం. ఔపనిషతత్వసారం. స్మరణ–పారాయణ మాత్రంగా అంతఃకరణ శుద్ధి అవుతుంది.

వాల్మీకి రామాయణాన్ని యథావాల్మీకంగా, పూర్వ కాండలతో సహా ఉత్తర కాండను కూడా కలిపి తెనిగించిన ఏకైక మహాకవి కీర్తి శేషులు వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) గారు. ఆ మహానుభావుడి ఆంధ్ర వాల్మీకి రామాయణం మందరాలన్నీ, తెలుగునేల నాలుగు చెరగులా విశేష ప్రాచుర్యాన్ని ఏనాడో సంతరించుకున్నాయి. కానీ, కాలక్రమంలో అవన్నీ మరుగున పడిపోతున్నాయి. రామాయణానికి రచయిత ఒక్కడే. వాల్మీకి మహర్షి తప్ప ఇతరులెవరికీ రామాయణం రచయిత అని చెప్పుకునే హక్కులేదనే అనాలి. వాసుదాసుగారు కూడా వ్యాఖ్యాతననే అంటారు తన ఆంధ్ర వాల్మీకి రామాయణానికి.

వాల్మీకి రామాయణ క్షీరసాగర మథనాన్ని చేసి "మందర" మకరందాలనూ, రమా రామ పారమ్య పీయూషాలనూ, నాలుగు చెరగులా పంచి, ఆ మథనంలో ఆవిర్భవించిన శ్రీ సీతారాముల తత్వాన్ని, వేద వేదాంగేతిహాస స్మృతి శ్రుతి శుభంగా అన్వయించి, ఆంధ్రుల హృదయ కేదారాలను ప్రపుల్లంచేసిన పరమ భాగవతోత్తములు "ఆంధ్ర వాల్మీకి" వాసుదాస స్వామి. "రామ భక్తి సామ్రాజ్యం యే మానవుల కబ్బెనో మనసా! ఆ మానవుల సందర్శనం అత్యంత బ్రహ్మానందమే" అన్న త్యాగరాజ స్వామి వారి కీర్తనకు సాకార దివ్య స్వరూపులు వాసుదాస స్వామి. ఆంధ్ర వాల్మీకి వాసుదాస స్వామి అవతరించి వున్న కాలంలో, వారి దర్శన-అనుగ్రహ భాషణా సౌభాగ్యమబ్బిన వారు, "శ్రీ మద్రామాయణం-మందరం" పారాయణ పరులై, తమ పరంపరకు శ్రీ వాసుదాస స్వామి గారి దివ్య స్మృతులను అందించి తరించారు. వాల్మీకి సంస్కృత రామాయణాన్ని అందరికంటే మొట్ట మొదలు ఆంధ్రీకరించి, పదే-పదే రామాయణ పఠన పాఠన శ్రవణాదుల పట్ల ఆంధ్రులకు అత్యుత్సాహాన్ని కలిగించి, "రామ భక్తి సామ్రాజ్యం" అంటే, ఆంధ్ర దేశమే సుమా, అనిపించిన నిరుపమ రామ భక్తులు వాసుదాస స్వామివారు.

ఇరవైనాలుగు గాయత్రీ మంత్రాక్షరాలలో నిబంధించబడిన మంత్ర మంజూష వాల్మీకి మహర్షి రచించిన శ్రీమద్రామాయణం. మహా మహానుభావులూ, మహా విద్వాంసులూ కీర్తి శేషులు శ్రీమాన్ వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) గారు, వాల్మీకి రామాయణాన్ని యధాతథంగా మంత్రమయం చేస్తూ, ఛందో యతులను ఆయా స్థానాలలో నిలిపి, వాల్మీకాన్ని తెనిగించారు. వాల్మీకి రామాయణానికి తుల్యమైన స్థాయినీ-పారమ్యాన్నీ, తొలుత నిర్వచనంగా ఆంధ్ర వాల్మీకి రామాయణానికి అందించి, తదనంతరం, "మందరం" అని దానికి విశేష ప్రాచుర్యాన్ని కలిగించారు. ఆంధ్ర పాఠక లోకం మందరాన్ని అపారంగా అభిమానించింది-ఆదరించింది.

వాసుదాసుగారి కీర్తికి ఆలవాలమైంది ఆంధ్ర వాల్మీకి రామాయణం. ఆంధ్ర భాషలో అంతకుముందు రామాయణానికి యధా మూలాలు లేవని, అర్థ పూర్తి కలిగి, కావ్య-ఇతిహాస గౌరవ పాత్రమై, సర్వజన పఠనీయమై, ప్రామాణికమై, మూలానుసరమైన రామాయణం తెలుగులో వుండడం లోకోపకారంగా భావించి, రచించించారీ గ్రంథాన్ని వాసుదాసుగారు. ఎనిమిదేళ్లలో రామాయణాన్ని తొలుత నిర్వచనంగా ఆంధ్రీకరించి, అలనాటి

కడప మండలంలోని ఒంటిమిట్ట కోదండ రామస్వామికి అంకితం చేసారు. ఆయన రచించిన నిర్వచన రామాయణం, ఆయన జీవిత కాలంలోనే, నాలుగైదు సార్లు ముద్రించబడింది. ఆంధ్ర వాల్మీకి రామాయణం బాల కాండలో, తన స్వవిషయం గురించి ప్రస్తావిస్తూ వాసుదాసుగారు, సంస్కృత రామాయణాన్ని శ్రీరామచంద్రుడి కుమారులైన కుశ-లవులు లోకానికి ప్రకటించినట్లే, తనకూ ఆయన కుమారుడిగా, అలాంటి అధికారం వుందని, అయితే సంకల్పించడం మాత్రమే తన వంతని-నిర్వహించడం శ్రీరాముడి వంతని, పూర్తిచేయించే భారం ఆయన భుజాలపైనే వేస్తున్నానని, ఆయన వలదన్నా వదలనని చెప్పుకుంటారు.

వాసుదాసుగారు రచించిన ఆంధ్ర వాల్మీకి రామాయణానికి తెలుగులో సరైన వ్యాఖ్యానముంటే, సంస్కృతం రానివారికి చక్కగా అర్థమవుతుందని మిత్రులంటారాయనతో. మూల గ్రంథం రాయడంకంటే వ్యాఖ్యానం రాయడం కష్టమనుకుంటారాయన మొదట్లో. బాగా ఆలోచించిన తర్వాత, (శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం) "మందరం" పేరుతో గొప్ప వ్యాఖ్యానం రాసారు వాసుదాసుగారు. వాస్తవానికి అదొక గొప్ప ఉద్గ్రంథం. సరికొత్త విజ్ఞాన సర్వస్వం."మందరం"అంటే, క్షీరసాగరాన్ని మథించడంలో కవ్వంగా ఉపయోగించిన మందర పర్వతమే గుర్తుకొస్తుంది సాధారణంగా ఎవరికైనా. కాని, వాసుదాసుగారి శ్రీపాద సంబంధులకు మాత్రం, "మందరం" అంటే, మొదట గుర్తుకొచ్చేది, ఆంధ్ర వాల్మీకి రామాయణం మందరమే. వాల్మీకి విరచితమైన రామాయణాన్ని శ్రీవారు, "క్షీరవారాసి" గా సంభావించి, దానిని మథించిన తమ "మేథ" అందించిన మకరందాలను-మధురిమలను, ముచ్చటగా "మందరం" అని పేర్కొన్నారు. సహృదయ నైవేద్యంగా-అనుభవైక వేద్యంగా వచ్చిన రచనలకు అసాధ్యంగా-నిగమ గోచరంగా భావించబడిన రామాయణానికి "మందరం" అని నామకరణం చేయడంలో తను కొంతవరకే న్యాయం చేయగలిగానని అంటారాయన. ఇందులోంచి చిలికిన కొద్దీ ఎన్నో దివ్య రసాయనాలు ఉద్భవిస్తాయని, భావితరాలవారు ఇందుకు పూనుకోవాలని కూడా సూచించారు వాసుదాసుగారు.

వాసుదాసుగారు,తాను రచించిన నిర్వచన రామాయణంలో సంస్కృత రామాయణంలో వున్న ప్రతి శ్లోకానికొక పద్యం వంతున రాసారు. మందరంలో తను రాసిన ప్రతి పద్యానికి, ప్రతి పదార్థ తాత్పర్యం సమకూర్చారు. ఒక్కో

పదానికున్న వివిదార్థాలను విశదీకరించారు. భావాన్ని వివరణాత్మకంగా విపులీకరించారు. ఆయన మందరాలలోని శ్రీరామాయణ వ్యాఖ్యానంలో "జ్ఞాన పిపాసి" కి విజ్ఞాన సర్వస్వం దర్శనమిస్తుంది. ఇక ఆయన రాసిన నిర్వచన రామాయణంలో సాధారణంగా అందరూ రాసే చంపక మాలలు, ఉత్పల మాలలు, సీస–ఆటవెలది–తేటగీతి–కంద–శార్దూలాలు, మత్తేభాలు మాత్రమే కాకుండా, తెలుగు ఛందస్సులో వుండే వృత్తాలన్నిటినీ, సందర్భోచితంగా ప్రయోగించారు. వాటిలో, "మత్తకోకిలము", "పంచ చామరం", "కవిరాజ విరాజితము", "తరలము", "ప్రహరణకలిత", "సుగంధి", "ఉత్సాహం", "మనోహరిణి", "వనమయూరము", "తోటకము", "మానిని", "ఇంద్రవంశము", "లయగ్రాహి", "తోదకము", "మాలిని", "కలితాంతము", "మధురగతిరగడ", "వనమంజరి", "కమల విలసితము", "వసంతమంజరి", "మంజుభాషిణి", "స్రగ్ధర", "వసంతతిలక", "మాలి", "కరిబృంహితము", “చారుమతి", "వృషభగతిరగడ", "స్రగ్విని", "మనోరంజని", "తామరసం", "పద్మనాభ వృత్తం", "అంబురుహ వృత్తం", "మందాక్రాంత"లాంటివెన్నో వున్నాయి. ద్విపదలూ వున్నాయి. దండకం కూడా వుందో సందర్భంలో. ఎక్కడ ఎందుకు ఏ విధంగా ఛందో యతులను ఉపయోగించారో కూడా వివరించారు. వీటికి తోడు అనేక వ్యాకరణ విషయాలను అవసరమైన ప్రతి చోటా పాఠకులకు అర్థమయ్యే రీతిలో విపులంగా తెలియచేశారు.

వాసుదాసుగారి ఆంధ్ర వాల్మీకంలోని ప్రతి కాండకొక ప్రత్యేకతుంది. ప్రతికాండ ఒక్కోరకమైన విజ్ఞానసర్వస్వం. ప్రతి కాండలోని, ప్రతి పద్యానికి, ప్రతి పదార్థం ఇస్తూ, చివరకు తాత్పర్యం రాస్తూ, అవసరమైన చోట నిగూఢార్థాలను–అంతరార్థాలను–ఉపమానాలను ఉటంకిస్తూ, సాధ్యమైనంత వరకు ఇతర గ్రంథాల్లోని తత్సంబంధమైన అంశాలను పేర్కొంటారు కవి. ప్రత్యుత్తరం కోరి చదవాల్సిన విషయాలన్నింటికీ సోదాహరణంగా జవాబిస్తారు. శ్రద్ధగా చదువుకుంటూ పోతే–అర్థం చేసుకునే ప్రయత్నం చేసుకుంటూ చదువగలిగితే, ప్రతి కాండలో ఆ కాండ కథా వృత్తాంతమే కాకుండా, సకల శాస్త్రాల సంగమం దర్శనమిస్తుంది. ఒక సారి ధర్మశాస్త్రం లాగా, ఇంకో సారి రాజనీతి శాస్త్రం లాగా, మరో చోట ఇంకో శాస్త్రం లాగా బోధపడుతుంది. ప్రతికాండ ఒక భూగోళ శాస్త్రం–ఖగోళ శాస్త్రం–సాంఘిక, సామాజిక, ఆర్థిక, సామాన్య, నీతి, సంఖ్యా, సాముద్రిక, కామ, రతి, స్వప్న, పురా తత్వ శాస్త్రం లాగా

దర్శనమిస్తుంది. బహుశా, క్షుణ్ణంగా చదివితే, ఇంకెన్నో రకమైన శాస్త్ర విషయాలు గోచరిస్తాయి. అసలు-సిసలైన పరిశోధకులంటూ వుంటే, మందరం ఏ ఒక్క కాండ మీద పరిశోధన చేసినా, ఒకటి కాదు-వంద పీహెచ్‌డీలకు సరిపోయే విషయ సంపద లభ్యమవుతుంది. డాక్టరేట్ తో పాటు, అద్భుతమైన రహస్యాలు అవగతమౌతాయి. పాదరసం నుండి బంగారం చేసే రహస్యమైన విషయాలలాంటి అనేకమైనవి తెలుసుకోవచ్చు, పరిశోధనా దృక్పదంతో చదివితే. ప్రతి కాండ చివర వాసుదాసుగారు రాసిన ఆఖరు పద్యంలో, ఆ కాండలో వున్న మొత్తం పద్యాలెన్నో తెలియచేసే పంక్తులుంటాయి.

ఆంధ్ర వాల్మీకిరామాయణం రాయడానికి ప్రేరణ-స్ఫూర్తి, భాగవత గ్రంథకర్త బమ్మెర పోతన సంకల్పం ద్వారానే తనకు లభించిందంటారు వాసుదాసుగారు. పోతనను కరుణించిన శ్రీరామచంద్రమూర్తి, ఆయనతో భాగవతాన్ని తెనిగింపచేసి భవ బంధ విముక్తుడిని చేసాడని, అందుకే, పలుకుపలుకులో తేనెలొలికించి, వ్యాస భాగవతాన్ని మరిపించగలిగాడని వాసుదాసుగారి అభిప్రాయం. ఆ విధంగానే, శ్రీరాముడి కరుణ తనపైన కూడా ప్రసరించిందని వాసుదాసుగారు భావించి వుండాలి. తద్రూపమే ఆంధ్ర వాల్మీకం. వాల్మీకాన్ని ఆమూలాగ్రంగా పరిశోధించిన పరమ భాగవతోత్తముడు వాసుదాసస్వామి.108సార్లు వాల్మీకి సంస్కృత రామాయణాన్ని పఠించి-పారాయణం చేసి, పట్టాభిషేకాలు, సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించిన ఏకైక మహానుభావుడు వాసుదాసస్వామి.

తనకంటే ముందు కాలం నాటి పూర్వ కవులెవరు, రామాయణాన్ని (పూర్వ కాండలు, ఉత్తర కాండ కలిపి) సంపూర్ణంగా తెనిగించలేదని గ్రహించిన వాసుదాసుగారు, అన్ని కాండలను తెనిగించి, విశేషించి తెలుగు పాఠక లోకానికి ఆవిష్కరించాలని సంకల్పించుకున్నారు."వాల్మీకిరామాయణాన్ని సమగ్రంగా, యథామూలంగా పలికినవారు పూర్వ కవులందూ-నేటి (ఆయన కాలం నాటి) కవులందూ లేరు. నేటి (ఆయన కాలం నాటి) రామాయణాలలో మూలానుసరణంగా వుంది, సమగ్రం కాదు. సమగ్రమయింది మూలాను సరణం కాదు. తమ అభిప్రాయాలను, ఇతరుల అభిప్రాయాలను మూలంగా చేర్చిపెడితే, అది వాల్మీకి పలికిందెలా అవుతుంది?" అని ప్రశ్నించాడు వాసుదాసుగారు.

భగవత్ చరిత్రలెన్నో వుండగా రామాయణ రచనకే ఎందుకు

పూనుకున్నావని అడిగినవారికి తనదైన శైలిలో జవాబిచ్చారు వాసుదాసుగారు. జనన–మరణ రూపకమైన సంసార బంధం నుండి విముక్తి చేసేది రామ కథేనని, భగవత్ సాయుజ్యం పొందేందుకు రామాయణ రచన చేసానని అంటారాయన. పూర్వం కొందరు రాసారుకదా, మరల ఎందుకు రాస్తున్నావంటే, "ఎవరి పుణ్యం వారిదే. ఒకరి పుణ్యం మరొకరిని రక్షించదు" అని జవాబిస్తూ, శ్రీరాముడి అనుగ్రహం కొరకు రామాయణాన్ని రచించి వాగ్రూపకైంకర్యం చేయదల్చానంటారు వాసుదాసుగారు. భారద్వాజ గోత్రీకుడు, ఆపస్తంబ సూత్రుడు, గోల్కొండ వ్యాపారి శాఖీయుడయిన వావిలికొలను సుబ్బరావుగారు, కడప జిల్లా–జమ్మలమడుగులో 1863 లో జన్మించి 1939 లో పరమపదించారు. ఎఫ్.ఎ చదువు పూర్తిచేసి, పొద్దుటూరు తాలూకా కార్యాలయంలో చిరుద్యోగిగా చేరి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ హోదాకెదిగారు. ఆ విధంగా 1893–1904 మధ్య కాలంలో పదకొండేళ్లు రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేసారు మొదట్లో. కందుకూరి వీరేశలింగం పంతులు గారి తర్వాత, మద్రాస్ (నేటి చెన్నై) ప్రెసిడెన్సీ కళాశాలలో ఆంధ్ర పండితులుగా 1904–1920 మధ్య కాలంలో పనిచేసారు. వాసుదాసుగారి తర్వాత ఆ పదవిని అలంకరించింది అక్కిరాజు ఉమాకాంతం గారు. కళాశాలలో చేరక ముందే, పినతండ్రి మీద తనకున్న కృతజ్ఞతకు గుర్తుగా, "శ్రీ కుమారాభ్యుదయం" అనే ప్రబంధ గ్రంథాన్ని రచించి, ఆయనకు అంకితమిచ్చి శాశ్వత స్వర్గ సుఖాన్ని కలిగించారాయనకు. ఆయన రచించిన ఆ ప్రబంధం, నాటి కవి పండితులను ఆశ్చర్య పరిచింది. ఆయన ప్రతిభకది తొలి హారం.

ఆంధ్ర పండితుడిగా పనిచేస్తున్న రోజుల్లోనే, భార్యా వియోగం కలగడంతో, వాసుదాసుగారు భక్తి–యోగ మార్గం పట్టారు. జీర్ణ దశలో వున్న ఒంటిమిట్ట రామాలయాన్ని సముద్ధరించాలన్న సంకల్పంతో, బిక్షాటనచేసి లభించిన ధనంతో ఆలయాన్ని అభివృద్ధి చేసారు. ఆంధ్ర వాల్మీకి రచనాకాలం 1900–1908 మధ్య కాలంలో. గాయత్రీ మంత్రం, రామ షడక్షర మంత్రం మూలంలో వున్నట్లే, అనువాదంలో కూడా నిక్షిప్తం చేసారాయన. వాల్మీకంలో వున్న బీజాక్షరాలన్నీ, ఇందులోనూ యథాస్థానంలో చేర్చబడ్డాయి. విడిగా వాసుదాసుగారు, గాయత్రీ రామాయణం, శ్రీరామనుతి కూడా రాసారు. ఆంధ్ర వాల్మీకం అనువాదమైనా, స్వంత రచన–స్వతంత్ర రచన అనిపించుకుంది.

వావిలికొలను సుబ్బరావుగా పండిత పదవీ విరమణ చేసిన అనంతరం,

తన జీవితమంతా, భక్తి మార్గంలోనే గడిపారు. ఈ నాటికీ క్రమం తప్పకుండా గుంటూరు జిల్లా తెనాలి దగ్గరున్న అంగలకుదురు నుంచి ప్రచురించబడుతున్న "భక్తి సంజీవని" అనే భక్తి-జ్ఞాన-కర్మ యోగాలను తెలిపే ఆధ్యాత్మిక మాసపత్రిక సంస్థాపక సంపాదకులుగా-వాసుదాసుగా-ఆంధ్ర వాల్మీకిగా-కవి సార్వభౌమగా ప్రసిద్ధికెక్కారు. అంగలకుదురులోని శ్రీ కోదండ రామ సేవక ధర్మ సమాజం స్థాపించింది ఆయనే. కడప జిల్లాలోని ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయాన్ని పునరుద్ధరించి, ఈ నాటికీ దర్శనీయమైన రీతిలో శాశ్వత కైంకర్యం చేసిన వాసుదాసుగారు, వాఙ్మయ ప్రపంచంలోని భక్త కవులలో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నారు."సత్కవి మిత్రుడను" అని చెప్పుకున్న ఆయనకు, తిరుపతి వేంకటకవులు, కొక్కొండ వేంకట రత్నం పంతులు, వేదం వేంకటరాయ శాస్త్రులు మొదలైన ప్రసిద్ధ కవులందరూ స్నేహితులే.

వాసుదాసుగారు "కౌసల్యా పరిణయం" అనే ప్రబంధం, "సుభద్రా విజయం" అనే నాటకంతో పాటు, "హిత చర్యలు", "ఆధునిక వచనరచనా విమర్శనం","పోతన నికేతన చర్చ","పోతరాజు విజయం","రామాశ్వమేధం", ఆంధ్రవిజయం" కూడా రాసారు."ఆర్యకథానిధులు" అన్న పేరుతో ఆయన రాసిన సులభ వచన గ్రంథాలు తెలుగువారందరికి అత్యంత ఆదరణీయమైనాయి."సులభ వ్యాకరణం" తెలుగు వ్యాకరణాన్ని నిజంగానే సులభం చేసింది. ఆయన రచించిన "కృష్ణావతార తత్వం" ప్రశస్త కృతిపాండిత్యంతో, ఆధ్యాత్మిక భావనతో, పాఠకులలో ఆంధ్ర భాషాభిమానాన్ని ఉద్దీపించచేసి-తాను తరించి, ఇతరులను తరింపచేసిన ధన్యాత్ముడు, మహామనీషి వావిలికొలను సుబ్బరావుగారు.

ఆంధ్ర వాల్మీకిరామాయణం తర్వాత రచించబడిన పలు గద్య-పద్య రామాయణాలకు విశేషప్రాచుర్యం లభించినా, ఆ రోజుల్లోనూ-ఈ రోజుల్లోనూ, వాసుదాసుగారి రామాయణానికి ప్రాచుర్యం లభించినా తగినంత గుర్తింపు ఎందుకు లభించలేదనేది జవాబు దొరకని ప్రశ్న. "ఆదికవి-ఆంధ్ర వాల్మీకి", యథాతథంగా మంత్రమయం చేస్తూ, ఛందోయతులను ఆయా స్థానాలలో నిలిపి తెనిగించిన వాల్మీకానికి రావాల్సినంత మోతాదులో, ఎందుకు గుర్తింపు రాలేదు? వ్యాస మహాభారతాన్ని మొదట తెనిగించిన నన్నయను "ఆదికవి" గా పిలిచినప్పుడు, వాల్మీకి రామాయణాన్ని యథావాల్మీకంగా పూర్వ కాండలతో

కలిపి ఉత్తర కాండను కూడా మొట్టమొదట తెనిగించిన వాసుదాసుగారు కూడా "ఆదికవే" కదా? నన్నయంతటి గొప్పవాడే కదా. వాస్తవానికి సరైన పోషకుడో–ప్రాయోజకుడో వుండి వుంటే, వాసుదాసుగారి ఆంధ్రవాల్మీకిరామాయణం, ఎప్పుడో–ఏనాడో నొబెల్ సాహిత్య బహుమతికో, జ్ఞానపీఠ పురస్కారానికో నోచుకుని వుండేది. ఏ మాత్రం మన తెలుగువారు ప్రయత్నం చేసినా, ఆ మహానుభావుడికి భారతరత్న–జ్ఞానపీఠ ఆవార్డులతో పాటు నొబెల్ బహుమానం వచ్చేది. ఇప్పటికైనా ఆ ప్రయత్నం చేస్తే మంచిదేమో.

వాసుదాసుగారు ఆంధ్ర వాల్మీకిగా లబ్ద ప్రతిష్టులయ్యారు. మహనీయమైన "మందర" రామాయణాన్ని అనేకానేక విశేషాలతో, పద్య–గద్య–ప్రతి పదార్థ–తాత్పర్య–ఛందోలంకార విశేష సముచ్ఛయంతో, నిర్మించి, వేలాది పుటలలో మనకందించారు. రామాయణ క్షీర సాగరాన్ని "మందరం" మథించి, మనకందరికీ ఆప్యాయంగా అందించింది. అయితే, దానిని ఆస్వాదించే తీరికా–ఓపికా లేని జీవులమైపోయాం మనం. భాష, శైలి, అర్థం, తాత్పర్యం కాలక్రమంలో పరిణామం చెందుతున్నాయి. "సూక్ష్మంలో మోక్షం" కావాలంటున్నారు నేటి తరం పఠితులూ, పండితులూ.

కాలం గడిచిపోతున్నది. వాసుదారుగారు మారిపోతున్న తరాలకు గుర్తురావడం కూడా కష్టమైపోతున్నది. వారి "ఆర్యకథానిధుల" తోనూ, "హితచర్యల" పరంపరలతోనూ, పరవశించిపోయిన ఆ నాటి తెలుగు పాఠక మహనీయులు క్రమంగా తెరమరుగవుతున్నారు. మళ్లీ–మళ్లీ జ్ఞాపకం చేసుకోవాల్సిన, మరువలేని మహనీయుడు, ప్రాతఃస్మరణీయుడు వాసుదాసస్వామి.

నారాయణా! కరుణా!
ధీనా! దీనార్తిహరణ ధీమజ్జనర
క్షానియా! యపపర్గ వి
ధానక్షమ! యొంటిమిట్ట దశరథరామా!
మందరం..వ్యాఖ్యానారంభం
శ్రీరామచంద్ర ప్రభో పాహి పాహి.

రామాయణంలో ఏముంది..
ఆంధ్ర వాల్మీకి రామాయణం ఎందుకు చదవాలి?

శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణానికివాసుదాసుగారి పీఠిక

శ్రీ రామాయణం, భారతం, భాగవతం అద్వితీయమైన గీర్వాణ భాషా గ్రంథాలు. వేద వేదాంత అర్థోపబృంహితంబులు. ఈ మూడింటి లో ఆద్యమైంది శ్రీ రామాయణ కావ్యం. కావ్యాలలోకెల్లా ప్రధమంగా ఉత్పన్నమైంది కావడంతో ఆదికావ్యమైంది. శ్రీమద్రామాయణం–ఉత్తర కాండ 94వ సర్గలో చెప్పినట్లు రామాయణాన్ని చక్కగా తెలిసినవారు–అర్థం చేసుకోగలిగిన వారు మాత్రమే లోకానికి అందలి విషయాలను వివరించ సమర్థులు. అందరికీ అది సాధ్యమయ్యేది కాదు. (రామాయణ తత్వాన్ని తనకు తెలిసినంత వరకు ఆంధ్ర వాల్మీకంలో చెప్ప సాహసించానని, తన ఆ సాహసానికి క్షమించమని వాసు దాసు గారు పాఠకులకు విజ్ఞప్తి చేశారు).

మన పూర్వీకులకు తెలియని నాగరికతలు లేవు. మన పూర్వులు ఏ కారణం వల్ల ఆర్యులయ్యారు? వారు ఎటువంటి గుణాలు కలిగి, ఎటువంటి మహోన్నత స్థితిలో వుండే వారు? వారి నాగరికత విధానం ఎటువంటిది? వారి కులా చార ప్రవర్తనలెలావుండేవి? రాజుకు–ప్రజలకు మధ్య ఐకమత్యం ఎలా వుండేది? భార్యా–భర్తలు, సోదరులు, తల్లి తండ్రులు, పుత్రులు పరస్పరం ఎలా ప్రవర్తించేవారు? సుఖ–దుఃఖాల విషయంలో స్త్రీ–పురుషులు ఏ విధమైన నడవడి గలవారు? వారికి దేవుడంటే ఎలాంటి ఆలోచన వుండేది? దైవాన్ని వారెలాఆరాధిస్తుండేవారు?ఇలాంటిలౌకికవిషయాలనుతెలుసుకోవాలనుకునే వారికి శ్రీ రామాయణాన్ని మించి తెలిపే గ్రంథం ఎక్కడా లేదు.

జనన మరణ చక్ర బంధంలో ఇరుక్కొని, పరిభ్రమిస్తూ, ఆ బాధ తొలగించుకునేందుకు పారలౌకిక చింత కలిగి, నిరామయమై- నిత్యమై- నిర్మలమైన పరమపదానికి పోవాలనుకునే కోరికగల వారికి, కరతలామలకంగా సుఖమైన మార్గాన్ని బోధించగల గ్రంథం శ్రీ రామాయణం తప్ప మరొకటి లేదు. కాలక్షేపానికి చదవడానికైనా శ్రీ రామాయణం లాంటి పుస్తకం ఇంకోటి లేదు. ఏ విధంగా చదివినా, చదివిన తర్వాత, సమయాన్ని సద్వినియోగం చేశామన్న తృప్తినిచ్చేది రామాయణమే. శ్రద్ధా భక్తులతో చదివినవారికి కల్పవృక్షంలా కోరిన కోరికలు తీర్చేదీ రామాయణమే. కాబట్టి, ఇహ-పర లోకాల్లో సుఖపడాలనుకునేవారికి, శ్రీ రామాయణ పఠనం అవశ్య కర్తవ్యం.

భరత ఖండంలో శైవులని, వైష్ణవులని, శాక్తేయులని భిన్న మతాల వారున్నారు. అయితే వీరిలో కొందరు వైష్ణవులకు శైవుడంటే ఇష్టం లేకపోవడం, అలానే నారాయణుడి పేరంటే నే ముఖం చిట్లించుకునే శైవులుండడం అందరికీ తెలిసిందే. ఐనప్పటికీ, శ్రీ సీతారాముల పేరు విన్న ప్రతి ఆర్యుడు మనస్సులోనైనా భక్తితో నమస్కారం చేసుకోవాల్సిందే. ఇలా సీతారాములు సార్వజనీన సం పూజ్యులు కావడానికి కారణమేంటి? హరిశ్చంద్రుడి లాంటి సత్యాత్ములు, ధర్మరాజు లాంటి ధర్మాత్ములు, దమయంతి-సావిత్రి లాంటి పతివ్రతలు లేరా? వారి మీద ఎంత గౌరవం వున్నా లోకులు వారిని పూజించడం లేదే? మరి, సీతారాములలో విశేషమేమిటంటే, వారు అవతార మూర్తులు కావడమే! ఎవరెవరు-ఏ ఏ పేరుతో పిలిచినా, భగవంతుడనేవాడు ఒక్కడే అని ఆర్యుల నమ్మకం. భిన్న-భిన్న రూపాల్లో దర్శనమీయుడం భగవత్ కళా విశేషం. అలాంటి భగవంతుడే, శ్రీరాముడుగా, లోక రక్షణార్థం జన్మించాడన్న నమ్మకమే, లోకులందరు ఒకేవిధంగా శ్రీ సీతారాములను అర్చన చేయడానికి కారణమైంది. ప్రత్యక్షానుభవమున్న భక్తులే దానిలోని గూడార్థాన్ని వెల్లడిచేయగల సమర్థులు- శక్తిమంతులు. అలాంటివాడైన వాల్మీకి మహర్షి ఆ అవతార రహస్యాన్ని, తాను గ్రంథస్థం చేసిన శ్రీ రామాయణంలో, "కంఠోక్తి ఘోషించినాడు".

"శ్రీ రామాయణం" అంటే, లక్ష్మీరమణుడైన శ్రీమన్నారాయణుడి మాయా మానుషావతారమైన శ్రీరామ చరిత్రనీ, శ్రీ లక్ష్మీదేవి అవతారమైన సీతాదేవి చరిత్రనీ అర్థం. దంపతుల మాదిరిగా, వారి "అభిధానంబులు అనపాయంగా" వుండినట్లే, తత్త్వమెరిగిన మహాత్ముడు వాల్మీకి మహర్షి, తను రచించిన ఆది కావ్యానికి శ్రీ రామాయణం అనిపేరు పెట్టాడు. ఇందులో సీతాదేవి మహాత్మ్యాన్ని

విశేషించి చెప్పడంవల్ల వాల్మీకి మహర్షే, శ్రీ రామాయణాన్ని "సీతాయాశ్చరితం మహత్తు" అని వెల్లడిచేశాడు. ఈ చిత్రం గ్రంథం పేరులోనే కాకుండా, గ్రంథమంతా కనపడుతుంది. శ్రీరామచంద్రుడు మనుష్యుడివలె నటిస్తుంటే, వాల్మీకే మో వాస్థవార్థం చెప్తూ, ఆయన సాక్షాత్తు భగవంతుడే అంటాడు. రాముడి చర్యల ద్వారా, రాముడి వాక్కుల ద్వారా తాను చెప్పదల్చుకున్న దాన్ని సిద్ధాంతీకరించాడు వాల్మీకి. శ్రీరాముడు భగవంతుడేనన్న అర్థం, హారంలోని సూత్రంలాగా, రామాయణంలోని ఏడు కాండల్లోనూ వ్యాపించి వుంది. రామాయణాన్ని చదివేవారందరు, ఈ అర్థాన్ని మనస్సులో పెట్టుకొని, ఇందులోని ప్రతి అంశాన్ని–ప్రతి వాక్యాన్ని హెచ్చరికతో శోధించాలి. ఇలా ఆసక్తిగా శోధించిన వారికి–పరీక్షించిన వారికి మాత్రమే, వాల్మీకి రామాయణానికి–ఇతర రామాయణాలకు (ఆ మాటకొస్తే, ఏ భాషలో వున్న ఏ గ్రంథాలకు) గల తారతమ్యం, వాల్మీకి రామాయణంలోని గొప్పదనం తెలుస్తుంది. కవి హృదయాన్ని తెలుసు కోకుండా, ఆయన శైలిని అనుసరించకుండా చదివినవారికి, అందులోని సారాన్ని అర్థంచేసుకోలేక, ఆ శక్తి హీనతను వాల్మీకి దోషంగా భ్రమించి సంతోష పడవచ్చు.

శ్రీ రామాయణం మహాకావ్యం. పుట్టుకతోనే కాకుండా గుణంలో కూడ అదే మొదటిది. దానిలోని గుణాలు, రహస్యాలు తెలుసుకోవాలంటే వాల్మీకికి గాని, సర్వజ్ఞుడికి గాని మాత్రమే సాధ్యమవుతుంది. అనంత కల్యాణ గుణ విశిష్టుడైన భగవంతుడిని, దయావంతుడని–సర్వజ్ఞుడని–సర్వ శక్తిమంతుడని, ఏవో కొన్ని గుణాలు వర్ణించి సంతసించడానికి, రామాయణం చదివిన వారు, వారి వారి శక్తికొలది కొన్ని గుణాల వరకు అర్థంచేసుకోవచ్చు. వాస్తవానికి, అర్థం చేసుకునే ప్రయత్నం చేసినా కొద్దీ, శ్రీమద్రామాయణంలో ఉత్తమోత్తమ మహాకావ్య లక్షణాలెన్నో వున్నాయి. వర్ణనలెన్నో వున్నాయి. రామాయణం గానం చేసినా, పఠించినా మనోహరంగా వుంటుంది. లోకంలో కొన్ని కృతులను పాడుతుంటే శ్రావ్యంగా వుంటాయి గాని, మామూలుగా చదువుతుంటే, నీరసంగా అనిపిస్తాయి. కొన్నేమో, చదవడానికి ఇంపుగా వున్నా, రాగానికి–తాళానికి అనువుగా వుండవు. రామాయణం అలాంటి కోవకు చెందింది కాదు. చదివినా, పాడినా మధురమే. ఆ విషయం గ్రంథంలోనే వుంది. ఆ ప్రకారమే కుశ లవులు పాడారు కూడా.

రామాయణంలో శృంగారం లాంటి నవ రసాలున్నాయి. అందులో

శృంగార రసం "సంభోగ శృంగారం". సీతారాముల కల్యాణం తర్వాత అయోధ్యలో వారు అనేక ఋతువులు ప్రియంగా గడిపిన వర్ణన ఉదాహరణగా తీసుకోవచ్చు. భార్యా భర్తల పరస్పర అనురాగం ఇంతకన్నా మించి వర్ణించడం ఎవరితరం కాదు. వాల్మీకి శ్లోకాల (ఆంధ్ర వాల్మీకి పద్యాల) భావం మాత్రమే కాకుండా, అందులోని కొన్ని పదాలు ఎంత అర్థ గాంభీర్యం గలవిగా– రసవంతంగా వుంటాయో చెప్పలేము. వాల్మీకి వాక్యామృత రసాన్ని నిరంతరం ఆస్వాదన చేసిన భవభూతి వర్ణించినట్లు ఇందులో హాస్యం (శూర్పణఖ–త్రిజటల వృత్తాంతం), కరుణ (ఇష్ట వియోగం వల్ల అనిష్ట సంభవం, దశరథుడి చావు), వీర (లక్ష్మణుడి వృత్తాంతం), రౌద్రం (రావణుడి వృత్తాంతం), భయానక (మారీచాది వృత్తాంతం), బీభత్సం (కబంధ–విరాధుల వర్ణన), అద్భుతం (రావణ యుద్ధంలో), శాంతం (శబరి వృత్తాంతం) రసాలను కనుగొన వచ్చు.

ఇక అలంకారాల విషయానికొస్తే, శబ్దాలంకారాలని, అర్థాలంకారాలని రెండు రకాలున్నాయి. రామాయణంలో శబ్దాలంకారాలు తరచుగా కనబడవు. అంత్యానుప్రాసలు కొన్ని చోట్ల వున్నాయి. శ్రీమద్రామాయణం స్వభావోక్త్యలంకారాలకు పుట్టిల్లు. స్వభావోక్తులు దేశకాలవక్తృ స్వభావాలను అనుసరించి చెప్పబడ్డాయి. వర్షాన్ని వర్ణన చేసిన సందర్భంలో మన ఎదుట వర్షం కురుస్తున్నట్లే వుంటుంది. హేమంతాన్ని వర్ణిస్తుంటే, మనకు మంచులో తడుస్తున్నామా అనిపిస్తుంది. అడవులలో జరిగినవి, మనమెప్పుడూ చూడనివి–విననివి చదువుతుంటే, మన కళ్లకు కట్టినట్లే వుంటుంది. తన వర్ణనా చాతుర్యంతో వాల్మీకి, పాఠకులను, తన చేతిలో బొమ్మలా చేసి, ఇష్టమొచ్చినట్లు ఆడుకుంటాడు. ఆయన ఏ విషయాన్ని వర్ణించినా అది మన కళ్ల ఎదుట జరిగిన భావం కలుగుతుంది. ఇక ఉపమాన అలంకారాల విషయానికొస్తే, వాల్మీకి కాళిదాసుకే గురువనిపిస్తాడు. రావణ వధానంతరం రాముడు సీతతో అన్న మాటలకు అర్థం వెతుకుతే, ఆ ఉపమానంలో, సీత నిర్దోషురాలనీ–శంక అనే దోషంతో బాధ పడినవాడు రాముడనీ స్పష్టంగా తెలుస్తుంది. అలానే, రావణుడు సీతను అపహరిస్తున్నప్పుడు రాసిన శ్లోకం కూడా. దానర్థం: సీత లోకమాత అయినందున ఆమెను రావణుడు పట్టుకోవడం తల్లిని పట్టుకోవడమంత మహా ఘోరమైన కార్యమని. ఇంద్రజిత్తు మరణం తర్వాత వాడి సేనలకు పట్టిన గతిని వర్ణిస్తూ రాసిన శ్లోకం మరో చక్కటి ఉదాహరణ.

వాల్మీకి మరో ప్రత్యేకత "ఉత్ప్రేక్ష". లంకలో– అశోక వనంలో ఒక "వంక" పారుతుంటుంది. దాని తీరంలో వున్న చెట్ల కొమ్మలు నీళ్లలో వేలాడుతుండడం వల్ల, నీరు వెనక్కు పోతుంటుంది. ఈ సామాన్య విషయాన్ని వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి) ఎలా ఉత్ప్రేక్షించినాడో చదివి తీరాల్సిందే. "ఆ పర్వతం పైనుండి కిందకు పారుతున్న సెలయేరు, చూడడానికి, మగడి తొడపై నుండి కోపంతో దిగిపోతున్న స్త్రీలా వుంది. వేలాడుతున్న కొమ్మలు ప్రవాహాన్ని అడ్డగించడంతో, వెనుదిరుగుతున్న నీటి కదలిక సన్నివేశం, బంధువుల బుజ్జగింపులకు సమాధానపడి–శాంతించి, మగడి వద్దకు మరలిపోతున్న ఆడదానిలా వుంది" అన్న అర్థం వస్తుంది ఆ శ్లోకానికి–పద్యానికి. అలానే ఆయన వాడిన శ్లేషాలంకారాలు.

శ్లేషాలంకారానికి చక్కటి ఉదాహరణ వాల్మీకి నోట వెలువడిన ప్రథమ శ్లోకం.

"మానిషాద ప్రతిష్ఠాం త్వ! మగ మ శ్శాశ్వతీ స్సమాః
యత్క్రౌంచ మిథునాదేక! మవధీః కామమోహితం"

వేదాన్య విషయంలో కలిగిన ఈ ఆదిమ శ్లోకానికే నిషాద పరంగా ఒక అర్థం, భగవత్ పరంగా రెండో అర్థం వున్నాయి.ఆంధ్ర వాల్మీకంలో దీన్ని ఇలా పద్యంగా మలిచారు కవి.

"తెలియు మా నిషాదుండ ప్రతిష్ఠ నీక
ప్రాప్తమయ్యెడు శాశ్వతహాయనముల
గ్రౌంచ మిథునంబునందు నొక్కండు నీవు
కామమోహిత ముం జంపు కారణమున"

"ఒక బోయవాడు క్రౌంచ మిథునంలో వున్న మగ పక్షిని చంపడం, ఆడ పక్షి అది చూసి దుఃఖించడం, పరమ దయామయుడైన వాల్మీకి అది చూసి, బోయవాడు చేసిన అధర్మ కార్యానికి కోపగించి అతడిని ఈ శ్లోకంలో శపించడంజరిగింది. ఇదే రామాయణ ఉత్పత్తికి కారణమైన శ్లోకం కావడంతో నాంది శ్లోకం అయింది. కాబట్టి దీనికి భగవత్ పరంగా ఒక అర్థం వుంది. రామాయణంలోని ఏడు కాండల అర్థం–కథ ఇందులో సూక్ష్మంగా సమర్థించబడింది.

లక్ష్మణుడు రాముడితో అరణ్యాలకు వెళ్లే ముందర తల్లికి నమస్కారం

చేసినప్పుడు, సుమిత్రా దేవి కుమారుడికి చేసిన బోధనను తెలియచేసే శ్లోకానికి పండితులు అనేక అర్థాలను చెప్పారు. అందులో సార్వజనీన సమ్మతమైనవి–ప్రధానమైనవి మూడర్థాలు. సంగ్రహంగా అవి:

మొదటిది: "ఇదివరకు నీవు రాముడికి కుడిచేతిలా, వెలుపల ప్రాణంలా వుండేవాడివి. ఆ భక్తితోనే ఇప్పుడు ఆయన వెంట అడవులకు పోతున్నావు. ఇదివరకు రాముడు మహారాజ కుమారుడు. పట్టణంలో అనేక భోగాలను అనుభవిస్తుండే వాడు. నువ్వూ అలానే సుఖానికి హాని లేకుండా అన్నను కొలుస్తుండే వాడివి. ఇక మీద అలా కాదు. చేయబోయేది సకల దుఃఖ నిలయ కాననవాసం. అదికూడా ఒక రోజు కాదు. 14సంవత్సరాలు. పరివారంతో కాదు–ఒంటరిగా. నువ్వే పరిచారకుడవు. అలాంటి కష్ట కాలంలో నీకు విసుగు కలగవచ్చు. జ్ఞాత వెంట నేనెందుకు కష్టాల పాలు కావాలని అనుకుంటావేమో. అలా భావించ వద్దు. అడవిలో వున్నా, పట్టణంలో వున్నా, ధనికుడైనా, దరిద్రుడైనా తండ్రి ఎలా పూజనీయుడో, పితృసమానుడైన రాముడలానే. తండ్రిమీద ఎలాంటి గౌరవం వుంచాలో అలాంటిదే శ్రీరాముడి మీదుంచు. అలానే, నామీద నీకెలాంటి గౌరవం వుందో అలాంటిదే సీత మీదుంచు. అడవిని దుఃఖాలయంగా భావించ వద్దు. సుఖమైన అయోధ్యగా భావించు. సుఖ దుఃఖాలు మనఃకల్పితాలు. నీ మనస్సు నీ వశంలో వుంటే ఎక్కడున్నా నీకు సుఖ దుఃఖాలు సమానమే".

రెండోది: అదే "రాముడ యెరుంగుమీ దశరథుడు నిజము" అన్న సుమిత్ర మాటలకు మరో అర్థం రాముడు అడవులకు పోయిన తర్వాత ఆయన తండ్రి జీవించడని–అది నిజమని. "నీ తండ్రి ఎప్పుడు మరణించునో అప్పుడు నా గతేంటి? ఇక్కడే మో కైక ప్రభుత్వం. ఆమెకు నా మీద ద్వేషమన్న సంగతి నీకు తెలిసిందే. నీ తండ్రి లేకుండా, రాముడు లేకుండా, నువ్వూ లేకుండా నన్ను కైక ఇక్కడ వుండనిస్తుందా? కాబట్టి నేను పుట్టిల్లు చేరాల్సినదాన్నే. అక్కడ నాకు ప్రతిష్టేముంటుంది? దశరథుడి భార్య అన్న గౌరవం నశించింది. అక్కడివారు మన రాజు కూతురు పుట్టింటికి వచ్చిందని నన్ను–నా తండ్రిని చులకనగా అంటారు. అలాంటప్పుడు అయోధ్య గతి ఏమందువా? అయోధ్యే అడవి కాగలదు"

మూడోది: "కుమారా–నేనెందుకు జ్ఞాతైన రాముడి వెంట అడవికి పోయి ప్రాణాపాయానికి లోనుకావాలనీ, నన్నెవ్వరు పొమ్మన్నారనీ, నాకై నేను చెట్టు

కొట్టి మీద వేసుకొనడమెందుకనీ, నేను పోతే కలిగే లాభమేమిటనీ, పోకపోతే నష్టమేంటనీ సందేహిస్తున్నావేమో! అలాంటి ఆలోచనలు చేయవద్దు. లక్ష్మీనారాయణులుండే స్థలమే వైకుంఠం. అడవియే వైకుంఠం. అలాంటి ఏకాంత సేవ దొరకడం దుర్లభం. కాబట్టి–నాయనా, తదేక ధ్యానంతో భగవత్ సేవను అరణ్యంలో చేసుకో" అని బోధించెను.

ఇలా నానార్థాల పద్యాలను అన్వయించేందుకు ఆంధ్ర వ్యాకరణ సూత్రాలను సమయోచితంగా అనుసంధానం చేసుకోవాలి.

అలంకార శాస్త్రంలో ఎన్ని అలంకారాలు చెప్పబడ్డాయో, అవన్నీ వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి)రామాయణంలో వున్నాయి. వాల్మీకి అసమాన కవితా చాతురి వర్ణనాతీతం. మరొక్క ఉదాహరణ చిత్రాలంకార ఉపయోగం. రావణుడు సీతాదేవిని అపహరించిన తర్వాత, శ్రీరాముడు ప్రియా వియోగానికి దుఃఖిస్తూ, అడవిలో జనులెవ్వరూ వుండకపోవడంతో, కళ్లకు కనిపించే పక్షి–వృక్ష–మృగాలను సంబోధించుకుంటూ పోతూ–పోతూ, రావణుడు జటాయువుతో యుద్ధం చేసిన స్థలానికి సమీపంలో వున్న ప్రస్రవణగిరిని చూస్తాడు. చూసి " ఓ పర్వత రాజా! నా వల్ల ఒంటరిగా, రమ్యమైన ప్రదేశంలో విడువబడిన సర్వాంగ సుందరైన సీత నీ చేత చూడబడెనా" అన్న ప్రశ్న వేసిన శ్లోకం (పద్యం) చక్కటి చిత్రాలంకారం. వృక్షాలకు–నదులకు వలె కాకుండా, కొండలకు ప్రతిధ్వని ఇచ్చే గుణం వుంది. దీన్ని మనస్సులో పెట్టుకున్న కవి ఈ శ్లోకాన్ని (పద్యాన్ని) రచించారు. ప్రతిధ్వనిలో మనం అన్న మాటలే మనకు తిరిగి వినపడ్తాయి. "నీవు చూశావా?" అంటే "నీవు చూశావా?" అని ప్రతిధ్వని వస్తుంది. అలా వినబడిందని రాస్తే సారస్యం లేదనుకున్న వాల్మీకి ప్రతిధ్వనిగా వినపడిన శ్లోకాన్ని " ఓ రాజ శ్రేష్టుడా! రమ్యవనదేశమందు నీ చేత ఒంటరిగా విడువబడిన సర్వాంగ సుందరి నా చేత చూడబడె" అనిఅర్థం వచ్చే ట్లు రాశారు. ఇలా ప్రశ్న–జవాబు ఒక్క వాక్యంగానే వుంటే చిత్రాలంకారం అవుతుంది. ఇంత దీర్ఘంగా ఊహించి రాసిన కవి ఇంతవరకూ ఒక్క వాల్మీకే. అలంకారాల వరకెందుకు? సాధారణ విషయాన్ని చెప్పాల్సి వచ్చినప్పుడు కూడా ఏదో ఒక చమత్కారాన్ని కనబరిచేవాడు.

వాల్మీకి రామాయణంలోని పాత్రలు–పాత్రధారుల వాక్కులు, ఆయా పాత్రల చిత్త వృత్తి గుణాలను తెలియచేసేవిగా, సందర్భోచితంగా, వారున్న అప్పటి స్థితికి అర్థమైనవిగా వుంటాయి. దశరథుడి మృతి గురించి కైక భరతుడికి చెప్తూ,

"ఎల్ల భూతములకు నెయ్యదిగతి నీదు తండ్రి యట్టిగతికి దనయ యరిగె" అని అంటుంది. తానేదో ఘనకార్యం సాధించినట్లు కైక చెప్పిన పద్ధతిలో, తన భర్త చావు గురించి, తన కుమారుడితో ఏ తల్లైనా చెప్తుందా? ఇదే వాల్మీకిలోని ప్రత్యేకత. ఇదే వార్తను భరతుడు శ్రీరాముడితో మరోలా చెప్తాడు. "నిను దలంచియ యేడ్చుచున్......... నీదు దర్శన కాంక్షియై......... జనకు డక్కట యస్తమించెను జాల నిన్నె స్మరించుచున్" అని దీనోక్తిగా అంటాడు. వినాశ కాలానికి నోటినుంచి విపరీత వాక్యాలే వస్తాయి. శుభ వాక్యాలు, అశుభ వాక్యాలుగా అవుతాయి.

మరో సందర్భంలో, మొట్టమొదట వానరుల మీదకు యుద్ధానికి పొమ్మని ధూమ్రాక్షుడుని ఆజ్ఞాపించాడు రావణాసురుడు. ఆజ్ఞాపిస్తూ, "నీవు వధార్థమై మదవ నేచరయుక్తుడు రాముమీదికిన్" అంటాడు. రావణుడి కోరిక రామాదులను చంపటానికే అయినా, "నువ్వు చావడానికి" అన్న విపరీతార్థం వచ్చింది ఆయన మాటల్లో. శ్రీరామచంద్రుడు ఎలా "ఆత్మవంతుడో" అలానే కుంభకర్ణుడు "వపుష్మంతుడు". అతడిది సహజ శక్తి. వరబలం కాదు. కేవలం దేహం మీదే దృష్టి నిలిపేవాడి కుండే పెద్దదేహముందతడికి. బలం, తాగుబోతు దనం, నిద్దురబోతుదనం, తిండిబోతుదనం లాంటి గుణాలన్నీ పరిపక్వదశకొచ్చి వాడిలో నిలిచాయి. ఇలాంటి వాడు, తను రాముడి మీదకు యుద్ధానికి పోతానని రావణుడితో అంటాడు. ఆయన చెప్పిన మాటల్లోనూ విపరీతార్థం స్పష్టంగా స్ఫురిస్తుంది. ".... బోదు హతుడుగాగ, రామవిభు డక్షయంబుగ రమణి సీత బొంద గలుగును..." అని కుంభకర్ణుడుతో అనిపించాడు వాల్మీకి.

పాత్ర గుణ మహాత్మ్యానికి అసంగతమైన వాక్యాలు ఆయా పాత్రల నోటినుంచి వెలువడవు. శ్రీరాముడు భగవంతుడన్న అభిప్రాయం వాల్మీకి పదే పదే చెప్పుకుంటూ పోయాడు రామాయణంలో. అలాంటప్పుడు, ఆయన భగవంతుడే అయితే, తనకు జరగాల్సిన పట్టాభిషేకం ఆఖరు క్షణంలో విఘ్నమైనప్పుడు సీతతో "... చెలియ యువరాజు నన్నిప్డ చేయురేడు" (... "ధ్రువ మద్యేవ మాం రాజా, యౌవరాజ్యే భీషేక్ష్యతి") అని ఎందుకు చెప్పాడన్న సందేహం కలగొచ్చు. వాల్మీకి ఆ సందర్భంలో రాసిన శ్లోకార్థాన్ని పరిశీలించడానికి ముందు, అదే విషయం ప్రస్తావిస్తూ, అంతకు పూర్వం జాగ్రత్తగా చెప్పిన రామ వాక్యాలను అర్థం చేసుకోవాలి. శ్లోకంలో బాహ్యార్థం స్పష్టంగా తెలుస్తూనే వుంది. అంతరార్థంలో రాముడు చెప్పిందేంటి? తన పట్టాభిషేకం గురించి తల్లి-తండ్రి

ఆలోచిస్తున్నారని అంటాడు. ఇది వాస్తవం. ఏమని ఆలోచిస్తున్నది–పట్టాభిషేకం చేయాలనా? వద్దనా?– అనేది విశదపర్చలేదు. అలానే మిగతా సందర్భాలలో చెప్పిన రామ వాక్యాలన్నీ పరిశీలించుకుంటూ పోతే–అర్థం చేసుకుంటూ పోతే ఆయన అవతార ప్రయోజనం గురించి తెలుసుకోవచ్చు. ఉదాహరణకు సీతతో అన్న ".. నా యర్థవృద్ధికై తొందరపెట్టు బతిని.." అన్న రామ వాక్యాలనే తీసుకోవచ్చు. అర్థ వృద్ధి అంటే లోకాభిప్రాయం ప్రకారం "పట్టాభిషేకం–ధన వృద్ధి". అయితే రాముడి అభిప్రాయం వేరు. "నా ప్రయోజనం గురించి" అంటే, తాను రావణవధాది కార్యాలు చేసే ప్రయోజనం గురించి అని అర్థం. ఇదే అర్థాన్ని వచ్చేటట్లు శ్రీరాముడు మునులతో కూడా అంటాడు తన మనస్సులో మాటగా.

రాముడి మనస్సులో వున్న అర్థం రావణవధాదికమే. సర్వసముడగు భగవంతుడని పేరుపొందిన రాముడు, తల్లిదండ్రులమీద ద్వేష బుద్ధిగలవాడు ఎలా అవుతాడు? కాడు. కాబట్టి వారిపై నున్న సదభిప్రాయంతోనే ఒకచోట "సభ యెట్టిదో దూత యట్టివాడ" ని చెప్ప బడింది ఆయన మాటలుగా సీతకు. ఆయన అవతార ప్రయోజనం నెరవేరాలంటే, పట్టాభిషేకం చేసుకుని రాజుగా అయోధ్యలో వుండకూడదు. అరణ్యాలకు పోవాలి. ఆ పని జరగాలంటే పట్టాభిషేకం విఘ్న కారి. కాబట్టి జరగబోయేదేంటటే, "... చెలియ యువరాజు నన్నిప్డ చేయురేడు" (... "ధ్రువ మద్యైవ మాం రాజా, యౌవరాజ్యే భీషేక్ష్యతి"). దానర్థం "రాజు ఇప్పుడు నన్ను యువరాజు చేయడు" అని.

వాల్మీకి రామాయణమనే "కలశార్ణవం" లో రత్నాలను వెదికేవారు, మొట్టమొదటగా తెలుసుకోవాల్సింది వాల్మీకి శైలి–విధానం. అది తెలుసుకోలేక వెతకడం మొదలుపెట్టితే, చీకట్లో తారాడినట్లే. ఒక విషయం గురించి చెప్పాల్సిందంతా ఒకచోట చెప్పడు. కొన్ని సందర్భాలలో ఆ విషయానికి సంబంధించిన ప్రస్తావనే వుండదు. అదే విషయం మరెక్కడో సూచన ప్రాయంగా వుండొచ్చు. ఒక్కోసారి విపులంగా విశదీకరించబడి వుండొచ్చు. ఆయన చేసిన వర్ణనలను బట్టి, ప్రయోగించిన పదజాలాన్ని బట్టి, పాఠకులు ఊహించుకోవచ్చు. ఒకే విషయం, ఒకటి కంటె ఎక్కువ సార్లు చెప్పితే, ఒక్కోసారి ఒక్కోరకమైన విశేషంతో చెప్పబడుతుంది. ఇలాంటి చిత్రాలు అనేకం వుంటాయి.

సుందర కాండలో సీతాదేవి హనుమంతుడిని ప్రశ్నించిన వాక్యాలు ఇంకో ఉదాహరణ. "కౌసల్యయు సుమిత్ర కపివరా! భరతుండు, కుశలులే?.. భరతుండు.. యక్షౌహిణీసేన నంపునయ్యె?" అని అడుగుతుంది సీత

హనుమంతుడిని. ఎక్కడి పంప? ఎక్కడి పంచవటి? ఎక్కడి అయోధ్య? ఎక్కడి క్షేమ సమాచారం? ఎక్కడి సేన రావడం? ఈ సందేహాలన్నీ పాఠకులకు కలగొచ్చు. అయితే ఉత్తర కాండ చదివినవారికి, భాతృవత్సలుడైన భరతుడు, దూతలద్వారా శ్రీరామాదుల సమాచారాన్నంతా, వారు పంచవటి విడిచి పోయిందనక తెలుసుకుంటుండేవాడని స్పష్టంగా తెలుస్తుంది.

వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి) రామాయణం "ధ్వని కావ్యం". కావ్యానికి ప్రధానమైంది ధ్వని. కావ్యానికి ప్రాణం ధ్వని. ధ్వని లేని కావ్యం శవంతో సమానం. రామాయణంలో ధ్వని విశేషంగా వుంది. కావ్యమంతా ధ్వన్యర్థం వుండడమే కాకుండా, పలు శ్లోకాలకు విడిగా ధ్వన్యర్థం వుంది. రుతు వర్ణనలలో ధ్వని స్ఫురిస్తుంది. ఉదాహరణకు, సుందర కాండలోని "తతో రావణ నీతాయాః సీతాయా..." (తరువాత రావణాసుర, వరనీత ధరాత్మజాత...") అన్న శ్లోకానికి ఆచార్య పరమైన అర్థం ధ్వని. అలానే మరో శ్లోకంలో గురువు ఎలాంటివాడై వుండాలో ఆ లక్షణాలను వివరించబడింది. ఇలాంటి అర్థ బాహుళ్యం గల శ్లోకాలు వందల కొద్దీ వున్నాయి.

శ్రీ రామాయణ అంతరార్థాన్ని పెద్దలు ఇలా చెప్పుకుంటారు: భగవంతుడు ఒక్కడే పురుషుడు. తక్కిన దంతా స్త్రీ మయం అన్న నియమం ప్రకారం, సీతే జీవుడు. ఆ జీవుడు భగవంతుడిని ఆశ్రయించి వున్నంతవరకు ఎలాంటి ఆపదా కలగదు. కర్మవశాన దుర్బుద్ధితో, మాయా మయమైన ప్రకృతి పదార్థాల (మాయ జింక) మీద ఆసక్తి కలిగితే, మోక్ష సాధనానికి విరుద్ధమైన అలాంటి బుద్ధి మళ్లీ పుట్టకుండా చేయడానికి భగవద్వియోగం కలుగుతుంది. వెంటనే దేహ ప్రాప్తి (లంక) కలుగుతుంది. అందులోని రావణ-కుంభకర్ణులు అహంకార-మమకారాలు. ఏకాక్షి ప్రభృతులు ఇంద్రియాలు. అనుభవంతో బుద్ధిమంతులు కావల్సినవారు, వాటికి చిక్కి అవస్థ పడుతున్నప్పుడు, జీవుడికి వివేకం కలిగి-పరితపించడం ప్రారంభించి, తన మీద భగవంతుడికి దయ కలుగుతోందా-తన దగ్గరకు చేర్చుకుంటాడా, అని విలపిస్తారు (సీతా విలాపం). తనను ఆశ్రయించిన జీవుడు ఇలా అజ్ఞానం వల్ల కష్ట దశలో పడిపోయెగదా అని అత్యంత దయాళుడైన భగవంతుడు బిడ్డకొరకు తండ్రి దుఃఖించినట్లు, జీవుడికంటే ఎక్కువగా పరితపిస్తాడు (రామ విలాపం). జీవుడికి ధైర్యం కలగడానికి, భగవంతుడికి తనపై అనురాగం వుందని చెప్పి భయపడ వద్దని తెలియచేయడానికి ఆచార్యుడిని (హనుమంతుడు) పంపుతాడు.

ఆచార్యుడు అక్కడకు (లంకకు) పోయి అతడి చేష్టలన్నీ తెలుసుకొని, ధైర్యం చెప్పి, మరల భగవంతుడితో జీవుడు అనన్య భక్తుడనీ–ఆయనే దిక్కని నమ్మినాడనీ (నియత–యక్షత), కాబట్టి భగవంతుడే కాపాడాలనీ వేడుకుంటాడు. భగవంతుడు ప్రతిబంధకాలను అణచివేసి, చిత్తశుద్ధి పరీక్షించి (సీత అగ్నిప్రవేశం) మరల తన దగ్గర చేర్చుకుంటాడు. దానర్థం: అనన్యాసక్తుడై, దృఢ నిశ్చయంతో, జీవుడు భగవంతుడిని సేవిస్తుంటే, అతడికి కావల్సిందంతా భగవంతుడే నెరవేరుస్తాడు. సుందర కాండ చదివేటప్పుడు పాఠకులు తమను సీత గాను, శ్రీరాముడిని భగవంతుడి గాను భావిస్తే ఈ అర్థం స్పష్టంగా తెలుసుకోవచ్చు.

వాల్మీకి రామాయణంలో, సాధారణంగా, సర్గ మొదట్లో– చివర్లో, మొదలు చెప్పిన కథనే సంగ్రహంగా తిరిగి చెప్పడం జరిగింది. ఇది కాకుండా, యజ్ఞాలు–శకునాల లాంటివి చెప్పవలసి వచ్చినప్పుడు, వర్ణించిన విషయాన్నే మరల వర్ణించాల్సి వస్తే, పూర్వోక్త శ్లోకాలనే మళ్లీ చెప్పడం జరిగింది. వీటినే పునరుక్తులు అనవచ్చు. ఇలాంటిది ఆ కవి కవితా విశేషమే గాని మరొకటి కాదు. రావణుడు రాముడిని గురించి అనుకున్న శ్లోక పాదంలో, రాముడు తనను అదే విషయం గురించి అనుకున్న శ్లోకంలో "…. మానుషం మన్యే రామం దశరథాత్మజం" అన్న పదాలుంటాయి. "విదితం", "ఆత్మానం" అన్న పదాలు మారతాయి. రావణుడు మనుష్యుడి చేతిలో చావడం విధి. కాబట్టి తన విరోధి (రాముడు) మనిషి అని అనుకోకుండా భగవంతుడని నమ్మితే చావు రాదు. ఇక సమర్థుడైన నర్తకుడు తాను ధరిస్తున్న పాత్రను ఉచిత రీతిగా నటించడానికి, తన్ను–తాను మరిచినట్లు, మనుష్య వేషం వేసి నటిస్తున్న రాముడు చేయాల్సిన పనిమీదున్న ఆసక్తితో తనను తాను మరిచి పోయాడు. ఉభయుల అభిప్రాయం ఒకటే కావడంతో రాముడి చేతిలో రావణుడు చచ్చాడు–రాముడు రావణుడిని చంపగలిగాడు. ఇలాంటివే ఒకే తరహాలో వున్న, సుగ్రీవుడు రాముడితో–లక్ష్మణుడితో చెప్పిన వాక్యాలు.

కొన ఊపిరితో వున్న జటాయువుని, శ్రీరాముడు సీతాదేవి వార్తను అడుగుతుండగానే అతడు ప్రాణాలను విడిచాడు. ఇలాంటి సందర్భంలో ఎవరికైనా, బతికుంటే ఏం చెప్పేవాడో కదా అనిపిస్తుంది. ఇలాంటిది నివారించేందుకు, సంపాతి అంగదాదులతో, రావణుడి వృత్తాంతాన్ని చెప్పే సందర్భాన్నిఎంచుకున్నాడు వాల్మీకి. అక్కడా–ఇక్కడా ఉమ్మడి వాక్యాలున్నాయి.

అర్థం మారింది. జటాయువు చెప్పని రావణుడి వూరు–పేరు ఇక్కడ సంపాతితో చెప్పించాడు కవి. వాల్మీకి మహర్షి "కవితౌత్కృష్ట్యానికి" వేరే దృష్టాంతం అవసరమా? శ్రీరాముడు శరభంగుడితోను, సుతీక్ష్ణుడితోను ".. నీ వనమున వాసయోగ్య మగు పట్టెది చెప్పుము" అని భగవంతుడిలా పలికి, వెంటనే మనుష్య భావంతో మాట్లాడే చమత్కారం వాల్మీకి రామాయణం ప్రత్యేకత. ఇలాంటివెన్నో వున్నాయిందులో. చదివే పాఠకులు, ఈ అద్భుత విశేషాలను స్వయంగా ఆస్వాదించవచ్చు.

శ్రీ రామాయణంలోని కవితా చమత్కృతిని విశదీకరించాలంటే, ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఇంతెందుకు! కాళిదాసు, భవభూతి అంత గొప్ప వాళ్లు కావడానికి రామాయణమే కారణం. వాళ్లు రామాయణాన్ని ఎన్ని సార్లు చదివారో గాని, వారి కవితా వల్లి "వాల్మీకి వాక్సుధాసేచనం" లో జీవించి, వృద్ధి పొందిందనడం నిర్వివాదం. శ్రీ విశిష్టాద్వైతం మతోద్ధారకుడైన శ్రీ రామానుజాచార్యులు పద్దెనిమిది పర్యాయాలు గురు ముఖంగా రామాయణాన్ని పఠించి వ్యాఖ్య రాశారు. ఒక్కసారి కూడా గ్రంథమంతా చదవకుండా, సంస్కృత భాష తెలియకపోయినా, "పూర్వ పక్షం" రాసేవారెందరో వున్నారు! వారెలాంటి ప్రాజ్ఞులో కదా!

"ఒక్క ఏరునో–నదినో చూసిన మాత్రాన అదెంత గొప్పగా వుందో అనుకుంటాం. అలానే కాళిదాసు లాంటి వారిని గొప్ప కవులంటాం. అలాంటప్పుడు అన్ని నదులకు ఆధారమైన సముద్రాన్ని ఏమనాలి? అలానే, కాళిదాసాదులకు జీవనదమైన రామాయణాన్ని ఏమని వర్ణించాలి? మన మతంలో వున్న ఏదో ఒక సుగుణాన్ని గ్రహించి, దాన్నే విస్తరించి చెప్తూతూ, అన్య మతాలు ప్రసిద్ధికెక్కినట్లే, ఉపమా విషయం, కాళిదాసుని వలె ఇతర కవుల ఇతర గుణాలను ఒక్కొక్కదానిని ఇందుండి గ్రహించి, దానిని తమ చిన్న కావ్యాలలో విశేషంగా చొప్పించి ప్రసిద్ధులయ్యారు". ఆర్య మతంలా, వాల్మీకి రామాయణం గొప్పదై, పామరులకు ఇందులోని అన్ని విషయాలను అర్థం చేసుకోవడం దుస్సాధ్యం కావడంతో, పిల్ల మతాల లాగా ఇతర గ్రంథాలు ప్రసిద్ధికెక్కాయి. మహర్షైన–మహా యోగైన వాల్మీకెక్కడ? ఇప్పటి (అప్పటి) కవులెక్కడ?

కాళిదాసు రచనలోని "అస్మాన్ సాధు విచిం త్యేత్యాది" శ్లోకాలలోని విశేషాలను, వాల్మీకి రామాయణం "అహం వేద్మి మహాత్మానం...., ఇయం సీతా మమ సుతా...." (ఏ నెరుంగుదు రాజేంద్ర!......, ఈ సీత నాదుకూతురు, నీ

సహధర్మచరి, దీనినిం గైకొనుమా....") శ్లోకాలలోని, ప్రతి పద సారస్యాన్ని నిశితంగా పరిశీలించితే, కాళిదాసు వాల్మీకి శిష్యుడని తెలియడమే కాకుండా, గురు శిష్యుల తారతమ్యం స్పష్టంగా బయట పడుతుంది. కాళిదాసు "విక్రమోర్వశీయం" నాలుగో అంకం శ్లోకంలోని ఒక్క పదం తప్ప మిగతా దంతా, వాల్మీకి రామాయణంలో ఇంతకుముందు రాసిందే. ఇరువురి శ్లోకాలలోని ఉమ్మడి వాక్యాలిలా వున్నాయి: "....... క్షితిభృతాంనాథ! దృష్టా సర్వాంగసుందరీ రామా! రమ్యవనోద్దేశే, మయా విరహితా త్వయా". "కచ్చిత్" కు బదులుగా "సర్వక్షితి" అన్న ఒక్క పదాన్ని చొప్పించాడు కాళిదాసు. ఇలా వాల్మీకి రామాయణం నుంచి కాళిదాసు లాంటి వారు గ్రహించినవి ఎన్నో వున్నాయి. వేదవ్యాసుడంతటి వాడు వాల్మీకి శ్లోకాలను అనువదించగా లేంది, వేరేవారి సంగతి చెప్పాలా!

ఎవరికైనా సత్కవి కావాలని కోరికుంటే, వారువాల్మీకి రామాయణాన్ని అనేక పర్యాయాలు, శ్రద్ధగా-భక్తితో పఠించాల్సిందే.

శ్రీమద్రామాయణం గొప్ప ధర్మ శాస్త్రం. ఇందులో సర్వ విధాలైన, అన్ని రకాల ధర్మాల గురించి వివరంగా చెప్పబడింది. రాజ ధర్మం, ప్రజా ధర్మం, పతి ధర్మం, సతీ ధర్మం, భాతృ ధర్మం, పుత్ర ధర్మం, భృత్యు ధర్మం, మిత్ర ధర్మం లాంటి అన్ని ధర్మాలను గురించి చక్కగా తెలుపబడి వుంది. లాభ-లోభ-పక్షపాత బుద్ధి లేకుండా, న్యాయం మీదే దృష్టి నిలిపి వాదించే న్యాయవాది ధర్మం కూడా చెప్పబడింది. వీటితో పాటు కథా సందర్భానుసారంగా, అంతరాంతరాలలో ఎన్నో నీతులు చెప్పబడ్డాయి.

సత్ ప్రభు లక్షణం తెలుసుకోవాలంటే, రామ-దశరథుల రాజ్య పాలనా విధానంలో దొరుకుతుంది. ఆర్య ప్రభువులు ఏ పని చేసినా ప్రజల అనుమతి లేకుండా చేయలేదు. తాము ప్రభుత్వం నడిపేది ప్రజలకొరకేనని, వారిని సుఖ పెట్టడానికేనని వారు భావించేవారు. ప్రత్యక్షంగానైనా-పరోక్షంగానైనా ప్రజలకు హాని కలిగించే పనేదీ చేయరు. శ్రీరాముడి పట్టాభిషేకం గురించి దశరథుడు చేసిన (అయోధ్య కాండ) ఉపన్యాసం ఇందుకో ఉదాహరణ. ప్రజల దగ్గర పన్నులు తీసుకుంటూ, వారి కష్టాలు తొలగించకపోతే నరకంలోకి పోతామని వారి నమ్మకం (అరణ్య కాండ).

ప్రభువైన వాడు ధర్మాన్ని ఆధారంగా చేసుకొని, వేగులవారి ద్వారా, ప్రజల

కష్ట సుఖాలను తెలుసుకోవాలి. ప్రజలు ఇష్టపడని గుణాలు తనలో వుంటే, ఎంత నష్టమైనా-కష్టమైనా అవి మానుకోవాలి. ఆ విషయంలో రాజు అంతఃకరణం చెప్పింది ముఖ్యం కాదు. ఇతరులను సంతోష పెట్టడానికి తనెందుకు దుఃఖపడాలని అనకూడదు. ఈ విషయంలో రాముడే ప్రమాణం.

శ్రీరాముడు పట్టాభిషేకం జరిగిన తర్వాత ఒక నాడు వేగులవాడైన భద్రుడిని నగరంలో- పల్లెల్లో వార్తలేంటని, తమను గురించి ప్రజలేమనుకుంటున్నారని అడిగాడు. జవాబుగా వాడు, తనను లోకులందరూ ప్రశంసిస్తున్నారని చెప్తే, అంతటితో తృప్తి పడలేదాయన. ఉన్నదున్నట్లు-విన్నది విన్నట్లు అసలు విషయాలన్నీ చెప్పమంటాడు రాముడు. భద్రుడప్పుడు లోకుల పొగడ్తల మాటలు ముందు చెప్పి తర్వాత, "తామసుడగు రాక్షసు గృహసీమను జిరకాల మట్లు చెరబడిన సతిన్, రాముడు రోయక కూడెడి, గాముకులగు వారి కెందు గన్నులు గలవే" అని ప్రజలు వారికి తోచినట్లనుకుంటూన్నారని అంటాడు. అతడు చెప్పిన మాట సత్యమని ఇతరులతో దృఢపర్చుకొని, భరతాదులను పిలిపించి, లక్ష్మణుడితో లంకలో జరిగిన సంగతంతా చెప్పి, ".. అపవాదము దుస్సహమై, తపియింపగ జేసె నన్ను........ విడిచెద మిమ్మెల్లర, నే విడిచెద నా ప్రాణమేని, విమల యశము కై...." అంటూ, సీతను వాల్మీకాశ్రమానికి పంపాడు రాముడు. ఒకడిపైన ఇంతకంటే అసత్యమైన అపవాదం పడుతుందా? అలాంటి అపవాదాన్ని పోగొట్టుకోవడానికి ఇంతకంటే స్వార్థ పరిత్యాగం చేసిన వాడుంటాడా? కాబట్టి, ప్రతి మనిషి, తనను చూసి ఇతరులు తప్పు తోవలో ప్రవర్తించకుండేట్లు, లోకోపకారమైన మార్గాన్నే అనుసరించాలి.

సత్ ప్రభువు ప్రజల సుఖ దుఃఖాలను అనుదినం విచారించాలి. సీతా వియోగానంతరం, లక్ష్మణుడు తిరిగొచ్చేంతవరకు, నాలుగు రోజులు, కొలువు దీర్చలేదు రాముడు. దానికి "మర్మనికృంతన మైన బాధ" పడుతూ లక్ష్మణుడితో వెంటనే కొలువు తీర్చమని చెప్పి పరితపించాడు.

అలాంటి అనురాగం గల ప్రభువు విషయంలో, ప్రజలు కూడా అలానే వుండేవారు. అతడితో అడవులకు పోవడానికి, ప్రాణాలైనా పరిత్యజించడానికి అంగీకరించారు. ప్రభువు తానెంత గొప్పవాడైనా, తక్కువ వారితో కూడా కలిసి-మెలిసి వుండాలి. దీన్నే సౌశీల్యం అంటారు. గుహుడికి రాముడిని చూడగానే తటాలున కౌగలించు కోవడానికి వాళ్లిద్దరి మధ్య ఎంత స్నేహం వుండాలో కదా? అలానే రాజు ఎంత తెలిసినవాడైనా, మంత్రుల ఆలోచనలను-సలహాలను

తిరస్కరించకూడదు. వారు చెప్పింది విని, వారితో తాను చేయదల్చుకుంది, సరైందని నమ్మే విధంగా సమాధానం ఇవ్వాలి. విభీషణుడు శరణు చొచ్చినప్పుడు జరిగిన సంగతి ఇందుకొక ఉదాహరణ. ఇంతెందుకు? రాముడి గుణగణాలను చక్కగ అర్థం చేసుకుంటే, రాజుకుండవలసిన సద్గుణాలే కాకుండా, సాధారణంగా ప్రతి పురుషుడికి వుండాల్సిన, సత్యం–దయ–ఇంద్రియ నిగ్రహం–పితృభక్తి–ఏక పత్నీనియమం–సౌభ్రాత్రం–దైవ భక్తి–దేవతారాధనం–నిత్య కర్మానుష్ఠానం విపులంగా ఆయనలో వున్నాయని తెలుసుకోవచ్చు.

ఇక ఉత్తమ స్త్రీల లక్షణాలన్నీ కలిగున్నవారిగా సీత, కౌసల్య, సుమిత్రల గుణాలను బట్టి, నీచ స్త్రీల లక్షణాలున్న వారిగా కైకేయి, శూర్పణఖల గుణాలను బట్టి తెలుసుకోవచ్చు. రావణాసురుడు చెడిపోవడానికి ఎన్నో కారణాలు కనిపిస్తాయి రామాయణంలో. ఇంద్రియాలను జయించ లేకపోవడం, అసత్యాలు పలకడం, వేగుల వారు లేకపోవడం–వున్న వారికి సరైన జీతాలు ఇవ్వక పోవడం, తన పరిసరాలో జరుగుతున్న వృత్తాంతాలను తెలుసుకోలేక పోవడం, విన్న ప్రతి విషయాన్నీ నమ్మడం–నిజా, నిజాలు మంత్రులపైన పడవేయడం, తన మేలుకోరి చెప్పగలవారికి–జ్ఞాన హీనతతో చెప్పేవారికి మధ్య తేడా తెలుసుకోలేక పోవడం, ఎవరినీ నమ్మక పోవడం, మూర్ఖత్వం లాంటి పలు దుర్గుణాలు వున్న రావణుడు సమూలంగా నాశనమయ్యాడు. పైన పేర్కొన్న విషయాలన్నీ, శూర్పణక, మారీచుడు, విభీషణుడు చెప్పిన మాటల్లో బయట పడుతుంది. రాముడితో యుద్ధమెందుకు చేయవలసి వచ్చిందో–యుద్ధ కారణమేంటో తన భటులకే తెలియనీయక వంచన చేసి, వారి ప్రాణాలను తీసిన (రావణాసురుడి లాంటి) ప్రభువు ఎలాంటి వాడో రామాయణం చదువుతే అర్థమవుతుంది.

ఇలాగే, రామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల చర్యల వలన భ్రాతృ ధర్మం, సుగ్రీవుడి చర్యల వలన మిత్ర ధర్మం, హనుమంతుడి చర్యల వలన భృత్యు ధర్మం తెలియ చేయబడ్డాయి రామాయణంలో. అరణ్య వాసానికి పోయేటప్పుడు శ్రీరాముడు తల్లి కౌసల్యతో (అయోధ్య కాండ) అన్న మాటల్లో సతీ ధర్మం ఏమిటో తెలుసుకోవచ్చు. ఆ విషయం "...... వారిజనేత్రకు భర్తృసేవ సద్గతి సమకూర్చు దల్లి......,....... భర్తృహిత కారిణివై చరియింపు మంగనా..." అన్న ఆంధ్ర వాల్మీకి పద్యాల్లో స్పష్టంగా తెలుస్తుంది. అలానే అనసూయ సీతకు హితోపదేశం

చేసిన ఘట్టం చదివితే సతీ ధర్మం గురించి తెలుసుకోవచ్చు.

పితృ భక్తిని తెలుసుకోవాలంటే, అయోధ్య కాండలోని "....... పుత్ర లబ్ధికై పనిగొని తల్లి తండ్రి పడు పాటులకుం బ్రతి సేయ నౌనె? యింపున దల జూచి నీళ్లు కడుపుంగని యన్నము పోసిపెట్టి యెండను జడి గాలి బ్రోతురు దినంబును వారల తుల్యులే యొరుల్" అన్న రాముడి వాక్యాలను చదవాలి.

మిత్ర ధర్మాన్ని గురించి "సులభము మిత్రుల జేర్చుట, కలసిన మరి మైత్రి చెడక కాపాడుటయే బలితపు గష్టము మది చం, చల మగుటను బ్రీతి చెడును స్వల్పంబున కేన్" అన్న సుగ్రీవుడి మాటల్లో తెలియచేయబడింది. న్యాయవాది ధర్మాన్ని హనుమంతుడి వాక్యాలలోను, కన్యాజనకత్వాన్ని" జననీ వంశమువారిని, జనకు కులమువారి స్వపతి సంతతి వారిన్ దనయా! కన్యక సంశయ, మున ద్రోయు సదా యకీర్తి ముంచునొ యనుచున్" అన్న ఉత్తర కాండ పద్యాలలోను తెలుసుకోవచ్చు. సుందర కాండలోని "కోపి తునుము గురువులనేన్, గోపి కడుం గరకులాడు గుణవంతులనేన్, గోపి యొనర్పగజాలని, పాపం బేదైన గలదే భావింపగన్" అన్న పద్యంలో కోపి లక్షణం ఏంటో తెలుసుకోవచ్చు.

రామాయణంలో సకల ధర్మాలున్నాయి. ఇందులో వున్న ధర్మాలే మిగిలిన అన్ని గ్రంథాలలోనూ కనబడతాయి. ఇందులో లేని ధర్మాలు మరింకేదాంట్లోను కనిపించవు. రామాయణంలో సూత్రప్రాయంగా చెప్పిన ఎన్నో విషయాలను వ్యాసమహర్షి తన గ్రంథాలలో పేర్కొన్నాడు. ఉదాహరణకు "నాళీక జంఘుని" కథ. ఇలానే రామాయణంలో సూక్ష్మంగా చెప్పబడిన ధర్మాలను, కథలు–కథలుగా కల్పించి వ్యాస భగవానుడు ఇంతకు నాలుగింతలు గ్రంథాన్ని తయారు చేశాడు. భగవద్గీతంతా కూడా రామాయణ సారమేనని గ్రహించాలి.

శ్రీమద్వాల్మీకి రామాయణం మంత్రనిధానం. ఇందులో అనేకానేక మంత్రాలు ఉద్ధరించబడి వున్నాయి. అందువల్లే, వాల్మీకి రామాయణం పారాయణం చేసేవారు, "అంగన్యాస కరన్యాసాదులతో" యథావిధిగా చదివి, వారి వారి కోరికలు నెరవేర్చుకుంటారు. సద్భావంతో సుందర కాండ పారాయణం చేసి కార్య సిద్ధిని పొందనివారు ఇంతవరకు లేరు. ఉత్తర కాండలో చెప్పినట్లు, రామాయణమంతా గాయత్రీ స్వరూపమే. గాయత్రిలోని 24 అక్షరాలను, ప్రతి వేయి శ్లోకాలకు ఒక అక్షరం చొప్పున శ్లోకం ఆరంభంలో

చెప్పబడింది. ఏడు కాండలలో ఏడు వ్యాహృతులు వివరించడం జరిగింది. ఈ గాయత్రీ విధానాన్ని నారదుడే స్వయంగా వాల్మీకి మహర్షికి, రామాయణంతో పాటే ఉపదేశించాడు. " తప స్స్వాధ్యాయ నిరతం, తపస్వీ వాగ్విదాంవరమ్, నారదం పరిపప్రచ్ఛ, వాల్మీకిర్మునిపుంగవమ్" అని గాయత్రిలోని మొదటి అక్షరంతో శ్లోకాన్ని ప్రారంభించి, "జనశ్చ శూద్రోపి మహత్త్వ మీయాత్" అని గాయత్రి కడపటి అక్షరంతో సర్గను ముగించాడు వాల్మీకి. అంధ్ర వాల్మీకంలో, మూలంలో వున్నట్లు "తపమున స్వాధ్యాయంబున, నిపుణుని........ తమి గావించెన్" అన్న పద్యంతో ప్రారంభించి, "యథావిధి విన్న బఠింప నారయన్" అని ముగించబడింది.

సంస్కృత మూలంలో మాదిరిగానే, ఆంధ్ర వాల్మీకంలో, ప్రణవం–ప్రణవార్థం సముద్ధరించబడి వున్నాయి. ఉదాహరణకు, ఆంధ్ర వాల్మీకంలోని, "అగ్రవర్తియై శ్రీరాము... నువిద తను మధ్య..... మహిత కోదండ..... డోలి....ప్రేమ" అన్న పద్యంలోని మొదటి మూడు పాదాల ప్రథమాక్షరాలు (అవుమ) కలిపితే, నాల్గవ పాదం ప్రథమ–అంత్య అక్షర (ఓమ) స్వరూపం వస్తుంది. ఇలా మంత్రార్థమంతా మూలంలో వలె వుంటుంది. ఇలా, షడక్షరి, అష్టాక్షరి, ద్వయము లాంటి మంత్రాలు కూర్చబడ్డాయి. పరిశోధకులకు ఇవి కనుగొనడం తేలిక.

ఆంధ్ర వాల్మీకంలోని ఈ పద్యం చదువుతే సాంఖ్య శాస్త్ర రహస్యం గురించి కూడా తెలుసుకోవచ్చు.

"శ్రీమహిజాధవుండు జడ చేతనజీవనధాత సద్గరీ
యో మరభూరుహంబు సమ దారివిదారణశీలి భక్తవా
రామృతదాత సంభృతశ రాసకరాంబుజు డొంటిమిట్టశ్రీ
రాము డమాయవర్తనుడు రక్తి గ్రహించుత మన్నమస్కృతుల్

చివరి పాదంలోని మొదటి అక్షరం "రా" అంటే సంఖ్యా శాస్త్రం ప్రకారం 2కు సమానం. ఈ అక్షరం తర్వాత రెండు అక్షరాలను వదిలి చదివితే "మాయ" వుంటుంది. సాంఖ్య శాస్త్రం ప్రకారం మాయ 15కు సమానం. మొదటి అక్షరం తర్వాత 15 అక్షరాలు వదిలి చదివితే "నమః" వుంటుంది. ఇలా అన్నీ కలిపి చదివితే "రామాయనమః" ఏర్పడుతుంది. ఇలాగే కాండాది పద్యాలలో ద్వయము, షడక్షర నియమం కనిపిస్తాయి. కాండాంత పద్యాలలో "రామషడక్షరి" చొప్పించబడి వుంది. వాస్తవానికి సంస్కృత మూలంలో కొన్ని

శ్లోకాలు అభేద్యంగా, వాటి స్వరూపాలు ఊహకందకుండా వుండడంతో తెనిగించడం అంత తేలికైన విషయంగా కనిపించలేదు.

ఇంద్రజిత్తును లక్ష్మణుడు సంహరించేటప్పుడు "సారధర్మాత్ముడును సత్యసంధుడేని, రామచంద్రుండు దశరథ రాజసుతుడు పౌరుషమునను నప్రతి ద్వంద్వు డేని, శరమ! ఈ రావణాత్మజు సంహరింపు" అని రాయబడింది. ఇదొక మహా మంత్రం. దీనికి ప్రతి మంత్రం లేదు. దానితోనే, సర్వాస్త్రవేదియై ఏ అస్త్రంతోనూ చావని ఇంద్రజిత్తును లక్ష్మణుడు చంపగలిగాడు. "రామ" అన్న రెండక్షరాలే "తారక మంత్రం" కదా! దానినే సర్వజ్ఞుడు శివుడు పార్వతికి ఉపదేశించాడు.

కామ్యార్థమైనా, మోక్షార్థమైనా, రామాయణం పారాయణం చేసినవారి కోరికలు నెరవేర్చే శక్తి, రామాయణానికి వుండడానికి కారణం, అది భగవత్ కథ కావడానికి అదనంగా సర్వజ్ఞుడైన వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి) కూర్చిన బీజాక్షరాల మహాత్మ్యమే. ఉదాహరణకు ఒక దృష్టాంతం తీసుకుందాం. సుందర కాండను అందరు పారాయణం చేస్తారు కదా! అలా చేసినవారి కోరికలు నెరవేరడం కూడా సహజమే కదా! ఆ కాండంలో ప్రథమాక్షరం "త". చివరి అక్షరం కూడా "త". "తరువాత రావణాసుర...." తో మొదలయ్యి, "తత భవద్దుఃఖమునకు....శాంతి సీత" తో ముగుస్తుంది. సుందర కాండలో ప్రతి సర్గ మొదటి అక్షరం "స" కారంతోనో, "త" కారంతోనో వుంటుంది. అలా కాకపోతే ఆ శ్లోకంలో "సీత" అన్న శబ్దంకాని, దాని పర్యాయ పదం కాని వుంటుంది. అది కూడా కుదరనప్పుడు, రెండో శ్లోకం మొదటి అక్షరం "స" కాని, "త" కాని తప్పకుండా వుంటుంది. ఈ "స", "త" లు "సీత" అన్న పదాన్ని సూచించడం స్పష్టంగా తెలుస్తోంది. సుందర కాండకు అధిష్టాన దేవత సీత. ఈ సకార-తకార మహిమ ప్రకారం సీత అంటే "ఓం" అని అర్థం కూడా. బీజాక్షర మహిమ కూడా వుంది. ఇప్పుడు చెప్పిన దాని కంతా పారాయణం చేస్తున్న వారే సాక్షులు. హనుమంతుడు ఆమె పేరు చెప్పాల్సి వచ్చినప్పుడల్లా, ఆమె వున్న దిక్కుకు నమస్కరించి మరీ ప్రస్తావించేవాడు. ఇలా రామాయణంలో ఎన్ని రహస్యాలున్నాయన్న సంగతి ఎవరికన్నా తెలుసునా?

శ్రీమద్రామాయణం వేదంతో సమానమైందే కాకుండా వేదమే అనాలి. వేదమే అయినప్పుడు, వేదంతో సమానమైందని ఎలా అనవచ్చునంటే, వేదంలోని వర్ణాలనే, అనులోమ-విలోమాలుగా మార్చి, వేద ప్రసిద్ధమైన రామ

కథను చెప్పడంవల్ల ఇది వేదమే అయింది. వేదాల్లోని అర్థాలున్నందువల్ల వేదంతో సమానమైంది. అందువల్లనే, వేద పఠనం అవశ్యంగా చేయాల్సిన కార్యక్రమాల్లో, రామాయణ పఠనం నియమితమైంది. "రామాయణం వేదసమం, శ్రాద్ధేషు శ్రావయే ద్బుధః" అని రామాయణంలోనే చెప్పబడింది.

శత కోటి, అంటే 24 గాయత్రీ బీజాక్షరాలతో కూడిన 24,000 శ్లోకాల రామాయణంలోని ప్రతి అక్షరానికి మహా పాతకాలను నాశనం చేయగల శక్తిగలదని కొందరంటారు. కొందరేమో, శత కోటి రామాయణాన్ని వాల్మీకి సంగ్రహంగా చెప్పాడంటారు. ఇలాంటి మహిమ రామాయణంలో వుండడానికి కారణమేంటో ఆలోచించాలి. వాల్మీకి సూత్రాన్ననుసరించి, రామాయణం వేద స్వర సముద్ధృతంగా–సర్వశ్రుతులందున్నట్లుగా తెలుస్తోంది. వాల్మీకి రచించిన 24,000 శ్లోకాలలో, యజుర్వేదంలోని 1 29 290 పదాలే కాకుండా, రుగ్వేదం, సామవేదం, అధర్వ వేదాలలోని పదాలు కూడా అనులోమ–విలోమంగా కూర్చబడిందన్న రహస్యం తెలుసుకోవచ్చు. యజుర్వేదానికి ప్రాముఖ్యం ఇవ్వడానికి కారణం, శ్రీరాముడు యజుర్వేది కావడమే.

యజుర్వేద సంహితా ప్రమాణం ఆధారంగా, రామాయణంలోని ఏడు కాండలంటే, సౌమ్యము, ప్రాజాపత్యము, వైశ్వదేవము, ఆగ్నేయము, ఆగ్నేయ బ్రాహ్మణము, సౌమ్య బ్రాహ్మణము, కామ్యకము. అదే విధంగా ప్రశ్నలు 44. అందులో మొదటి కాండలో 8, రెండులో 6, మూడులో 5, నాలుగులో 7, ఐదులో 7, ఆరులో 6, ఏడవ కాండలో 5 ప్రశ్నలున్నాయి. అనువాకాలు 651, పనసలు 2198, పదాలు 129290, అక్షరాలు 253868 వున్నాయి. ఈ విధంగా యజుర్వేదంలోని కాండల, ప్రశ్నల, అనువాకాల, పదాక్షరాల నిర్ణయం జరిగింది. శ్రీమద్రామాయణంలోని కాండలలో వేదాక్షరాలు ఎలా వున్నాయో పరిశీలించితే, బాల కాండ ప్రధమ సర్గ నుంచి ఐదో సర్గ వరకు రెండో శ్లోకం దాకా, నారదుడు ఉపదేశించిన విధానం రాసి, తర్వాతనే బ్రహ్మ ప్రత్యక్షం కావడంతో కథా భాగం వుంది. బాల కాండ 5 సర్గ 3 వ శ్లోకం నుంచి, అయోధ్య కాండ 115 వ సర్గ వరకు యజుర్వేదం. అయోధ్య కాండ 116 వ సర్గ మొదలు, అరణ్య కాండ 74 వ సర్గ వరకు ఋగ్వేదం. అరణ్య కాండ 75 వ సర్గ మొదలు సుందరకాండ 48 వ సర్గ వరకు సామవేదం. సుందర కాండ 49 వ సర్గ మొదలు ఉత్తర కాండ 36 వ సర్గ వరకు అథర్వ వేదం. ఉత్తర కాండ 37వ సర్గ మొదలు చివర వరకు ఉపనిషత్తు–అంటే శాంతి. ఈ విధంగా 647సర్గలలో 23635

శ్లోకాలు, 776794అక్షరాలున్నాయి. అక్షరాల సంఖ్యలో కొంచెం తేడా రావడానికి కారణం వేదాలలో వర్ణముల పదాలు విశేషంగా వుండడం వల్ల ఇవి సరి చూసుకుంటే, వేద వర్ణాల లెక్కకు, రామాయణ వర్ణాల లెక్కకు సరిపోతాయి. రామాయణం వేదం కాబట్టే, నిరంతర అధ్యాయనపరుడైన వాల్మీకి, కొన్ని చోట్ల వేద పరిభాషా పదాలను, వేద సంజ్ఞలను ప్రయోగించాడు. ఈ సంకేతాలన్నింటినీ తెలుసుకోగలిగితే సందేహాలకు తావులేకుండా వాల్మీకి రామాయణ సారాన్ని గ్రహించగలుగుతారు.

రామాయణం ఒక మహత్తరమైన సాంఖ్య శాస్త్రం. "కాదినవాది సూత్రాల" ప్రకారం అక్షరాల కొచ్చే సంఖ్యలను బట్టి చూస్తే, రామాయణంలో కొన్ని చిత్రాలు కనిపిస్తాయి.

రా + మ = 2+5 =	7
అవతార సంఖ్య	7
రామాయణ కాండ సంఖ్య	7
యుద్ధం జరిగిన రోజుల సంఖ్య	7
రామాయణ యుద్ధంలో ముఖ్యమైన పురుషుల సంఖ్య	7

(రామ, లక్ష్మణ, హనుమ, విభీషణ, రావణ, కుంభకర్ణ, ఇంద్రజిత్తులు)

పారాయణం చేసే వారికి ముఖ్యంగా నియమిత మైన సర్గల సంఖ్య 7. వ్యాహృతులు 7. ఇలా ఈ ఏడవ సంఖ్య మహిమ అద్భుతం. "శ్లోక శతై" అని వాల్మీకి చెప్పినట్లు, బాల కాండం మొదటి సర్గ మొదటి శ్లోకం (తప స్స్వాధ్యాయ...) లోని అక్షరాల కొచ్చే సంఖ్యలను కూడితే 100 వస్తుంది. ఈ 100 సంఖ్య ప్రథమ సర్గలోని శ్లోకాల సంఖ్య. రామాయణంలోని సప్త సంఖ్యా నియమాన్ని గ్రహించిన వ్యాస భగవానులు నిజ రచిత గ్రంథానికి "జయ" అని పేరు పెట్టాడు. "జయ" అంటే18. భారతంలోని పర్వాలు 18. యుద్ధం జరిగింది 18 రోజులు. రణ శూరులు 18 మంది. భగవద్గీతలో 18 అధ్యాయాలున్నాయి. ఇలా ఆలోచిస్తే, మహర్షులందరి మార్గాలు ఒక్కటేననిపిస్తుంది.

సీతారాముల వియోగం గురించి, కలిసి వుండడం గురించి అయోధ్యా కాండలో చెప్ప బడింది. మిగిలిన కాండలలో కొంత కాలమన్నా వియోగం గురించి చెప్పబడింది. కాబట్టి "సీత, రామ" నామాల సంఖ్యలు కలిపితే (సీత=67 + రామ=52) 119 వస్తుంది. అయోధ్య కాండలో 119

సర్గలున్నాయి. ఇలాంటి చిత్రాలు ఎన్నెన్నో వాల్మీకి రామాయణంలో నిక్షేపం చేశాడు.

శ్రీరాముడు సామాన్య ధర్మాలన్నీ ఎలా అనుష్టించింది, కష్ట కాలంలో ఎలా ప్రవర్తించింది, సుఖ కాలంలో ఎలా నడచుకుంది, ఎలాంటెలాంటి వారి మీద ఏ విధమైన అభిప్రాయంతో మెలిగేవాడనేదీ, వీటి కారణాలేంటి అన్న విషయాలన్నీ చర్చించాల్సినవే. రాముడి పైనా, ఆయన తమ్ములపైనా ఏక పత్నీవ్రతం విషయంలో కూడా విరుద్ధాభిప్రాయాలను వెలిబుచ్చిన వారున్నారు. అసలా మాటకొస్తే " దుష్టులు వెలిచవి (జారత్వం) మరగిన భ్రష్టులు లేరప్పురమున రాష్ట్రమునందున్" అని బాలకాండలో చెప్పినట్లు, దశరథుడు పాలించిన అయోధ్యలో ప్రతి మనుష్యుడు ఏక పత్నీవ్రతుడే. అలాంటప్పుడు రాముడు అనేక పత్నీకుడని ఎలా చెప్పారు? అలాంటి రాముడు వాల్మీకి వర్ణించిన శ్రీరాముడు మాత్రం కాదు. ఒక్క వాల్మీకే యథార్థ చరిత్రను వర్ణించాడు. మిగిలిన వారందరూ, రాముడి పరత్వాన్ని వర్ణించినవారే. ఇలానే వాలి వధ విషయంలో కూడా రాముడి గుణం దోషరహితమే. శ్రీరాముడు సంధ్యావందనం, దేవతార్చన, విగ్రహారాధన, వ్రతానుష్టానం లాంటి నిత్య కర్మలన్నీ శ్రద్ధగా చేసేవాడు.

రామాయణ గ్రంథమేమో చాలా గొప్పది. రాసిన కవేమో బ్రహ్మర్షి. ఇందులోని మర్మాలేమో మెండుగా వున్నాయి. రాసిందేమో సంస్కృత భాషలో. చదివినా కొద్దీ విశేషాలు కనిపిస్తాయి. నేనా కించిజ్ఞుడను-చంచల చిత్తుడను-శక్తి హీనుడను. అందుకే దోషాలు దండిగా వుంటాయి. పాఠకులు ఆంధ్ర వాల్మీకి రామాయణాన్ని దయతో చదివి నన్ను ధన్యుడిని చేయండి. భగవద్ధ్యానంలో ఆసక్తిగల భక్తులందరూ దీన్ని భగవంతుడికి నివేదించబడిన ప్రసాదంలా ఈ కృతిని భావించమని ప్రార్థన.

చివరగా:

"తప్పెనను నొప్పెనను, దెప్పుచునో మెచ్చుకొనుచో, దీనిన్ శ్రద్ధన్
దప్పక సకలము జదివెడు, నప్పుణ్యాత్ముల కొనర్తు సాష్టాంగనతుల్"

(వావిలికొలను సుబ్బరావు, కీలక సంవత్సరం, మాఖ శుద్ధ ౧౧, తిరువళిక్కేణి)

వాల్మీకి రచించిన శ్రీమద్రామాయణానిదే కావ్యాలలో అగ్రస్థానం

శ్రీ సీతారామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల చరిత్రను, వీరు ఆచరించిన ధర్మాలను అన్ని లోకాలకూ శాశ్వతంగా చెప్పేందుకు, శత కోటి గ్రంథాత్మకమైన ప్రబంధంగా, ఓ బృహత్ గ్రంథాన్ని రచించి నారదుడికి, ఇతర మహర్షులకు ఉపదేశించాడు బ్రహ్మదేవుడు. అంతటితో ఆగకుండా భూలోక వాసుల కొరకై శ్రీరామ భక్తుడైన వాల్మీకికి ఉపదేశించమని నారదుడిని ఆదేశించాడు. వాల్మీకి రచించిన రామాయణం బ్రహ్మ ప్రేరేపించినదే.

వాల్మీకి సంస్కృతంలో రచించిన శ్రీమద్రామాయణం కావ్యాలలో అగ్రస్థానంలో నిలిచింది,. శ్రీమద్రామాయణంలో నాయిక సాక్షాత్తు శ్రీదేవైన సీతా దేవి. నాయకుడు మహావిష్ణువైన శ్రీరామచంద్రమూర్తి. వీరిరువురు త్రేతాయుగంలో దుష్ట శిక్షణ–శిష్ట రక్షణ చేసి, ధర్మ సంస్థాపన చేసేందుకు అవతరించారు. ఇహ–పర సాధకంబులైన "స్వధర్మాలలో, స్త్రీ ధర్మం సీతని, పురుష ధర్మం శ్రీరామచంద్రమూర్తని లోకానికుపదేశించాడు వాల్మీకి.

శ్రీరామచంద్రుడు బాలుడుగా వున్నప్పుడు జరిగిన సంగతులు తెలిపేది "బాల కాండ". ఇందులోనే సీతాకల్యాణ ఘట్టం అత్యంత మనోహరంగా రాసారు వాల్మీకి కవి. "కాండం"అంటే జలం...అంటే నీరు. శ్రీ రామాయణం మహార్ణవంగా చెప్పడంవల్ల, అందులోని జలం కాండమన్నారు. శ్రీ రామాయణంలోని బాల కాండలో శ్రీరామచంద్రమూర్తైన విష్ణువే "జగజ్జనన కారణభూతుడు" అని బోధపడుతుంది. జననం మొదలు ఇరవై అయిదు ఏళ్లు వచ్చేవరకూ రాముడు చేసిన చర్యలు ఈ కాండలో వున్నాయి. పన్నెండో ఏట పెళ్లైనప్పటినుండి పట్టాభిషేకం ప్రయత్నం జరిగే వరకు చెప్పుకోదగ్గ విశేషం ఏమీలేదు. బాల కాండ వృత్తాంతమంతా 12 సంవత్సరాల కాలంలో జరిగింది.

రామాయణ రచనకు పూనుకున్న వాల్మీకి మహర్షి, భగవద్విషయాన్ని బోధించే యోగ్యతలున్న గురువు దొరకలేదనే నిర్వేదంతో శుష్కించి, తన ఆశ్రమానికి వచ్చిన నారదుడికి సాష్టాంగ నమస్కారం చేసి: "గుణవంతుడు, అతివీర్యవంతుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యశీలుడు, సమర్థుడు, నిశ్చలసంకల్పుడు, సదాచారం మీరనివాడు, సమస్త ప్రాణులకు మేలు చేయాలన్న కోరికున్నవాడు, విద్వాంసుడు, ప్రియదర్శనుడు, ఆత్మవంతుడు, కోపాన్ని స్వాధీనంలో వుంచుకున్నవాడు, ఆశ్చర్యకరమైన కాంతిగల వాడు, అసూయ లేనివాడు, రణరంగంలో దేవదానవులను గడ–గడలాడించ గలవాడు ఎవరైనా వున్నారా ఈ భూలోకంలో?" అని పదహారు ప్రశ్నలు వేస్తాడు.

వాస్తవానికి ఈ గుణాలన్నీ వున్నవాడు శ్రీరామచంద్రుడే! అందుకే ఆయన చరిత్రను మనకందించాడు వాల్మీకి మహర్షి.

బాల కాండలో శ్రీ మహావిష్ణువు భూమిపై అవతరించాల్సిన కారణం, అయోధ్య కాండలో స్థితి కారణం, అరణ్య కాండలో మోక్షమిచ్చే అధికారం, కిష్కింధ కాండలో గుణ సంపత్తి, సుందర కాండలో సర్వ సంహార శక్తి, యుద్ధ కాండలో వేదాంత వేద్యత్వం, ఉత్తర కాండలో సృష్టికి హేతువు లాంటి విషయాలను చెప్పడం జరిగింది. రామాయణంలో చెప్పబడిన పరతత్వం శ్రీరామచంద్రమూర్తిగా అవతరించిన విష్ణువేనని స్పష్టమవుతుంది. ఇటువంటి పరతత్వాన్ని స్థాపించి, పరమాత్మ అనుభవించే ఉపాయం శరణాగతని అర్థం చేసుకోవాలి. శరణా గతికి ముఖ్య ఫలం, భగవత్ సన్నిధానంలో చేరి, భగవంతుడికి సేవ చేయడమే. శరణాగతికి పురుష కారం అవశ్యం. పురుష కారానికి కావాల్సిన ముఖ్య గుణం శరణాగతుడి పట్ల దయ. రామాయణంలో పురుష కారం ప్రధానమైంది. శరణాగతుని అనుష్టించు అధికారికి శేషత్వం పారతంత్ర్యం స్వరూపం. భరతుడి చర్య వలన పారతంత్ర్యం స్పష్టంగా కనిపిస్తుంది. శత్రుఘ్నుడి చర్యలు భాగవత పారతంత్ర్యాన్ని తెలియచేస్తుంది. మనం సదా జపం చేయాల్సింది రామాయణమే.

రామావతారం పూర్ణావతారమే. అంటే ప్రకృతి సంసర్గం లేదు. శరీరం అప్రాకృతం. ప్రకృతి గుణాలు ఆయన్ను బాధించవు. రామచంద్రమూర్తి శోకించాడని వాల్మీకి రాసిందీ అసత్యం కాదు. నిజంగానే శోకం కలిగిందాయనకు. అయితే శోకం కలిగింది తన కొచ్చిన కష్టానికి కాదు. తమకు దుఃఖాలొచ్చాయని మనుష్యులు దుఃఖిస్తారు. తనకై, తన ఆప్తులకు దుఃఖం కలిగిందికదానని, తన మూలాన వీరికింత దుఃఖం ప్రాప్తించిందికదానని, వారి దుఃఖాన్ని ఆపాల్సిన తానే వారి దుఃఖానికి కారణమయ్యానని మాత్రమే రాముడు శోకించాడు. అలానే, సీతాదేవి విషయంలోనూ దుఃఖించాడు శ్రీరాముడు. తనను నమ్మి అడవులకు వచ్చిన సీతను, రాక్షసుడు ఎత్తుకుపోతే, తనను వదిలిన బాధతో, అమెకెంత దుఃఖం కలిగిందని రామచంద్రమూర్తి దుఃఖించాడు. వియోగంవల్ల తమకు కలిగిన నష్టానికి దుఃఖించే వాళ్లు మనుష్యులు. జీవులకు కలిగిన నష్టానికి దుఃఖించేవాడు భగవంతుడు. శ్రీరామ చరిత్ర అంటే మహాపురుష చరిత్రే. అందుకే దీనివలన ఎన్నో లాభాలున్నాయన్న భావన బాల కాండ మొదటి పద్యం లోనే వివరించబడింది.

శ్రీ రామాయణం, భారతం, భాగవతం అద్వితీయమైన గీర్వాణ భాషా గ్రంథాలు. ఈ మూడింటి లో ఆద్యమైంది శ్రీరామాయణ కావ్యం. కావ్యాలలోకెల్లా ప్రధమంగా ఉత్పన్నమైంది కావడంతో ఆదికావ్యమైంది. రామాయణాన్ని చక్కగా తెలిసినవారు–అర్థం చేసుకోగలిగిన వారు మాత్రమే లోకానికి అందలి విషయాలను వివరించ సమర్థులు. అందరికీ అది సాధ్యమయ్యేది కాదు. "శ్రీరామాయణం" అంటే, లక్ష్మీరమణుడైన శ్రీమన్నారాయణుడి మాయా మానుషావతారమైన శ్రీరామ చరిత్రనీ, శ్రీ లక్ష్మీదేవి అవతారమైన సీతాదేవి చరిత్రనీ అర్థం. సీతాదేవి మహాత్మ్యాన్ని విశేషించి చెప్పడంవల్ల వాల్మీకి మహర్షి, శ్రీ రామాయణాన్ని "సీతాయాశ్చరితం మహత్తు" అని వెల్లడిచేశాడు. శ్రీరామచంద్రుడు మనుష్యుడివలె నటిస్తుంటే, వాల్మీకేమో వాస్తవార్థం చెప్తూ, ఆయన సాక్షాత్తు భగవంతుడే అంటాడు. రాముడి చర్యల ద్వారా, రాముడి వాక్కుల ద్వారా తాను చెప్పదల్చుకున్న దాన్ని సిద్ధాంతీకరించాడు వాల్మీకి. శ్రీరాముడు భగవంతుడేనన్న అర్థం, హారంలోని సూత్రంలాగా, రామాయణంలోని ఏడు కాండల్లోనూ వ్యాపించి వుంది. రామాయణాన్ని చదివేవారందరు, ఈ అర్థాన్ని మనస్సులో పెట్టుకొని, ఇందులోని ప్రతి అంశాన్ని–ప్రతి వాక్యాన్ని హెచ్చరికతో శోధించాలి. ఇలా ఆసక్తిగా శోధించిన వారికి–పరీక్షించిన వారికి మాత్రమే, వాల్మీకి రామాయణంలోని గొప్పదనం తెలుస్తుంది.

వాల్మీకి రామాయణంలోని పాత్రలు–పాత్రధారుల వాక్కులు, ఆయా పాత్రల చిత్త వృత్తి గుణాలను తెలియచేసేవిగా, సందర్భోచితంగా, వారున్న అప్పటి స్థితికి అర్హమైనవిగా వుంటాయి. పాత్ర గుణ మహాత్మ్యానికి అసంగతమైన వాక్యాలు ఆయా పాత్రల నోటినుంచి వెలువడవు. శ్రీరాముడు భగవంతుడన్న అభిప్రాయం వాల్మీకి పదే పదే చెప్పుకుంటూ పోయాడు రామాయణంలో. వాల్మీకి రామాయణమనే "కలశార్ణవం" లో రత్నాలను వెదికేవారు, మొట్టమొదటగా తెలుసుకోవాల్సింది వాల్మీకి శైలి–విధానం. అది తెలుసుకోలేక వెతకడం మొదలుపెట్టితే, చీకట్లో తారాడినట్లే. ఒక విషయం గురించి చెప్పాల్సిందంతా ఒకచోట చెప్పడు. కొన్ని సందర్భాలలో ఆ విషయానికి సంబంధించిన ప్రస్తావనే వుండదు. అదే విషయం మరెక్కడో సూచన ప్రాయంగా వుండొచ్చు. ఒక్కోసారి విపులంగా విశదీకరించబడి వుండొచ్చు. ఆయన చేసిన వర్ణనలను బట్టి, ప్రయోగించిన పదజాలాన్ని బట్టి, పాఠకులు ఊహించుకోవచ్చు.

వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి) రామాయణం "ధ్వని కావ్యం". కావ్యానికి ప్రధానమైంది ధ్వని. కావ్యానికి ప్రాణం ధ్వని. ధ్వని లేని కావ్యం శవంతో సమానం. రామాయణంలో ధ్వని విశేషంగా వుంది. కావ్యమంతా ధ్వన్యర్థం వుండడమే కాకుండా, పలు శ్లోకాలకు విడిగా ధ్వన్యర్థం వుంది. శ్రీమద్రామాయణం గొప్ప ధర్మ శాస్త్రం. ఇందులో సర్వ విధాలైన, అన్ని రకాల ధర్మాల గురించి వివరంగా చెప్పబడింది. రాజ ధర్మం, ప్రజా ధర్మం, పతి ధర్మం, సతీ ధర్మం, భాతృ ధర్మం, పుత్ర ధర్మం, భృత్యు ధర్మం, మిత్ర ధర్మం లాంటి అన్ని ధర్మాలను గురించి చక్కగా తెలుపబడి వుంది. లాభ–లోభ–పక్షపాత బుద్ధి లేకుండా, న్యాయం మీదే దృష్టి నిలిపి వాదించే న్యాయవాది ధర్మం కూడా చెప్పబడింది. వీటితో పాటు కథా సందర్భానుసారంగా, అంతరాంతరాలలో ఎన్నో నీతులు చెప్పబడ్డాయి. రామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల చర్యల వలన భాతృ ధర్మం, సుగ్రీవుడి చర్యల వలన మిత్ర ధర్మం, హనుమంతుడి చర్యల వలన భృత్యు ధర్మం తెలియ చేయబడ్డాయి రామాయణంలో. రామాయణంలో సకల ధర్మాలున్నాయి. ఇందులో వున్న ధర్మాలే మిగిలిన అన్ని గ్రంథాలలోనూ కనబడతాయి. ఇందులో లేని ధర్మాలు మరింకేదాంట్లోను కనిపించవు.

ఇలా వాల్మీకి రామాయణంలో ఒకటి కాదు...వందల...వేల రకాల వ్యావహారిక, ప్రాపంచిక, ధర్మ, అర్థ, కామ, మోక్ష సంబంధమైన అనేకానేక విషయాలు వుండడం వల్ల దానిని మించిన గ్రంథం మరోటి లేదని అంటారు.

సర్గ-1
అవతారిక

అరణ్యకాండలో దీనసంరక్షణ అనే ధర్మాన్ని రామచంద్రమూర్తి అనుష్ఠించి చూపించాడు. ఈ కాండలో మిత్ర రక్షణ, అనుష్ఠించి చూపుతున్నాడు. పూర్వకాండలో జటాయువు లాంటివారికి మోక్షమిచ్చి తన పరాత్పరత్వాన్ని వెల్లడి చేశాడు. ఈ కాండలో ఆయన అసంఖ్యాకమైన కళ్యాణ గుణాలు చెప్పడం జరుగుతుంది. ప్రథమ కాండలో శరణాగతి మంత్రం అందులోని సీతాకళ్యాణం ద్వారా వివరించబడింది. అయోధ్యాకాండలో సర్వజన వ్యామోహ విషయత్వం చెప్పి నారాయణ శబ్దార్థం వివరించడం జరిగింది. అరణ్యకాండలో పంచవటీ వాసపర్యంత వృత్తాంతంతో మునిజనులు చేసిన కైంకర్యం చెప్పడం వల్ల "నారాయణాయ" అనే పదంలోని చతుర్థీ విభక్తి అర్థం చెప్పడం జరిగింది. ఖరాది రాక్షసుల వధతో మంత్రంలోని ఉత్తరార్థంలో "నమ" అనే మూడో పదం అర్థాన్ని విశదీకరించి మారీచ దర్శనం మొదలు జీవుడు ఉజ్జీవించే ఉపాయం చెప్పడం జరుగుతుంది. శ్రీరామచంద్రమూర్తి సీతను వెతికాడు అనే కథ వల్ల భగవంతుడు జీవుడిని ఉజ్జీవింప చేసే ఉపాయ చింతన చెప్పడం జరిగింది.

కిష్కింధాకాండలో ఆ జీవుడి దగ్గరకు ఆచార్యుడు పంపంపడం జరిగిందని చెప్పబడింది. శ్రీరామచంద్రమూర్తి విలాపం పేరుతో, నిత్య కైంకర్యపరులైన నిత్య శూరులను చూసి, అయ్యో! జీవులందరూ వీరిలాగానే భోగానికి అర్హులై కూడా ఎందుకు కొందరు నన్ను చేర రావడం లేదనే భగవంతుడి క్లేశం ప్రథమ సర్గలో వర్ణించడం జరిగింది. కమలాల, కలువల, మీనాల సమూహంతో మిక్కిలి ప్రకాశించే సౌందర్య లక్ష్మితో కూడిన పంపా పుష్కరిణిని చూసి రామచంద్రమూర్తి తమ్ముడైన లక్ష్మణుడితో తన దుఃఖం చెప్పుకొని ఇలా పలికాడు.

(ఇక్కడ పంపను పుష్కరణి అని అనడం జరిగింది. అరణ్యకాండలో చెప్పిన దాన్ని బట్టి, ఇది పోల్చుకుంటే, పంప అనేది సరస్సా? నదా? అనే సందేహం కలగవచ్చు. ఏదేమైనా, ఇప్పుడిది ఎక్కడ వుందనేది తెలుసుకోవాలి. దీనికి దగ్గరలోనే కిష్కింధ వుండాలి. పంప నదా? సరస్సా? అనే విషయం రామాయణాన్ని బట్టి పరిష్కరించడం సాధ్యపడకపోవచ్చు. బహుశా అది కొంత భాగం నదనీ, కొంత భాగం సరస్సనీ నిశ్చయించవచ్చు. స్థలం పరిశీలించితే కాని ఈ ఊహకు బలం చేకూరుతుంది. పంప హంపి కూడా కావచ్చు. ఈ హంపి ఇప్పుడు బళ్లారి దగ్గర హాస్పేటలో వుంది. ఇప్పుడు తుంగభద్ర అని పిలిచే నదినే ఒకప్పుడు పంప అని పిలిచారంటారు కొందరు. తుంగభద్రా నదీ తీరంలో వున్న ఒకానొక శివ క్షేత్రంలో వున్న ఈశ్వరుడిని పంపాపతి అని పిలుస్తారు. హంస సందేశంలో శ్రీరామచంద్రమూర్తి తానుండేది మాల్యవంతమనే పర్వతం అనిచెప్పాడు. మాల్యవంతం బళ్లారి దగ్గరలోనే వుంది. ఇది చూసుకుంటూ తూర్పు పర్వతాల వెంట పోతే వేంకటాద్రి కనపడుతుందని హంసతో చెప్పినట్లు కథ వుంది).

పంపను చూసిన సంతోషంతో శ్రీరామచంద్రమూర్తికి సీతాదేవి జ్ఞాపకానికి వచ్చింది. సీతాదేవి కోసం తానెంత శోకిస్తున్నాడో, వెలవెలబోయి వున్నాడో అనే విషయాన్ని తనలాగే ముఖ చిహ్నాలున్న తమ్ముడు లక్ష్మణుడితో ఇలా అన్నాడు. "వికసించిన కమలాలు, ఎర్ర కలువలు, వైడూర్యకాంతి కల నిర్మల జలాలు, ఆ నీటి ఒడ్డున నానా విధాలైన వృక్షాలు కల పంపను చూశావా సౌమిత్రీ ? శిఖరాలతో కొండలుండే రీతిగా ఎత్తైన కొమ్మలతో పంప చుట్టూ వున్న అడవుల్లోని చెట్లు పొగిడేవిధంగా వున్నాయి. ఊరి బయట కుటీరంలో ఉపవాసాలు, వ్రతాలు చేస్తూ కృషిస్తున్న భరతుడి కొరకు, సీత రాక్షసుల చేతికి చిక్కి బాధపడుతున్నందుకు, శోకపీడితుడనైన నన్ను వసంతుడు అధిక దుఃఖంలో ముంచాలని చూస్తున్నాడు. దుఃఖించే వాడికి సర్వం అసహ్యంగా కనిపించినట్లే, సీతాభరతులకై ఏడ్చే నాకు కూడా ఈ కొలను విచిత్ర వనంతో చుట్టబడి, తాపం హరించి, ధేహకాంతి కలిగించి, చల్లటి నీటితో, మిక్కిలి సంతోషంగా వుంది. పాములతో చుట్టబడి, మృగాలతో-పక్షులతో కూడి, కమలాలు, కలువలతో కప్పబడిన కొలను కనపడుతుంది చూశావా? లక్ష్మణా! అవే పచ్చిక పట్టులు. నీలం, పసుపు రంగుతో వుండడంతో, వాటిమీద చెట్లనుండి పూలు రాలడంవల్ల రత్న కంబళాల లాగా వున్నాయి".

"దండిగా పూసిన పూలతో వృద్ధిపొందిన కొనకొమ్మలు కల చెట్లను, వికసించిన పూలుకల కొనలున్న తీగెలు ఆపాదమస్తకం కౌగలించుకున్నాయి చూశావా? సువాసనతో నిండిన వాడై, సుఖం కలిగించే విధంగా స్పృశించే వాయువు కలవాడై, విజృంభించిన మన్మథుడు కలవాడై, ఫలాలతో, పూలతో మనస్సును ఆకర్షించేవాడై, వసంతుడు ప్రకాశిస్తున్నాడు. మేఘాలు నీళ్లు కురిపిస్తున్నట్లే పూల చెట్లు పూల వర్షం కురిపిస్తున్నాయి. చూడు ఈ సౌభాగ్యం. కఠినమైన రాళ్లలో అడవి చెట్లు పూలు రాల్చాయి. గాలి వీస్తుంటే రాలిన, రాలుతున్న పూలతో కలిసి పిల్లగాలి ఆడుకుంటున్నది. గాలి పూలతో అందమైన కొమ్మలను తాకి, వాటి నుండి వచ్చే ధ్వనితో తుమ్మెదల ఝుంకారం పేరుతో పాటలు పాడుతున్నది. కోవెలల మనోజ్ఞమైన పంచమధ్వనితో సంతోషంగా చెట్లకొమ్మలను ఆడించే విధంగా కొండగుహ వదిలి బయల్దేరి పాటపాడుతున్న దానిలాగా గాలి కనిపించింది. గాలి రివ్వున వీచడం వల్ల పూచిన కొమ్మలు ఒకదానితో మరొకటి పెనవేసుకొని ఇంపైన పూలదండలాగా చెట్ల సమూహంలో ప్రకాశిస్తున్నది. మందానిలుడు శ్రీగంధంలాగా చల్లగా, మంచిపరిమళాన్ని అన్నిచోట్లా కలిసేట్లు స్పృశించిన వారికి వేడి పోయేట్లు సుఖ స్పర్శుడై చక్కగా విసిరాడు. తేనెల వాసనలు కొట్టున్న అడవుల్లో మదించిన తుమ్మెదల మనోహర ధ్వనుల వల్ల చెట్ల గాలి అతిశయంతో ఆడింది, పాడింది".

"కొండల్లో, కోనల్లో, పుట్టిన నిండారు పూలగుత్తులతో నిండిన చెట్లు ఒకదానితో మరొకటి కలిసికొనగా కొండలన్నీ పూలకుప్పల్లాగా కనపడుతున్నాయి. పూలతో కప్పబడిన కొనలు కలిగి, ఎగురకొట్టడం వల్ల, భ్రమరం పైభాగం తలమీద పూలను ధరించి, నల్లగుడ్డ ముసుగువేసుకుని, ఆడుతూ-పాడుతూ వున్న స్త్రీలలాగా చెట్లున్నాయి. బంగారపు సొమ్ములు ధరించి, సరిగ వస్త్రాన్ని వల్లెవాటుగా పైన వేసుకున్న జనుల లాగా నిండా పూచిన గోగులున్నాయి చూశావా? వసంతం కొత్త-కొత్త పక్షుల ధ్వనులతో ఆక్రమించి భార్యలేని నాకు సహించలేని మనోవేదన కలిగిస్తున్నది. భార్యను ఎడబాసిన తీవ్ర దుఃఖం అనుభవిస్తున్న నన్ను మన్మథుడు చాలా బాధిస్తున్నాడు. కోవెలలు జయఘోషతో నన్ను సంతోషంగా పిలుస్తున్నాయి. రమ్యమైన అడవి వంకలలోని నీటికోళ్లు, మిక్కిలి సంతోషంతో మనొహరమైన ధ్వనులు చేస్తూ, సహించలేని పరితాపం నాకు కలిగిస్తున్నాయి".

"లక్ష్మణా! మనం పంచవటి ఆశ్రమంలో వున్నప్పుడు ఇటువంటి

మనోహరమైన ధ్వనులు వినపడినట్లయితే, జానకి సంతోషంగా నన్ను పిలిచి, ఆ ధ్వనులెంత రమ్యంగా వున్నయో వినమని నాకు చెప్పి సంతోషించేది. తనకు సంతోషమైనా, నాకు సంతోషం అయితేనేకాని ఆమెకు సంతోషకరం కాదు కదా? అనేకమైన పక్షుల గుంపులు నానావిధాలైన మనోహర ధ్వనులు చేస్తూ తీగెల పొదలమీద వాలుతున్నాయి చూడు. ఇంపైన ధ్వనులు చేస్తూ, అతిశయించిన ఆశతో, తమ జాతికి చెందిన పోతు పక్షులతో కూడి ఆడు పక్షులు తుమ్మెదలు పాట పాడుతుంటే ఆడుతున్నాయి. నీటికోళ్ల గుంపుల ధ్వనులతో, కోయిలల ఇంపైన స్వరాలతో, చెట్లు నాకు మన్మథ తాపాన్ని ఎక్కువ చేస్తున్నాయి. అందమైన అశోక పుష్పాల గుత్తులు నిప్పులుగా, తుమ్మెదల ధ్వనులు మంటల చిట-పట ధ్వనులుగా, ఎర్ర చిగుళ్లు జ్వాలల్లాగా, వసంతాగ్ని నన్ను కాలుస్తున్నది. వినపడుతున్న ఇంపైన కోయిలల ధ్వనులు, చక్కగా పూసిన వనాలు, ఈ వసంతకాలం సీతకు చాలా సంతోషమైనవి. అందమైన కళ్లు, ఇంపైన వాక్కులు, తుమ్మెదల్లాంటి ముంగురులు కలదైన సీతను ఎడబాసి తమ్ముడా! నేను ప్రాణాలతో వున్నా ఏమి ప్రయోజనం? సగం శరీరం పోగా తక్కిన సగం శరీరం ఏ పని చేయగలదు?"

"విస్తారంగా పూసిన పూపొదలు అన్ని చోట్లా కనబడుతున్నాయి. చకోరాల్లాంటి కళ్లు కల సీత మాత్రమే కళ్లారా చూద్దామంటే కనబడడం లేదు. అనురాగం కారణాన మన్మథుడితో పుట్టి, వసంతుడితో పెంచబడిన ఈ శోకాగ్నితో కమ్ముకున్న మనస్సు శుష్కిస్తుంటే నేనెలా సహించి వుండగలను? సీతాదేవి కనబడక నాకు శోకం కలిగించింది. ఈ వసంతుడు కనబడి చెమట బిందువులను ఆర్పివేస్తున్నాడు. సీతాదేవిని వదిలి తాపంవల్ల మాడుతున్న నన్ను, నిర్దయుడైన గాలి దహిస్తున్నాడు. రెప-రెప గాలి వీస్తుంటే, స్ఫటికపు గవాక్షాలలాగా విచ్చుకున్న పురులు ప్రకాశిస్తుంటే, ఆడ నెమళ్లు తమను చుట్టుకుని సేవిస్తుంటే, మత్తుతో పరవశించి మగనెమళ్లు సీతావియోగంతో మన్మథ పీడితుడనైన నన్ను, మరింత మన్మథార్తికి పాల్చేసి నాట్యం చేస్తున్నాయి. ఆడుతున్న మగ నెమలిని చూసి, ఆడ నెమలి సంభోగ ఇచ్ఛ ఎక్కువవుతుంటే, మగ నెమలితో అదీ ఆడుతుంటే, వదలని మదన తాపంతో రెక్కలు విచ్చి ఆడుతూ, ఆడ పక్షిని చేరబోతూ, మెల్లగా ధ్వనులు చేస్తూ మగ నెమలి భార్యలేని నన్ను పరిహాసం చేసేదానిలాగా, నా వంక చూసింది లక్ష్మణా! చూశావా ఇది?"

"ఈ మగనెమలి ప్రియురాలిని, రాక్షసుడు, అడవుల్లో అపహరించి

దాచిపెట్టలేదు కాబట్టి, ఇది ప్రియురాలితో వేడుకగా వినోద క్రీడలు చేస్తున్నది. అవురా! ఈ వసంతకాల మహిమ గొప్పదనం? దాని మహిమ వల్లే కదా! పక్షిజాతుల్లో పుట్టినా, ఆ ఆడ నెమలి అనురాగాతిశయంతో మగనెమలి దగ్గరనే వుంది. రావణాసురుడు హరించకపోతే నా సీత కూడా ఈ విధంగా నన్ను చేరేది కదా! అలాంటి నా ప్రియురాలు జానకిని వదలిపెట్టి ఈ వసంతాన్ని ఎలా దాటుతాను? తేనెలు కారుతున్న పూల గుంపులతో అడవులు నిండినా, ఆ పూలు సంతోషం కలిగించలేక నా పాలిట వ్యర్థమయ్యాయి. ఈ పూలు మంచి కాంతిగా వున్నప్పటికీ, తేనె కోసం తుమ్మెదలు వస్తున్నా నా విషయంలో వ్యర్థమై నేలరాలుతున్నాయి. పక్షుల గుంపులు నాకు కామాన్ని పెంచడానికా అన్నట్లు మనోహర, అవ్యక్త ధ్వనులు చేస్తూ ఒకదానిని మరొకటి పిలుస్తూ సల్లాపాలు ఆడుతున్నాయి. నా ప్రియురాలు సీతాదేవి ఎక్కడ వుందో అక్కడ కూడా ఈ వసంతకాలం వుంటే, ఆమెకూడా నాలాగే మదనతాపాతిశయంతో వియోగ కారణాన బాధపడుతుండవచ్చు”.

"జానకి వున్నచోట వసంతకాలం లేదు. రావణుడెక్కడో రహస్య స్థలంలో దాచిపెట్టితే అక్కడ వసంత కాలం ఎలా వస్తుంది? అక్కడ కూడా ఇలాగే వుంటే ఆమె ఈ విరహతాపం ఎలా సహించగలదు? ఒకవేళ ఇలాగే అక్కడకూడా వసంత కాలం వుంటే, రాక్షసులు చుట్టుముట్టి, "చంపుతాం..కోస్తాం...నిన్ను పీక్కు తింటాం..." అని బెదిరించే మాటలు అంటుంటే ముఖం వెల-వెలపోయి ఆమె ఏం చేయగలదు? శృంగార రసానుభవం ఎలా కలుగుతుంది? మధ్య వయస్కురాలు, మెల్లగా మృదువుగా మాట్లాడే కోమల హృదయం కలది. సౌందర్యానికి స్థానమైనది. కొత్తగా వికసించే తామరరేకుల్లాంటి కళ్లు కలది. కాబట్టి ఈ వసంత సమయంలో కామం అతిశయించగా సహించలేక శరీరం వదులుతుందా? సీతాదేవి వయసులో వుంది. అందునా పతివ్రత కాబట్టి కామం తీర్చుకునే వీలులేక నా వియోగాన్ని సహించలేదు. లోకంలో భార్యాభర్తలు లేరా? ఎందుకు ఇంత తపిస్తున్నావు భార్యకై అంటావా? సీతాదేవి మనస్సు ఎల్లప్పుడూ నామీదే నిలిచి వుంటుంది. ఏ దశలోనూ దానికి విరుద్ధంగా జరగదు. ఆ కారణాన స్మరణకు రాకుండా ఎలా వుంటుంది? నన్ను నేను మరువగలనా? స్నేహం దూరమైనా కొద్దీ దగ్గరవుతుంది. సమీపిస్తే తగ్గుతుంది".

"పూలవాసనలతో కూడిన ఈ గాలి ఎంతో సుఖం కలిగిస్తూ చల్లదనం ఇస్తున్నప్పటికీ, సీత నా దగ్గర లేని కారణాన అగ్నిహోత్రంలాగా అమితమైన బాధ

కలిగిస్తున్నాడు. ఇది వాయువు స్వభావ గుణం అందామా అంటే, సీతాదేవి నా దగ్గర వున్నప్పుడు అమితమైన సుఖం కలిగించేది కాని, ఇప్పుడిలా కాలుస్తున్నాడు. ఏం పాపమో? అప్పుడు నేను రాముడినే కాని ఇప్పుడు కాదా? అప్పటి గాలి ఇదికాదా? సీతాదేవి నా దగ్గర వున్నప్పుడు కష్టాలు కూడా సుఖంగానే వుండేవి. ఇప్పుడేమో, సుఖమైనవి కూడా దుఃఖంగానే అనిపిస్తున్నాయి. కాబట్టి, నా సుఖ, దుఃఖాలకు సీతాదేవే కారాణం. (దీని వాస్తవార్థం: లక్ష్మీ యుక్తుడు దుఃఖం ఎరుగడు...అలక్ష్మీ యుక్తుడు సుఖం ఎరుగడు). ఈ నీచమైన కాకి, నేను సీతాదేవితో పంచవటిలో వున్నప్పుడు మా వియోగాన్ని సూచిస్తూ ఆకాశం నుండి మా చెవులు కాల్చేట్లు కఠోరంగా కూస్తుండేది. ఇప్పుడేమో మళ్లీ మా సంయోగాన్ని సూచిస్తూ చెట్టు కొమ్మ మీద వాలి రెక్కలు విదిలిస్తూ మరీ-మరీ కూస్తున్నది. ఈ పక్షే పంచవటిలో వున్నప్పుడు సీతావియోగాన్ని సూచించింది. అదే ఇప్పుడు ఆ స్త్రీరత్నం సంయోగాన్ని సూచిస్తున్నది".

"పూల కొనలున్న చెట్ల మీద మనోహరంగా కూర్చొని పక్షుల సమూహాలు నా ధైర్యం చెడిపోయేట్లు, కామం పెరిగేట్లు, నానా రకమైన ధ్వనులు చేస్తున్నాయి విన్నావా లక్ష్మణా? కామ మదంతో కంపించి పోతున్న ప్రియురాలిని, దాని మగడు వెంటబడి పోయిన విధంగా గాలివల్ల కదులుతున్న తిలకపు పూలగుత్తిని మగ తుమ్మెద వెంటబడి తిరుగుతున్నది చూశావా? పేరుకు ఇది అశోక వనమే కాని, వాస్తవంగా కామక జనుల శోకాన్ని వృద్ధి చేసేది ఇది. ఇప్పుడు అది ఏం చేస్తున్నదంటావా? గాలి వల్ల కదిలించబడిన పూలగుత్తులతో అనేక పర్యాయాలు నన్ను కొట్టేదానిలాగా భయపెట్టున్నాయి. శోకం ఆహారం తిననియ్యదు. మల్లెలు వాడిపోయేట్లు చేస్తుంది. మామిడి వన్నె మారుస్తుంది. కమలాలు ఆలోచనలను పెంచుతాయి. కలువలు చంపడానికి ప్రయత్నం చేస్తాయి. శృంగార చేష్టలతో, గర్వం కలిగిన మనసులతో, నిర్మలమైన చందనం లాంటివి పూసుకున్న మనుష్యులలాగా నిండార పూసిన మామిడిచెట్లు కాంతిగా ప్రకాశిస్తున్నాయి. లక్ష్మణా! పంపాతీరంలోని అడవుల్లో విలాసంగా అక్కడక్కడా కిన్నరులు తిరుగుతున్నారు....చూశావా? నీటి అలల్లో ప్రతిఫలించిన ఉదయకాలంలోని సూర్యుడిలాగా వున్న ఈ ఎర్రకమలాలను చూశావా? సంతోషకరములైన కహ్లారాలు, ఎర్రకలువలు, హంసలు, బెగ్గురులతో నిండిన నీళ్లను చూసావా? లేత సూర్యుడితో సమానమైన తుమ్మెద రెక్కలతో కొట్టబడిన అకరువులున్న మడుగును చూశావా? చక్రవాకాలతో కూడి మనోహరమైన వనం అనే వస్త్రాన్ని

కప్పుకుని దప్పిక తీర్చుకోవడానికి వచ్చిన లేళ్లతో, ఏనుగులతో పంప ఎంతో ఆనందకరంగా వుంది".

"తామరపూలు గాలివాటానికి విజృంభించిన అలలతో తాకబడి, ఊయలమీద ఊగుతున్నట్లుగా, ఇంపుగా వున్నాయి చూశావా లక్ష్మణా? తామరరేకుల్లాంటి కళ్లు, కమలాలంటే ప్రీతి, కమలగంధి అయిన సీతను చూడలేక బతకడం వల్ల నేలకు భారమే కాని మరే ప్రయోజనం లేదు. లక్ష్మణా! ఈ మన్మథుడి కుటిల బుద్ధిని గురించి నేనేమని చెప్పాలి? ఎంతో దూరంగా వున్న నా ప్రాణంతో సమానమైన దానిని, కష్టంగా మాత్రమే సాధించవీలయ్యేది, శ్రేష్ఠమైన గుణాలు కలదానిని, ప్రియమైన శుభకర వాక్యాలు చెప్పేదానిని, నా స్మృతికి వచ్చేట్లు చేశాడు కదా? లక్ష్మణా! మన్మథుడు నన్నేమీ చేయలేడు. వాడివల్ల నాకు భయం లేదుకాని, ఈ వసంతుడు వాడికి తోడుగా వచ్చి నన్ను బాధిస్తున్నాడు. శత్రు బాహుళ్యం ఏర్పడింది. అందగత్తె అయిన సీతాదేవి సాంగత్యం వల్ల అందమైనవేవైనా నాకు అనురాగం కలిగించాయో, అవే ఆమెను ఎడబాయడం వల్ల అందం చెడి నాకు వైరాగ్యం కలిగించాయి. తక్కినవన్నీ ఎందుకు? తామరమొగ్గల రేకులను చూసైనా సంతోషిద్దామంటే సీతాదేవి కంటిరెప్పలతో అవి పోలినట్లుండడం వల్ల ఆమె స్మృతికి వస్తున్నది. అది పోనీయ్...కమ్మటి గాలిని చూసైనా సంతోషిద్దామంటే సర్వ ప్రాణాధారకమైన ఆ గాలి నన్ను బాధపెట్తూ, తామరపూలను తాకి, అలా వచ్చిన వాసన, పుప్పొడి, తీసుకుని చెట్లలోనుండి బయటకు వచ్చి సీతాదేవి విడిచే నిశ్వాసాన్ని పోలి నా మనస్సును ఆకర్షిస్తున్నాడు".

“లక్ష్మణా!పంపానదీ తీరంలో దక్షిణ తీరాన విస్తారంగా పూచిన గోగుకాడలు ఎంత ప్రకాశవంతంగా వున్నాయో చూశావా? లక్ష్మణా! కావిరాలు లాంటివాటితో ఘనంగా అలంకరించబడిన ఈ పర్వతరాజు వాయువేగంతో ఎగురగొట్టబడిన దుమ్మును చిత్ర విచిత్రంగా, సంతోషకరంగా లేవదీస్తున్నాడు. మనోహరంగా చెట్ల ఆకులు కనపడకుండా పూచిన అందమైన మోదుగులతో కొండచరియలు ప్రకాశిస్తున్నాయి. పూచిన కొనలుకల తీగెల గుంపులు తమను చుట్టుకోగా పంపా ఒడ్డున పూచిన చెట్లు దట్టమైన కాంతులను ప్రసరింపచేస్తూ, తమ కొమ్మలను ఊపుతున్నాయి. వృక్షాలు గాలికి కదులుతున్న కొమ్మలతో సంతోషంతో తమను సమీపిస్తుంటే కామ మదం కల యువతుల్లాగా తీగలు కౌగలించుకున్నాయి. వాయువు నానారసంకల జ్ఞానం కలవానిలాగా

చెట్టు–చెట్టు, కొండ–కొండ, అడవి–అడవి తిరుగుతున్నాడు. పూచిన పూలతో కొన్ని వృక్షాలు తియ్యటి వాసన ఇస్తున్నాయి. కొన్ని పూలు ఆకులు కనపడకుండా మొగ్గలతో కప్పబడి వున్నాయి. కొన్ని ఆకులు నీలంగా వున్నాయి. కొత్త పూలంటే అనురాగం కల మదించిన తుమ్మెదలు, ఇది ఇంపనీ, ఇది తీపనీ, ఇది ఇపుడే వికసించినదనీ, భావిస్తూ, సంతోషంగా ఝంకారాలు చేస్తూ, పూలమీద పడిపోయాయి. ఒక తుమ్మెద తేనెమీది ఆశతో చెట్లలోని పూల చాటునుండి తటాలున దాన్ని విడిచి, బయటకు వచ్చి, వేరే చెట్లమీద ఎక్కువగా తేనె వుండడంతో అక్కడికి పోయింది. పూలు తమంతట తామే విశేషంగా రాలడం వల్ల అందమైన నేలలు సుఖంగా, మనుష్యులు పరచని పూలపాన్పుల్లాగా ప్రకాశిస్తున్నాయి".

"నానా రకాల రంగులు కల పూలు,అంతటా రాలి మనోహరంగా, బంగారపు ఎరుపు, తెలుపు కలిగి, పరచిన పరుపులాగా ప్రకాశిస్తున్నాయి లక్ష్మణా చూశావా? లక్ష్మణా! ఈ వసంత సమయంలో చెట్ల సమూహాలలో ఎంత విస్తారంగా పూలున్నాయో చూశావా? అన్నా! ఏ పక్క చూసినా పూలు, కొమ్మల కొనల్లో బసకలిగి వున్నాయి. ఈ వృక్షాలు ఒకదానిలాగా మరొకటి పూయాలని, పోటీపడి, చక్కగా పూచి, తుమ్మెదల ఝంకారాల నెపంతో ఒకదానిని ఇంకొకటి అదే తక్కువ పూచిందని, తాను ఎక్కువగా పూసానని పరిహాసం ఆడింది. ఈ నీటికోడి తన భార్యతో నీళ్లలో మునిగి స్నానం చేసి నాకు మదన తాపం కలిగేట్లు రతికేళిలో నిమగ్నమైంది. గంగానదికి, ఈ పంపానది అందం లభించినందువల్లే కదా, మనోహర గుణాలతో లోకంలో ప్రసిద్ధికెక్కింది. నా భార్యను నేను కళ్లారా చూస్తూ నిండుమనస్సుతో వుండగలిగితే, నాకు స్వర్గం మీద కాని, అయోధ్య మీద కాని మనసుపోదు. స్వర్గం, వైకుంఠం మాట అలా వుండనియ్యి...సీతను చూస్తూ, మిసమిస మెరిసే ఈ పచ్చిక బయళ్లలో మనం వుండగలిగితే, పొద్దుపోవడానికి కూడా మిగతా విషయాల జోలికి ఎందుకు పోతాను? మనం ముగ్గురం తప్ప వేరే ఆలోచనే రాదు".

"తమ్ముడా, లక్ష్మణా! చిగుళ్లతో, మొగ్గలతో, పూలతో, అందమైన ఆకులతో కాంతివంతంగా ప్రకాశిస్తూ, ఈ చెట్లున్న అడవుల కాంతితో నాకు పిచ్చెక్కుతున్నది. చక్రవాకాలు, బెగ్గురులు, నీటికోళ్లు, క్రౌంచాలు, కూసే పక్షులు, అనేక రకాల జింకలు, పందులు, మితిమీరి వున్నాయి. ఈ పంపానదిని చూశావా? యువతీరత్నం, చంద్రముఖి, కమలలోచన అయిన సీతాదేవిని,

సంతోషంతో కూడిన పక్షి సమూహాలు నాకు స్మృతికి తెచ్చి మితిమీరిన కామాన్ని నాకు కలిగిస్తున్నాయి. ఆడ జింకలతో కలిసి చరియల్లో తిరిగే మగ జింకలను చూడు. ఆడ జింక కళ్లలాంటి కళ్లుకల సీతను విడిచి వున్న నన్ను చూడు. అవెంత సంతోషంగా వున్నాయో, నేనెలా ఏడుస్తున్నానో చూడు. మదించిన పక్షి గుంపులు పర్వతాలలోని బయళ్లలో కామంతో సంతోషంగా తిరుగుతుంటే ఇక్కడ నేను తత్తరపాటుగా వుండడాన్ని ఏమని చెప్పాలి? సీతాదేవితో కూడి ఈ మనోహరమైన వనంలో కామం చక్కబడే విధంగా ఇతర విచారం లేకుండా తిరిగినప్పుడు కదా నా మన్సు చక్కబడుతుంది. పావన పంపానదీ జలాలను, పిల్ల గాలులను, నేను పావని అయిన సీతాదేవితో కలిసి సేవిస్తేనే కదా నా దేహంలో ప్రాణాలు నిలుస్తాయి. అలా కాకపోతే నాకు క్షేమం కలదా? కమలాలతో, కలువలతో, పరిమళాలు కలదిగా చేయబడ్డ పంపా సమీపంలోని అడవుల గాలిని అలసట మాని సేవించగలవారే ఎంతో ధన్యులు".

"ఆ కమలాక్షి, ఆ సుందరి, నిండు చంద్రుడిని పోలిన మోము కలది, వియోగం కలిగినందున, ఏ విధంగా ధైర్యంతో ప్రాణాలు నిలుపుకోగలదు? దానికొరకై నేను దుఃఖిస్తాను. వియోగం ఎలాగైనా సహించవచ్చు. అవమానం ఎలా సహించాలి? ఏం అవమానం వచ్చిందంటావా? సీతాదేవి తండ్రి జనక రాజు పాపరహితుడు. యదార్థం చెప్తుతాడు. గొప్ప పూజ్యమైన మనసున్నవాడు. ధర్మం అంటే ఆసక్తికల ఆచారం కలవాడు. ఇలాంటివాడు, నేను మళ్లీ తిరిగి అయోధ్యకు పోయిన తరువాత, 'అల్లుడా, నా కూతురు క్షేమంగా వుందా?' అని కుశల ప్రశ్న వేస్తే, నేనేమని జవాబివ్వాలి? 'నీ కూతురును ఎవడో ఎత్తుకుని పోయాడు' అని చెప్పాల్నా? ఇంతకంటే అవమానమైన మాట ఇంకోటి లేదుకదా? నన్ను కడుపార కన్న తండ్రే నా మీద ప్రేమ వదిలి, 'రామా! నువ్వు అడవుల పాలై పో' అని చెప్పగా, సీతాదేవి భర్త వెంట భార్య అనే న్యాయాన్ని అనుసరించి నా వెంట వచ్చింది. దానివెంట నేను పోలేదు కదా? నేనేమి మగడిని? ఏమి కృతజ్ఞుడిని? ఎక్కడ, ఏ గతి పట్టిందో?"

"లక్ష్మణా! రాజునన్న పేరే కాని నాకు రాజ్యం లేదు. నా లాగా సంతోషహీనులై ఏడ్చేవారు ఎందరుంటారు? నవ్వుకుంటో, ఏడ్చుకుంటో ఏదో తిని కొంపలో పడి వుందామంటే, దరిద్రుల్లో శ్రేష్టుడనైతిని. ఇలాంటి నావెంట తన పుట్టింటికీ, బంధువుల ఇంటికీ కాకుండా, నాతో పాటు అడవులకు నన్ను వదలకుండా వచ్చిన ఆడపడుచును వదిలిన నేను దేన్ని చూసి ప్రాణాలు నిలుపుకోవాలి?

లక్ష్మణా! సీతాదేవి ఘుమ-ఘుమ కమ్మటి వాసనలు వెదజల్లే అద్దంలాంటి ముఖాన్ని చూడగలనా? చెవులకింపుగా సమానమైన చిరునవ్వుతో కూడిన హాస్యపు మాటలను నేను వినగలనా? తనకు మనసులో బాధ వున్నప్పటికీ, ఏమీ లేనిదానిలాగా నా మదన తాపం చల్లారేట్లు పలుకగా జీవించగలనా? మెల్లటి నడకగల సీతాదేవిని కూడి సంతోషంగా హృదయంతో జీవించగలనా? తమ్ముడా! నేనేం చేయాలిరా ఇప్పుడు? అయోధ్యకు పోగానే కల్లాకపటం తెలియని మృధుస్వభావి మా తల్లి కౌసల్య ఎదురుగా వచ్చి, కుమారా! నా కోడలేదిరా? అని అడిగితే ఏమని జవాబు చెప్పాలి? లక్ష్మణా! నువ్వు అయోధ్యకు వెళ్లిపో. నాగతి ఏమిటంటావా? సీతను విడిచి నేను బతకలేను. ఒక్క బాధే అయితే ఎలాగైనా సహించవచ్చు. సీత నా సుఖానికి కారణమైంది. తన సుఖం లెక్కపెట్టకుండా నా సుఖం కొరకు నావెంట నన్ను నమ్మి అడవులకు వచ్చింది. అలాంటి దాన్ని విడిచి నేనెలా బతుకుతాను? సీతాపతి, సీతా భర్త, సీతా ప్రియుడు, సీతా మనోహరుడు, సీతా ప్రాణేశుడు అని ఎవరైనా అంటే, వాళ్ల ముఖం నేనెలా చూస్తాను? మొండి బతుకు బతికి అయోధ్యకు వచ్చాననుకో.... మామగారికి ఏమని చెప్పాలి? కన్న తల్లికి ఏమని చెప్పాలి? వాళ్లు వద్దని వారించినా మగవాడిలాగా సీతను తీసుకుపోయానే? ఇప్పుడు వాళ్లేమంటారు? కామానికి ఏడ్వాలా? నా అనాథ తత్వానికి ఏడ్వాలా? అవమానానికి ఏడ్వాలా? దేనికని ఏడ్వాలి? కాబట్టి ఇన్ని దుఃఖాలతో ఈ శరీరం నిలవదు. నువ్వు అయోధ్యకు పోయి భరతుడి దగ్గర చేరు. ఆయన కైక కొడుకైనా నువ్వంటే ప్రేమకలవాడు. నిన్ను అలక్ష్యం చేయడు. వెళ్లు".

ఇలా రామచంద్రమూర్తి, ఎంతో సమర్థుడైనప్పటికీ, బేలవలె ఏడుస్తూ వుండడం చూసిన లక్ష్మణుడు సమాయనుకూలమైన నీతితో కూడిన హితబోధ చేసి సంతాపాన్ని ఉపశమింప చేద్దామని ఇలా అన్నాడు.

"అన్నా! ధైర్యం తెచ్చుకో. నీలాంటి ధీరుడు ఆపద్దశలో ఇలా దుఃఖించవచ్చునా? ఏడ్వ వచ్చునా? అన్నా, నా మనవి దయచేసి ఆలకించు. ఈ లోకంలో తనకు ఇష్టమైన వారు వదిలిపోతే తీవ్ర దుఃఖం కలుగుతుంది. ఇది లోక ధర్మమని నీ మనసుకు తెచ్చుకో. తెచ్చుకుని ఏం చేయాలంటావా? ఎవ్వరిమీదా, ఏ బంధువుల మీదా స్నేహభావం వుంచుకోవద్దు. అన్ని దుఃఖాలకు స్నేహభావమే కారణం. నీళ్లలో నానిన వత్తి కూడా చమురుతో స్నేహభావం వల్ల మండుతున్నది కదా? నీళ్లలో నానితే మండదు కాని చమురుతో నానితే

మండుతుంది. వత్తిని కాల్చేది స్నేహమే కదా? అందుకే స్నేహం వదులుకో. అటైన సీత పోయిన పోనీలే అని వూరుకుందామా అని అంటావేమో? సీతను పోగొట్టుకుని వూరికే వుండమని నేననడంలేదు. ముందు మనం సీత ఎక్కడున్నదా అనే విషయం తెలుసుకోవాలి. దానికై మనం కృషి చేయాలి. ఆమె వునికి స్థానం మనకు తెలిస్తే, మనం చంపుతామని భయపడి, ఆమెను అపహరించినవాడు తనంతట తానే సీతను తెచ్చి నీకు సమర్పిస్తాడు. అలాకాకపోతే, వారెవరైనా సరే, జానకితో పాతాళలోకంలో దూరినా, ఇంద్రుడి తల్లి కడుపులో దాగినా వాడిని చీల్చి చెండాడుతాను. నువ్వు శ్రమించాల్సిన అవసరం లేదు. సీతాపహరణం వల్ల నాకు దుఃఖం లేదా? అవమానం నాకు లేదా? నువ్వు సీతకొరకు మాత్రమే దుఃఖిస్తున్నావు. నేను మీ ఇరువురికొరకు దుఃఖిస్తున్నాను. బహిరంగంగా ఏడ్వడం లేదు. కార్యసాధన ఉపాయం ఆలోచిద్దాం".

"భార్య కొరకు, ఎంతో బుద్ధికలవాడివై కూడా, బుద్ధిమంతుల్లో శ్రేష్టుడవై కూడా, ఆలోచన లేనివాడిలాగా ఎందుకు ఏడుస్తున్నావు? ఏడ్వ వద్దు. ఏడుస్తూ వూరికే కూర్చుంటే ఏ పనీ జరగదు. నీకు ఏడుపు ప్రధానమా? సీతను మళ్లీ పొందడం ప్రధానమా? రెండోది ప్రధానమైతే దానికై కృషి చేయి. ఆ కృషికి కావాల్సింది ధైర్యం. కాబట్టి ధీరుడివికా. ఏవిధంగానైనా సీతను సాధిద్దాం. ప్రయత్నం చేయకపోతే చెడిన పని ఎలా బాగవుతుంది? అన్నా! నువ్వు ఉత్సాహం వదలడం మంచిదికాదు. ఉత్సాహంకంటే బలం లేదు. ఉత్సాహమే శక్తి. ఉత్సాహవంతులకు సాధించనిది లేదు. ఉత్సాహంతో పనిచేసేవారికి కార్యాలు విఘ్నం కలగించలేవు. రామచంద్రా! నీకు ఉత్సాహం కలిగిందా....సీతను తప్పక తేగలవు....చూడగలవు. శోకాన్ని తగ్గించుకో. కామవృత్తు వదులుకో. నువ్వు కోవిదుడివి. మహాత్ముడివి. సుకృతాత్ముడివి. రామచంద్రా! ఇలాంటి నిన్ను నువ్వే తెలుసుకోలేకపోతే నేనేమని చెప్పాలి?"

అని ఇలా లక్ష్మణుడు చెప్పగా ఆయన చెప్పిన మాటలు సత్యమని భావించిన రాముడు దుఃఖాన్ని విడిచి ధైర్యం వహించాడు. ఆ తరువాత శీఘ్రంగా సెలయేళ్లు, అడవులు, గుహలు, చూసుకుంటూ నిర్భయంగా నడుస్తూ, తమ్ముడు ధర్మ వాక్యాలు చెప్తుంటే వినుకుంటూ ముందుకు సాగిపోయారు.

సర్గ-2

రామలక్ష్మణులను చూసి భయపడిన సుగ్రీవుడు

ఈ విధంగా ఆ రాజకుమారులు, రాముడు, లక్ష్మణుడు ఋశ్యమూక పర్వతం దరిదాపుల్లో సంచరిస్తుండగా, ఆశ్చర్యకరంగా, మిక్కిలి అందంగా, దేవతల్లాగా వున్న వారిని కొండమీద వున్న సుగ్రీవుడు చూసి భయంతో చేష్టలుడిగి, బాధపడసాగాడు. సుగ్రీవుడితో పాటు ఇతర వానరులు కూడా చూశారు. రామలక్ష్మణులను చూసిన వానరులకు వీరిని వాలి పంపగా తమను చంపడానికి వచ్చారని భావించారు. వెంటనే వారు దాక్కునే మతంగాశ్రమ గుహ దగ్గరకు పోయారు. పంపానదికి ఉత్తరాన రామలక్ష్మణులు, దక్షిణాన సుగ్రీవాదులు వున్నారు. మనోహరమైన ఆకారంకల రామలక్ష్మణులను విల్లు, బాణాలు, ఖడ్గం ధరించగా చూసిన సుగ్రీవుడు సందేహించాడు. గుండెలు కొట్టుకున్నాయతడికి. ఇంకా ఎవరైనా వస్తున్నారేమోనని నలుదిక్కులా చూశాడు. ఎటు పరుగెత్తాల్నా అని ఆలోచించసాగాడు. నిప్పుతొక్కిన కోతిలాగా అయిపోయాడు. ఒకచోట నిల్వలేకపోయాడు. ఏ పాపం ఎరుగని అన్నదమ్ములను చూసి తాన్నున్న స్థలాన్ని వదిలి భయపీడితుడు, శోకతప్తుడయ్యాడు. ఈ పర్వతం మీదే వుంటే శాపభయం లేనందున వాళ్లిక్కడికి వస్తారేమోనని భయపడ్డాడు సుగ్రీవుడు. ఇది విడిచి పోతే వాలి చంపుతాడేమోనని కూడా భయపడ్డాడు. తనతోటి వానరులను, మంత్రులను చూసి ఇలా అన్నాడు.

"మంత్రులారా! శుభకర రూపం కలవారిని చూశారుకదా? వారెవరో, ఏమో కాని నిజమైన మునుల్లాగా లేరు. వంచించడానికి నారచీరెలు కట్టారు. ఎవరిని వంచించడానికి ఇక్కడికి వచ్చారో? నామీద వైరం సాధించడానికి వాలి ఇక్కడికి రాలేదు. కాబట్టి ఎవరినో మనుష్యులను పిలుచుకుని వచ్చాడు. మునులని మనం

దగ్గరకు పోతే, వెంటనే చంపుతారు. ఇది వారి ఉపాయం. అలాకాకపోతే తపస్సు చేసుకునేవారికి ఆయుధాలెందుకు?"

సుగ్రీవుడు ఇలా చెప్పగా వానరులు, మంత్రులు కూడా పెద్ద విల్లు-బాణాలు ధరించిన రామలక్ష్మణులను చూసి, గుండెలు అదరగా, ఒక కొండ మీదనుండి మరొక కొండ మీదికి దూకుతూ, ఒకడు పోయిన దారిలో ఇంకొకడు పోకుండా ఒక్కొక్కరొక దారిలో పోసాగారు. అందరూ చివరకు ఒక కొండ చాటున చేరి సుగ్రీవుడి దగ్గర నిలుచున్నారు.

సుగ్రీవుడి భయానికి కారణం అడిగిన హనుమంతుడు

ఆంజనేయుడు సుగ్రీవుడి దగ్గరకు పోయి "వానర రాజా! ఎందుకు నీకు భయం వేస్తున్నది? వాలి భయంతో ఎందుకు నువ్వీవిధంగా పరుగెత్తుతున్నావు? ఈ పర్వతం ఋష్యమూకం కదా! ఇక్కడ వాలివల్ల భయం లేదుకదా? ఒకవేళ భయపడడానికైనా వాలి ఇక్కడెక్కడా కనబడడం లేదే? కాబట్టి ఎందుకు తొట్రుపాటు పడుతున్నావు?క్రూరకర్ములు, పాపపు పనులు చెసే వాలి నాకిక్కడ కనబడడం లేదు. నీ పిరికితనానికి కారణం ఏమిటి? నీ కోతి స్వభావం సార్థకమైంది. నువ్వు గొప్ప మనస్సు లేనివాడివైనందున ముందు-వెనుకలు, సాధక-బాధకాలు పూర్తిగా ఆలోచించడం లేదు. జ్ఞానం, బుద్ధి, ఇంగితం లేని రాజు ప్రజలను ఎలా రక్షించగలడు? సుగ్రీవా! మొదట ఏది తోస్తుందో దాన్నే నమ్మి తటాలున ఏ పనీ చేయవద్దు. ఆ విషయంలో చక్కగా ఆలోచించు. ఎదుటివారి ముఖనయన చేష్టల వల్ల నీ అభిప్రాయం సరైందో, కాదో నిర్ణయించుకో".

పనులన్నీ చక్కదిద్దమని హితమైన మాటలు చెప్పిన తన హితుడైన ఆంజనేయుడితో సుగ్రీవుడు శుభకరమైన మాటలతో ఇలా జావబిచ్చాడు. తన అభిప్రాయం తాను చెప్తాననీ, ఆ తరువాత హనుమంతుడు పోయి చాకచక్యంగా కార్యం సరిదిద్దమనీ అంటాడు.

"హనుమంతా! నా ఆలోచనా విధానం చెప్తా విను. కమలాల రేకుల్లాంటి కళ్లు కలవారిని, మోకాలిని అంటే చేతులు కలవారిని, గొప్ప విల్లు-బాణాలు-కత్తులు కలవారిని, స్తోత్రం చేయడానికి యోగ్యమైన తేజస్సు కలవారిని, దేవకుమారులతో సమానంగా వున్నవారిని చూస్తే భయం కలగదా? వారు శత్రువులని ఎందుకు భయపడాలి, వారికి నాకు విరోధం వుందా, లేదు

కదా, ఏదో వాళ్ల పనిమీద వాళ్లు వచ్చారేమో, అని అనుకోకూడదా? అంటావేమో? వీళ్లు ఋషులా? రాచవీరులా? అయితే నారచీరెలు ఎందుకు కట్టుకోవాలి? ఋశీశ్వరులే అయితే విల్లు-బాణాలు ఎందుకు? నేనా వాళ్లను ఎరుగను. వారి సహాయం అడగలేదు. కాబట్టి నా పక్షాన రాలేదు. కాబట్టి దీంట్లో ఏదో వంచన వున్నదని అనుమానించాను. ఏ వంచన అంటావా? వాలి ఇక్కడికి రాకూడదు. నేనా దీన్ని విడిచి పోను. కాబట్టి ఇక్కడికి రాగలిగి, నన్ను చంపగల వారెవరినో ఇక్కడికి వాలి పంపాడని నిశ్చయించాను. కాబట్టి భయపడ్డాను".

"రాజులకు స్నేహితులు ఎందరో వుంటారు. కాబట్టి రాజులను నమ్మకూడదు. వంచనతో రహస్యంగా తమ శత్రువులను చంపడానికి ఎవరినో పంపుతారు. వచ్చినవారు అవకాశం దొరికినప్పుడు తమ గుట్టు బయటపడకుండా శత్రువులను చంపుతారు. ఇది రాజ ధర్మం. వాలి అంటే సామాన్యుడు కాదు. ఉపాయాలన్నీ తెలిసినవాడు. అపాయం లేని నడవడి కలవాడు. దూరాలోచన కలవాడు. రాజులందరూ తమ శత్రువులను ఉపాయంతోనే కదా చంపుతారు? అలాగే వాలి కూడా చేస్తుండవచ్చు. అయినప్పటికీ ఇది ఇలాగే అని నేను చెప్పలేను. నా జాగ్రత్తలో నేను వుండడం మంచిదని ఇక్కడికి వచ్చాను. నా ఆలోచన సరైందా? కాదా? అని తెలుసుకోవాలి. దానికొరకు ఎవరో ఒక సామాన్యుడిని వారిదగ్గరకు పంపాలి. అధముడు పోతే పని పాడవుతుంది. కాబట్టి నువ్వే సామాన్య మనిషి వేషంలో వాళ్ల దగ్గరికి పోయి విషయం తెలుసుకో".

రామలక్ష్మణుల దగ్గరికి హనుమంతుడిని పంపిన సుగ్రీవుడు

"ఆంజనేయా! నువ్వు పో. మాటలవల్ల, ఆకారాల వల్ల, పలురకాలైన ముఖకవళికల వల్ల, వాళ్ల మనస్సు నిజంగా ఎలాంటిదో కనుక్కో, వారి మనస్సు శుద్ధమైందా? వంచనతో కూడిందా? ఇది వున్నది వున్నట్లుగా తెలుసుకో. ఆంజనేయా! నువ్వు ముందుగా చేయాల్సిన పని చెప్తా విను. నీ మాటల నేర్పుతో, నీ భావం వాళ్లకు సులభంగా అర్థమయ్యేట్లుగా, వాళ్లు నిన్ను నమ్మేట్లు ముచ్చట్లాడు. ఇలా నీమీద ముందుగా నమ్మకం పుట్టించుకుని ఆ తరువాత నామీద వాళ్లకు సదభిప్రాయం కలిగేట్లు చేయి. ఇలా చనువు కుదిరిన తరువాత వాళ్లు కత్తులు, బాణాలు, విల్లు ధరించి అడవుల్లో తిరగడానికి కారణం ఏంటో కనుక్కో. వాళ్లు నిర్మలమైన మనస్సు కలవారనీ, వంచన గుణం లేనివారనీ నీకు నమ్మకం కుదిరితే, వాళ్లు మాట్లాడే విధానం గమనించు. వారి మాటల్లో

నిజమెంతో, మోసమెంతో తెలుసుకో".

అని సుగ్రీవుడు చెప్పగా అలాగే చేస్తానని మహాత్ముడైన హనుమంతుడు రామలక్ష్మణులున్న ప్రదేశానికి ఎలా పోవాలా అని ఆలోచన చేశాడు. తన స్వరూపంతోనే పోవాలా, పోయినట్లయితే, సుగ్రీవుడి దగ్గరనుండి వచ్చాడని అనుమానించి, వాళ్లు వంచకులే అయితే తనను వదిలరని భావించాడు. పోయిన పని వృథా అవుతుందనుకుంటాడు. సామాన్యులైన అడవి మనుష్యుల వేషంతో పోతే, వీడెవడో పామరుడని మనసు విప్పి మాట్లాడరేమో? ఎలా పోవాలా అని ఆలోచన చేశాడు.

సర్గ–3

రామలక్ష్మణుల దగ్గరకు బిక్షుక వేషంలో పోయిన హనుమంతుడు

నిజస్వరూపంలో రామలక్ష్మణుల దగ్గరికి పోతే, పోయిన పని నెరవేర్చడం కష్టమని భావించిన హనుమంతుడు, వానర రూపం వదిలి, సన్న్యాసి లాగా తానున్న కొండ దగ్గరినుండి, వారిదగ్గరికి పోయి ఏకాగ్రచిత్తంతో, వినయంగా వాళ్లకు నమస్కారం చేశాడు.

(ఇక్కడ సన్న్యాసి రూపం ధరించిన హనుమంతుడు గృహస్తుడైన రామచంద్రమూర్తికి ముందుగా తానే నమస్కారం చేయడం అంటే సర్వత్రా ఇలాంటి ఆచారం సమంజసమని అనుకోవాలి. సన్న్యాసి గృహస్తుడికి నమస్కారం చేయడం భావ్యం కాదని కొందరంటారు కాని, అది వాస్తవం కాదు. మనువాక్యమూ కాదు....మనుశాస్త్రానికి విరుద్ధం కూడా. ఆ మాటకు మూలం ఏంటో, కర్త ఎవరో కూడా తెలియదు. జ్ఞానాధికుడైన గృహస్తుడికి సన్న్యాసి నమస్కరించాలి అనేదే మనువాక్యం. హనుమంతుడు అత్యద్భుతములైన రామలక్ష్మణుల ఆకారాలు చూసిన వెంటనే అధికానంద పరవశుడై తాను ధరించిన సన్న్యాసి ఆకారాన్ని కూడ మరచిపోయి అవశంగా వారికి నమస్కారం చేశాడు. ఇది సర్వత్రా ప్రామాణికం కాదని కొందరి అభిప్రాయం. ఇది యుక్తంకాదు. హనుమంతుడు నిపుణమతి. గొప్ప మంత్రి. రాముడి అభిప్రాయం కనుక్కొని రమ్మని సుగ్రీవుడు పంపగా వచ్చాడు. అలాంటి వాడు ఆదిలోనే తనను తాను మరచిపోతే తక్కిన కార్యం ఎలా నెరవేర్చగలడు? రామచంద్రమూర్తి ఎలా నమ్ముతాడు? రామచంద్రమూర్తి దివ్యమంగళ విగ్రహం చూడగానే వీరు సుగ్రీవుడికి మేలు చేసేవారే కాని పగవారు కాదని నిశ్చయించిన హనుమంతుడు తాను వేసుకున్న వేషం మారు వేషమనీ, తాను చారుడనీ తెలియచేయడానికే

నమస్కారం చేశాడు. ఇక్కడ బిక్షువు అంటే సన్న్యాసికాదు. బ్రహ్మచారి అని కొందరంటారు. అదీ యుక్తం కాదు. హనుమంతుడు మొదటినుండీ బ్రహ్మచారే కాని, ఇప్పుడు కొత్తగా వేయలేదు. కాబట్టి హనుమంతుడు సన్న్యాసి వేషం ధరించాడనీ, జ్ఞానాధికుడైన రామచంద్రుడికి, గృహస్తుడికి, నమస్కరించడం తప్పుకాదనీ చెప్పాలి).

సుమనోజ్ఞంగా, సౌమ్యంగా, వంచనలేని మాటలు చెప్పి, రాజకుమారులను తృప్తికావించి, సుగ్రీవుడి అభిప్రాయానికి సరిపోయేట్లు తన అభిప్రాయాన్ని చెప్పాడు హనుమంతుడు రాముడితో ఇలా.

"అయ్యలారా! మీరెవరు? ఈ అడవి ప్రదేశానికి ఎందుకు వచ్చారు? మీలాంటివారు తిరగాల్సిన స్థలం కాదిదే? ఎందుకంటే మీరు రాజర్షులతో, దేవతలతో సమానంగా వున్నారు. అలాంటివారికి ఇలాంటి చోట ఏమిపని? మీరు రాజర్షులని నాకెలా తెల్సిందంటారా? మీరు ధరించిన మునిరాజుల వేషాలు అది తెలియచేస్తున్నది. మీలో రాజవేషం, ముని వేషం రెండూ కలిసి వున్నాయి. అలా అయితే మీరు సంకరులని నా అభిప్రాయం కాదు. మీరేదో మంచి వ్రతం పూని ఇలా వున్నారని నేను అనుకుంటున్నాను. ఇలాంటి వ్రతం మీరు పూనడానికి కారణమేంటి? మీ దేహాలు, వాటి కాంతి చూస్తుంటే అవి వ్రతాల వల్ల తపించ తగినదిగా కనబడడం లేదు. నేనింతగా మాట్లాడినా, నాతో మాట్లాడకుండా కొలను ఒడ్డున వున్న చెట్లను చూస్తున్నారు. ఇలాంటి చెట్లను మీరు ఈ అడవిలో చూడలేదా? మిమ్మల్ని చూసి ఈ అడవిలోని పక్షులు, మృగాలు భయంతో పరుగెత్తుతున్నాయి. మీ దేహకాంతి ఈ నిర్మలమైన జలాలమీద పడి దానికి మెరుగు పెట్టున్నట్లు వుంది. ఇంత ఘోరారణ్యంలో మీరిద్దరే తిరగడం అంటే మీకు భయం లేదన్న మాట. మీరు భయమెరుగని ధైర్యవంతుల్లాగా వున్నారు. మీ శరీరాలు భంగారు చాయగా వున్నాయి. మంచి వయసులో వున్నారు మీరు".

"సింహాల చూపుల్లాంటి చూపులు, సింహాల పరాక్రమంలాంటి పరాక్రమం కలవారు మీరు. ఇంద్రచాపాల్లాంటి పెద్ద విల్లులను చేతిలో ధరించి వున్నారు. స్థిరకాంతి సంపద కలవారిలా వున్నారు. బలసిన ఆబోతులలాగా నడుస్తున్నారు. మీ భుజాలు ఏనుగు తొండాల్లాగా వున్నాయి. ఇలా వున్నా చూడడానికి అందంగా, మహిమలో దేవతలకు సమానంగా వున్నారు. కాబట్టి ఎలాంటి శత్రువునైనా చంపగల సమర్థులు మీరు. ఎంధుకు మీద-మీద నిట్టూర్పులు

విడుస్తున్నారు? నడిచిన అలసట వల్లా? మిమ్మల్ని చూసి పక్షులు భయపడుతున్నాయి. ప్రాజ్ఞులారా! మీ చిహ్నాలు చూస్తుంటే బంగారు సింహాసనాల మీద వుండతగ్గవారిలాగా కనిపిస్తున్నారు. ఇలాంటి వీరులు, మీరెందుకు నారచీరెలు కట్టి జడదారుల్లాగా జడలు ధరించి తిరుగుతున్నారు? మీ యోగ్యతకు, మీ ఇప్పటి స్థితి, పరస్పర విరుద్ధంగా వుండడానికి కారణం ఏంటి?''

"అసమాన కాంతితో కొండలను, అడవులను ప్రకాశించేట్లు చేస్తున్నారు. ఒకరికి ఒకరు సమానంగా వున్నారు. విశాలమైన వక్షాలున్నాయి మీకు. పెద్ద–పెద్ద బాహువులున్నాయి. దేవతాకాంతితో ప్రకాశిస్తున్నారు. ఆకాశాన్ని విడిచి ఈ లోకాన్ని చూసిపోవడానికి క్రీడకోసం వచ్చిన సూర్య–చంద్రుల్లాగా వున్నారు. నిజంగా మీరెవరు? మీ చేతులు ఇసుకపట్ల గుదియల్లాగా గట్టిగా, సుందరంగా, మోకాళ్లను అంటుతూ, గుండ్రటి ఆభరణాలు ధరించడానికి యోగ్యమైనవిగా వున్నాయి. ఎందుకు మీరు ఆభరణాలు ధరించలేదు? ఆభరణాలతో కప్పిపెట్టుకుంటే మీ ఆయయవాలకు దృష్టి తాకుతుందా? మీరు ఆభరణాలు ధరించినట్లయితే అవే లోకాన్ని వశపర్చుకుంటాయి. నిరావారణమైన మీ దేహ సౌందర్యం ఎందుకు కనపడాలి? ఆభరణాలు ధరించకుండా, కేవలం ఆయుధాలు ధరించడం చూస్తే మీరేదో శత్రుసంహార కార్యక్రమానికి సిద్ధమైనట్లు కనపడుతున్నది. మీరు ఆభరణాలు ధరించకపోయినా మీకు కలిగే సౌందర్య హాని ఏమీ లేదు. కాని అవి తేజోహీనులై పడివున్నాయి కదా? మిమ్మల్ని ఆశ్రయించిన వాటిని తేజోహీనులుగా చేయవచ్చా?''

"అడవులతో, సముద్రాలతో, మేరు–వింధ్య శ్రేణులతో ప్రకాశించే ఈ భూమండలమంతా పరిపాలించే యోగ్యతవున్నవారైనప్పటికీ ఇలాంటి దీన దశలో ఎందుకున్నారు? మీ విల్లు–బాణాలు చూడడానికి ఇంద్రుడి వజ్రాయుధానికి సమానంగా వున్నాయి. ఇలాంటివి లోకంలో సాధారణంగా కనపడవు. మీ అమ్ములపొదలు పగవారి ప్రాణాలు తీయడానికి బుసకొట్టే పాముల్లాగా బాణాలతో నిండి వున్నాయి. చూడడానికి నాణాల్లాగా శుభకరంగా వున్నాయి. చాలా నిడివి, వెడల్పు కలిగి చూడడానికి భయంకరంగా అపరంజి బంగారంతో కలిసిన మీ కత్తులు కుబుసం విడిచిన పాముల్లాగా వున్నాయి''.

(హనుమంతుడు ఇన్ని ప్రశ్నలు వేసినా రామలక్ష్మణులు ఆయన మాటల సొంపు–పెంపు వింటూ వూరకే వున్నారు తప్ప ఒక్కదానికైనా జవాబివ్వలేదు.

కారణాలు అనేకం వుండొచ్చు. ఆయన మాటలపట్ల ఆసక్తి కావచ్చు. తాము మాట్లాడితే ఆయన మాటలు వినే అవకాశం కోల్పోవచ్చు. సన్న్యాసులు తిరగకూడని ప్రదేశంలో తిరుగుతున్న ఈ సన్న్యాసి నిజమైన సన్న్యాసా? కాదా? అన్న సందేహం కావచ్చు. బిక్షకోసం వచ్చిన సన్న్యాసి అయితే ఆయన స్థితిగతులు చెప్పుకోవాలి కాని తమ స్థితిగతులను గురించి ఎందుకు అడగాలి? వేగులవాడేమో! ఇక్కడ పరస్పర శత్రువులైన వాలి–సుగ్రీవులలో ఇతడు ఎవరి పక్షమో? కాబట్టి ముందుగా తానెవరో చెప్పిన తరువాత మాట్లాడుదామని రామలక్ష్మణులు భావించి వుండాలి.

ఇక హనుమంతుడు వేరే విధంగా ఆలోచించ సాగాడు. తానెంత మాట్లాడినా వీళ్లు బదులు చెప్పడం లేదు. తనమీద వీరికి సందేహం కలిగిందేమో? ఆ సందేహం తీరేవిధంగా తాను సంభాషిస్తేనేగాని వాళ్లు తనను నమ్మి తనతో మాట్లాడారని అనుకుంటాడు. వీళ్లు గొప్పవారిలాగా వున్నారు కాబట్టి వీళ్ల స్నేహం తప్పక చేయాలి అని ఆలోచించి తన వృత్తాంతాన్ని కపటం లేకుండా చెప్పడం ఆరంభించాడు).

"ఆర్యులారా! నేనింతసేపు మాట్లాడినా మీరొక్క మాటైనా బదులు ఇవ్వలేదు. ఇక నా వృత్తాంతాన్ని చెప్తా వినండి. ఈ ప్రాంతంలో సుగ్రీవుడు అనే ఒక ధర్మాత్ముడు, కోతిరాజు, వీరుల గౌరవానికి పాత్రుడు వున్నాడు. అతడిని ఆయన అన్న వెళ్లగొట్టితే నిలువనీడలేక, ప్రాణ భయంతో అమితంగా బాధపడ్తూ దేశంలో తిరుగుతున్నాడు. మీ స్నేహం కోరి ధర్మాత్ముడైన సుగ్రీవుడు పంపుతే మీ దగ్గరికి వచ్చాను నేను. నేనాయన మంత్రిని. వాయుపుత్రుడిని. నా పేరు హనుమంతుడు. నేను వానరుడిని. కోరిన రూపం ధరించి, కోరిన ప్రదేశానికి వెళ్లగలను. సుగ్రీవుడి మేలు కోరి సన్న్యాసి వేషంలో ఋశ్యమూకం నుండి ఇక్కడికి వచ్చాను" అని చెప్పి హనుమంతుడు మౌనం దాల్చాడు.

(దీంతో రామలక్ష్మణుల సందేహం తీరింది. వాలి–సుగ్రీవుల పేర్లు, వాలి సుగ్రీవుడిని వెళ్లగొట్టడం, సుగ్రీవుడు ఋశ్యమూకం మీద వుండడం, ఇవన్నీ రామలక్ష్మణులకు తెలిసిన విషయమే. కాబట్టి సందేహానికి తావు లేదు. ఆ తరువాత తాను సుగ్రీవుడి మంత్రినని చెప్పాడు హనుమంతుడు. అంటే సుగ్రీవుడి పక్షంవాడని అర్థమయింది).

హనుమంతుడి మాటలకు సంతోషించిన రాముడు, తమ్ముడు లక్ష్మణుడిని చూసి ఇలా అన్నాడు.

హనుమంతుడిని ప్రశంసిస్తూ లక్ష్మణుడికి చెప్పిన రాముడు

శ్రీరాముడు హనుమంతుడిని ప్రశంసిస్తూ లక్ష్మణుడితో ఇలా అంటాడు. "లక్ష్మణా! ఇతడిని సామాన్యుడిగా భావించవద్దు. గొప్ప మనసున్న సుగ్రీవుడికి ప్రీతిపాత్రుడైన మంత్రి. ఇతడి మీద ఎంతో నమ్మకముంటేనే కదా, మనదగ్గరికి ఇలాంటి పనిమీద పంపాడు? మనం ఏ సుగ్రీవుడిని చూడాలని పోతున్నామో,అతడి మంత్రే ఈ రూపంలో మనదగ్గరికి వచ్చాడు. అంటే, సుగ్రీవుడితో ఏ పనైతే అవుతుందని అనుకుంటున్నామో, అది ఇతడిద్వారానే జరుగుతుంది. ఆయన్ను మనం ఎలా నమ్మవచ్చో ఇతడిని కూడా అలాగే నమ్మవచ్చు. ఆయనకూ, ఇతడికీ భేదం లేదు".

(హనుమంతుడు ఆచార్యపదవికి తగినవాడని శ్రీరామచంద్రమూర్తి ఆయన యోగ్యతను గురించి చెప్పాడు. ఆచార్యుడు వేదం తెల్సినవాడిగానూ, విష్ణుభక్తుడుగానూ, మాత్సర్యం లేనివాడుగానూ, విష్ణుమంత్రం తెలిసినవాడుగానూ, ఆ మంత్రం మీద భక్తికలవాడుగానూ, మంత్రార్థం ఇతరులకు చెప్పగలిగినవాడుగానూ, బాహ్యాభ్యంతరాలలో నిర్మలమైనవాడుగానూ, గురుభక్తికలవాడుగానూ, పురాణాల జ్ఞానంకలవాడుగానూ వుండాలి. ఇలాంటివాడినే ఆచార్యడు అంటారు. ఈ గుణాలు హనుమంతుడిలో వున్నాయని శ్రీరాముడు చెప్తున్నాడు లక్ష్మణుడితో).

"లక్ష్మణా! యితడు అడిగిన ప్రశ్నలకు నువ్వు జవాబు ఇవ్వు. యితడు మాటల పొందిక శాస్త్రసరణి తెలిసినవాడు. ఆయన యోగ్యతకు తగ్గట్లు మనం మాట్లాడకపోతే మనం మూఢులమని ఆతడు భావిస్తాడు. కాబట్టి నువ్వు మాట్లాడే మాటలు స్నేహం కలవడానికి, వింటానికి ప్రియంగా వుండాలి. ఏ విషయం ఎలా చెప్పాలో అలాగే చెప్పు. ఎందుకింత హెచ్చరికగా చెప్తున్నానంటావా? ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం చక్కగా వల్లించి ధృఢంగా మనస్సులో నిలిపినవాడే ఇతడిలాగా మాట్లాడగలడు. అలా అని ఇతడిని చాంధసుడు అని భావించవద్దు. శిక్షావ్యాకరణాలు చక్కగా పఠించినవాడు. వ్యాకరణాన్ని ఎన్నోమార్లు వల్లించి కంఠస్థం చేశాడో కాని, నేనెంత పరీక్షించి చూసినా, ఇతడి మాటల్లో వ్యాకరణ విరుద్ధమైన ప్రయోగం ఒక్కటైనా కనబడలేదు. అంతేకాదు.... మాట్లాడే తీరు చూస్తే, శిక్షను కూడా పఠించినవాడుగా వున్నాడు. ఎంతసేపు మాట్లాడినా, కళ్లల్లోకానీ, ముఖంలో కానీ, నొసటకానీ, కనుబొమలలోకానీ ఒక్క దోషమైనా కనిపించలేదు".

"ఇతడి మాటల్లో గొతుకులు లేవు. వ్యర్థపదాలు లేవు. ఈ అర్థమా? ఆ అర్థమా? ఇది ఈ పదమా? ఆ పదమా? అన్న సందేహం రాదు. గబగబా పరుగెత్తడం లేదు. మెల్లగా నీళ్లు నమలుకుంటూ మాట్లాడిందీ లేదు. తొస్సులు లేవు. ఉరం, కంఠం నుండి మాట వచ్చింది కాని, బిగ్గరగా అరిచింది లేదు. వినవచ్చీ, వినపడకుండా గొణగడం, పెదవులతో మాట్లాడడం లేదు. ప్రతిపదం వ్యాకరణ శుద్ధక్రమాన్ని అనుసరించి వుంది. శుభంగా, మనోహరంగా వుంది. ఉదాత్తానుదాత్త స్వరితాలతో కూడిన ఇతడి చిత్రమైన మాటలు, ఇతడిమీద కోపంతో కత్తిపైకెత్తిన వాడినికూడా సంతోషపెట్టుంది. ఇక అనుకూలమైన వారి వేరే విషయం చెప్పాలా? రాజైనవాడు ఇలాంటి దూతను సంపాదించకపోతే ప్రారంభించిన పని ఎలా పూర్తవుతుంది? అతడు కార్యసాధకుడన్న కీర్తిని ఎలా సంపాదించగలడు? ఇలాంటి గుణసమూహాలు కల దూత ఏ రాజుదగ్గర వుంటాడో, అతడి పనులన్నీ దూతవల్లే సఫలం అవుతాయి".

(దీనర్థం: తాను సుగ్రీవుడితో స్నేహం చేస్తే తన పని హనుమంతుడి వల్లే సఫలం అవుతుందని రామచంద్రమూర్తి నిశ్చయించుకున్నాడు. వాక్యజ్ఞుడు లక్ష్మణుడు, వాక్యజ్ఞుడు హనుమంతుడు అని శ్రీరామచంద్రమూర్తి చెప్పడం అంటే, ఈ గుణాలన్నీ లక్ష్మణుడిలో, హనుమంతుడిలో–ఇద్దరిలో– కలవనీ, ఇద్దరూ సమానులే అనీ భావం).

శ్రీరామచంద్రమూర్తి ఈ విధంగా చెప్పడంతో, వాక్యజ్ఞుడైన లక్ష్మణుడు వాక్యజ్ఞుడైన హనుమంతుడితో ఇలా అన్నాడు. "అయ్యా! పండితుడా! సుగ్రీవుడి గురించి, అతడి ప్రభావం గురించీ, అతడి గొప్ప గుణాలను గురించీ, మేం ఇదివరకే విన్నాం. కాబట్టే ఆయన్ను వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చాం. నువ్వు చెప్పిన సుగ్రీవుడి పనిని మేం సంతోషంతో నువ్వు చెప్పినట్లే చేయగలం".

ఇలా లక్ష్మణుడు చెప్పగానే హనుమంతుడు సుగ్రీవుడి జయం కోరుతూ రామసుగ్రీవులకు స్నేహం కుదర్చాలని అనుకున్నాడు.

సర్గ-4

హనుమంతుడితో తమ వృత్తాంతాన్ని చెప్పిన లక్ష్మణుడు

రామలక్ష్మణులు కార్యార్థమై సుగ్రీవుడిని చూడడానికి, కలవడానికి, స్నేహం చేయడానికి వచ్చారని సంతోషపడ్డ హనుమంతుడు, సుగ్రీవుడిని తలచుకుని, ఇక అతడి పని చక్కబడినట్లే అనీ, ఆయనకు రాజ్యం లభించడం సత్యమే అని అనుకుంటాడు. ఇలాంటి వారు పూనుకుంటే పని జరక్కుండా ఆగుతుందా? అని కూడా అనుకుంటాడు. ఆంజనేయుడు ఈ విధంగా ఆలోచించి, సుగ్రీవుడితో వీళ్లకేం పనుందో? అది అతడివల్ల సాధ్యమవుతుందా? కాదా? తెలుసుకుందామనుకుంటాడు. రామచంద్రుడిని చూసి, "అయ్యా! నువ్వు తమ్ముడితో ఈ భయంకర అరణ్యాలలో తిరగడానికి కారణం ఏంటి?" అని అడిగాడు. వెంటనే, రామచంద్రుడి ఆజ్ఞానుసారం లక్ష్మణుడు శ్రీరామచంద్రుడి చరిత్ర ఆదినుండి ఇలా చెప్పాడు.

"తేజోవంతుడు, గొప్ప మతిమంతుడు అయిన దశరథమహారాజు ధర్మం అంటే ప్రేమతో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే నాలుగు వర్ణాలవారిని వారి-వారి స్వధర్మం చెడకుండా సర్వదా రక్షించేవాడు. ఆయన ఎవరికీ విరోధికాకుండా, ఎవరిమీద ఆయనకు విరోధిభావం లేకుండా, రెండవ బ్రహ్మలాగా రక్షించేవాడు. నియమం చెడకుండా అగ్నిష్టోమమ్ లాంటి యజ్ఞాలను దక్షిణలతో సహా నెరవేర్చేవాడు. ఆయన కొడుకుల్లో పెద్దవాడు శ్రీరాముడనే పేరుకలవాడు. పరాక్రమంలో ప్రసిద్ధికెక్కినవాడు. సర్వభూతాలను రక్షించే యోగ్యతకలవాడు. తండ్రిమాటను పాటించేవాడు. రాజచిహ్నాలతో కూడినవాడు. ఆయనే ఈ రామచంద్రుడు. ఈయన రాజ్యాన్ని పోగొట్టుకుని అడవులకు పోవడానికి సిద్ధపడగా నేను కూడా ఆయనకు తోడుగా వచ్చాను.

నేను ఒక్కడినే కాకుండా, ఆయన భార్య భూపుత్రి సీతాదేవి కూడా ఆయన వెంట అడవులకు వచ్చింది. ఆమె భార్య కాబట్టి రావడం న్యాయమే. నేనెందుకు వచ్చానంటావా? ఈ మతిమంతుడికి నేను జన్మతః తమ్ముడిని. ఆయన గొప్ప ధర్మబుద్ధికి, సద్గుణ సంపదకు వశపడి దాస్యం చేస్తున్నాను".

"నా పేరు లక్ష్మణుడు. నా యోగ్యతకు అది తగ్గపేరు. చేసిన మేలు మరవనివాడు, సుఖపడడానికి అర్హుడు, గొప్ప యోగ్యతకలవాడు, ప్రాణికోటులను రక్షించడంలో ఆసక్తికలవాడు, రాజ్యం లేనివాడు అయిన ఈ రాముడి ప్రియురాలిని, సీతాదేవిని, కామరూపైన రాక్షసుడు ఎవడో అడవుల్లో భయం లేకుండా దొంగిలించాడు. మేం ఆమెను వెతుక్కుంటూ అడవుల్లో తిరుగుతుంటే, ఒకచోట, శాపంవల్ల రాక్షసుడైన ఒకడు, సీతాదేవి జాడ తెలుసుకోవడానికి సుగ్రీవుడనే వానర రాజు సమర్థుడని, అతడి సహాయం తీసుకోమనీ చెప్పాడు. ఇలా చెప్పి అతడు స్వర్గానికి పోయాడు. ఇది వాస్తవంగా జరిగిన విషయం. ఈ కారణాన నాకు, రామచంద్రమూర్తికి, సుగ్రీవుడే ఇక దిక్కు వానరేంద్రా!. సర్వలోక రక్షకుడై, పూర్వం అనేక దానాలు చేసి, దాత అని పేరెన్నికగన్న రామచంద్రమూర్తి ఇప్పుడు తనకు సూర్యుడి కొడుకు దిక్కని అనుకుంటున్నాడు".

"దీనరక్షకుడు, అనేక ధర్మాలను రక్షించిన వాడు దశరథుడు. అలాంటివాడి కుమారుడు రక్షకుడైన వాడు కీసరాజు శరణుజొచ్చాడు హనుమంతా! లోకాలన్నిటికీ రక్షకుడు, శరణు చోర యోగ్యుడు, నా గురువు అయిన ఈ రామచంద్రమూర్తి సూర్యపుత్రుడి శరణు కోరగా వచ్చాడు. ఎవరి అనుగ్రహం వల్ల ఈ భూలోకంలోని జనులందరకీ సుఖం కలుగుతుందో, అలాంటి ప్రభువు శ్రీరామచంద్రమూర్తి వినయంగా కోతిరాజు అనుగ్రహం కోరుతున్నాడు. సమస్త సద్గుణ సంపత్తితో పూజ్యులైన రాజులు ఎవరితో గౌరవించబడుతున్నారో అలాంటి ఉత్తమదాత దశరథనందనుడు, రాముడు అని లోకంలో కీర్తికాంచినవాడు, క్రోతిరేడు శరణు కోరుతున్నాడు. మంచి కీర్తి సంపాదించిన యితడు శోకవశుడైసుగ్రీవుడి శరణుజొచ్చాడు".

లక్ష్మణుడు ఇలా చెప్పగానే, రెండు కళ్లల్లో నీళ్లు కాలవల్లాగా కారుతున్న అతడిని చూసి, హనుమంతుడు, "ఈ పరాక్రమం, ఈ ఇంద్రియ జయం, ఈ బుద్ధి సంపద, ఇలాంటి సదాచార సంపత్తికల మిమ్మల్ని తన అదృష్టం కొద్దీ సుగ్రీవుడు చూశాడు. సజ్జన స్తోత్ర పాత్రమైన నడవడి కలవారా! ఇక సుగ్రీవుడి

చరిత్ర చెప్తాను వినండి" అంటూ చెప్పసాగాడు. "తన అన్న అయిన వాలి పగపట్టి, బాధపెట్టి, ఊరు వెడలగొట్టి అతడి భార్యను అధర్మ పద్ధతిలో హరించడం వల్ల అడవుల్లో కీడు దశ అనుభవిస్తున్నాడు సుగ్రీవుడు. సీతాదేవిని వెతికే పనిలో మాలాంటి కోతులను రంగంలోకి దింపి మీకు తప్పక సహాయం చేస్తాడు".

ఇలా చెప్పి సుగ్రీవుడిని చూడడానికి పోదాం రమ్మని రామలక్ష్మణులను అడిగాడు. అప్పుడు లక్ష్మణుడు సంతోషంగా హనుమంతుడిని పొగిడి, రామచంద్రమూర్తితో "అన్నా! హనుమంతుడు యదార్థం చెప్తున్నాడు. సుగ్రీవుడికి నీతో పని వుంది. కాబట్టి సంతోషించు. నీ కార్యం కూడా నెరవేరిందని భావించు. ఇతడు చెప్పింది ఎంతవరకు నిజమని, నమ్మడం ఎలాగని అంటావేమో? మోసగాళ్లలో వుండాల్సిన గుణం ఒక్కటి కూడా ఇతడిలో లేవు. మోసపు మాటలు చెప్తే, ఇంగితంతో వాస్తవ విషయం తెలుసుకోవచ్చు. ముఖంలో వికారం కనిపించలేదు. ఒకవేళ యితడు చెప్పింది అబద్ధమైతే దానివల్ల మనకు వచ్చే నష్టం ఏమీ లేదు. పనైతే అయింది...లేకపోతె లేదు".

"ఇప్పుడు మనం వున్న స్థితికంటే తక్కువ స్థితికి పోము. ఆయన మాట్లాడేటప్పుడు ముఖం ఒక విధంగా ప్రసన్నంగా వుంది. మాటలేమో సంతోషంగా కార్యసాధకుడిలాగా వున్నాయి. సందేహించడానికి తావులేకుండా స్పష్టంగా సాదుభావంతో ప్రసంగిస్తున్నాడు. ఈ ఇంగితాల ఆధారంగా యితడు మోసగాడు కాదని నా అభిప్రాయం. కాబట్టి హనుమంతుడు కోరినట్లు మనం సుగ్రీవుడి దగ్గరికి పోదాం". అని లక్ష్మణుడు చెప్పగా రామచంద్రమూర్తి అలాగే చేద్దామన్నాడు. అప్పుడు ఆంజనేయుడు తన సన్న్యాసి రూపాన్ని వెంటనే వదిలాడు. తన కోతిరూపాన్ని ధరించి రామలక్ష్మణులను ఇద్దరినీ భుజాలమీద ఎక్కించుకుని, తాను వచ్చిన సుగ్రీవుడి కార్యం నెరవేరిందికదా అనుకుని, సంతోషంగా, నిర్మలమైన మనస్సుతో మహావేగంగా తీసుకునిపోయి, సుగ్రీవుడు తిరుగుతున్న చోట దించాడు.

సర్గ-5
రామలక్ష్మణులను సుగ్రీవుడి దగ్గరికి తీసుకుపోయిన హనుమంతుడు

సుగ్రీవుడు తిరుగుతున్న ప్రాంతంలో ఒక ప్రదేశంలో రామలక్ష్మణులను దింపి, హనుమంతుడు, సుగ్రీవుడి దగ్గరకు పోయాడు. పోయి, "సుగ్రీవా! ఈ రాముడు ఏ పాపం ఎరుగడు సుమా! నువ్వు సందేహించిన దోషం ఇతడిలో లేదు. మిక్కిలి ఆలోచనాపరుడితడు. సూర్యతేజస్సు కల తమ్ముడు లక్ష్మణుడితో యితడు నీదగ్గరకు వచ్చాడు. యితడు సామాన్యుడని భావించవద్దు. విస్తారమైన సత్యం, శౌర్యం, సత్యమైన శౌర్యం, సత్యమే శౌర్యంగా కల వాడితడు. ఈయన సాక్షాత్తూ పరమాత్మ అనుకోవాలి. సూర్యవంశంలో జన్మించాడు. రామచంద్రమూర్తి ఇంద్రుడిని జయించిన తేజస్సువున్నవాడు. దశరథమహారాజు కొడుకు. ధర్మబుద్ధిలో తరుగులేనివాడు. పితృవాక్యపాలనలో దక్షుడు. ఇలాంటివాడు అడవుల్లో తిరుగుతుంటే, రావణాసురుడి వల్ల తన భార్యను కోల్పోయాడు. ఈయన తండ్రి దశరథుడు రాజసూయాది యాగాలను చేసి వేలకొద్దీ ఆవులను దక్షిణలతో దానం చేశాడు. వీరు పూజ్యులలో ఉత్తములు. ఇంతకు మించినవారు లేరు. అందమైన కీర్తికలవారు. నీ స్నేహం కోరి ఇక్కడికి వచ్చారు. కాబట్టి నువ్వు పోయి వారిని పూజించు".

రామలక్ష్మణులతోసంభాషించిన సుగ్రీవుడు

ఆంజనేయుడి మాటలు విన్న సుగ్రీవుడు తనకు రామచంద్రుడి వల్ల కలిగిన భయాన్ని వదిలి సంతోషంగా మనుష్య రూపాన్ని ధరించి త్వరత్వరగా వారి దగ్గరికి వచ్చాడు. నిర్మలమనస్కుడైన గురువు చెప్పిన మాటలు విని, ఆ మాటల్లో శ్రద్ధగలవాడైన శిష్యుడిలాగా సుగ్రీవుడు ప్రవర్తించాడు. ఇలా సుగ్రీవుడు రామలక్ష్మణులను సమీపించి, అనురాగంగా పూజించి, రామచంద్రమూర్తిని చూసి ఇలా అన్నాడు.

"మీరు వీరులనీ, గొప్ప ధర్మ గుణం కలవారనీ, సమస్త జీవకోటుల మీద వాత్సల్యం కలవారనీ, ఇలా మీ లెక్కించనలవికాని గుణాలను హనుమంతుడు చెప్పాడు. ఓ రాజకుమారులారా! మహాత్ములారా! ఈ కోతితో మీరు స్నేహం చేయాలని అనుకుంటే అంతకంటే నాకు గౌరవం, ఉత్తమమైన లాభం ఇంకోటి వుంటుందా? నేనే కృతకృత్యుడిని. అయినా ఒకటి చెప్తా వినండి. రామా! నువ్వు నాతో స్నేహం చేస్తే, రాముడి స్నేహితుడు సుగ్రీవుడు అని గౌరవ లాభం నాకే కాని, నావల్ల నీకు గౌరవలాభాలు కలగవు. ఆ కారణాన నేనే ధన్యుడిని. నా జన్మే సార్థకం".

సుగ్రీవుడితో స్నేహం చేసిన రాముడు

సుగ్రీవుడు ఇంకా ఇలా అన్నాడు. "రామచంద్రా! నాతో స్నేహం చేయడానికి నీకు పరిపూర్ణంగా అంగీకారమైతే, నా చేతిలో నీ చేయి వెయ్యి. ఇదిగో,నా చేతిని స్నేహధర్మ మర్యాద ప్రకారం చాచాను. ఇది అభయహస్త ప్రధానప్రార్థన". ఆ మాట విన్న రామచంద్రమూర్తి వీడు నిర్మలమనస్కుడని మనసులో సంతోషించి, తన అరచేతిని, సుగ్రీవుడి అరచేతిలో వుంచి, గౌరవించి నిండు మనస్సుకల స్నేహంతో కౌగలించుకున్నాడు. ఆంజనేయుడు అప్పుడు తిరిగి తన సన్యాసి రూపాన్ని వదిలి కోతిరూపాన్ని ధరించి, చంద్రపుల్లల్ని తెచ్చి మంట చేశాడు. గనగన మండే ఆ అగ్నిహోత్రాన్ని వారిద్దరిమధ్య హనుమంతుడు పెట్టాడు. రామసుగ్రీవులు అడవి పూలతో పూజించి, ఒకరిచేయి మరొకరు పట్టుకుని, ఆసక్తిగా అగ్నికి ప్రదక్షిణ చేశారు. ఇలా రామసుగ్రీవులు స్నేహం చేసి వారి-వారి హృదయాల్లో వున్న ఆరాటాన్ని విడిచి ఇద్దరూ తమ పని జరిగినట్లే సంతోషించారు. ఒకరినొకరు ప్రేమపూరితమైన చూపులతో మరీ-మరీ చూసుకుంటూ తృప్తి పడ్డారు.

రామసుగ్రీవులు అలా తన్మయంగా ఒకరినొకరు చూసుకుంటూ వుండగా, ఆ సమయంలో సుగ్రీవుడు రామచంద్రమూర్తితో ఇలా అన్నాడు. "రామచంద్రా! నీ స్నేహాన్ని సంపాదిం చాను. మన సుఖదుఃఖాలు సమానమయ్యాయి". ఇలా చెప్పి, సుగ్రీవుడు, నిండారా పూసిన ఒక కొమ్మను ఒకదానిని విరిచి నేలమీద వేసి, దానిమీద రామచంద్రమూర్తితో కలిసి కూర్చున్నాడు. అప్పుడు వాళ్లలా కూర్చోగా హనుమంతుడు చందనశాఖను ఒకదానిని విరిచి తెచ్చివేయగా లక్ష్మణుడు దానిమీద కూర్చున్నాడు. అప్పుడు సవినయంగా సుగ్రీవుడు రాముడితో ఇలా అన్నాడు.

తనకు వాలి చేసిన అపకారాన్ని రాముడికి చెప్పిన సుగ్రీవుడు

సుగ్రీవుడు తనకు అన్న వాలి చేసిన అపకారాన్ని గురించి ఇలా చెప్పసాగాడు. "రామచంద్రా! నా అన్న వాలి భయంకరమైన పరాక్రమం కలవాడు. వాడు నామీద కోపంతో నన్ను రాజ్యం నుండి పంపించి, నా భార్యను హరించి, నిర్దయుడై వెళ్లగొట్టితే, ప్రాణభయంతో కొండాకోనలలో అల్లల్లాడుతున్నాను. నన్ను కరుణార్ద్ర దృష్టులతో చూసి వాలి భయం నాకు లేకుండా చేసి నన్ను రక్షించు".

సుగ్రీవుడిలా చెప్పగా స్నేహధర్మం తెల్సినవాడు, శరణాగత రక్షణ అంటే ప్రేమకలవాడు, దేవతలను రక్షించే కకుత్థ్సుడి వంశంలో పుట్టినవాడు, శ్రీరామచంద్రుడు తాను చేయాల్సింది ఇంత అల్ప కార్యమా? అని చిరునవ్వుతో ప్రీతిగా సుగ్రీవుడితో ఇలా అన్నాడు.

వాలిని చంపడానికి ప్రతిజ్ఞ చేస్తున్నట్లు సుగ్రీవుడికి చెప్పిన శ్రీరాముడు

సుగ్రీవుడితో వాలిని చంపడానికి ప్రతిజ్ఞ చేస్తూ రాముడు ఇలా అన్నాడు. "స్నేహితుడంటే ఉపకారం చేసేవాడని అర్థం. ఇది నేను చక్కగా ఎరుగుదును. కాబట్టి నీ భార్యను అపహరించిన ధర్మవిరుద్ధచరిత్రుడైన వాలిని చంపుతాను. భయపడవద్దు. వాలినెలా చంపుతానంటావా? ఇదిగో చూడు. నా బాణాలు గురిభేదించకుండా వ్యర్థంగా పోవు. మిక్కిలి వాడికల మొనలున్నాయి. వంకరలేకుండా చక్కటి కణుపులున్నాయి. నీచపు నడవడికల వాలిని, కోపించిన పాముల గుంపుల్లాగా చంపుతాయి".

రాముడిలా చెప్పగా, సంతోషించిన సుగ్రీవుడు, "రామచంద్రా! నీ అనుగ్రహంవల్ల నా భార్య, రాజ్యలక్ష్మి లభిస్తే సంతోషిస్తాను. నీ బాణాలతో వాలిని త్వరగా చంపి నా తీవ్ర దుఃఖాన్ని తొలగించి రక్షించు" అని అంటాడు.

సర్గ–6
సీతను తాను తీసుకొస్తానని రాముడికి చెప్పిన సుగ్రీవుడు

సుగ్రీవుడు రామచంద్రమూర్తితో ఇంకా ఇలా అన్నాడు. "నా మంత్రులలో గొప్పవాడైన హనుమంతుడు మీరు అడవికి వచ్చిన కారణాన్ని చెప్పాడు. నువ్వు మిథిలానగర రాజు కూతురైన సీతతోను, తమ్ముడు లక్ష్మణుడితోనూ, అడవుల్లో తిరుగుతుండగా క్రూర రాక్షసుడు మీరు దగ్గరలో లేని సమయం కనిపెట్టి, నీ భార్యను అపహరించినాడని చెప్పాడు హనుమంతుడు. సీతను అపహరించి తీసుకుపోతున్న సమయంలో, దారిలో, గద్దరాజైన జటాయువును చంపాడని చెప్పాడు. రామచంద్రా! నీకు నీ భార్యను ఎడబాయడం వల్ల కలిగిన దుఃఖాన్ని నేను తొలగిస్తాను. నువ్వు బాధపడవద్దు. పతివ్రతైన సీతాదేవిని నీచుడైన రాక్షసుడు ఏ ప్రదేశంలో దాచినప్పటికీ, రాక్షసులు హరించిన వేదాన్ని హయగ్రీవమూర్తి–మత్స్యమూర్తి తెచ్చినట్లు నేను తెస్తాను. సీతాదేవి పాతాళంలో వున్నా సరే, ఆకాశాన వున్నా సరే, రామచంద్రా! ఆమెను నేను తేగలను. నువ్వు బాధపడవద్దు".

"రామచంద్రా నేను సత్యం చెప్తున్నాను. నమ్ము. రాక్షసులు, దానవులు సైన్యంతో విజృంభించినా సీతను జీర్ణం చేసుకోలేవు. విషం కలిపిన అప్పచ్చులు తిన్నవారు చస్తారుకాని, జీర్ణం చేసుకుంటారా? అలాగే సీతను హరించినవాడు చస్తాడు కాని ఆమెను అనుభవించలేడు. రామచంద్రా! నువ్వు దుఃఖం వదులు. నీ భార్యను నేను తెస్తాను. నా భార్య ముఖం నువ్వెరుగవు. ఆమె ఎక్కడున్నదో తెలియదు. అలా వున్నా నేను ఇంత ధైర్యంగా చెప్పడానికి కారణం, రావణాసురుడు ఒక స్త్రీని చంకలో ఇరికించుకుని ఆదరబాదరగా ఆకాశంలో పరుగెత్తాడు. ఆమె గద్గద స్వరంతో రామా! రామా! అని ఏడుస్తూ వుంది. ఆమె

సీతాదేవి అని ఇప్పుడు తెల్సుకున్నాను. రామచంద్రా! ఆకాశంలో పరుగెత్తి పోతున్న రావణాసురుడి ఒడిలో ఆడపాములాగా వేలాడి భయంతో వణకుతున్న స్త్రీని నేనొక్కడినే కాదు ఈ నలుగురు కూడా చూశారు".

సీతాదేవి పడేసిన భూషణాలను శ్రీరాముడికి చూపించిన సుగ్రీవుడు

సుగ్రీవుడు శ్రీరాముడితో ఇంకా ఇలా అన్నాడు. "మేం సీతను చూడడమే కాదు. ఆమెకూడా మమ్మల్ని చూసి, ఆమె తనమీది ఉత్తరీయంలో సొమ్ములను మూటగట్టి విసిరివేసింది. వాటన్నింటినీ నేను కొండగుహమీద వున్న హనుమంతుడి చేతికి ఇచ్చి దాచిపెట్టాను. వాటిని త్వరగా తెప్పిస్తాను. నీ భార్యవేమో చూడు".

సుగ్రీవుడి మాటలకు రామచంద్రమూర్తి ఆయన్ను ముచ్చట్లతో కాలయాపన చేయవద్దని, వెంటనే వేగంగా ఆభరణాలను తెప్పించమని పురమాయించాడు. తక్షణమే సుగ్రీవుడు హనుమంతుడికి చెప్పడం, ఆయన పోయి వాటిని తెచ్చి రాముడికి చూపించడం జరిగింది. చీరచెరగున కట్టిన సొమ్ములను రామచంద్రమూర్తి చేతికి తీసుకుని, వాటిని చూస్తూ, కళ్లల్లో కన్నీళ్లు వస్తుంటే, అవి చూపులను అడ్డగిస్తుంటే, "హా! ప్రియురాలా! రమణీ!" అంటూ ఆరాటంగా ఆ భూషణాలను ఒత్తిపట్టుకుని పుట్టలోని పాము బుసకొట్టినట్లు పెద్ద శ్వాస విడిచాడు.

రామచంద్రమూర్తి చాలాసేపు మూర్ఛపోయి, పడిలేచి, తమ్ముడు లక్ష్మణుడిని చూసి, "దయలేని రాక్షసుడు ఆమెను ఎత్తుకుని పోతుంటే తన శరీరంమీద ఆభరణాలను సీత భూమ్మీద పారవేసింది చూశావా, లక్ష్మణా! వీటిని సీతాదేవి కొండరాళ్ళమీద వేయలేదు. పచ్చికనేలమీద పడేసింది. కాబట్టి ఇన్ని సొమ్ములు ఆమె శరీరంమీద ఉన్నప్పుడు ఎలా మంచిగా వున్నాయో ఇప్పుడూ అలాగే ఏమాత్రం చెడిపోకుండా వున్నాయి. లక్ష్మణా, వీటిని నువ్వు చూడు. ఇవి సీతవే కదా?" అని అడిగాడు.

రామచంద్రమూర్తి ప్రశ్నలకు జవాబుగా లక్ష్మణుడు, "అన్నా! ఈ బాహుపురులు, ఈ కమ్మలు, సీతాదేవివి అవునో–కాదో నేను చెప్పలేను. ప్రతిదినం ఆమెకు పాదాభివందనం చేసేటప్పుడు చూసేవాడిని కాబట్టి ఈ అందియలు సీతాదేవివే అని చెప్పగలను" అన్నాడు.

సుగ్రీవుడిని రావణుడి వృత్తాంతాన్ని అడిగిన శ్రీరాముడు

లక్ష్మణుడు ఇలా చెప్పగానే, సుగ్రీవుడిని చూసి రాముడు “మిత్రమా! నా ప్రాణాలకంటే ప్రియమైన నాప్రియురాలిని రాక్షసుడు ఎత్తుకుని పోతుంటే సీతను నువ్వెక్కడ చూశావు? నాకు దుఃఖం కలిగించిన ఆవంచకుడు వుండే ప్రదేశం ఏదో చెప్పు. వాడిని పరిచారకులతో సహా వధిస్తాను. రామచంద్రా! రావణాసురుడు ఎక్కడ? నువ్వెక్కడ? ఎక్కడో వుండేవాడిని ఇక్కడినుండి ఎలా చంపుతావు? అని అంటావేమో? చెప్తా విను. జానకిని దొంగిలించి మాకు కష్టం కలిగించి, పాపాన్ని సంపూర్ణంగా పెంచుకుని, తన గర్వంతో తన మృత్యుదేవతను తన మీదకు తెచ్చుకున్న ఆ రాక్షసుడి కోసం లోకంలో రాక్షసుడనేవాడు లేకుండా చేస్తాను. మిత్రమా! వాడెక్కడ వుంటాడో చెప్పు. దొంగలాగా అడవుల్లో వున్నా నాభార్యను బలవంతంగా దొంగిలించిన ఆ దుష్టుడిని ఇప్పుడే చంపుతాను.

సర్గ-7
శ్రీరాముడికి ధైర్యం చెప్పిన సుగ్రీవుడు

శ్రీరామచంద్రమూర్తి బాధపడడం చూసిన సుగ్రీవుడు కన్నీళ్లు తన గొంతుకు అడ్డంగా వస్తుంటే ఇలా అన్నాడు. "అయ్యా! రామచంద్రమూర్తీ! ఆ రాక్షసుడు కాపురముండే దేశం కానీ, అతడి బలం కానీ, శక్తికానీ, సామర్థ్యం కానీ, అ అనీచుడి కులంకానీ నాకు నిజంగా తెలియదు. అయితే ఎలా అని విచారపడవద్దు. ఏవిధంగానైనా నీభార్య నీతో కలిసే మార్గాన్ని అన్వేషిస్తాం. నామాట నమ్ము".

(ఇక్కడ సుగ్రీవుడు స్పష్టంగా అబద్ధం చెప్పాడు. రావణాసురుడి విషయం హనుమంతుడికి తెలియదుకాని సుగ్రీవుడికి బాగా తెలుసు. రావణాసురుడు వాలిచేతిలో ఓడిపోయి సంధి కుదుర్చుకున్నవాడే. అప్పుడు సుగ్రీవుడు కూడా అక్కడ వున్నాడు. అలాంటప్పుడు తెలిసి-తెలిసి అబద్ధం చెప్పడం మిత్రద్రోహం కాదా? కాదు...కానేకాదు. ఇప్పుడే రావణాసురుడి గురించి సుగ్రీవుడు చెప్తే చాలా తొందరలో వున్న రామచంద్రమూర్తి వెంటనే లంకమీదకు యుద్ధానికి పోదామని అనవచ్చు. వాడి బలం ఈయనకు తెలియదు. తానేమో వాలి జీవించి ఉన్నంతదాకా ఈ స్థలాన్ని విడిచి పోవడానికి వీల్లేదు. ఒకవేళ పోయినా ఇప్పుడున్న ఐదుగురితో చేయగలిగింది ఏమీ లేదు. తాము బయల్దేరిపోతే వాలి సైన్యంతో దండెత్తి వస్తాడు. వాలి, రావణుడు ఒకటైతారు. అప్పుడీయన ఎవరితోనని యుద్ధం చేస్తాడు? తొందరపాటు వల్ల కార్యభంగమే కాని అనుకూలంకావు. వాలిని చంపి రాజ్యాన్ని సుగ్రీవుడికి ఇస్తే తానూ సర్వాధికారి అవుతాడు. అప్పుడు నిర్భయంగా లంకమీదకు దండెత్తవచ్చు. ఇలా కార్యభారం, సాధన మార్గం ఆలోచించి సుగ్రీవుడు అబద్ధం చెప్పాడు. దీనివల్ల రామచంద్రమూర్తి పని పాడవలేదు. స్నేహధర్మాన్ని అనుసరించి ఆడిన అబద్ధం

తప్పుకాదు. రోగి మేలు కోరిన వైద్యుడు రోగి ఇష్టప్రకారం చికిత్స చేయదు. వాడి మేలు ఆలోచించి చేస్తాడు).

సుగ్రీవుడు ఇంకా ఇలా అన్నాడు రాముడితో. “రామచంద్రా! నా ప్రతిజ్ఞ విను. సీతాదేవి ఎక్కడున్నా వెతికి ఆ రాక్షసుడిని బంధువులతో, కొడుకులతో, స్నేహితులతో యుద్ధంలో చీల్చివేసి నీ మనస్సుకు సంతోషం కలిగేట్లు చేస్తాం. నీ ప్రియురాలిని నీతో కలిసేట్లు చేస్తాం. తండ్రీ! నామాట నమ్ము. అయ్యా! బాధపడవద్దు. సాహసం వదలవద్దు. ధైర్యం, తేజం వదిలి పెట్టవద్దు. గౌరవం చెడిపోయేవిధంగా పరితాపపడవద్దు. దేవాత్మా! నీలాంటి మహాత్ములు ఈ విధంగా దుఃఖపడతారా? గౌరవం చెడడానికి బాధపడడమే కారణం అని నీకు తెలియదా? నీ దుఃఖం నాకెలా తెలుస్తుంది అంటావేమో? నీలాగా నేను కూడా భార్యను పోగొట్టుకుని అనేక కష్టాలు అనుభవిస్తున్నాను కదా? అయినా నీలాగా నేను ఏడుస్తున్నానా? ధైర్యం వదిలానా?నేనా కోతిని, మూఢుడను అయినప్పటికీ ఆడదానికై దుఃఖపడను. నువ్వేమో మంచి పండితుడివి. దీరుడివి. మహాత్మా నువ్వు ఇలా చేయడం తగునా?”.

“రామచంద్రా! కారుతున్న కన్నీటిని ఇనుమడించిన ధైర్యంతో అడ్డగించు. కార్యోన్ముఖుడు నిలకడగా వుండాల్సిన ధైర్యాన్ని విడువవచ్చా? వ్యసనపడేటప్పుడు, ధననష్టం జరిగినప్పుడు, ప్రాణాపద కలిగినప్పుడు, భయం కలిగినప్పుడు, తన బుద్ధిబలంతో ధీరుడనేవాడు ధైర్యంగా వుండాలి కాని అధైర్యపడకూడదు. ఎప్పుడూ ఏడిచే బుద్ధిహీనుడు శోకంతో బరువెక్కిన పడవ సముద్రంలో మునిగినట్లు మునుగుతాడు. చేతులు రెండూ జోడించి నిన్ను ప్రార్థిస్తున్నాను.....నామీద స్నేహభావం వుంచి నన్ను మన్నించు. కొంచెం కూడా దుఃఖపడవద్దు. పౌరుషంగా వుండు పండితాగ్రణీ! రామచంద్రా! శోకమే అన్నిటికీ సమాధానం, అంతకు మించి మనం ఏమీ చేయలేంఅనేవాళ్లకు సుఖం వుండదు. శోకంలో మునిగినవాడికి తేజస్సు చెడిపోతుంది. శోక పడేవాడికి బతుకు దుర్లభం అవుతుంది. కాబట్టి శత్రుసంహారకా! ధైర్యాన్ని తెచ్చుకో”.

“రామచంద్రా! స్నేహం వల్ల నేను నీకు హితమైన దాన్నే చెప్తున్నానుకానీ నీకు తెలియని విషయం ఉపదేశం చేయడం లేదు. నీకు చెప్పేటంతటి వాడినా నేను? కాబట్టి నా స్నేహాన్ని గౌరవించి నేను చెప్పిన మాటలను ఆదరించి మన మేలుకేకదా చెప్తున్నాడని భావించి నీ మోహాన్ని, మనస్తాపాన్ని తగ్గించుకో”.

స్నేహం, ప్రేమ ప్రకాశించే రీతిలో సుగ్రీవుడు చెప్తుంటే, కళ్ళనుండి కాలువల్లాగా కారుతున్న నీళ్లను నిమ్మదిగా తుడుచుకుని, సుగ్రీవుడిని చూసి, రామచంద్రమూర్తి ఇలా అన్నాడు. "కౌగిట్లో వుంచుకుని, ప్రేమతో, గుణసంపన్నుడైన స్నేహితుడు తన స్నేహితుడికి ఆపద సమయంలో ఎలా మెసలుకోవాలో. అలాగే నువ్వు నీ మాటలతో నన్ను ఓదార్చావు. మిత్రుడా! బంధువులంటే రక్తసంబంధీకులు మాత్రమే కాదు. అలాంటి సంబంధమున్నా, లేకపోయినా, అవసరానికి సహాయపడేవారే నిజమైన బంధువులు. ఇలా నా హితం కోరేవాడు, అవసరానికి ఆదుకునేవాడు నాకెక్కడ దొరుకుతాడు? సంపదలో తులతూగేవాడికి ఎవరన్నా లభిస్తారేమో కాని, ఆపదలో వున్న నాలాంటివారికి, నీచ స్థితిలో ఎవరూ లేని సమయంలో నీలాంటి స్నేహితులు ఎలా దొరుకుతారు? కాబట్టి నువ్వు నిజమైన చుట్టానివి. నీ మాటలవల్ల నామనసు నిర్మలమైంది".

"సుగ్రీవా! నీకు నామీద ఇంత ప్రేమ వుంది కాబట్టి, ఇక నువ్వు 'ఇలా చేయి, అలా చేయి' అని చెప్పను. దుష్టబుద్ధితో క్రూర కార్యాలు చేసే రాక్షసుడుని వెతకడానికి చేయాల్సిన ప్రయత్నాలు నువ్వే చేయి. ఇక ఆ విషయాలు నేను ప్రస్తావించను కాని, ఇప్పుడు నన్నేమి చేయమంటావో చెప్పు. వానాకాలంలో విత్తనం సిద్ధం చేయబడిన మడికయ్యగా నన్ను భావించు. నువ్వు వేసే విత్తనం కొద్దీ నీకు ఫలితం వుంటుంది. ఆలోచన చెప్పాల్సిన బాధ్యత నీది....అది ఫలించేలా చేయడం నా వంతు. నేను చెప్తున్నది సత్యం అని నమ్ము. ఇంతవరకు నేను అసత్యమాడలేదు. ఇక ముందు ఆడబోయేది లేదు. మిత్రమా! సందేహం వదులు. సత్యం మీద ప్రమాణం చేసి చెప్తున్నాను".

రామచంద్రమూర్తి చెప్పిన హితవాక్యాలు, ప్రతిజ్ఞ, విన్న సుగ్రీవుడు, ఆయన మంత్రులు చాలా సంతోషించారు. ఈ విధంగా రామసుగ్రీవులు వారి-వారి సుఖ దుఃఖాలు ఒకరితో మరొకరు ఏకాంతంగా చెప్పుకున్నారు. ఏక నిశ్చయంతో రామసుగ్రీవులు ఇలా తమ సుఖదుఃఖాలు ఒకరికొకరు చెప్పగా, సుగ్రీవుడు తన కార్యం సఫలమైంది కదా అని మిక్కిలి సంతోషించాడు.

సర్గ–8

శ్రీరామునితో స్నేహాన్ని కొనియాడిన సుగ్రీవుడు

లక్ష్మణుడి సమక్షంలో ఆయన వింటుండగా వానరరాజైన సుగ్రీవుడు రామచంద్రమూర్తితో ఇలా అన్నాడు. "నీలాంటి గొప్ప మహిమకలవాడు నాకు స్నేహితుడిగా లభించడంవల్ల దేవతలందరి అనుగ్రహానికి నేను యోగ్యుడనయ్యాను. ఇంతవరకూ నన్ను కొండమీది కోతి అని తలచినవారంతా ఇకమీద నన్ను రాముడి స్నేహితుడని ఎంతగానో గౌరవిస్తారు. నువ్వు కొంచెం ఆలోచిస్తే నీ సహాయంతో నాకు కేవలం కపిరాజ్యమే కాదు, స్వర్గలోక ప్రభుత్వం కూడా లభిస్తుంది. రఘువంశంలో పుట్టిన వాళ్లలో శ్రేష్టుడవైన నీతో నాకు స్నేహం లభించడం వల్ల నా చుట్టాలందరికీ, ప్రాణమిత్రులకూ, పూజనీయుడనయ్యాను. నీకారణాన నన్ను ఇక అందరూ గౌరవిస్తారు. నీకు నేను తగిన స్నేహితుడనని కాలక్రమంలో నువ్వే తెలుసుకుంటావు రామచంద్రా! నా గుణాలను గురించి నేను చెప్పుకోకూడదు. ఆత్మ ప్రశంస మరణప్రాయమని పెద్దలంటారు కదా?"

"ఇది నా విషయం. నీ విషయంలో నాకేమాత్రం సందేహం లేదు. నీ లాంటి ధన్యులు, కృతకృత్యులు స్థిరచిత్తం కలవారిగా వుంటారు కాని, చపల చిత్తులుగా వుండరు. జ్ఞానులలో ధైర్యంలాగా వారిలో ప్రేమ నిశ్చంచలమై వుంటుంది. ఇద్దరు స్నేహితులు సాదువులైతే, చాలా విలువగల పదార్థాలైన వెండి–బంగారు సొమ్ములను కూడా ఒకరివాటిని ఇంకొకరు తమ సొంత వస్తువుల్లాగే, ఇతరుల ధనమనే భేదం లేకుండా ఉపయోగిస్తారు. తన స్నేహితుడు ధనవంతుడైనా, దరిద్రుడైనా, దుఃఖంలో మునిగివున్నా, సుఖభోగాలు అనుభవిస్తున్నా, దోషైనా, దోషరహితుడైనా, అతడి గుణదోషాలను నిజమైన స్నేహితుడు ఎంచకూడదు.

ధనం పోయినా, సుఖాలన్నీ పోయినా, తన దేహమే పోయినా, తన స్నేహితుడి పని నెరవేరేలా చూడాలికాని, వాడికోసం మనమెందుకు చెడిపోవాలి అనుకోకూడదు".

ఇలా హితం, ప్రియమైన మాటలను సుగ్రీవుడు చెప్పగా, శ్రీరామచంద్రమూర్తి లక్ష్మణుడు వింటుండగా "ఔను, నువ్వు చెప్పింది నిజం" అని సుగ్రీవుడితో అన్నాడు. ఆ తరువాత సుగ్రీవుడు, రామలక్ష్మణులు కూర్చున్న శాఖలు వాడిపోయి వుండడం గమనించి, కొత్తవైన, మనోహరమైన శాఖలకోసం నాలుగు దిక్కులా చూశాడు. సమీపంలో వున్న ఒక కొమ్మను, చిగుళ్లు, పూలు బాగా వుండి ఆకులు తక్కువగా వున్న దాన్ని తెచ్చి రామచంద్రమూర్తికి వేశాడు. ఆయన దానిమీద కూర్చున్నాడు. ఆ తరువాత అలాంటిదాన్నే హనుమంతుడు తెచ్చి ఇస్తే, లక్ష్మణుడు కూర్చున్నాడు. అందరిలా కూర్చున్న తరువాత సుగ్రీవుడు శ్రీరామచంద్రమూర్తితో ఇలా అన్నాడు.

"మా అన్న వాలి నామీద పగపట్టి, నన్ను ఇల్లు వెళ్ళగొట్టి, నా భార్యను అపహరిస్తే, ఇక ఇక్కడ వుంటే చంపుతాడన్న భయంతో ఈ ఋశ్యమూక పర్వతంమీద పడివుంటున్నాను. సమస్త జీవరాసుల భయం పోగొట్టగలిగే వాడివి నువ్వు. రక్షకుడు లేని నన్ను, దుఃఖపడే నన్ను రక్షించు".

ఇలా సుగ్రీవుడు చెప్పడంతో రామచంద్రమూర్తి తాను ఈ విషయాన్ని ఇంతకుముందే చెప్పానుకదా అనుకుంటాడు. అదొక గొప్ప విషయం కాదనుకుంటాడు. చిరునవ్వుతో సుగ్రీవుడితో ఇలా అన్నాడు.

"పుణ్యాత్మా! సుగ్రీవా! మేలు చేయడం స్నేహధర్మం. కీడు చేయడం శత్రువుల లక్షణం. నువ్వు నాకు స్నేహితుడివి. నీ భార్యను అపహరించిన మూర్ఖుడిని ఇప్పుడే చంపుతాను. దీనికొరకు విచారించవద్దు. సుగ్రీవా! నా బాణాలు ఎలాంటివో తెలుసా? అమితమైన వేగంగా పోతాయి. మిరుమిట్లుగొలిపే కాంతికలవి. చూడడానికి భయంకరాకారాలు కలవి. బంగారు పింజలున్నాయి. కుమారస్వామి వనంలో పుట్టాయి. ఇంద్రుడి వజ్రాయుధంతో సమానమైనవి. భయంకరంగా, కోపంతో వున్న పాముల్లాగా, మిక్కిలి వాడికల ముఖాలున్నాయి. నువ్వు వీటిని చూసి ధైర్యం తెచ్చుకో. వాలిని తప్పక చంపుతాను. భయపడవద్దు. పాపపు మనస్సుకల వాలి నేలబడి చావగా సుగ్రీవా! సంతోషంగా చూస్తావు".

ఈ విధంగా చెప్పిన రామచంద్రమూర్తి మాటలు విన్న సుగ్రీవుడు సంతోషంతో

శ్రీరామచంద్రమూర్తిని మేలు–మేలని ప్రస్తుతించి ఇలా అన్నాడు.

"దేవా! శోకపీడితులకు నువ్వే గతి. నేనో శోకపీడితుడిని. కాబట్టి నువ్వే నాకు గతి. అంతమాత్రమే కాకుండా నువ్వు నాకు స్నేహితుడివి. నన్ను రక్షించాల్సిన భారం నీమీదే ఎక్కువగా వుంది. ఈ కారణాన దీనుడినై ఏడుస్తున్నాను. అగ్నిసాక్షిగా నువ్వు నా చేతిలో నీ చేయి వేసి స్నేహం చేసి, నాకు ప్రాణదానాన్ని నిస్సందేహంగా ఇచ్చిన కారణాన ధైర్యంతో వున్నాను. దేవుడైన నిన్నే నా ప్రాణస్నేహితుడివని నమ్మి నా మనస్సును ఎల్లవేళలా కాల్చే దుఃఖాన్ని నీకు చెప్పడానికి ప్రయత్నించాను. అల్పవిషయమైతే నేనెందుకు చెప్పేవాడిని?".

ఇంతవరకు చెప్పి, కళ్ళనిండా నీళ్లు కారుతుంటే, గొంతు గద్గదమై, నోట మాటరాక మౌనం దాల్చాడు.

ధీరుడైన సుగ్రీవుడు తన కళ్ళవెంట కారుతున్న నీళ్లను అణచుకుంటూ, రాముడేమనుకుంటాడో అని భయపడ్తూ, మళ్లీ ధైర్యం తెచ్చుకుని రామచంద్రుడితో తన కథ ఇలా చెప్పసాగాడు.

వాలి తనను పరాభవించిన విధానం రాముడికి చెప్పిన సుగ్రీవుడు

వాలి తనకు చేసిన కీడును గురించి సుగ్రీవుడు రాముడికి చెప్పాడిలా. "రామచంద్రా! వాలి నాకు చేసిన కీడు చెప్తా విను. వాలి రాజుగా వుండగా నేను యువరాజుగా వున్నాను. అప్పుడు నన్ను నానావిధాలుగా దూషించి దయలేకుండా వెళ్ళగొట్టాడు. నా ప్రాణాలకంటే ప్రియమైన నా భార్యను అపహరించాడు. నామీద ప్రేమగల స్నేహితులను, బంధువులను, చెరసాలలో బంధించాడు. ఇంతటితో ఆగకుండా నా ప్రాణాలను తీయడానికి ఆలోచిస్తున్నాడు. నన్ను చంపడానికి అనేకమందిని పంపాడు. ఇంకా నన్ను మోసం చేసి చంపడానికి అనేక ఆలోచనలు చేశాడు. అతడు నాకు చేసిన కీడులు చెప్పడం సాధ్యపడదు. నన్ను చంపడానికి వాలి ఎవరెవరినో పంపడం, నేను వాళ్లను చంపడంతో కాలం గడిచిపోతున్నది. ఆ కారణానే నేను మిమ్మల్ని చూసినప్పుడు, మీరు కూడా వాలితో పంపబడిన వారని భయపడ్డాను. ఈ హనుమంతుడు మొదలైన వానరులు మాత్రమే నాకు తగిన సహాయం చేస్తూ వుంటే, ఎన్ని కష్టాలో పడ్తూ, ప్రాణాలతో వున్నాను. నాకు వీళ్లు అన్నివేళలా అండదండలుగా వుంటూ, నా ప్రాణాలను కాపాడుతున్నారు. రామచంద్రా! ఎక్కువగా మాటలు చెప్పకుండా సారాంశాన్ని సంగ్రహంగా చెప్తా విను. వాలి

మహా పరాక్రమశాలి. సూర్యుడిలాంటివాడు. శత్రువులకు భయంకరుడు. అలాంటివాడు చచ్చి నేలబడితేనేకాని నా దుఃఖాలు పోవు....అన్నం సహించదు... కంటికి నిద్ర రాదు. రామచంద్రా! నాకు కలిగిన దుఃఖం ఎట్లా పోతుందో ఆ విషయమే చెప్పాను. కష్టాల్లో కానీ, సుఖాల్లోకానీ మిత్రుడికి మిత్రుడే దిక్కు".

సుగ్రీవుడు చెప్పినదంతా విన్న రామచంద్రమూర్తి ఇలా అన్నాడు. "వాలి నీకు అన్న కదా? అతడితో నీకింత విరోధం ఎందుకు కలిగింది? దానికి కారణం ఏమిటి? నువ్వేం తప్పు చేశావు? అంతా వివరంగా చెప్పు. మీ తప్పుల్లోని బలాబలాలు విచారించి, నీ తప్పు చిన్నదే అయితే, అతడి విరోధం ఎక్కువైతే, వాడిని ఇప్పుడే చంపుతాను. నీ తప్పు పెద్దదై, విరోధం చిన్నదైతే, ఇద్దరికీ సమాధానం కుదిరించి కార్యం చక్కదిద్దుతాను. నువ్వు విచారపడవద్దు. ధైర్యంగా మొదటినుండి మీ చరిత్ర చెప్పు. నీకు కలిగిన అవమానం వింటేనే నాకు కోపం వస్తున్నది. మనస్సు చలిస్తున్నది. నీకు విరోధి అయితే నాకూ విరోధే కదా? నేను విల్లు ఎక్కుపెట్టకముందే నీ సమాచారమంతా వివరంగా చెప్పు. నా విల్లు నుండి బాణం బయటికి వస్తే ఇక వాలి చచ్చిపోయినట్లే అని నమ్ము".

ఇలా శ్రీరామచంద్రమూర్తి చెప్పగా విన్న సుగ్రీవుడు, తనకు, తన అన్నకు విరోధం వచ్చిన విధం చెప్పడం ప్రారంభించాడు.

సర్గ-9
వాలికి, తనకు, విరోధం కలిగిన కారణం శ్రీరాముడికి చెప్పిన సుగ్రీవుడు

"రామచంద్రా! పూజ్యుడైన మా తండ్రికి మేమిద్దరం కొడుకులం. మాలో వాలి జ్యేష్టుడు. నేను చిన్నవాడిని. మా తండ్రికి నాకు మిక్కిలి ప్రేమకలవాడై వాలి ప్రవర్తించేవాడు. మా తండ్రి మరణించగా, కపులు, పౌరులు, మంత్రులు సమ్మతించి కపిరాజ్యానికి వాలిని రాజుగా నిర్ణయించి అతడికి పట్టాభిషేకం చేశారు. వంశపారంపర్యంగా వచ్చిన రాజ్యాన్ని వాలి పాలిస్తుంటే నేను ఆయన హితం కోరి ఆయనకు సేవలు చేస్తుండేవాడిని. ఇలా కొంతకాలం గడిచింది. ఆ తరువాత రామచంద్రా, మయుడి కుమారుడు, దుందుభి సోదరుడైన మాయావి అనేవాడు స్త్రీ కారణాన వాడికీ, వాలికీ వున్న విరోధాన్ని అడ్డం పెట్టుకుని ఒక అర్థరాత్రి అందరూ నిద్రించే సమయంలో వాలిమీదకు యుద్ధానికి వచ్చాడు. కోపంతో, రోషంతో వాలి నిద్రలేచి మాయావి మీదకు యుద్ధానికి పోవడానికి సిద్ధమయ్యాడు. అప్పుడు నేను, ఆడవారు ఆయనకు నమస్కారం చేసి, రాక్షసులతో అర్ధరాత్రి యుద్ధానికి పోవడం మంచిది కాదని నచ్చచెప్పాం. మా మాట వినకుండా మమ్మల్ని ధిక్కరించి, కింద పడవేసి, రివ్వున వాడిమీదకు యుద్ధానికి పోయాడు".

"నడిరేయిలో ఒంటరిగా రాక్షసులమీదకు యుద్ధానికి పోతున్న అన్న వాలిని చూసి, ఆయనమీద వున్న భక్తి కారణాన నేను కూడా వెంటపోయాను. ముందు నడుస్తూ తన మీదకు వస్తున్న వాలిని, వెనుక వున్న నన్ను చూసి, ఆ రాక్షసుడు భయంతో వేగంగా పరుగెత్తసాగాడు. వెన్నెల మాకు సహాయపడుతుంటే, మేం కూడా వాడి వెంట పోయాం. ఆ దానవుడు పరుగెత్తిపోయి భూమిలో తీగలతో కప్పబడి, పోవడానికి కష్టమైన ఒక బిలంలో ప్రవేశించాడు. అప్పుడు మా అన్న

నన్ను చూసి రావద్దని, అక్కడే నిలవమని, దానవుడిని చంపి వస్తానని చెప్పి లోపలికి పోయాడు. నేను కూడా అయన వెంట పోవడానికి అంగీకరించమని ఎంత చెప్పినా వినలేదు. పైగా ఆయన పాదాల మీద ఒట్టు పెట్టాడు. అప్పుడు చేసేదేమీ లేక బిలంబైట నిలబడ్డాను. వాలిమాత్రం వాడితో యుద్ధానికి చేయడానికి రోషంతో బిలంలోకి పోయాడు".

"ఒక సంవత్సరం నేనా బిలం బైటనే వుండిపోయాను. బిలంలోనుండి నెత్తురు భయంకరమైన నురుగుతో బయటకు రాసాగింది. రాక్షసుల సింహనాదాలు స్పష్టంగా వినపడ్డాయి. వాలి దీనమైన ఏడుపు వినపడ్డది. పరాక్రమం క్షీణించి వాలి రాక్షసుడి చేతిలో చిక్కాడని, మరణించాడనిభావించి, మనస్సు బాధపడుతుంటే, కొంచంపాటి కొండను ఆ బిలానికి అడ్డంగా వేసి అక్కడి నుండి వెళ్లిపోయాను. నేనాయనకు నీళ్లు విడిచి, మెల్లగా నగరానికి వచ్చి, వాలి కథ ఎవరికీ చెప్పకుండా దాచిపెట్టాను. మంత్రులు ఏదోవిధంగా వాస్తవాన్ని గ్రహించారు. నన్ను రాజ్యానికి రాజుగా చేసి, పట్టాభిషేకం చేశారు. ఆ విధంగా రాజునైన నేను రాజ్యాన్ని పాలిస్తున్నాను. ఇంతలో, మహాబలశాలి వాలి దైత్యుడిని చంపి, నగరానికి వచ్చి, రాజ్యాన్ని కోరి తనను విడిచి వెళ్ళిపోయానని సందేహించాడు. పట్టాభిషేకం చేసుకున్న నన్ను చూసి కోపంగా చూశాడు".

"చూసి, దుష్టబుద్ధీ, ఎందుకురా ఇలా చేసావు? నువ్వు తమ్ముడివని నమ్మికదా, నిన్ను బిలం బైట వుండమన్నాను. నేను బలవంతుడితో పోరాటం చేస్తున్నప్పుడు నన్నావిధంగా ఒంటరిగా వదిలి రావడమే కాకుండా నేను బిలం వెలుపలికి రాకుండా పెద్ద కొండను పెట్టి మూసివేసావు. రాజ్యానికి వచ్చి రాజ్యసంపద, భోగాలను అనుభవిస్తున్నావా? దుష్టుడా! నువ్వు తమ్ముడివేనా? అని నన్ను తిట్టి, నా దగ్గరున్న మంత్రులందరినీ బంధించి, వాళ్లను చెరసాలలో వేశాడు. నేనప్పుడు ఆయన్ను మంత్రుల, బంధువుల, స్నేహితుల సహాయంతో అడ్డుకోగల స్థితిలో వున్నప్పటికీ, అన్న కదా, పొరపాటున ఇలా చేస్తున్నాడనీ, నిజం తెలుసకుని విచారపడక పోతాడా అని మౌనం వహించడం వల్ల, నాకు ప్రాణాపద సంభవించింది. వాస్తవానికి ఆయన తన భుజబలంతో దానవుడిని చంపి, నగరానికి వస్తున్న సమయంలో, ఆ విషయం తెలుసుకుని, ఆయనకు ఎదురేగి భక్తితో నమస్కారం చేసినా, నాతో వాలి ఒక్క మంచిమాటైనా అనలేదు. నా క్షేమసమాచారం అడగలేదు. మూతి బిగించుకుని నావంక చూడనైనా లేదు".

సర్గ–10

వాలి తనను దూషించిన వృత్తాంతాన్ని శ్రీరాముడికి చెప్పిన సుగ్రీవుడు

వాలికి, తనకు విరోధం వచ్చిన కారణాన్ని చెప్పడం కొనసాగిస్తూ శ్రీరాముడితో సుగ్రీవుడు ఇంకా ఇలా అన్నాడు. "దురాగ్రహంతో మండిపడుతున్న ఆ కపిరాజు వాలి మీద వున్న గౌరవంతో వున్న విషయాన్ని విన్నవించుకున్నాను. కట్టెలాగా ఆయన పాదాలమీద పడి ఇలా వేడుకున్నాను".

"అన్నా! మహా శౌర్యశాలీ! మా భాగ్యంవల్ల శత్రువైన మాయావిని నువ్వు చంపి వచ్చావు. దిక్కులేనివారికి దిక్కైన నువ్వే ఈ దిక్కులేనివాడికి దిక్కు. చంద్రుడిలాగా ప్రకాశించే తెల్లగొడుగును నీకు నేను పట్టాను. నిర్మలమైన మనస్సుతో అంగీకరించు. ఒక్క సంవత్సరం నేను బిలం ముఖం వద్ద కాచుకుని కూర్చున్నాను. అప్పుడు నెత్తురు ప్రవాహాలు అంతకంతకూ ఎక్కువై పారడం జరిగింది. రాక్షసుల సింహనాదాలు వినపడ్డాయికాని నీ గొంతు వినపడలేదని బాధపడ్డాను. అప్పుడు, నిన్ను చంపిన రాక్షసులు నామీదకు యుద్ధానికి వస్తారేమోనని భయపడి ఒక కొండను బిలద్వారంలో పెట్టి ఏడ్చుకుంటూ, కలవరపడుతూ నగరానికి చేరుకున్నాను. అన్నా! ఇది యదార్థంగా జరిగిన సంగతి. దుఃఖంతో పరితపిస్తున్న నన్ను నేను వద్దంటున్నా బలవంతంగా మంత్రులు రాజ్యాభిషిక్తుడిని చేశారు. దేవా! నన్ను దయచూడు. అన్నా, నువ్వే రాజుగా వుండు. నేను ఎప్పటిలాగా యువరాజుగా వుంటాను. రాజు లేకుంటే రాజ్యం ఆరాచకం అవుతుందని మంత్రులీవిధంగా చేశారు. రాజ్యం, రాజుతనం నేను కోరలేదు. ఇది నిజం. నీరాజ్యాన్ని నువ్వే తీసుకో. అన్నా! నేను నీకు తమ్ముడిని. శత్రువును కాదు. నీ విషయంలో నేను ఎలాంటి ద్రోహం చేయలేదు.

నన్ను క్షమించు. నీ పాదాలమీద పడతాను. చేతులు జోడించి నమస్కారం చేస్తున్నాను".

"అని ఎంతగా వినయంగా నేను వేడుకున్నా ఆయన కోపం వదలలేదు. ధిక్కార స్వరం మారలేదు. ఎన్నో విధాలుగా తిట్టాడు. పురజనులను, మంత్రులందరినీ సభలో చేర్చి నన్ను చూసి వాలి ఇలా అన్నాడు".

"ఒక అర్థరాత్రి, ఒక రాక్షసుడు, యుద్ధానికి నన్ను పిలిస్తే నేను వెంటనే ఇల్లు వదిలి పోయాను. ఈ మోసగాడు కూడా నా వెనకే వచ్చాడు. ఇది మీకు తెలిసిన విషయమే. మమ్మల్ని ఇద్దరినీ చూసి మాయావి భయపడి పరుగెత్తాడు. నేను వాడివెంట పరుగెత్తాను. ఈ పాపచారి నా వెంట వచ్చాడు. ఇలా పరుగెత్తి వాడు అడవిలో భూమిలో వుండే ఒక బిలంలోకి దూరాడు. నేను విరోధం మానకుండా వాడివెంట పోవాలని, ఈ నీచుడితో, నేను రాక్షసుడిని చంపి వచ్చేవరకు ఈ బిలం దగ్గరే వుండమని చెప్పాను. విరోధిని చంపినా తరువాతే ఊళ్లోకి వస్తానని కూడా చెప్పాను. అలా సుగ్రీవుడిని బిలం వాకిట్లో వుంచి నేను ఆలశ్యం చేయకుండా లోపలికి పోయాను. పోయి అక్కడ రాక్షసుడిని వెతికాను. ఒక సంవత్సరం గడిచింది. అప్పుడు వాడు కనబడ్డాడు. వాడిని యుద్ధంలో వాడి బంధువులతో సహా చంపి మళ్లీ మనవూరికి రావాలని ప్రయత్నం చేస్తే, బిలద్వారానికి కొండ అడ్డంగా వుండడం వల్ల దారి కనపడలేదు. నేను గట్టిగా ఎన్నో సార్లు సుగ్రీవా! సుగ్రీవా! అని అరిచాను. వాడి దగ్గర నుండి సమాధానం లేదు. బయటికి రావడానికి దారి తెలియలేదు. నేను వుండమని చెప్పి వచ్చిన సుగ్రీవుడి గొంతు వినపడలేదు. అప్పుడు నేను పడ్డ బాధ ఏమని చెప్పాలి? కడుపులో చేయిపెట్టి కెలికినట్లయింది. ఇలా ఇబ్బందిపడుతూ బిలద్వారంలో వున్న కొండను గాలితో తన్ని-తన్ని పడగొట్టి ఎంతో కష్టం మీద బయటపడ్డాను. రాజ్యలక్ష్మి కొరకు వీడెంత పాపం చేశాడో చూశారా? వాడికి అన్నని కదా? ఇలా ప్రవర్తించవచ్చా? అని ఆలోచించలేదు. ఈ నీచుడు ఎంత చెడ్డ పని చేశాడో చూశారా?వీడిని మన్నించవచ్చా?"

"ఇలా అంటూ నన్ను వూరు వెడలగొట్టాడు. నా భార్యను గ్రహించాడు. అంతటితో ఆగకుండా నన్ను చంపడానికి రావడంతో ప్రాణ భయంతో అనేక దేశాల్లో తిరిగి చివరకు ఈ గుట్టకు అతడు రాలేకపోవడానికి కారణం వుండడం వల్ల ఇక్కడ స్థానం ఏర్పాటు చేసుకున్నాను. బుద్ధిపూర్వకంగా నేను ఏ అపకారం చేయలేదు. అలా అయినప్పటికీ పడరాని కష్టాలను పడుతున్నాను. నా మీద

దయచూపించి సర్వభూతరక్షకుడవైన నువ్వు ఈ దీనుడిని, దరిద్రుడిని రక్షించు. దీనరక్షకుడని కీర్తిని సంపాదించు".

(సుగ్రీవుడు జరిగినదంతా సత్యంగానే చెప్పాడు కాని, తాను రాజుగా వున్న సమయంలో అన్న భార్య తారను గ్రహించిన సంగతి చెప్పలేదు. ఈ కలహంలో మొదలు సుగ్రీవుడు మీద అనుమానం రావడం సహజమే. కాని సుగ్రీవుడు బుద్ధిపూర్వకంగా చేయాలని పొరపాటు చేయలేదు. వాస్తవంగా రాజ్యకాంక్ష వల్ల వాలికి ద్రోహం చేసినట్లయితే అతడు కిష్కింధకు వచ్చినప్పుడు తన బలంతో వాలిని నిగ్రహించగలిగేవాడే! వాలిసుగ్రీవులు ఇద్దరూ ఇంచుమించు సమానమైన బలవంతులే. వాలిదగ్గర ఇంద్రదత్తహారం వుండడం వల్ల ఎక్కువ బలశాలి అయ్యాడు. హనుమంతుడు, నీలుడు లాంటివారు సుగ్రీవుడి సహాయకులు. సుగ్రీవుడు వాలితో యుద్ధానికి పూనుకుంటే ఒక్క హనుమంతుడే వాలిని మట్టుబెట్టగలడు. కాబట్టి సుగ్రీవుడిలో ద్రోహబుద్ధి లేదు. సుగ్రీవుడి విషయంలో వాలి అనుమానపడ్డాడు. బిలద్వారం మూయడం, రాజ్యాభిషిక్తుడు కావడం ద్రోహబుద్ధితో చేశాడని నమ్మాడు. తాను జీవించి వుండగా తన భార్య తారను గ్రహించాడని కోపం వచ్చి వుండవచ్చు. అందుకే ఆ తరువాత సుగ్రీవుడి భార్యను వాలి గ్రహించాడు. అయితే సోదరుడు మరణిస్తేనే ఆయన భార్యను స్వీకరించవచ్చని ఒక మర్యాద ఆ జాతుల్లో వుంది. వాస్తవానికి వాలి మరణించాడని నమ్మి ఆయన భార్యను సుగ్రీవుడు గ్రహించాడు. కాని, సుగ్రీవుడు జీవించి ఉన్నాడని తెల్సికూడా వాలి అతడి భార్యను గ్రహించాడు. ఈ కులమర్యాదను రామచంద్రుడు కూడాఆదరించాడు. ఎందుకంటేవాలి మరణం తరువాత సుగ్రీవుడు తారను గ్రహించాడని తెలిసీ ఆయన ఏం అనలేదు. వాలి కుల మర్యాదను, శాస్త్ర మర్యాదను ఉల్లంఘించడం వల్లే శిక్షార్హుడయ్యాడు).

సుగ్రీవుడు ఇలా చెప్పడంతో రామచంద్రమూర్తి అతడితో, "మిత్రమా! బాధపడవద్దు. నా బాణాలతో నీ పగ తీరుస్తాను. ఆ పాపాత్ముడెంతవరకు నాకంట పడడో అప్పటివరకే సుఖంగా వుంటాడు. కపీశ్వరా నా దుఃఖంలాంటిదే నీ దుఃఖం. దాన్ని ఉపశమించేట్లు చేస్తా. సంతోషించు".

సర్గ-11
వాలి బలపరాక్రమాలను శ్రీరాముడికి తెలిపిన సుగ్రీవుడు

తన దుఃఖం ఉపశమించేట్లు చేస్తానని శ్రీరాముడు చెప్పిన మాటలకు సంతోషించిన సుగ్రీవుడు రామచంద్రమూర్తితో ఇలా అన్నాడు. "అసమాన కీర్తీ! నువ్వు కోపంతో బాణాలను వదిలితే, అవి లయకాలంలోని సూర్యకిరణాల లాగా, లోకాలన్నిటినీ అల్పకాలంలో కాల్చి బూడిద చేస్తాయి. అయినప్పటికీ, వాలి ధైర్యం, ఆయన అద్భుత పరాక్రమం గురించి చెప్తాను. ఏకాగ్రచిత్తంతో విను. విన్నతరువాత ఎలాంటి ఉపాయం చేయాల్నో ఆలోచించి అలాగే చేయి. వాడు పెద్ద-పెద్ద కొండలను పైకి ఎత్తి చిన్నపిల్లలు గోలీలు ఆడినట్లు ఆడుతాడు. ప్రతిరోజూ సూర్యోదయం కాకముందే సంధ్యావార్చడానికి తూర్పు సముద్రంలో స్నానం చేసి, దక్షిణ సముద్రంలో ఆచమనం చేసి, పడమటి సముద్రంలో అర్ఘ్యం ఇచ్చి, మరో సముద్రంలో జపం చేసి, సూర్యోపస్థానం చేస్తాడు. ఇలా వాలి ప్రతిరోజూ నాలుగు సముద్రాలలో సంధ్యవారుస్తాడు. ఇంత తిరిగి వచ్చినా కొంచెమైనా అలసట వుండదు వాలికి. తన బలాన్ని ప్రదర్శించడానికి అడవిలోని పెద్ద-పెద్ద చెట్లను చేతిదెబ్బతో విరగ్గొట్టుతాడు. నిర్మలచిత్తా! అతడి బలం వర్ణించడం కష్టం".

దుందుభి వృత్తాంతాన్ని శ్రీరాముడికి చెప్పిన సుగ్రీవుడు

"వెండికొండ శిఖరంలాంటి తేజస్సుకల దుందుభి అనే మహిషస్వరూపంకల ఒక రాక్షసుడు, వరబలంతో వేయి ఏనుగుల బలం కలవాడై, సముద్రుడిని చూసి, తనతో యుద్ధానికి రమ్మని పిలిచాడు. వీడికి చేటుకాలం సమీపించినదని తలచిన సముద్రుడు, అతడితో యుద్ధం చేయడానికి తాను సరిజోడీకాదని, ఈశ్వరుడి మామ, కొండలరాజు, తపస్సు చేసేవారికి ఆశ్రయం ఇచ్చేవాడు,

అనేకమైన గుహలతో ప్రకాశించేవాడైన హిమవంతుడు దానికి సరిపోతాడని చెప్పాడు. సముద్రుడిని భయపడ్డాడని తలచాడుదుందుభి. యుద్ధాసక్తుడైన దుందుభి హిమవంతుడి మీదకు పోయాడు. ఇలా పోయి, తన కొమ్ముల బలంతో పెద్ద-పెద్ద బండలను నేలమీద పడవేయసాగాడు. అప్పుడు హిమవంతుడు తెల్లటి రూపంతో శిఖరం మీదనుండి వాడితో ఇలా అన్నాడు".

"రాక్షస శ్రేష్టుడా! నన్నెందుకు బాధపెట్టుతున్నావు? నువ్వేమో ధర్మాత్ముడివే? నేను మునులకు ఆశ్రయమిచ్చేవాడిని. నువ్విలా చేస్తే వాళ్లకు హాని చేసినట్లేకదా?". హిమవంతుడి మాటలకు జవాబుగా దుందుభి, "నువ్వు భయపడితే, నాతో యుద్ధం చేయగలవాడి పేరు చెప్పు" అని అంటాడు. హిమవంతుడు "మహాధైర్యవంతుడు, బలవంతుడు, ఇంద్రుడితో సమానమైనవాడు, చాలా బుద్ధిమంతుడు, వాలి అనే వానరుడు కిష్కింధలో వున్నాడు. అతడు నీతో సంతోషంగా ద్వంద్వ యుద్ధం చేస్తాడు. యుద్ధం చేయాలని నీకు కోరిక వుంటే అతడిమీదకు యుద్ధానికి పో. అతడు వెంటనే నిన్ను చక్కగా చేస్తాడు. నముచికి యుద్ధ బిక్ష ఇంద్రుడు ఇచ్చినట్లు, నీకు వాలి ఇస్తాడు" అని వాలి దగ్గరకు పొమ్మంటాడు దుందుభిని.

వాలిమీదకు యుద్ధానికి పోయిన దుందుభి

"పాపాత్ముడైన దుందుభి రాక్షసుడు రోషంగా, గర్వంగా, కళ్ళు మూసుకుపోగా, కాళ్ళ తొక్కిడితో భూమి వణకుతుంటే, కిష్కింధకు పోయి, మహిష స్వరూపం ధరించి, వాడి కొమ్ములతో ఏనుగులాగా చెట్లను, నగరం బైటున్న తలుపులను చీల్చాడు. విచ్చలవిడిగా ఆ రాక్షసుడు చెవులు దద్దరిల్లేట్లు నగారాలాగా మధ్య-మధ్యన పెద్ద ధ్వని చేశాడు. అంతఃపురంలో వున్న వాలి ఈ చప్పుడు విని స్త్రీలతో సహా బయటకు వచ్చి ఆ రాక్షసుడితో, ఆతడు దుందుభి అని తనకు తెలుసనీ, దనుజ శ్రేష్టుడైన ఆతడు ఎందుకు ఈ విధంగా బుద్ధిలేకుండా తన పట్టణం వాకిట్లో ధ్వని చేస్తున్నాడనీ, అతడికి ఉపిరితో జీవించి వుండాలన్న ఆశ లేదా అనీ, వుంటే మరెక్కడికైనా పొమ్మనీ అంటాడు".

జవాబుగా దుందుభి, "వాలీ, ఆడవారి ఎదురుగా పౌరుషపు బింకాలు పలకగానే వచ్చిన లాభం ఏంటి? నువ్వు పరాక్రమంకలవాడివైతే, యుద్ధానికి రా. నీ భుజబలం ఎలాంటిదో అప్పుడు తెలుస్తుంది. అలా కాకపోతే ఉదయం దాకా వేచి వుంటాను. నీ ఇష్ట భార్యలతో అప్పటిదాకా సుఖపడు. నువ్వు ఇంటికి

పో. పరలోకంలో నీకు సుఖం కలగడానికి చేయాల్సిన దానాలు చేయి. నీకు ప్రియమైన వారినందరినీ కౌగలించుకో. నీ స్త్రీలతో భోగించు. పట్నమంతా ఒక్కసారి కడసారిగా కలియచూడు. నీతో సమానమైన వాడిని రాజ్యానికి పట్టాభిషిక్తుడిని చేయి. ఆ తరువాత రా యుద్ధానికి. నీ పొగరు అణచి వేస్తాను. మత్తు పదార్థాలు తినడం వల్ల, తాగడం వల్ల, శరీరం తెలియని వాడిని, ప్రమాదంలో వున్నవాడిని, నిద్రించేవాడిని, ఆయుధాలు లేనివాడిని, నీలాగా కామంతో వొళ్ళు తెలియనివాడిని చంపితే భ్రూణహత్యాదోషం వస్తుంది" అంటాడు.

"దుందుభి చెప్పిన మాటలు విన్న వాలి, చిరునవ్వు నవ్వి, తన భార్య తారను, ఇతర స్త్రీలను ఇళ్లకు పొమ్మని, రాక్షసుడిని చూసి, "అసుర శ్రేష్టుడా! నువ్వు పిరికివాడివి కాకపోతే నన్ను మట్టుడిగా అనుకోవద్దు. నేను తాగింది వీరపాణం అనుకో. చూడు..కాచుకో" అని చెప్పి, తనతండ్రి ఇచ్చిన బంగారు దండను మెడలో ధరించి త్వరగా పోయి రాక్షసుడైన దుందుభిని తాకాడు. ఇలా తాకి, వాడిమీద పడి గట్టిగా అదిమి, పౌరుషంగా వాడి కొమ్ములు పట్టుకుని రివ్వు-రివ్వున వాడిని తిప్పి-తిప్పి, వాడు బలహీనుడై పోగా, నేలమీద కొట్టాడు. నేలమీద పడ్డ వాడు చెవులనుండి నెత్తురు కారుతుంటే, ధీరుడై లేచాడు. మోకాళ్ళతో, మోచేతులతో, చెట్లతో, పెద్ద రాళ్లతో వాలి మహిషాసురుడిని వలంగా కొట్టినా దుందుభి భయపడకుండా వాలిని ఎదుర్కున్నాడు. ఒకరినొకరు గెలవాలని యుద్ధం చేశారు. క్రమక్రమంగా, అంతకంతకు వాలి బలం పెరిగింది. రామచంద్రా! దుందుభి బలం తగ్గింది. దీనికి కారణం వాలి ధరించిన బంగారు దండ. అది శత్రువు దేహాన్ని తాకినప్పుడల్లా వాడి బలం లాగి వాలి దేహంలో ప్రవేశపెట్టుతుంది. అదే దండలోని మంత్రబలం".

వాలిని శపించిన మతంగుడు

"మహిషాసురుడు బలహీనుడయ్యాడని అర్థం చేసుకున్న వాలి వాడిని పిడికిటి పోటులతో చంపి, వాడి కళేబరాన్ని చేతులతో పైకెత్తి, ఆమడ దూరంలో పడేట్లు విసిరి వేశాడు. అప్పుడారాక్షసుడి నోటినుండి కారుతున్న నెత్తురు గాలికి కొట్టుకుని వచ్చి మతంగాశ్రమంలో పడింది. అది చూసి మునీశ్వరుడు బాగా కోపం తెచ్చుకున్నాడు. 'దుష్టబుద్ధి, పాపి, బుద్ధిలేనివాడు, జ్ఞానహీనుడు, ఎవడిలా నామీద నెత్తురు పడేశాడు?' అని ఆశ్రమం బయటకి వచ్చి చూస్తే, ప్రాణం పోయి కొండలాగా పడివున్న రాక్షసుడిని చూశాడు. మహిషాసురుడిని

చూసి ఎవరీ పని చేశాడని ఆలోచించి, తన తపశ్శక్తితో బలోన్మత్తుడైన వాలి చేసిన పని ఇది అను గ్రహించాడు. వాలిమీద కోపం తెచ్చుకున్నాడు ముని. దుష్టబుద్ధితో రాక్షసుడి దేహాన్ని తన బలంతో ఇక్కడి ఆశ్రమంలో వేసి, ఇక్కడి చెట్లను విరిచి, భూమ్మీద నెత్తురు, మాంసం పడవేసిన అడవిని అసహ్యంగా చేసిన దుష్టుడు ఇక్కడికి వస్తే చచ్చిపోతాడు అని శపించాడు. ఆ ఆశ్రమ ప్రదేశం ఒక ఆమడ విస్తీర్ణం కలది. దానిలోపలికి వాలి వస్తే చచ్చిపోతాడు. అక్కడున్న వాలి పక్షాన వున్న కోతులను సూర్యోదయం లోపల ఆ ప్రదేశాన్ని వదిలి వెళ్లాలని, వెళ్లకపోతే అందరూ శిలలుగా వేల సంవత్సరాలు వుండిపోతారని కూడా శపించాడు".

"ఇలా మునీశ్వరుడు శపించడంతో అక్కడున్న కోతులు భయపడి వాలి దగ్గరకు పరుగెత్తిపోయారు. వాళ్లను చూసి వాలి ఎందుకిలా వచ్చారని అడిగాడు. వాళ్లు ముని శాపం గురించి వాలికి చెప్పారు. ఆ విషయాన్ని తెలుసుకున్న వాలి మునీశ్వరుడి దగ్గరకు పోయి, నమస్కారం చేసి, 'దయాశాలీ నన్ను క్షమించు' అని ఎన్ని విధాల వేడుకున్నా ఆయన కోపం వదలలేదు. అప్పటి నుండి వాలి ఇక్కడికి రాడు. దీని పక్క కన్నెత్తి కూడా చూడడు. వాలి ఇక్కడికి రాకూడదన్న విషయం నాకు తెలిసినందువల్ల భయం లేకుండా ఇక్కడ తిరుగుతున్నాను. అదిగో అదే ఆ రాక్షసుడి ఎముకల గూడు. నేలపడి వుంది చూడు.రామచంద్రా! వాలి భుజబలం ఎలాంటిదో నీకు చెప్పాను. అలాంటి మహాబలశాలి వాలిని నువ్వెలా చంపుతావో చెప్పు" అని అంటాడు సుగ్రీవుడు.

వాలి లాంటి అల్పుడిని రామచంద్రమూర్తి ఎలా చంపగలడో అని అనుమానిస్తున్నాడే, ఇదేమి మూఢత్వం అని లక్ష్మణుడు చిరునవ్వు నవ్వి ఇలా అన్నాడు సుగ్రీవుడితో. "కీర్తిమంతుడా! రామచంద్రమూర్తి ఏం చేస్తే వాలిని చంపగలడని నువ్వు నమ్ముతావు?" అని అడిగాడు. అక్కడున్న మద్ది చెట్లలో ఒకదానిని రామచంద్రమూర్తి ఖండిస్తే తాను నమ్ముతానని అంటాడు సుగ్రీవుడు. అలాగే కొండలాగా పడివున్న రాక్షసుడి ఎముకల గూడును బెండులాగా రెండువందల ధనువుల (నాలుగు మూరలు) దూరం చిమ్మితే వాలిని రామచంద్రమూర్తి చంపగలడని నమ్ముతానంటాడు సుగ్రీవుడు. ఇలా అంటూనే, వాలి బలపరాక్రమాలను గురించి వివరంగా చెప్పాడు. అవన్నీ విన్న రాముడు తనలో తానే నవ్వుకుని, తన బలాన్ని ఆయన నమ్మేట్లు ప్రదర్శిస్తానని సుగ్రీవుడితో అన్నాడు.

దుందుభి కళేబరాన్ని చిమ్మిన శ్రీరాముడు

సుగ్రీవుడికి సమాధానం చెప్పిన శ్రీరాముడు, దుందుభి శరీరాన్ని దూదిలాగా తన వేలితో అవలీలగా ఎత్తి పది యోజనాల అవతల పడేట్లు చిమ్మాడు. అది చూసి సుగ్రీవుడు "రామచంద్రా! ఇది పూర్వం వాలి చిమ్మినప్పుడు పచ్చిది. నెత్తురు, మాంసం కలది. కొత్తది. అదీ కాకుండా వాలి ఎంతో శ్రమపడ్డాడు. దేహం తెలియక వున్నవాడు. ఇప్పుడు దీనిలో ఎముకలు మాత్రమే మిగిలాయి. నువ్వేమీ కష్టపడలేదు. కాబట్టి నువ్వు వాలికంటే బలవంతుడివన్న విషయంలో సందేహం పోలేదు. అప్పుడు పచ్చిది, ఇప్పుడు ఎండిపోయింది కాబట్టి మీ ఇద్దరిలో ఎవరు బలవంతులో చెప్పలేకపోతున్నాను. నిజం చెప్తున్నాను. నువ్వు విల్లు ఎక్కుబెట్టి బాణం సంధించి, భుజబలంతో ఒక్క మద్ది చెట్టును పడగొట్టితే వాలికంటే నువ్వే బలవంతుడివి అని నమ్ముతాను. నిన్ను నమ్మి వాలిమీదకు యుద్ధానికి పోవడానికి భయం లేకుండా వుండడానికి, నమ్మకం కుదరడానికి అడుగుతున్నాను. నేను అడిగినట్లు చేస్తే, తేజస్సులో రవి, పర్వతాలలో హిమవంతుడు, నాలుగు కాళ్ల జంతువులలో సింహంలాగా రామచంద్రా! మనుష్యులలో నిన్ను మించినవాడు లేడు అని నమ్ముతాను" అంటాడు.

సర్గ–12
సాలసప్తకాన్ని భేదించిన శ్రీరామచంద్రుడు

సుగ్రీవుడు ఈ విధంగా చెప్పగా రామచంద్రమూర్తి ఆయనకు నమ్మకం కలిగేట్లు చేయడానికి, తన విల్లు చేతబట్టుకుని, బంగారు పిడి కల బాణాన్ని సంధించి, అల్లెతాటి మోత, బాణం రెక్కల ధ్వని దిక్కులన్నీ వ్యాపిస్తుంటే, మద్దిచెట్టును గురిచూసి కొట్టాడు. రామచంద్రమూర్తి వేసిన బాణం త్వరగా పోయి, ఆ ఏడు చెట్లను త్వరగా నరికి, కొండబద్దలయ్యేలా భేదించి, భూమిలో దూరి, మళ్లీ త్వరగా బయటకు వచ్చి ఆయన అంబులపొదిలో చేరింది. ఏడుచెట్లు భయంకరమైన ఆ బాణానికి వాటి దార్ఢ్యం చెడిపోయి, చూసేవారికి బయం కలిగేట్లు దభాలున కూలడం చూసిన సుగ్రీవుడు ఆ బాణవేగానికి ఆశ్చర్యపడ్డాడు. తన మెడలోని ముత్యాలహారాలు నేలకు తగిలేట్లుగా సుగ్రీవుడు నేలమీదవాలి, రామచంద్రమూర్తికి మొక్కి, పరమప్రీతిగా మళ్లీ లేచి భగవన్నమస్కారం చేశాడు. తన రెండు చేతులు జోడించి, రామచంద్రమూర్తిని ప్రార్థిస్తూ ఇలా అన్నాడు.

“నీ బాణాలతో ఇంద్రుడితో కలిపి దేవతలందరినీ, రాక్షస సమూహాలనూ ఏక కాలంలో చంపగలవు. ఇక యుద్ధంలో వాలి–గీలి నీకొక లెక్కా? వరుణ–ఇంద్రులతో సమానుడివి. మిత్రప్రీతికల నిన్ను చూడగానే నా దుఃఖం సమసిపోయింది. ఆర్త శరణ్యా! ఏడు మద్దిచెట్లను పాతాళానికి ఒకే ఒక్క బాణంతో భేదించిన నీకు యుద్ధంలో ఎదురెవరు? మహాత్మా! నా దుఃఖం పారదోలు. దయలేనివాడైన నా విరోధి, అన్న వాలిని చంపు”.

దీనుడై ప్రార్థిస్తున్న సుగ్రీవుడిని రామచంద్రమూర్తి ప్రేమతో కౌగలించుకుని కిష్కింధకు పోదాం అని అంటాడు.

తొలిసారి వాలిమీదకు యుద్ధానికి పోయిన సుగ్రీవుడు

సుగ్రీవుడితో రాముడు, "కిష్కింధకు పోదాం పద. ఇక ఉపేక్ష చేయవద్దు. త్వరగా నువ్వు ముందు పోయి, నీ సోదరుడిని సంతోషంగా యుద్ధానికి పిలువు. భయపడవద్దు" అని అంటాడు. ఇలా చెప్పి, రామలక్ష్మణులు కోతిమూకతో కలిసి శీఘ్రంగా కదిలి, చెట్లచాటున దాక్కున్నారు. సుగ్రీవుడు ముందుగా పోయి దిక్కులు పిక్కటిల్లేట్లు సింహనాదం చేసి వాలిని యుద్ధానికి పిలిచాడు. ఆ ధ్వని విన్న వాలి మండిపడుతూ యుద్ధానికి వచ్చాడు. వారిరువిరికీ ఆకాశంలోని బుధ, అంగారక గ్రహాలకు లాగా ఘోరమైన ద్వంద్వయుద్ధం జరిగింది. పిడుగులతో సమానమైన పిడికిళ్ళతో, అరచేతులతో, భయంకరంగా విడవకుండా యుద్ధం చేశారు ఇద్దరూ. పిడిగుద్దుల యుద్ధం అలా పెరుగుతుంటే, రామచంద్రమూర్తి చేత్తో విల్లు పట్టుకుని, ఎక్కుపెట్టి, గురిచూసి వేద్దామనుకున్నాడు కాని....అశ్వినీ దేవతల్లాగా, తేజంలో, శౌర్యంలో, ఆకారంలో సమానంగా ఒకేవిధంగా వున్న వారిద్దరినీ చూసి ఎవరు సుగ్రీవుడో, ఎవరు వాలో పోల్చుకోలేక ఆగిపోయాడు. పైగా వాలి తన బంగారు మాలిక ధరించి రానందున పోల్చుకోవడం రాముడికి కష్టమైంది. ప్రాణం తీద్దామనుకున్న బాణాన్ని సందేహంతో రామచంద్రమూర్తి విడవలేదు. ఇంతలో వాలి దెబ్బలకు బాధపడి, వాలి వెంటపడి తరుముతుంటే ఋష్యమూకానికి పరుగెత్తి పోయాడు సుగ్రీవుడు. అది గమనించి వాలి, "ఛీ! బతికావు పో" అని అనుకుంటూ మళ్లీ కిష్కింధకు పోయాడు. దాగివున్న రామలక్ష్మణులు అక్కడనుండి కదిలారు.

వాలిని చంపనందుకు రాముడిని నిష్టూరాలు ఆడిన సుగ్రీవుడు

హనుమంతుడు తోడురాగా, రాముడు లక్ష్మణుడితో సహా సుగ్రీవుడున్న స్థలానికి పోయి అతడి ఎదుట నిలుచున్నారు. వాళ్లను చూసి సుగ్రీవుడు సిగ్గుతో తలవంచుకుని ఇలా అన్నాడు. "నీ పరాక్రమాన్ని నేను నమ్మేట్లు చేసి చూపించి, నన్ను యుద్ధానికి పొమ్మని ప్రేరేపించి, శత్రువు చేతిలో నన్నిలా చంపేట్లు చేయడానికి కారణం ఏమిటి? నా శత్రువు చేతిలో నన్ను చంపించడంవల్ల నీకు కలిగే లాభం ఏంటి రామచంద్రా? బలవంతుడా! మహాబుద్ధిమంతుడా! వాలిని చంపమని నిన్ను నేను కోరినప్పుడు చంపనని ముందే చెప్పవచ్చుకదా? నువ్వు అలా చెప్తే నేను ఎప్పటిలాగా హాయిగా ఇక్కడే పడి వుండేవాడిని కదా? నన్నెందుకు యుద్ధానికి పంపావు? నన్ను చావుదెబ్బల పాలుచేయడానికా?"

తాను వాలిని చంపకపోవడానికి కారణం చెప్పిన శ్రీరాముడు

ఇలా కన్నీరు మున్నీరుగా కారుస్తున్న, ఏడుస్తున్న సుగ్రీవుడిని చూసి రామభద్రుడు, "నాయనా! ఎందుకు నామీద కోప్పడతావు? నా దివ్యబాణాన్ని విడవకపోవడానికి కారణం చెప్తా విను. రూపంలో, వయస్సులో, ఎత్తులో, చూడడానికి, వేషంలో, నడకలో, కాంతిలో, మాటల్లో, కంఠస్వరంలో, ధైర్యంలో, మీరిద్దరూ సమానంగా వున్నారు. ఈ కారణాన మీలో వాలి ఎవరో, సుగ్రీవుడు ఎవరో నేను గుర్తుపట్టలేక ప్రాణం తీసే బాణాన్ని వదలలేదు. ఇది ముమ్మాటికీ నిజం. స్నేహితుడా! నా చేతినుండి విడువబడ్డ బాణం ఎప్పటికీ వ్యర్థం కాదు. ఉరికే విడుస్తే అది నీకు తగిలితే మూలనాశనం అవుతుంది కదా? అందుకే నేనప్పుడు బాణం విడువలేదు. నా బాణం నిన్ను చంపితే, నా బుద్ధిలేనితనం, పిల్లతనం, శాశ్వతంగా నికిచి వుండేది కదా? కార్యభంగమే కాకుండా శాశ్వతమైన అపకీర్తి వచ్చేది. మిత్రరత్నమా! అభయమిచ్చిన నేనే నిన్ను చంపితే నా పాపానికి అంతం ఏది? దానికి ప్రాయశ్చిత్తం లేదు. దీన్ని నువ్వు ఆలోచించు. నేను వాలితో కలిసి నిన్ను చంపించాలని అనుకున్నావేమో? ఈ మహారణ్యంలో నేను, లక్ష్మణుడు, సీత నీకు వశపడి వున్నాం. మా క్షేమం నీ చేతిలో వుంది. కాబట్టి నీకు నేను ద్రోహం చేయను. సమాధానపడు. సుగ్రీవా! నా మాట నమ్ము. సందేహించవద్దు. మళ్లీ వాలి మీదకు యుద్ధానికి పో. నాకు తెలిసేవిధంగా నువ్వేదైనా గుర్తు ధరించు. ఆ ఆమాత్రం నువ్వు చేస్తే, నా బాణం దెబ్బకు వాలి కిందపడి చస్తాడు" అని చెప్పి లక్ష్మణుడితో ఇలా అంటాడు.

"లక్ష్మణా! గజపుష్పమాల తీగె పుష్కలంగా వుంది. అది స్పష్టంగా తెలిసేట్లు తెచ్చి ఇప్పుడే సుగ్రీవుడి మెడలో వేయి". అని రామచంద్రమూర్తి చెప్పగానే లక్ష్మణుడు దాన్ని తెచ్చి సుగ్రీవుడి మెడలో వేశాడు. అప్పుడు సుగ్రీవుడు గొప్ప నక్షత్రాలతో కూడిన సూర్యుడిలాగా విపరీతంగా వెలిగాడు. రాముడి మాటలకు ధైర్యం తెచ్చుకుని ఆయనతో కలిసి కిష్కింధకు పోయాడు సుగ్రీవుడు.

సర్గ–13
సుగ్రీవాదులతో కలిసి కిష్కింధకు పోయిన శ్రీరాముడు

ముందు లక్ష్మణుడు, వెనుక వల, నీల, తార, హనుమంతుడు రాగా రామచంద్రుడు బంగారు రేకులతో అలంకరించిన పెద్ద విల్లును, సూర్యకాంతికల బాణాలను చేతిలో ధరించి బయల్దేరాడు. మార్గమధ్యంలో పూల బరువుతో వంగిన చెట్లను, తేటనీటి నదులను, వ్యాకులపడే వృక్షాలను, వాటంగా వున్న పర్వత ప్రదేశాలను, కాంతివంతమైన కొలకులను, కన్నెలేళ్ళను, హంసలను, బెగ్గురులను, వంచలాలను, నీటికోళ్ళను, చక్రవాకాలను, విశేషంగా ధ్వనించే మదుగులను, లేతపచ్చిక మేస్తూ విహరించే జింకలను, కారుమబ్బుల్లా వున్న తటాకాలను, ఒంటరిగా తిరుగుతున్న ఏనుగులను చూసుకుంటూ, వేగంగా అడుగులు వేసుకుంటూ పోతూ, శ్రీరాముడు చెట్లగుంపులుగా వున్న ఒక వనాన్ని చూసి సుగ్రీవుడితో ఇలా అన్నాడు.

"ఆకాశంలో వాన మబ్బులాగా, చాలా నల్లగా, నాలుగు పక్కలా వ్యాపించి, సుందరమైన అరటిచెట్లు రాసులు–రాసుల్లాగా వుండి, మిక్కిలి సంతోషం కలిగిస్తున్న ఈ వనం విషయం చెప్పు". జవాబుగా, నడక సాగిస్తూనే, సుగ్రీవుడు చెప్పాడిలా రాముడికి ఆతోట కథను.

"సప్తజనులనే పేరుకల ఋషీశ్వరులు ఏడుగురు నేలమీద తలమోపి ఇక్కడ తపస్సు చేస్తూ, ఏడు రోజులకు ఒకసారి గాలిని మాత్రమే ఆహారంగా తీసుకుంటూ, నీళ్లలో వుంటూ, ఏడువందల సంవత్సరాలు మహానిష్ఠగా ఘోరతపస్సు చేసి, దేహంతో స్వర్గానికి పోయారు. వాళ్ల తపోమహిమవల్ల ప్రాకారంలాగా చుట్టబడిన చెట్లున్న ఈ వనాన్ని దేవతలుకానీ, రాక్షసులుకానీ,

చూడడానికైనా భయపడ్తారు. ఈ వనంలోకి పక్షులు, అడవి మృగాలూ ప్రవేశించలేవు. ఒక వేళ ప్రవేశిస్తే కలవరపాటుతో ఇక్కడ ఎన్నేళ్ళైనా తిరగాల్సిందే కాని, బయటకు పోలేవు. ఇక్కడ ఆభరణధ్వనులు, సంతోషకరమైన గీతాలు, వాద్యాల–తూర్యాలధ్వనులు, వారిసల్లాపాలు వినపడ్తాయి. దేవతాసంబంధమైన పరిమళ వాయువు వీస్తుంది. అక్కడ చూడు....త్రేతాగ్నులు వెలుగుతున్నాయి. గాలి వల్ల ఎగురుతున్న పొగ గుంపు చెట్లకొమ్మల మీద ఎర్రటి కాంతితో మెరుస్తున్నది. పొగతో కప్పబడిన పైభాగాలతో ఈ అడవిలోని వృక్షాలన్నీ మేఘాల కాంతితో కప్పబడిన వైడూర్య పర్వతాల్లాగా వున్నాయి. రామచంద్రా! నువ్వు తమ్ముడితో సహా మునీశ్వరులకు నమస్కారం చేయి. ఈ మునులకు మొక్కినవారికి వ్యాధులు అంటవు".

సుగ్రీవుడిలా చెప్పగా రామచంద్రమూర్తి లక్ష్మణుడితో కలిసి నమస్కారం చేసి, త్వరగా ఆ పరదేశాన్ని దాటిపోయాడు. ఆ తరువాత వాలిని సంహరించాలన్న ఆసక్తితో వున్న శ్రీరాముడు వాలి పాలించే కిష్కింధను చూశాడు. ఈ విధంగా అందరూ వాలి పాలించే నగరానికి సమీపంలో దట్టమైన అరణ్య ప్రదేశంలో చెట్ల గుంపులున్న ఒక మరుగైన స్థలంలో నిలబడ్డారు.

సర్గ-14

సుగ్రీవుడి భయం పోవడానికి ఉత్సాహపు మాటలు చెప్పిన శ్రీరాముడు

సుగ్రీవుడు అమితమైన రోషంతో తన మెడ ఎత్తి, నలుదిక్కులా చూసి, గాలి–వాన వచ్చినప్పుడు మేఘాలు ఎలా గర్జిస్తాయో అలా సింహనాదం చేశాడు. ఆ తరువాత కార్యసాధనలో అత్యంత సమర్థుడైన రామచంద్రమూర్తికి వానరుల వలతో చుట్టబడి, యంత్రాలతో రక్షించబడుతున్న కిష్కింధా నగరాన్ని చూపిస్తూ, అక్కడికి చేరుకున్నామని అంటాడు. రామచంద్రమూర్తి తనకు చెప్పిన మాట సఫలం చేయడానికి తిగిన సమయం వచ్చిందని కూడా చెప్పాడు.

సుగ్రీవుడి మాటలకు జవాబుగా రామచంద్రమూర్తి, "సుగ్రీవా! నీ మెడలో లక్ష్మణుడు వేసిన గజపుష్ప మాలికతో నువ్వు నక్షత్రాలతో చుట్టబడిన నిండు చంద్రుడిలాగా ప్రకాశిస్తున్నావు. పగలు చుక్కలతో కూడిన సూర్యుడు ఎలా రాష్ట్ర ప్రభువును వధిస్తాడో అలాగే నువ్వు కూడా పుష్పమాలికతో వెలుగుతూ వాలిని చంపుతావు. భయపడవద్దు. వాలివల్ల నీకు కలిగిన భయాన్ని ఒక్క బాణంతో తొలగిస్తాను. నిన్ను, తన సోదరుడిని బాధించే వాలిని నాకు కనబడేట్లు చేయి చాలు. అంతటితో వాలి చచ్చాడని నమ్ము. ఈ మాటలతో ప్రయోజనం లేదు. వాలి మళ్లీ నాకు కనబడి, జీవిస్తే, అప్పుడు నన్ను నిందించు. అప్పటిదాకా నువ్వు నన్ను నిందించడం ధర్మం కాదు. ఇంతకు ముందు ఏడు మద్దిచెట్లను ఒకేఒక్క బాణంతో నేలకూల్చడం నీ కళ్లారా చూశావుకదా? వాలి కూడా ఇప్పుడు అలాగే చంపబడుతాడు. నన్ను నమ్ము. నాకు ఎన్ని ఆపదలొచ్చినా ఉత్తమ ధర్మాన్ని విడవడానికి నామనసు అంగీకరించదు. కాబట్టి, ఇంతకు ముందు నేను అసత్యం ఆడనూలేదు....ఇక ముందు ఆడేదీ లేదు. ఇది నిజం. నీకు భయంవల్ల కలిగిన తొట్రుపాటును వదిలిపెట్టు. నా ప్రతిజ్ఞ నేను నెరవేరుస్తాను. నీ మనసులోని

భయం, అనుమానం వదిలిపెట్టు. ఎలాంటి సింహనాదం నువ్వు చేస్తే, కోపంతో మండిపడుతూ, వాలి యుద్ధానికి వస్తాడో, అలాంటి సింహనాదం చేయి" అని అంటాడు.

వాలిని యుద్ధానికి పిలవడానికి సింహనాదం చేసిన సుగ్రీవుడు

ఇలా రామచంద్రమూర్తి స్పష్టంగా తనకు చెప్పిన మాటలు విన్న సుగ్రీవుడు, ఉరుములాగా గర్జిస్తూ, తన కంఠధ్వనిని దిక్కులు పిక్కలిల్లేట్లు చేశాడు. గుండెలు పగిలేలా సుగ్రీవుడు చేసిన సింహనాదాన్ని, ఆయన కఠోరమైన కంఠధ్వనిని విన్న ఆవులు, వానరులు దిక్కుతోచక పరుగెత్తాయి. మృగాలూ పరుగెత్తాయి. పక్షులు ఆకాశాన్నుండి నేలకూలాయి. మేఘం ఉరుములాగా సుగ్రీవుడి కంఠధ్వని క్షణ-క్షణం పెరగసాగింది. అది పెద్ద గాలితో లేచిన అలల సముద్ర ధ్వనిని పోలి వుంది.

సర్గ–15

యుద్ధానికి బయలేదేరిన వాలిని అడ్డగించిన తార

సమస్త జీవరాసులను గడ–గడలాడించే శక్తికల సుగ్రీవుడి సింహనాదం అంతఃపురంలో వున్న వాలి వినగానే అతడి మదం అణగిపోయింది. విపరీతమైన కోపం వచ్చింది. ఆ కోపంతో రూపం మారిన అవయవాలతో, సంధ్యాకాలంలో సూర్యకాంతులు కలిగించే వాలి గ్రహణం పట్టిన సూర్యుడిలాగా హీనుడయ్యాడు. కోపాతిశయంతో మండుతున్న అగ్నిలాగా వెలుగుతూనే కాంతిహీనుడయ్యాడు. భయంకరమైన సుగ్రీవుడి కంఠధ్వని తన చెవుల్లో పడగానే, పట–పటా పండ్లు కొరికి, కాలితొక్కిడితో భూమి బద్దలుకాగా సుగ్రీవుడి మీదకు యుద్ధానికి పోవడానికి సన్నద్ధమయ్యాడు. ఆ సమయంలో స్నేహంగా కౌగలించుకుంటూ వాలి భార్య తార ఆయనను అడ్డుకుని ఆయనకు మేలుజరిగే మాటలను తొట్రుపాటుతో ఇలా చెప్పింది.

"రాత్రి ముడిచిన పూలు ఉదయాన్నే తీసేసినట్లు సెలయేటిలాగా వచ్చిన ఈ కోపాన్ని వదిలిపెట్టు. సూర్యోదయం కాగానే నువ్వు యుద్ధానికి పోవచ్చు. ఇప్పుడే పోకపోతే నీకు వచ్చే అవమానం కానీ,నీ విరోదికి కలిగే గౌరవం కానీ ఏమీ లేదు. ఆలోచించు. ఇప్పుడే పోతే వచ్చే నష్టం ఏంటి? అంటావా? ఇప్పుడు యుద్ధానికి పోకూడదు. దానికి కారణం ఏమిటంటావా? ఇంతకు కొద్దిసేపటి క్రితమే నీ భుజబలం ముందు సతమతమై, బలహీనుడుడై పరుగెత్తిపోయాడు. ఇంతలోనే మళ్లీ యుద్ధానికి నిన్ను పిలిచే ధైర్యం, సాహసం ఎక్కడినుండి వచ్చింది? కాబట్టి నాకు ఏదో సందేహం కలుగుతున్నది. అతడు చేస్తున్న సింహనాదం ఇదివరకు చేసినట్లు లేదు. ఇప్పుడు, బలం, చలం, బలమైన యత్నం, చాలా గొప్పగా కనిపిస్తున్నది. ఇలా కావడానికి కారణం ఏదో వుండాలి. కారణం లేకుండా

కార్యం వుంటుందా? ఏదో బలిష్టమైన సహాయం దొరక్కుండా ఇలా మళ్లీ యుద్ధానికి రాడని నా అభిప్రాయం. బలిష్ట సహాయం దొరక్కపోతే అలాంటి సింహనాదం చేయదు. తెలివి, నేర్పు సుగ్రీవుడికి పుట్టుకతోనే వచ్చింది. బాగా ఆలోచించి, పరీక్షించి, నిస్సందేహంగా బలిష్టుడని అనుకున్నవాడితో వస్తాడు కానీ, అల్పులతో రాడు".

"ప్రాణేశ్వరా! ఇది నా ఊహమాత్రమే కాదు. వాస్తవంగా జరిగిన విషయమే. ఇంతకుముందే నేనీ వృత్తాంతాన్ని విన్నాను. మన అంగదుడే నాకీ సంగతి చెప్పాడు. అతడు అరణ్యానికి పోయి మరలి వచ్చేటప్పుడు మన వేగులవాళ్ళు చెప్పారట. రఘువంశంలో పుట్టిన అయోధ్యాదీశకుమారులు ఇరువురు, యుద్ధంలో జయించనలవికానివారు, రామలక్ష్మణులు అనేవాళ్లు, నువ్వు పోలేని ఋష్యమూకంలో నీ తమ్ముడికి సహాయం చేయడానికి వచ్చారట. వాళ్లలో రాముడనేవాడు శత్రువులపాలిటి కాలాంతకుడు. ప్రళయకాలాగ్నిలాంటివాడు. ఉచితానుచిత విద్యల్లో సమర్థుడు. సుగ్రీవుడికి రక్షకుడైన వాడు నీకెందుకు కాకూడదని అంటావా? నిన్నెందుకు శిక్షిస్తాడంటావా? సుగ్రీవుడు ఆయన్ను ఆశ్రయించాడు. నువ్వు ఆశ్రయించలేదు. కాబట్టి నీకు ఆయన రక్షకుడు కాలేదు. అదే కాకుండా, ఆయన్ను ఆశ్రయించిన సుగ్రీవుడికి నువ్వు విరోధివి. నిన్నెలా రక్షిస్తాడు? సుగ్రీవుడు సాధువు కాదుకదా! అతడు పాపం చేయలేదా? అంటావేమో? చేసి వుండవచ్చు కాని, ఎప్పుడైతే అతడు శ్రీరామచంద్రమూర్తిని ఆశ్రయించాడో, అప్పుడే సాధువయ్యాడు. నువ్వు పోయి ఆశ్రయిస్తే నిన్నూ రక్షిస్తాడు. సమస్త ధాతువులకు హిమవత్పర్వతం స్థానమైనట్లు సర్వకల్యాణ గుణాలకు రామచంద్రమూర్తి స్థానం. నేను నీ దోషాలు ఎత్తి చూపడానికి ఇవన్నీ చెప్పడం లేదు. నా మాట విను. విని నడుచుకుంటే నీకు మేలు కలుగుతుంది".

"నువ్వు వీరులలో శ్రేష్టుడివే. అయినా నీలాంటివారు లోకంలో మరెవ్వరూ లేరనుకోవడం సరైందికాదు. కాబట్టి రామచంద్రమూర్తితో విరోధం పెట్టుకోవడం సరైంది కాదు. అది దోషం....దానివల్ల మేలు కలగదు. అందుకే, నేను, నాకు తోచిన ఉపాయం చెప్తా విను. ఆ తరువాత నీకేది మంచిదో అదే చేయి. సుగ్రీవుడికి యౌవరాజ్యం ఇచ్చేయి. వాడూ మహాబలవంతుడే. అలాంటి వాడితో నీకెందుకు అనవసర విరోధం? నా మనవి విను. రామచంద్రమూర్తితో స్నేహం చేయడం నీకు శ్రేయస్కరం, శుభకరం. అదెలా కుదురుతుంది అని అంటావా? నీ తమ్ముడిమీద పగ వదలిపెట్టు. నువ్వాపని చేస్తే రామచంద్రమూర్తి

నిన్ను ద్వేషించడు. ప్రాణేశ్వరా! నీకు వాడొక్కడే తమ్ముడు. వాడు తప్ప నిన్ను అన్నా, అని పిలిచేవాడు ఎవరూ లేరు. వాడు కూడా దుర్మార్గుడు కాదు...దుష్టుడు కాదు. ఉత్తమ గుణాలు కలవాడు. నీదగ్గర వున్న వాళ్ళందరిలో వాడితో సమానమైన వాడిని ఒక్కడినైనా చూపించు. వాడికి నీమీద వినయవిధేయతలున్నాయే కాని, నిన్ను వాడు ధిక్కరించేవాడు కాదు కదా?"

"నీ బంధువుల్లో అందరూ ఆడవారి వైపువారే కాని నీతండ్రి వైపు వాళ్లు ఒక్కరైనా వున్నారా? వాడక్కడ వున్నా, ఇక్కడ వున్నా బందువంటే వాడే కదా? నీ కఠినత్వంవల్ల ప్రయోజనం లేదు. కాబట్టి వాడిని ఆదరించు. వాడు నీకు తమ్ముడు కాదా? నీకేమైనా శత్రువా? వాడు, నువ్వు ఒక్క గర్భంలో పుట్టారుకదా? వాడు నీకు బంధువని నానమ్మకం. కాబట్టి అతడిని గౌరవించి దగ్గర వుంచుకో. నేను నీ మేలు కోరేదానినని నువ్వు నన్ను నిండు మనస్సుతో నమ్మితే, నాకిష్టమైన పని చేయడం నీకు సమ్మతమైతే, తమ్ముడి విషయంలో ద్రోహం మానుకో. వాడితో స్నేహం చేయి. ఇది వ్యర్థమైన ఆలోచనకాదు. ఇది మినహా నీకు వేరే మార్గం లేదు. ప్రాణేశ్వరా! నామాట విను. కోపం వదులుకో. చేతులు జోడించి విన్నవించుకుంటున్నాను. ఇది నీకు కీర్తికరం కాదు. మేలు కూడా చేయదు. పరిమాణంలేని విక్రమం, ఇంద్రుడి తేజస్సుకల రామచంద్రమూర్తితో విరోధం వద్దు. శాంతించు".

తార ఈవిధంగా ఎంత హితం చెప్పినా వాలి చెవులకు ఎక్కలేదు. కాలం దాపరించినవాడు హితవాక్యాలు వింటాడా?

సర్గ–16
తారకు సమాధానం చెప్పి యుద్ధానికి పోయిన వాలి

తన ప్రియమైన భార్య,నీతి విద్యలో పండితురాలు, బుద్ధిసంపదకల తార ఇలా చెప్పడంతో, వాలికి కోపం వచ్చింది. అలా చెప్పడం తారకు తగదని ఆమెతో ఇలా అన్నాడు. "చంద్రముఖీ! ఈ విధంగా మాట్లాడడం నీకు న్యాయమా? వాడు నాకు తమ్ముడా? తమ్ముడే అయితే మితిమీరిన గర్వంతో చెలరేగి, సింహనాదాలు చేసి, పరాక్రమవంతుడనని భావించి నన్ను యుద్ధానికి పిలుస్తాడా? ఇలాంటివాడిని ఎలా క్షమిస్తాను?శూరులకు ప్రాణాలు తీపి అని అనుకుంటున్నావా? తరుణీ! పరాజయం అంటే ఏమిటో తెలియనివారికి, యుద్ధంలో వెనుకడుగు వేయని, తిరస్కరించబడని వారికి, విరోధులు చేసే అవమానం కంటే చావడమే మేలు. నామీదికి యుద్ధానికి వచ్చినవాడు శూరుడా? సింహనాదాలు చేస్తాడా? నేనేమో బలహీనుడినా? వాడి రంకెలు విని సహించేటంత ఖర్మ నాకెందుకు? ఇక రామచంద్రమూర్తి నన్ను చంపుతాడని కదా నువ్వు భయపడ్తున్నావు? నువ్వు భయపడాల్సిన కారణం లేదు".

"ఆయన నాకపకారం చేయడు. ఎందుకంటే, ఆయన ధర్మం అంటే విశేష ప్రీతికలవాడు. మేలెరిగినవాడు. ఇలాంటివాడు నిష్కారణంగా నన్నెందుకు చంపుతాడు? నువ్వు ఇతర స్త్రీలతో అంతఃపురానికి వెళ్లు. నామీద నీకున్న భక్తివల్ల ఇంత చెప్పావని నాకు తెలుసు. యుద్ధానికి పోయి శత్రువును కొట్టి, నీ మరది భుజబల గర్వం అణచి వస్తాను. వాడిని చంపను. నామాట నమ్ము. వాడికి బలం లేదు...గొంతు లేదు...అలాంటివాడి సింహనాదాన్ని సహిస్తానా? నా ప్రాణం మీద ఒట్టు పెడుతున్నాను. నా విజయం కాంక్షించి వెళ్లిపో".

అని వాలి చెప్పగానే తార ప్రదక్షిణ చేసి, వాలిని కౌగలించుకుని, మంగళాశాసనాలు చెప్పి స్త్రీలతో సహా సన్నటి గొంతుతో ఏడ్చుకుంటూ అంతఃపురానికి పోయింది. ఇలా తార ఇంటికి వెళ్లిపోగానే వాలి అసమాన కోపంతో ఉరు విడిచి పోయాడు.

వాలిసుగ్రీవుల ద్వితీయ యుద్ధం

అధిక రోషంతో విరోధిని చూడాలన్న కోరికతో వున్న వాలికి సుగ్రీవుడిని చూడగానే ఉత్సాహం కలిగింది. వెంటనే, కట్టువస్త్రాన్ని చక్కగా బిగించి, కడుకోపంతో, సుగ్రీవుడికి ఎదురుగా పోయాడు. అలా వస్తున్న వాలిని బంగారుమాలిక ధరించిన సుగ్రీవుడు–సూర్యపుత్రుడు చూసి, అదురు–బెదురూ లేకుండా ముందుకు పోయాడు. తనకెదురుగా వస్తున్న తమ్ముడిని చూసి వాలి, కోపంతో తన ముష్టిని చూపిస్తూ, అది అతడిని వజ్రంలాగా భేదిస్తుందన్నాడు. పరుగెత్తి పోవద్దని అన్న వాలికి సమాధానంగా తన ముష్టిని చూపాడు సుగ్రీవుడు. వాలి తలను చింతకాయలాగా చేస్తానంటాడు. ఆ ఆమాటలకు కోపించిన వాలి, సుగ్రీవుడిని సమీపించి గట్టి పిడికిలితో కొట్టాడు. ఆ దెబ్బకు ప్రతిగా, తన శరీరం నుండి నెత్తురుకారుతున్నప్పటికీ, ఒక చెట్టు పీకి గిరగిరా తిప్పి వాలిని కొట్టాడు సుగ్రీవుడు. ఆ దెబ్బకు బలవంతుడైనప్పటికీ వాలి గడగడ వణికాడు. కలవరపాటు చెందాడు కాసేపు. వాలిసుగ్రీవులిలా ఒకరినొకరు జయించగలవారిలాగా, భయపడకుండా, వెనుదీయకుండా, ఆకాశాన సూర్యచంద్రుల్లాగా భూమ్మీద యుద్ధరంగంలో ప్రకాశించారు.

వాలి శౌర్యం క్రమంగా పెరగసాగింది. సుగ్రీవుడి బలం క్రమంగా తగ్గసాగింది. అయినా సుగ్రీవుడు యుద్ధం చేస్తూనే వున్నాడు. ఒకరినొకరు ముష్టిఘాతాలతో, చేతులతో, చెట్లతో, కాళ్లతో, గోళ్లతో, దీరుల్లాగా తమ ఇష్టం వచ్చినరీతిలో యుద్ధం చేశారు. ఒకరినొకరు సమీపించి చెట్లతో కొట్టుకుంటూ, ఒకరినొకరు నేలమీద పడేసుకుంటూ, పిడికిలి గుద్దులతో నొప్పించుకుంటూ, వీర్యంగా తాకుతూ యుద్ధం చేశారు. సుగ్రీవుడి బలం క్రమక్రమంగా క్షీణించింది. వాలితో దెబ్బలు తిని నలుదిక్కులా చూడసాగాడు.

వాలిని నేలకూల్చిన శ్రీరాముడు

తన స్నేహితుడు, తాను అభయహస్తం ఇచ్చిన వాడు, తననే నమ్మినవాడు, శరణాగతుడు, సుగ్రీవుడు తన కళ్ళ ముందరే శత్రువు చేతిలో ప్రాణాంతక బాధ

పడడం చూసిన శత్రుసంహరణ దక్షుడైన శ్రీరాముడు, వాలిని చంపగల భయంకర బాణాన్ని తీసి అల్లెతాటిలో చాలా వేగంగా కూర్చాడు. ఆ అల్లెతాటి శబ్దానికి ఆకాశంలో తిరిగే పక్షులు, నేలమీద తిరిగే మృగాలు భయపడి తమ స్థానాల్లో వుండలేకపోయాయి. వజ్రాయుధంలాగా, వేగంగా, పిడుగులాగా, రామచంద్రమూర్తి విల్లు నుండి వెలువడిన బాణం వాలి రొమ్మును తాకింది. ఆ బాణం తాకగానే ఇద్రధ్వజంలాగా బలం క్షీణించి, వాలి నేలకూలాడు.

సర్గ–17
శ్రీరాముడిని దూషించిన వాలి

గొడ్డలి మొనతో నరకబడ్డ చెట్టులాగా రాముడి బాణం దెబ్బకు నేలమీద చాప పరిచినట్లు వాలి పడిపోయినప్పుడు, భూమి తేజం, చంద్రుడు లేని ఆకాశంలాగా అయిపోయింది. ఆ వీరుడు నేలమీద పడ్డప్పటికీ, ఆయన తేజం కాని, పరాక్రమం కానీ, ప్రాణాలు కానీ విడువలేదు. ఇంద్రుడు ఇచ్చిన మణులు చెక్కిన బంగారు సరం వాలి తేజస్సు, ప్రాణాలు, పరాక్రమం, కాంతి పోకుండా కాపాడాయి. శ్రేష్టమైన బంగారు మాలిక శరీరం మీద వెలుగుతుంటే పరాక్రమవంతుడైన వాలి, సాయంకాల సమయంలో ఎర్రటి కాంతితో ప్రకాశించే మేఘంలాగా కనిపించాడు. బంగారు సరంతో, ప్రాణాలు తీస్తున్న బాణంతో, నిర్మలమైన శరీరంతో వాలి మూడురంగుల ప్రకాశించాడు. శత్రువులను సంహరించే శక్తికల వాలికి, స్వర్గానికి పంపే శక్తికల రామబాణం ఉత్తమ గతిని (ముక్తిని) కలిగించింది.

జ్వాలలు ఉడిగిన అగ్నిలాగా, ప్రళయకాలంలో నేలపడిన సూర్యుడిలాగా, పుణ్యం క్షీణించడం వల్ల భూమ్మీద పడ్డ యయాతిలాగా, ఇంద్రుడిని అలక్ష్యం చేసేవాడిని, సింహం రొమ్ములాంటి రొమ్ముకలవాడిని, మండుతున్న ముఖం కలవాడిని, దీర్ఘమైన చేతులు కలవాడిని, తాను నేలపడేసినవాడిని, బలశాలిని మెచ్చుకుంటూ, వాడెలాంటివాడో చూడాలనుకుని వాలిని లక్ష్మడితో కలిసి సమీపించాడు శ్రీరాముడు. ఇలా తనను సమీపించిన రామచంద్రుడిని, లక్ష్మణుడిని చూసిన వాలి ధర్మంతో కూడిన, వినయంతో కూడిన, కఠినమైన మాటలతో ఇలా అన్నాడు.

"రామా! నువ్వు రాజకుమారుడివి. శాస్త్రజ్ఞానం చక్కగా తెలిసనవాడివి. స్థిరమైన శోభకలవాడివి. గొప్పవంశంలో పుట్టావు. మంచి తేజస్సు కలవాడివి. కీర్తికి నువ్వు నెలవైనవాడివి. ఇలాంటివాడివై వుండి కూడా యుద్ధభూమిలో నేను ఇతరులతో యుద్ధం చేస్తున్న సమయంలో, నా మనస్సు, దృష్టి దానిమీద వున్నప్పుడు, చాటున వుండి నా రొమ్ముమీద కొట్టడంలో ఏం గొప్ప వుందో చెప్పు. రామచంద్రా! రాముడు కరుణాజ్ఞానం కలవాడనీ, ప్రజల మేలు కోరేవాడనీ, దయాలక్ష్మికి స్థానమైనవాడనీ, ఉచితానుచితజ్ఞానం కలవాడనీ లోకులు నిన్ను పొగడుతుంటారు. తార నన్ను యుద్ధానికి పోవద్దని, సుగ్రీవుడికి సహాయంగా రాముడు వచ్చాడనీ, ఆయన నన్ను చంపుతాడనీ చెప్పినా వినకుండా వచ్చాను. బాహ్యేంద్రియ నిగ్రహం, అంతరింద్రియ నిగ్రహం, ఓర్పు, ధర్మం, ధైర్యం, సత్యం, పరాక్రమం, అపరాధులను మాత్రమే దండించడమనే రాజులకుండే ఉచితమైన సద్గుణం....ఇవన్నీ రాముడిలో లేకపోతాయా, నన్నేల నిరపరాధిని చంపుతాడని వచ్చాను. నీ చేతుల్లో చచ్చాను.ఇప్పుడు నేను చెప్పిన రాజగుణాల్లో ఒక్కటికూడా నీలో లేదు. నువ్వేం రాజువి? సుగ్రీవుడు చెప్పాడని తొందరపడి, కోపగించి, గుణదోషాల విచారణ చేయకుండా, ఇతరులతో యుద్ధం చేసేవాడిని ఎలా చంపాలి? అన్న ఆలోచన చేయక, ధర్మచింతన చేయక, ఎదురుపడి యుద్ధం చేసే ధైర్యం లేక, సత్యాసత్యాలు తెలుసుకోకుండా, పిరికివాడిలాగా దూరంగా మాటువేసి, నీకే అపకారం చేయని నన్ను దండించావు కదా? నువ్వు మోసగాడివి అని తార తెలుసుకుంది కాని నేను తెలుసుకోలేక పోయాను".

"రాముడు గొప్పవంశంలో పుట్టాడు కాబట్టి గొప్ప గుణాలు కలవాడై వుంటాడనీ, కళ్యాణ గుణాల మనోహరుడు కాబట్టి హేయ కార్యాలు ఎందుకు చేస్తాడనీ, నేను ఇతరులతో యుద్ధం చేస్తున్నప్పుడు నామీదకు ఎలా వస్తాడనీ, నన్నెందుకు చంపుతాడనీ, ఇలాంటి అకార్యం ఎందుకు చేస్తాడనీ భావించి, నీ ముఖం ఎన్నడూ చూడని కారణాన మోసపోయి ఈ విధంగా యుద్ధానికి వచ్చి నీచేతుల్లో ప్రాణాలు పోగొట్టుకున్నాను. రాజవేషం ధరించిన పాపపు నడవడికలవాడివి నువ్వు. మాయలమారివి. ఈ వాస్తవం తెలుసుకోలేక బుద్ధిహీనతవల్ల ఇలా అయిపోయాను. నేనెప్పుడూ నీ ముఖం చూడలేదు. నగరంలో కానీ, పొలిమేరల విషయంలో కానీ నీకు అపకారం చేయలేదెప్పుడూ. కాబట్టి నీకు నామీద కలహకారణం లేదు. అడవుల్లో వుండి మా ఇష్టప్రకారం

ఏదో ఆ వేళకు దొరికిన కాయకూరలు తింటూ బతికే కోతులం. కాబట్టి నీకూటికి అడ్డం రాలేదు. ఇలాంటి నన్ను యుద్ధం చేస్తున్న సమయంలో చంపడానికి కారణం ఏంటి? రాజుల వంశంలో పుట్టి వేదాలను అధ్యయనం చేశావే? తేజస్సులో అతిశయించావు కదా? నిస్సందేహమైన జ్ఞానం కలవాడివే? అలాంటి వాడివి ఎందుకీ విధంగా ధర్మాత్ములు ధరించాల్సిన వేషాలు వేసుకుని లోకులకు కీడైన క్రూర కార్యం చేయతలపెట్టావు? నువ్వు పుట్టిందా రాజవంశంలో. ధర్మాత్ముడనే కీర్తి సంపాదించావు. ఇలాంటి క్రూర కార్యం చేసే నువ్వు పెద్దమనిషిలా ఎలా ప్రవర్తిస్తావు? బుద్ధిమంతుల్లో శ్రేష్టులైన వారు సామం, దానం, శౌర్యం, సత్యం, క్షమ, ధర్మం, ధృతి, అపరాధులను దండించడం లాంటివి రాజగుణాలని చెప్పారు".

"మేం అడవుల్లో తిరిగేవాళ్ళం. మీరు నగరాల్లో తిరిగేవారు. మేం పండ్లు, కందమూలాలు తిని జీవించే మృగాలం. మీరు ఇష్ట మృష్టాన్నాలు తింటారు. నేనేమో మృగాన్ని. నువ్వో మనుష్యుడివి....నేను నీ సేవకుడిని. నువ్వు రాజైనా బుద్ధిలేనివాడివయ్యావు. చూశావా? భూమికానీ, బంగారంకానీ, వెండికానీ, కలహకారణాలు కదా? నేను తినే కందమూలాలమీద నువ్వు ఆశపడి, నేను తింటే నీకు లేకుండా పోతుందన్న భయంతో నన్ను చంపావా? నయం, అనుగ్రహం సజ్జనులైన రాజుల్లో వుంటుంది. దుర్వినయం, నిగ్రహం, దుష్టరాజుల గుణాలు. సాధారణంగా కలవని ఈ రెండూ నీలో మిశ్రమంగా వున్నాయి. రాజులైనవారు ధర్మవశులై నడచుకోవాలికాని మేమే ప్రభువులం, మేమెలా చేసినా కాదనేవారెవరు? అని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించకూడదు. నువ్వేమో ఇంద్రియాల వల్ల కలతచెంది, కామమే సర్వకాల-సర్వావస్తలలో ముఖ్యమని భావిస్తూ, అది నెరవేరకపోతే కోప్పడుతూ, చెడు-మంచిరాజుల మిశ్రమ నడవడికలవాడివై ప్రవర్తిస్తున్నావు. దానివల్ల నువ్వు మంచివాడివో, చెడ్డవాడివో మాలాంటి వాళ్లకు అర్థం కావడం లేదు. నిన్ను శిష్టుడవని నమ్మలేం, దుష్టుడవని అనలేం. విల్లే ప్రధాన సాధనంగా తలచి, కలహానికి కాలుదువ్వుతూ, బలవంతుడినన్న గర్వంతో, ధర్మం విడిచి మర్యాద వదిలావు".

"ధర్మం రక్షించడంలో నీకు విశ్వాసం లేదు. ధర్మరక్షణ వ్యర్థమని నీ అభిప్రాయం. కోరికల మీద మనసు పోనిచ్చి, ఇంద్రియాలకు వశపడి, అవి ఎలా ఈడుస్తే అలా పోతున్నావు. నీ విషయంలో నేను ఏ రకమైన దోషం చేయలేదు. ఇలాంటి నిరపరాధిని నన్ను నీ బాణంతో చంపావు. ఈ నింద

పోవడానికి సజ్జనుల సభలో నువ్వేమని సమాధానం చెప్తావు? నువ్వు రాజవంశంలో పుట్టతగిన వాడివికాదు. దొంగ, జీవహింస చేసేవాడు, కొండేలు చెప్పేవాడు, గురు భార్యను అనుభవించేవాడు, రాజును చంపినవాడు, నాస్తికుడు, గోవధ చేసేవాడు, అన్నకంటే ముందు పెళ్లి చేసుకున్నవాడు... వీరంతా నరకంలో వుండాల్సినవారే. నీలాంటి సత్పురుషులు జింకచర్మాల లాగా మా కోతి చర్మాలను కప్పుకోరు. ఏనుగు దంతాల లాగా నా ఎముకలను తాకరు. మాంసాన్ని తినరు. నా వెంట్రుకలు ఏ పనికీ ఉపయోగపడవు. అలాంటి నన్ను ఎందుకు చంపావు?''.

“రామచంద్రా! ఐదుగోళ్ళ జంతువులలో ఆలువం, ఏదుపంది, తాబేలు, ఉడుము, చెవులపిల్లుల మాంసం తప్ప ఇతర జంతువుల మాంసాన్ని బ్రాహ్మణ, క్షత్రియాదులెవరూ తినరుకదా! ఆహారం కొరకు నన్ను చంపావనడానికి మాంసానికి కూడా నేను కొరగాను కదా? ఎందుకు నన్ను చంపావు మరి? తెలివికలవారు నా ఎముకలను, చర్మాన్ని తాకకూడదని తాకను కూడా తాకరు. నా మాంసాన్ని తినరు. ఇలాంటి ఐదుగోళ్ళ జాతిలో చేరిన నన్ను చంపడం నీకు ధర్మమా? అయ్యో! జరగబోయే విషయం అంతా తెలిసన తార నా మేలుకోరి చెప్పిన మాటలను అలక్ష్యం చేసి బుద్ధిలేనివాడినై వచ్చి దాని ఫలితాన్ని ఇలా అనుభవిస్తున్నాను. ఈ భూమికి నువ్వు భర్తవైతే ఇది భర్త లేనిదిగానే వుంటుంది. ఎందుకంటే నీచుడు, మోసకారి అయిన భర్త దాపరిస్తే ఉత్తమ స్త్రీ భర్త లేనిదిగానే భావించాలి. పరులకు అపకారం చేసేవాడివి. రహస్యంగా కీడు చేసేవాడివి. నీచమైన మనస్సుకల వాడివి. ఇతరులను మోసగించడానికి జితేంద్రియుడిలాగా నటిస్తున్నావు. ఇలాంటి నువ్వు ఉత్తమమైన సదాచార సంపత్తి కలవాడు, గొప్ప మహిమకలవాడైన దశరథుడి కడుపు చెడ ఎలాపుట్టావు కఠిన స్వభావుడా?''

“ఏనుగు తనను కట్టిన తాళ్లను తెంచుకుని అంకుశాన్ని లక్ష్యం చేయకుండా వక్రమార్గంలో గుంపులను తొక్కుకుంటూ పోయిన విధంగా నువ్వు కూడా సచ్చరిత్ర అనే బంధానికి లోపడకుండా, ధర్మానికి వెరవకుండా, సదాచార సంపన్నులు పొగిడే ధర్మ మార్గాన్ని అతిక్రమించి పోయావు. కర్మవశాన నేను నీ చేతుల్లో చావాల్సి వచ్చింది. ధర్మజ్ఞాన వృద్ధులందరు ఛీఛీ అనే ఇలాంటి గౌరవహానికరమైన కార్యం చేసి సుజనుల ఎదురుగా ఏ ముఖం పెట్టుకుని పోతావు? పోగలవు? పోయినా ఏమని చెప్తావు? ఆహా రామచంద్రా! ఏం మగవాడివయ్యా? నీ మగతనం నీ భార్యను అపహరించిన వాడిమీద

చూపలేకపోయావు కాని, నీజోలికి రాకుండా తటస్థుడిగా వున్న నామీద చూపావుకదా! రామా! నా కంటి ఎదురుగా నిలబడి నువ్వు నాతో యుద్ధం చేస్తే నిన్ను నేను నిమిషంలో రుద్రభూమికి పంపేవాడిని కదా? నేనెంత శౌర్యం కలవాడినైనా చాటుగా వుండి విడిచిన నీ బాణం వల్ల చావాల్సి వచ్చింది కదా?"

"రామా! నీ కథ నాకు కొంచెమైనా చెప్పలేదు. చెప్పినట్లయితే, నువ్వే కారణాన సుగ్రీవుడు కోరిక తీర్చడానికి నన్ను చంపావో, ఆ కపటచిత్తుడైన రావణుడిని యుద్ధంలో కొట్టి, మెడలు వంచి పట్టుకుని, ఇక్కడికి ఈడ్చుకుంటూ తీసుకొచ్చేవాడినికదా? సీతను ఒక్కపూటలో తీసుకునిరానా? గోటితో పోయేదానికి గొడ్డలిని వెతికావుకదా? పూర్వం ఉపనిషద్భాగాలను మధు-కైటభులు అపహరించి సముద్రంలోకి తీసుకుపోయినప్పుడు హయగ్రీవమూర్తి వాళ్లను చంపి తీసుకొచ్చి ఇచ్చినట్లే నేను సీతను తెచ్చి ఇచ్చి వుండేవాడిని కదా?నా మరణానంతరం తండ్రి రాజ్యభాగంలో అర్హుడైన సుగ్రీవుడు నన్ను ఆ రాజ్యం కొరకు చంపడం న్యాయమే. కాని, ఏ సంబంధంలేని నువ్వు వక్రమార్గంలో నన్ను చంపావు. ఇది తమస్సుతో చేసింది. అధర్మమైనది. కాబట్టి న్యాయమైనదని చెప్పడానికి వీల్లేదు. రామచంద్రా! భూమ్మీద పుట్టినవారు ఏనాడో ఒకనాడు చావాల్సినవారే. కాబట్టి మరణం వచ్చిందే అని విచారపడడంలేదు. కాని నువ్వు శూరుల మర్యాద తప్పి చేసిన పనికి ప్రత్యుత్తరం ఏమని చెప్తావు? ఏదైనా ఉపాయం వుంటే వెతుకు".

అని, నోరు ఎండుతుంటే, బాణం బాధతో శరీరమంతా మండుతుంటే, బాధ సహించలేక శ్రీరాముడిని వూరికే చూసుకుంటూ తేజోహీనుడై వాలి పడిపోయాడు.

సర్గ-18
వాలి దూషణలకు సమాధానం చెప్పిన శ్రీరాముడు

వాలి తనను దూషించిన వాక్యాలకు శ్రీరామచంద్రుడు సమాధానం చెప్పాడు. దీనికొరకే వాలి వెంటనే మరణించే విధంగా బాణం వేయకుండా కొన ఉపిరి వుండేట్లు వేశాడు రాముడు. వాలి చనిపోయేట్లు బాణం వదులుతే రామచంద్రమూర్తి వాలిని వధించడానికి కారణం తెలియక లోకులు ఆయన్ను పలురకాలుగా నిందించి వుండేవారు. రాముడు తగిన సమాధానం చెప్పినప్పటికీ కొందరు దుష్టులు ఇప్పటికీ ఆయన్ను నిందిస్తూనే వున్నారు కదా!

ధర్మార్థయుతంగా, హితంగా, కఠినంగా, అవివేకంగా వాలి పలికిన మాటలకు, కాంతిలేని సూర్యుడిలాగా, నీళ్లులేని మబ్బులాగా, చల్లారిన అగ్నిలాగా భూమ్మీదపడివున్న ఆ వానరశ్రేష్టుని చూసి ధర్మార్థ గుణ సహితంగా రామచంద్రమూర్తి ఇలా అన్నాడు. "ఓయీ! ధర్మమని, అర్థమని పలికావు. సంతోషమేకాని ధర్మం ఏవిధంగా ఆచరిస్తే పురుషార్థమవుతుంది? ఎప్పుడు అది పురుషార్థం కాదు? అర్థం, కామం ధర్మంతో కూడి వుండేట్లు చేయాల్నా? ఈ విషయం నువ్వు ఆలోచించావా? పోనీ కుల సంప్రదాయం అంటావా? శాస్త్ర విషయంలో సందేహం వస్తే శిష్టాచారం కదా ప్రమాణం? అది ఎలా వుందో ఆలోచించావా? ఏ ఆలోచన చేయకుండా పిల్లతనంగా నన్ను దూషిస్తే నీకు కలిగే లాభం ఏమిటి? పోనీ నువ్వు అడవిలో వుండేవాడివు కాబట్టి నీకు ధర్మశాస్త్రం ఎలా తెలుస్తుందంటావా? తెలుసుకోక పోవడం నీ తప్పు. (ignorance of law no excuse). నువ్వు కులగురువులనో, కులంలో పెద్దలనో, శాస్త్రం తెలసిన పండితులనో, ఆచార శుద్ధులనో అడిగావా? ఎందుకు అడగలేదు? ఇదంతా ఆలోచించకుండా కోతులకున్న స్వాభావ చపల బుద్ధివల్ల

నన్ను దూషిస్తే లాభం ఏంటి?".

"ఓయీ! కొండలతో, అడవులతో, తోటలతో, తోపులతో కూడిన ఈ భూమంతా ఇక్ష్వాకుల కాలం మొదలు ఇప్పటిదాకా మా వంశంలో పుట్టిన రాజులదని నీకు తెలుసా? ఈ కారణాన నువ్వు ఇక్ష్వాకు వంశంవారికి సామంతరాజువేకాని స్వతంత్ర ప్రభువువు కాదు. ఇలా వాళ్లు సార్వభౌములైనందువల్ల వారి రాజ్యంలోని సమస్త జనులను, మృగాలను, పక్షులను కూడా రక్షించడానికి, శిక్షించడానికి వారికి అధికారం వుందని తెల్సుకో. సత్యమే అయినా నేను రాజును కాదంటావేమో? నిజమే. నేను రాజును కాదుకాని ధర్మార్థకామాలను, దేన్ని ఎప్పుడు అనుష్టించాలో ఆ రహస్యం తెలుసుకుని దుష్టులను శిక్షించడానికి, శిష్టులను రక్షించడానికి శక్తికలిగిన భరతుడు నేడు పాలిస్తున్నాడు. అతడే సత్యం, నీతి, వినయం,శౌర్యం కలిగి దేశకాల స్థితులెరిగిపాలిస్తున్నాడు. ఆయన ఆజ్ఞతో ప్రపంచంలో ధర్మాన్ని కాపాడే కోరికతో, అది ప్రమాదపడకుండా చూడడానికి నేను మరికొందరు రాజులు భూమ్మీద తిరుగుతున్నాం. నిశ్చల స్వభావుడైన భరతుడు రాజ్యం ఏలుతుంటేఎవడు అధర్మం చేయగలడు? చేస్తే శిక్షపడదా?"

"ఈ విధంగా ధర్మరక్షణ కొరకు తిరిగే మేం స్వధర్మాన్ని తప్పకుండా భూమ్మీదకల అధర్మాత్ములను భరతుడి ఆజ్ఞమేరకు దండిస్తాం. ఇది తప్పా? చెప్పు. నువ్విప్పుడు ఏవిధమైన అధర్మం చేశావని నేను నిన్ను శిక్షించానంటావా? చెప్తా విను. నువ్వు ధర్మాన్ని వదిలి కఠినమైన, నింద్యమైన కార్యం చేస్తూ అధర్మయుక్తమైన కామాన్నే ప్రధానంగా స్వీకరించి రాజధర్మాన్ని తప్పావు. ఇది నీకు తగునా? నీ నడవడి గురించి నువ్వు ఆలోచించకుండా ఇతరులను గర్వంతో ఎందుకు దూషిస్తావు? నువ్వే ధర్మాన్ని తప్పి నడిచానంటావా? చెప్తా విను. ధర్మమే ప్రమాణమైతే, కన్న తండ్రి, అన్న, విద్యనేర్పిన గురువు ధర్మపథంలో ఉన్నవారికి కన్న తండ్రులతో సమానమే సుమా! అలాగే సద్గుణాలున్న తోడబుట్టినవాడు, సద్గుణాలు కల శిష్యుడు, సద్గుణాలు కల తన కన్నకొడుకు, ముగ్గురూ కన్నకొడుకు లాంటివారే".

"ఓయీ! కన్నతండ్రి అన్న ఎలా అవుతాడు? అన్న తండ్రి ఎలా వుతాడు? చదువు చెప్పినంత మాత్రాన గురువు తండ్రి అవుతాడా? అంటావేమో? ఈ ముగ్గురు సమానమే అనే ధర్మ సూక్ష్మం గొప్ప-గొప్ప పండితులకు కూడా తెలియదు. సమస్త చరాచరాలకు ఆత్మయై, హృదయంలో నివసించే ఈశ్వరుడు

ఒక్కడే ఏది ధర్మం, ఏది అధర్మం అనే విషయం తెలిసినవాడు. ఆయనకు తెలిస్తే లోకానికి ఎలా తెలియాలి? ఆయన నీకెందుకు చెప్పలేదంటావేమో? నీకు శాస్త్ర రూపంలో చెప్పాడు తెలుసా? శాస్త్రరూపంలో ఆయన చెప్పినప్పటికీ నువ్వు తెలుసుకోలేకపోతే దోషులెవరు? నీలాంటి కోతికి అలాంటి ధర్మ సూక్ష్మం ఉన్నదున్నట్లు ఆమూలాగ్రం తెలియడం సాధ్యమా? నీకెందుకు ఆ ధర్మసూక్ష్మం తెలియలేదంటావా? నువ్వు స్థిర చిత్తం లేనివాడివి. నీతోవున్న సహాయకులు కూడా నీలాగే చపలచిత్తులు మాత్రమే కాకుండా మూర్ఖులు కూడా. పుట్టు గుడ్డివాడితో చేరిన పుట్టు గుడ్డికి ఏం తెలుస్తుంది? అలాగే నీకు ధర్మం ఎలా తెలుస్తుంది?"

"ఓయీ! నేను చెప్పదల్చుకున్నది స్పష్టంగా చెప్తా విను. కేవలం నామీద కోపంతో నన్ను నిందించవద్దు. నిన్ను చంపిన కారణం చెప్తా విను. సజ్జనులు శ్లాఘించే సనాతన ధర్మాన్ని వదిలి నీ తమ్ముడు బతికుండగా అతడి భార్యను, నీ కోడలి లాంటి రుమను నువ్వు పాపమార్గంలో దుష్కామంతో పొందావు. ఇది అసత్యమా చెప్పు? ధర్మమార్గం వదిలి కేవలం దుష్కామంతో అదుపూ-అడ్డం లేక నీతమ్ముడి భార్యను నువ్వు చెరిచిన కారణాన నిన్నీవిధంగా చంపాల్సి వచ్చింది. (రాజైనవాడు సామదానభేదాలు వ్యర్థమైనప్పుడే దండం ఉపయోగించాలి కదా అనే దానికి కూడా జవాబిచ్చాడు). ధర్మం బుద్ధిపూర్వకంగా వదిలిపెట్టి జనులకు మేలైన ఆచారవ్యవహారాలను అనుష్టించకుండా శాస్త్రబంధనం అతిక్రమించి దుష్ట గర్వంతో నాకెదురెవరని తిరిగేవాడి విషయంలో సామదానభేదాలు పనికిరావు. దండం ఒక్కటే ఉపయోగించాలి. సామదానభేదాలు తనకు లొంగిపోని రాజుల విషయంలో కాని సామంతరాజుల విషయంలో కానేకాదు. నేరం చేసి వధ శిక్షకు అర్హుడైనవాడితో సామాదానభేదాలు ఏముంటాయి? ఇది శాస్త్రీయం కాదు, లౌకికాచారం కూడా కాదు. నువ్వు దండించబడాల్సిన వాడివే కాబట్టి మొదలే దండాన్ని ఉపయోగించాను".

"నిన్ను దండించడానికి నేనెవర్ని అంటావేమో? చెప్తా విను. నేను క్షత్రియుడుగా పుట్టాను. సనాతన ధర్మాన్ని 'క్షతమ్' (చెడి పోకుండా) కాకుండా రక్షించే వాడే క్షత్రియుడు. కాబట్టి ధర్మరక్షణ అనేది నాకు పుట్టుకతో వచ్చిన అధికారం. నేను సింహాసనం అధిష్టించినా, అధిష్టించకున్నా ఈ కార్యం నాకు తప్పదు. అది తప్పితే నేను నా స్వధర్మాన్ని తప్పినట్లే. నేను జాతిమాత్ర క్షత్రియుడిని

మాత్రమే కాదు, ధర్మపాలనతత్పరులు అని ప్రసిద్ధికన్న భూమిపాలుర వంశంలో పుట్టాను. కాబట్టి ధర్మరక్షణ విషయంలో నాకెక్కువ అధికారం వుంది. అలాంటి రాజకుమారుడినైన నేను ధర్మాన్ని లక్ష్యం చేయకుండా కామమే ప్రధానంగా చేసుకుని అతిపాపం చేస్తున్న నిన్ను ఎలా క్షమిస్తాను? ఎలా సహిస్తాను? ఇది సాధ్యమా? ఇలాంటి ఘోరపాపం చేసిన నిన్నే దండించకపోతే అల్పపాపులను ఎలా దండించగలను? నా భార్యను రావణుడు ఎత్తుకుని పోవడం అధర్మమని కదా నువ్వు వాడిని కొట్టి తెస్తానన్నావు. అలాగే పరుడి భార్యను, అదీ తమ్ముడి భార్యను, కోడలులాంటి దానిని పూర్తిగా చెరిచిన నిన్ను ఏం చేయాలో నువ్వే చెప్పు?".

"నీ తమ్ముడి భార్య నీ భార్యకు చెల్లెలుకదా, నీ భార్యకు చెల్లెలైతే నీకు ఆమె భార్య వరసేకదా అంటావేమో? అదికాదు. కూతురు, చెల్లెలు, మరదలు ఒక్క వరసవారు. తన కూతురుతో, తన చెల్లెలుతో, తన మరదలితో సంగమించేవాడికి శాస్త్రంలో వధ శిక్ష ఒక్కటే చెప్పడం జరిగింది కాని వేరేది చెప్పబడలేదు. క్షత్రియజాతిలో, అందునా సార్వభౌముల వంశంలో పుట్టిన కారణాన అధర్మాత్ములను దండించే అధికారం మాకున్నప్పటికీ రాజు భరతుడు కాబట్టి మేమాతడి ఆజ్ఞ ప్రకారం ధర్మం తప్పినవారిని భూమ్మీద తిరిగి, వెతికి తగిన రీతిన పెద్దలకు సమ్మతమయ్యే విధంగా దండిస్తాం. భరతుడు రాజై దుష్టులను శిక్షిస్తున్నాడు. ధర్మాన్ని ఆర్జిస్తున్నాడు. మేమలా చేయకుండా ఉపేక్షచేయడం తగునా? ఆయనలాగా మేం కూడా దుష్ట శిక్ష, ధర్మ రక్ష చేయాలికదా? వాలీ! నా మనసులో లక్ష్మణుడు ఎలాగో స్నేహం విషయంలో సుగ్రీవుడు అలాంటివాడే. నావల్ల సుగ్రీవుడికి కలిగే లాభం ఏంటి అంటావా? లక్ష్మి, భూమి, భార్య. అతడి వల్ల నాకు కలిగే లాభం సీతను వెతకడం. ఆ పని అతడు చేయగలడు. మా స్నేహంవల్ల నాక్కావలసింది నాకవుతుంది, అతడికి కావాల్సింది అతడికి దక్కుతుంది. ఇలాంటి స్నేహాన్ని ఏ కారణాన ఉపేక్ష చేసి నీతో స్నేహం చేయమంటావు? ఇంతకంటే ఎక్కువ మేలు నువ్వేం చేస్తావు నాకు?"

"నీ భార్యను హరించిన వాలిని చంపుతానని, వానర రాజ్యాన్ని, ఆయన భార్యను ఆయనకు అప్పగిస్తానని సుగ్రీవుడికి మాట ఇచ్చాను. ఈ మేరకు వానరుల సమక్షంలో ప్రతిజ్ఞ చేసాను. అలా నిండు మనస్సుతో ప్రమాణం చేసి మాట తప్పవచ్చా? కాబట్టి నా స్నేహితుడి కార్యసాధన కొరకు కూడా నిన్ను చంపాను. సుగ్రీవుడితో నాకు స్నేహం కుదిరినా, కుదరకున్నా, నువ్వు తమ్ముడి

భార్యను పట్టినందువల్ల నాతో చావాల్సినవాడివే. నువ్వు నిర్దోషివైనా, నా స్నేహితుడుకి విరోధివైనందున నాకు కూడా నువ్వు విరోధివే. నువ్వు నాకు విరోధివైనప్పుడు నాతోచావాల్సినవాడివే కదా! ఇలా నిన్ను చంపడానికి అనేక కారణాలున్నాయి. నువ్వు తనకు విరోధివని సుగ్రీవుడు చెప్పినంత మాత్రానే నేను నమ్మి నిన్ను చంపలేదు. నా కళ్లముందర నా స్నేహితుడు, నా ఆశ్రితుడు, నాకు శరణాగతుడు వేరేవాళ్ల చేతిలో చంపబడడం నేను అలా చూస్తూ సాక్షిగా వుండడం ధర్మమా?"

"నువ్వు ఏ అడవులు, కొండలు నీవని పాలిస్తున్నావో అవన్నీ ఇక్ష్వాకు వంశంలో పుట్టిన మావా? కాదా? అయితే నువ్వు మాకు సామంతుడివే కదా? దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ రాజధర్మం కాదా? తమ్ముడి భార్యను, ఇంటిని, సర్వాన్ని తీసుకుని, అతడిని కట్టుబట్టలతో సహా వూరు వెడలగొట్టావా? లేదా? తమ్ముడి భార్యతో సంగమించిన వాడికి మరణదండనే శిక్ష అని శాస్త్రాలు చెప్పలేదా? సుగ్రీవుడితో నేను అగ్నిసాక్షిగా స్నేహం చేసి అతడికి మేలు చేస్తానని ప్రమాణం చేశానా? లేదా? ముందు మాట ఇచ్చి అసత్యమాడవచ్చా? ఇప్పుడు నేను చెప్తున్న దాంట్లో ఏదసత్యమో చెప్పు. సత్పురుషులు మెచ్చే ఇన్ని ధర్మకారణాలు వుండడం వల్లనే కోతిరాజా, నిన్ను వధించడం ధర్మం. ఇది నువ్వాలోచించు. ధర్మం తెలిసిన మిత్రుడు, ధర్మచరిత్రుడైన మిత్రుడికి సహాయం చేయడమే ధర్మం. నీకు కూడా ధర్మం తెలుసు. ఇది నీ పాపకర్మకు ప్రాయశ్చిత్తం అనుకో. సదాచారం బోధించేవి, పండితులు ఆమోదించేవి, శిష్ట జనులు అనుష్టానంలో వుంచుకోవాల్సినవి అయిన మనుస్మృతి వాక్యాలను కొన్ని చెప్తాను విను".

(అన్ని స్మృతుల్లో మనుస్మృతి పరమ ప్రమాణ గ్రంథం. దానికి విరుద్ధమైనదేదీ గ్రాహ్యం కాదు. దాన్ని అనుసరించే ఆయా యుగాల పురుషుల శక్తికి తగ్గట్లు ఆ ఋషులు స్మృతులు ప్రకటించారు. ఇవి వ్రతాలు, ప్రాయశ్చిత్తాలు మొదలైనవాటికి సంబంధించినవే కాని సనాతన ధర్మాలకు సంబంధించినవి కావు. రామచంద్రమూర్తి త్రేతాయుగంనాటివాడు కాబట్టి, ఆపాటికి మనుస్మృతి ప్రమాణం కాబట్టి, దానిలోని వాక్యాలను రామచంద్రమూర్తి తాను చేసిన పనికి ఉదాహరణగా చెప్పాడు).

వాలికి ధర్మశాస్త్ర వాక్యాలను చెప్పిన శ్రీరాముడు

"ప్రజలు పాపం చేసినా రాజుతో శిక్షించబడితే వారు ఆ పాపాలను

అనుభవించడానికి నరకానికి పోకుండా పాపాలు చేయని పుణ్యాత్ముల్లాగా ఇంద్రలోకానికి పోతారు. చేసిన పాపం రాజదండంతో నశిస్తుంది. ఇక్కడ శిక్షించబడకపోతే యమదండం అనుభవించాలి. రెంటిలో ఒకటి తప్పదు. దొంగ దొంగతనం చేస్తే రాజు చేతిలో శిక్షించబడాలి. లేదా, రాజు విచారణ చేసి వాడిని నిర్దోషి అని ప్రకటించి వదిలిపెట్టాలి. ఈ రెంటిలో ఏదైనా వాడిని పాప విముక్తుడిని చేస్తుంది. పాపం చేసినవారిని దండించలేని మతిహీనుడైన రాజు ఆ పాపాన్ని తాను పొందుతాడు. వాలీ! ధర్మ విధం అర్థమైందా? నేను దండించకపోతే నీ పాపం నాకు సంక్రమించేది. ధర్మాత్ముడని కీర్తి వహించిన మా వంశం పూర్వుడైన మాంధాత అనే మహారాజు, నువ్వు చేసిన పాపం లాంటిదే చేసిన ఒక సన్న్యాసిని భయంకరంగా దండించలేదా? చంపలేదా? సన్న్యాసినే దండించగా లేంది నువ్వెంత?"

"కొందరు రాజులు మదంతో మొదట్లోనే ఇది ధర్మం,ఇది అధర్మం అని తెలియక, అది విమర్శకు గురైనప్పుడు, హెచ్చరికతో బుద్ధిపూర్వకంగా అధర్మ మార్గంలో పోలేక, పాపపు జనులను దండించి పాపం శమించేట్లు చేయడం లేదా? ఎన్నాళ్లబట్టో నేనీ పని చేస్తున్నానే? ఇన్నాళ్లు ఊరకే వుండి ఇప్పుడు దోషం ఎందుకు ఎంచుతున్నావు? ఈ కారణాన నువ్వు విచారపడాల్సిన పనిలేదు. నిన్ను ధర్మ మార్గంలోనే చంపాను. ఈ కార్యం చేయడానికి, చేయకపోవడానికి మాకు స్వాతంత్ర్యం లేదు. ఎందుకంటే మేం శాస్త్రబద్ధులం. శాస్త్రంలో చెప్పినట్లు చేయాల్సిందే. తప్పదు. నువ్వు సంధ్య, జపం, తర్పణం చేస్తుండడం వల్ల నువ్వు మనుష్యుడివని భావించి, మనుష్యులకు అన్వయించే ధర్మశాస్త్రాలను చెప్పాను. అలాకాదు...నువ్వు కోతివే, మృగానివే అంటావా? మృగాలకు నేను చెప్పిన వావి-వరుసలు లేవు, నేను చెప్పిన శాస్త్ర వాక్యాలు నీకు అన్వయించవు అంటావా? అలాంటప్పుడు దానికి తగ్గ సమాధానం కూడా చెప్తాను. ఆ విధంగా చూసినా నిన్ను చంపడానికి గొప్ప కారణమే వుంది. అది విను. నీ సందేహం తీరుతుంది".

"నువ్వు మృగానివి కాబట్టి అజ్ఞానంతో కోప్పడి పరుషాలాడావు. అయినా నాకు నీమీద కోపం లేదు. నువ్వు కోప్పడ్డావని నాకు కోపం రాదు. నా మాట నమ్ము. మాంస భక్షణంలో ఆసక్తికల వాళ్లు మృగాలను చంపడానికి వలలు పన్నరా? ఉరులు పరచారా? పల్లాలు, పెద్ద గుంటలు తీయరా? ఎన్నో ఉపాయాలతో మృగాలను ఎదురుగానైనా, చాటుగానైనా, భయంతో

పరుగెత్తుతున్నా, నేలపడి వున్నా, నమ్మి ఎదురుగా నిలబడి వున్నా, మనుష్యులు చంపుతుంటే వారికి దోషం అంటిందా? లేదుకదా? అలాంటప్పుడు విశేష ధర్మజ్ఞానంకల రాజులు వేటకు పోరా? రాజులకు అది వర్తించదా? వేటవల్ల రాజులకు దోషం అంటగట్టబడుతుందని ఎక్కడైనా చెప్పడం జరిగిందా? రాజులు ఫలానా మృగాన్ని చంపవచ్చు, ఫలానా దాన్ని చంపకూడదని నియమం వుందా? కాబట్టి, నేను రాజును, నువ్వు మృగానివి....నిన్ను నేను ఎలాగైనా చంపవచ్చు. చంపితే దోషం లేదు. దీంట్లో నాకు స్వధర్మ హాని వుందేమో చెప్పు".

"పుండువల్ల బాధపడే వాడికి వైద్యుడు చెకిత్స చేసినట్లే లోకులను పాలించే రాజు ఆయన చేయాల్సిన పనులను వారికి ఇష్టమైనా, కాకున్నా ఏది ధర్మమో, ఏది అధర్మమో ఆలోచించి, ఎలా జీవులను రక్షించాలో అదే చేయాలి. అలాగే నీ విషయంలో నీ మేలు కోరి వైద్యుడు రోగికి శస్త్రచికిత్స చేసినట్లే చేశాను. ప్రజల మేలుకొరకే రాజులున్నారు. వారి మంచికే పనులు చేస్తారు. వాళ్ళు చేసేది దోషులకు అయిష్టంగా, ఇతరులకు ఇష్టంగా వుంటుంది. తమకది అయిష్టమని దోషులు రాజులను చంపకూడదు, తిట్టకూడదు. అప్రియాలు ఆడరాదు. పరిహసించ కూడదు. అతడు చెప్పిన దాన్ని ధిక్కరించకూడదు. ఎందుకంటే దేవతలే ధర్మ రక్షణ కొరకు మనుష్య రూపంలో సంచరిస్తారు. కొంచెం కూడా ధర్మ సూక్ష్మం ఆలోచించకుండా నిన్ను కొట్టితినన్న కోపంతో నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడావు. విను...నేను, నా తాతలు, తండ్రులు ఏ ధర్మాన్ని ఆచరించారో ఆ ధర్మాన్ని వదలినవాడిని కాదు. ఇది నా వృత్తాంతం. నా అభిప్రాయం చెప్పాను. ఇంకా తిట్టావా? తిట్టు. మెచ్చుకుంటావా? మెచ్చుకో. నేనేదీ కాదనను. కోప్పడను. సంతోషించను".

శ్రీరాముడి మాటలకు సమాదానపడి తనను క్షమించమని కోరిన వాలి

ఈ విధంగా రామచంద్రమూర్తి చెప్పగా విన్న వాలి, ఆయనలో దోషం లేదని తెలుసకుని, దోషం లేనివాడిని నిష్కారణంగా పనికిమాలిన మాటలన్నానే అని బాధపడ్డాడు. ధర్మ మార్గంలో వుందామని నిశ్చయంతో ఇలా అన్నాడు.

"రామచంద్రా! నువ్విప్పుడు చెప్పినదంతా సత్యం. దాంట్లో కొంచెమైనా సందేహం లేనేలేదు. మాలాంటి అల్పజనులా నీ లాంటి ప్రజ్ఞావంతులైన పుణ్యాత్ములకు బదులు చెప్పకలిగేవారు? జ్ఞానం లేకపోవడంతో నేనేదేదో అన్నాను. నమస్కరిస్తున్నాను.....నాయనా నన్ను క్షమించు. రామచంద్రా!

నువ్వేమైనా సామాన్య పురుషుడివా? ధర్మ విచారంలో పెద్దలవద్ద చక్కగా శిక్షణ పొందావు. ప్రతీ విషయంలో యథార్థ జ్ఞానం కలవాడివి. పండిత శ్రేష్టుడివి. ఏది పాపం? దానికి సరైన శిక్ష ఏంటి? దానివల్ల ఫలితం ఏమిటి? అనే విషయాల్లో నీ మనస్సు సర్వదా నిశ్చయజ్ఞానం కలిగి కలతలేక నిర్మలంగా వుంటుంది. నాలాంటివాళ్లా నిన్ను తప్పులు పట్టగలిగేది? రామచంద్రా! నేను ఏ ధర్మాలను చేసినవాడిని కాదు. అధర్మాలనెన్నో చేశాను. ధర్మవిరుద్ధమైన పాపకార్యాలను చేశాను. ఇలాంటి నన్ను సుఖదాతవైన నువ్వు నా తప్పులను క్షమించానని ధర్మార్థంగా ఒక్కమాట చెప్పు. నేను నీ చేతిలో యుద్ధంలో చనిపోయి ఉత్తమలోకాలకు పోతున్నాను. కాబట్టి నా మరణానికి నేను చింతించను. సుగ్రీవుడున్నాడు కాబట్టి నేను నా ప్రియభార్యకై కూడా దుఃఖపడను. నాలాగే సుగ్రీవుడిని ఆశ్రయిస్తారు కాబట్టి నా బంధువుల గురించి కొంచెం కూడా విచారించను. బంగారు భుజకీర్తులు కల నా ముద్దుల కుమారుడు అంగదుడిని తలచుకుంటే చెప్పలేని దుఃఖం కలుగుతున్నది".

అంగదుడిని శ్రీరాముడికి అప్పగించిన వాలి

"రామచంద్రా! నాకొక్కడే కొడుకు. వాడు సద్గుణాల శ్రేష్టుడు. ఆ కారణాన నేను వాడిని ఎంతో చనువుగా బుజ్జగించి, లాలించి కాపాడాను. ఇప్పుడిలా నేను ఇలా నేలపడిపోవడం చూసి తండ్రీ! పోయావా అని కాంతిహీనుడై ఎంతగా దుఃఖపడతాడో? రామచంద్రా! వాడు పిల్లవాడు కాబట్టి నా దగ్గర ఎక్కువ చనువుగా మెలిగి నన్ను విడిచి అల్పకాలమైనా వుండేవాడు కాదు. అది కూడా వాడు నాకు ఒక్కడే కొడుకు. ఇది మంచి, ఇది చెడు అని తెలుసుకునే శక్తి లేనివాడు. ఇకవాడికి మంచి చెడ్డలు శ్రద్ధగా ఎవరు నేర్పుతారు? వాడిని విచారించేవారెవరూ లేకపోతే వాడేమైపోతాడో అని దుఃఖిస్తున్నాను. రామచంద్రా! వాడికి నువ్వే దిక్కు. నీకు అప్పగిస్తున్నాను. వాడికి తల్లివైనా, తండ్రివైనా, నువ్వే. వాడికి నువ్వు తప్ప తల్లి–తండ్రులెవరూ లేరు. కాబట్టి రామచంద్రా! నీకెలాంటి రాగద్వేషాలు లేవు. నేను నీకు విరోధిని కాదు. కాబట్టి సుగ్రీవుడి మీద ఏ ప్రేమ వుంచావో ఆ ప్రేమ అంగదుడిమీద కూడా వుంచు. వాడు చేయగల పనులకు నువ్వే వాడిని ఉపయోగించుకో. సుగ్రీవుడి స్వాధీనంలో వుంచవద్దు. వాడిని పాల ముంచినా నీట ముంచినా ఆ పుణ్యపాపాలు నీవే".

"రామచంద్రా! భరతుడి మీద,లక్ష్మణుడి మీద నీకెలాంటి ప్రేమ, ఆప్యాయత వుందో అలాంటిదే అంగదుడి మీద, సుగ్రీవుడి మీద కనపర్చు. రామచంద్రా!

తార సత్స్వభావం, మంచి ఆలోచనకలది. నేను చనిపోయిన కారణాన దుఃఖిస్తుంది. నేను సుగ్రీవుడితో విరోధించిన కారణాన ఆమె కూడా నాలాగే దోషం చేసినట్లే కదా? అందువల్ల సుగ్రీవుడు ఆమెమీద కోపంతో ఆమెను నీచురాలిగా చూసి అవమానించకుండా చూడు. నాకొరకై ఆమె సుగ్రీవుడికి ఎప్పుడూ ద్రోహం చేయలేదు. దేవా! సుగ్రీవుడు నీపట్ల వినయవిధేయతలు కలిగి నీ ఇష్టప్రకారం ప్రవర్తిస్తే ఒక్క భూమినే కాదు స్వర్గాన్నైనా పాలించగలడు. ఇది సత్యం. మీ మహిమ నాకు తెలుసు. ఇంత తెలిసినేవాడిని, నేను, ఎందుకు యుద్ధానికి వచ్చానని నన్ను అడుగుతావేమో? నీ గురించి తెలియగానే నీ దగ్గరకు వస్తే పోయేదికదా అంటావేమో? నన్ను పోవద్దనీ, రాముడిని జయించలేననీ, తార నాకు అనేకవిధాలుగా చెప్పింది. కాని యుద్ధంలో నీ చేతిలో చావాలని అనుకునే యుద్ధం చేయడానికి వచ్చాను".

(వాలి మహావీరుడనే విషయంలో సందేహం లేదు. అంతమాత్రాన తనమీదకు యుద్ధానికి వచ్చినవారి మీదికే పోయేవాడే కాని, తనంతట తానుగా, రావణుడిలాగా అందరిమీదకు యుద్ధానికి పోయేవాడు కాదు. వాలి బలపరాక్రమాలు తెలిసినారెవరూ ఆయనమీదకు యుద్ధానికి పోయేవారు కాదు. ఇక వాడు చావడం ఎలాగా? వీరుడు వీరమరణం కోరుకుంటాడు కాని రోగిలాగా మంచం మరణం కోరడు. ఇప్పుడు తాను యుద్ధం చేయగల వీరుడు లభించాడని యుద్ధానికి వచ్చాడు. మరలాగైతే ఇంతసేపు ఎందుకు రాముడిని ఇన్ని తిట్లు తిట్టాల్సిన అవసరం వచ్చింది? సుగ్రీవుడికి సహాయంగా రాముడు వస్తాడు....అప్పుడు కలహించి చావాలనుకున్నాడు. కాని, రామచంద్రమూర్తి అలా చేయలేదు. ఆ కారణాన ఆశాభంగం అయింది. అది కాకుండా దెబ్బతిని పడ్డప్పుడు రోషం, అవమానం తీవ్రంగా బాధించడం వల్ల ఆ సమయంలో ఆ కాసేపు తెలివి చెడడం సహజం).

వాలిని సమాదానపర్చిన శ్రీరాముడు

ఇలా చెప్పిన వాలి, నమస్కారం చేసి, మౌనంగా వుండడంతో రామచంద్రమూర్తి ధర్మయుక్తములైన మాటలను ఇలా అన్నాడు వాలితో.

"వానరరాజా! నీ కొడుకు గతి ఏమవుతుందో అని విచారించవద్దు. నేను చేయతగని పని చేశానని కాని, నువ్వు పాపం చేశానని కాని అనుకోవద్దు. నీకు పాపకార్యం చేయడంలో పట్టుదల వుండడం వల్ల నేను బలవంతంగానైనా

ప్రాయశ్చిత్తం పెట్టాల్సి వచ్చింది. నేను నీకు మంచిమాటలతో నువ్వీపాపం చేశావని, ప్రాయశ్చిత్తం చేసుకొమ్మని చెప్తే వినేవాడివా? కారణముంటేనే కాని కార్యం జరగదు. కారణం లేకపోతే పని కాదు. నువ్వు చేసిన చెడ్డ పని కారణం అనుకోవాలి. నేను నిన్ను దండించడం కార్యం అనాలి. దీనివల్ల మనమిద్దరం బాగుపడ్డాం. దోషం చేసినవాడు శిక్ష అనుభవించి పవిత్రుడవుతాడు. కాబట్టి నువ్వు నాచే దండించబడి పవిత్రుడివయ్యావు. నిన్ను దండించకపోతే నేను నరకం పాలయ్యేవాడిని. ఇప్పుడు నాకా గండం తప్పింది. మనకిద్దరికీ నరక భయం లేదు".

"నువ్వు పాపకార్యం చేశావు కాబట్టి నేను నిన్ను దండించాను. దానివల్ల నువ్వు పాపరహితుడివై ఈ దేహాన్ని విడిచి నిర్మలమైన దేవతాస్వరూపాన్ని ధర్మ మార్గంలో పొందేవాడివయ్యావు. నిన్ను దండించకపోతే నువ్వు నరకానికి పోయేవాడివి. కాబట్టి దీనికి ఆయాసం కాని, ఈర్ష్య కాని, కోపంకాని తెచ్చుకోకు. విధి తప్పించడం ఎవరి తరం? ఇదిలా జరగాలని ముందే ఏర్పాటైనందువల్ల జరిగిందని భావించు. నీ కొడుకు విషయంలో నువ్వు కొంచెం కూడా విచారించవద్దు. అంగదుడు నీకెలాగో, నాకు, సుగ్రీవుడికి అలాగే అనుకో".

ఇలా శ్రీరాముడు చెప్పగా విన్న వాలి, ధర్మ మార్గంలో చరించే వారిలో మొదటివాడైన రామచంద్రమూర్తి తీయటి మాటలకు ఆయన తన మనసులోని సందేహాన్ని వదిలాడు. "రామచంద్రా! మహానుభావా! నువ్వు ప్రయోగించిన వాడి బాణం నిప్పులాగా నన్ను కాలుస్తుంటే, ఆ బాధతో తెలివిహీనుడనై నిన్ను తిట్టాను. రామచంద్రా! నన్ను క్షమించు" అన్నాడు వాలి.

సర్గ–19
వాలి మరణవార్త విని కిష్కింధ వెడలి వచ్చిన తార

రామచంద్రమూర్తి చెప్పిన యుక్తి–యుక్తమైన మంచి మాటలకు ప్రత్యుత్తరం ఇవ్వలేక క్షమించమని వేడుకుని, పెద్ద మూర్ఛ వచ్చినందున వాలి బాధతో నేలకొరిగాడు. సుగ్రీవుడికి వాలిమర్మం తెలుసు. దగ్గరికిపోతే తనను పట్టుకుని తన బలం లాక్కుంటాడనీ తెలిసే, దూరం నుండే రాళ్ళతోను, చెట్లతోనూ విసిరికొట్టాడు. ఆ దెబ్బలకు వాలి కీళ్లు బాగా నొప్పి కలిగించాయి. దానికి తోడు, రామబాణం మేకులాగా శరీరానికి గుచ్చుకుంది. ఈ కారణాన కాళ్లలో బలం పోయి కదిలించలేక, బాణం బాధకు విలవిల్లాడాడు. ఇక అక్కడ కిష్కింధలో వున్న తారకు తన మగడు చనిపోయాడన్న వార్త తెలిసింది. సహించలేని దుఃఖం వస్తుంటే, భయంతో వాలిని చూడాలన్న కోరికతో త్వరత్వరగా కొడుకుతో సహా కిష్కింధ వదిలి వచ్చింది. అంగదుడి పరిచారకులైన వానరులు ధనుర్ధరుడై వున్న రామచంద్రుడిని చూసి, బెదిరి, నలుదిక్కులా పరుగెత్తారు. రామబాణాలు తమను తాకుతాయేమో అన్న విధంగా పరుగెత్తుతున్న ఆ కోతులను చూసి తార ఇలా అంది.

"ఓరీ, పిరికివాళ్లలారా! మీకు వచ్చిన భయం లేదు. రాజ్యం కొరకు తమ్ముడు దూరంగా వేసిన బాణాలతో అన్నను చంపించాడు. ఇన్నాళ్లు మీరంతా మీ ప్రభువును సర్వదా కొలుస్తూ, కాపాడుతూ, ఇప్పుడు ఆపత్కాలంలో విడిచిపెట్టి కొండలకు, గుహలకు పరుగెత్తి పోవడం న్యాయమా?".

తారకు వాలి పడిపోవడం చెప్పిన వానరులు

అని తార చెప్పిన మాటలు విన్న కోతులన్నీ ఇలా యుక్తితో కూడిన మాటలు

చెప్పారు. "ప్రాణాలతో వున్న కొడుకు కల నువ్వు కొడుకుతో సహా ఇలా రాకూడదు. ఇంటికి పో. ఎందుకంటే ముందు నీకొడుకు ప్రాణాన్ని కాపాడుకో. వాలిని చంపినట్లే నీ కొడుకును కూడా చంపితే నువ్వేం చేస్తావు? యముడే రాముడి వేషంలో వచ్చి దూరం నుండి బాణం వేసి వాలిని వధించాడు కదా రాణీ! నువ్వు సహగమనం చేస్తానంటావా? కొడుకులున్న నువ్వాపని చేయరాదు కదా? కాబట్టి వూరు విడిచి రావద్దు. గుండ్రాళ్ళతో కొట్టి, చెట్లతో బాది, వాలి భయంతో వుంటే రాముడు వజ్రాయుధం లాంటి బాణాలతో చంపాడు. దీంట్లో సుగ్రీవుడి పాత్ర వుంది. ఇంద్ర తేజస్సుకల వాలి నేలపడగా చూసి కలిగిన భయం వల్ల కోతులన్నీ అక్కడ వుంటే తమను కూడా చంపుతాడేమోనని భయంతో కిష్కింధవైపు పరుగెత్తారు. నువ్విక హెచ్చరికతో వుండు. అంగదుడికి వైభవంగా పట్టాభిషేకం చేస్తే కోతులందరూ పూర్వం వాలిని సేవించినట్లే అంగదుడినీ సేవిస్తారు. నువ్విలా బయట తిరిగితే నీకూ అపాయం కలుగుతుంది".

వానరుల మాటలకు తార తాను చేయాల్సిన పని గురించి ఆలోచించింది. తన యోగ్యతకు తగ్గట్లు శోకాగ్నితో తపించి వాడిన తన ముఖంలో వస్తున్న కన్నీళ్లను పైటకొంగుతో తుడుచుకుని ఇలా అంది. "అయ్యో! లోకోత్తర చరిత్రుడై ప్రసిద్ధికెక్కి, పూజ్యమైన మనస్సుకలిగి, సింహం వంటి వాడైన నా భర్తే నాకు దక్కకపోతే ఇక నాకు రాజ్యమేల? కొడుకేల? దేహమేల? అవా నన్ను రక్షించేది? కాబట్టి రామ బాణం దెబ్బకు పడిపోయిన నా భర్త పాదాల దగ్గరకు పోతాను".

వాలిని చేరబోయిన తార

వానరులకు తాను చెప్పదలచుకున్నది చెప్పి, వాలిని దూరం నుండే చూసి, కీళ్లు సడలిపోగా, నడవలేక-నడవలేక, వాలిని సమీపించింది తార. అలా సమీపించిన తార, వాలిని, ఆయనను బాణంతో చంపిన శ్రీరాముడిని, పక్కనే వున్న లక్ష్మణుడిని, ఈ పనంతా వారితో చేయించిన సుగ్రీవుడిని చూసింది. వాలిని సమీపిస్తూనే, బాణం తాకిడికి నేలమీద పడివున్న ఆయన్ను చూసి, మూర్చిల్లి, నిలబడి, గాఢనిద్ర నుండి లేచినదానిలాగా "ప్రియనాథా! మనోహరా!" అని ఏడ్చింది. ఇలా ఏడుస్తున్న వదినను, చావడానికి సిద్ధంగా వున్న అన్నను, సుకుమారుడైన బాలుడు అంగదుడిని చూసిన సుగ్రీవుడు దుఃఖంతో వేడి కన్నీళ్లు కార్చాడు.

సర్గ–20
తారావిలాపం

దుఃఖం అతిశయిస్తుంటే తన భర్తను కౌగలించుకుని ఆయన శరీరం మీద పడి ఏడిచింది తార. ఏడుస్తూ, "రాజా! నీకు భూమి అనే స్త్రీమీద ఎంత మక్కువోకదా? అలా కాకుంటే, పక్కనే వున్న నన్ను లక్ష్యం చేయకుండా, నన్ను వదిలి, భూమిని కౌగలించుకుని విడవడం లేదు కదా! స్వర్గానికి పోయే దారిలో నీకు కిష్కింధలాంటి సంపద్యుక్తమైన వేరే నగరం లభించింది కాబోలు. లేకపోతే ఎన్నో శుభాలకు ఆలవాలమైన ఈ ఊరిని విడుస్తావా? నన్నెవ్వరింక ప్రాణేశ్వరీ అని ప్రేమగా పిలుస్తారు? నా ఆశలన్నీ అడియాశలయ్యాయి కదా? నీతో విహరించే కాలం నేటితో ముగిసిందా? నా దుఃఖం తన దుఃఖం అని ఇంక ఎవరు భావిస్తారు నువ్వు లేకపోతే? నీ లాంటి భర్త నన్ను వదిలి ఈ గులక రాళ్ళమీద పడివుండగా చూసి కూడా నా హృదయం వేయి తునకలు కావడం లేదు. దీనికి ఏనాటికీ నాశనం లేదేమో? ఇప్పుడే కాకపోతే ఇంకెప్పుడు అవుతుంది? ఇంతకు మించిన విపత్తు మరేం వుంటుంది? తమ్ముడిని వూరు నుండి వెళ్లగొట్టి వాడి భార్యను బలవంతంగా భార్యను చేసుకున్నావు. దాని ఫలం ఈవిధంగా అనుభవిస్తున్నావు. నీ మేలుకోరి ఆ దుష్కార్యం చేయవద్దని నేను చెప్పలేదా? నా మాట నీ చెవులకు ఎక్కిందా? మోహంతో నన్ను ఛీ అంటూ చీవాట్లు పెట్టావు కదా?"

"మంచి మనస్సు కలవాడా! దేవతా స్త్రీలను నీ సౌందర్యంతో లోపర్చుకుని కోరిక తీర్చుకుంటావా? నీ సుఖం మాత్రం నువ్వు చూసుకుంటున్నావు కాని ఇన్నాళ్లుగా నాతో వుండి కూడా నన్నిక్కడ ఒంటరిగా విడిచి పోవడం నీకు ధర్మమా? నిన్ను యుద్ధానికి పోవద్దని ఎంత బతిమాలుకున్నా నామాట

వినకుండా దయ్యం పట్టినట్లు, బలాత్కారంగా నిన్నెవరో ఈడ్చుకుని పోయినట్లు, యుద్ధానికి పోయావో, అప్పుడే నీకు ప్రాణాంతకమైన కాలం సమీపించింది అని అనుకున్నాను. నాథా! ఇంతవరకు దుఃఖం అంటే ఏమిటో నా మనస్సుకైనా తెలియదు. నువ్వు నన్ను గౌరవించడం వల్ల దీనత్వం అంటే ఏమిటో తెలియదు. ఇక ముందు దీనత్వంతో అంతులేని దుఃఖంతో, శుష్కిస్తూ దిక్కులేనిదానిలాగా ఈ వైధవ్యాన్ని ఎలా సహించాలి? (అంగదుడిని చూసి) కుమారా! ఇక్కడికి రా. ధర్మప్రీతికల నీ తండ్రిని కరువుతీరా చూడు. ఇదే కడసారి చూపు. ఇకమీద నీ తండ్రిని నువ్వు చూడాలనుకున్నా ఆ అదృష్టం నీకు లేదు. ఇంక ఎవరిని నువ్వు నాయనా అని పిలుస్తావు?"

"శూరాగ్రేసరా! ఇదిగో, వీడే అంగదుడు. చూడు. ఎప్పుడు కూడా సుఖం లేకుండా లేడు. సర్వకాలం ముద్దుగా పెంచుతే అలాగే పెరిగాడు. నీ ఎదుట మాట్లాడడానికే భయపడుతాడు. అలాంటప్పుడు, కోపం కల పినతండ్రికి సేవ ఎలా చేస్తాడో? చేయకపోతే ఏమవుతుందో? (భర్తమీద పడి) వానరేశ్వరా! వీడే నీ కొడుకు. కళ్ళు కొంచెం తెరిచి చూడు. ఎందుకేడుస్తున్నావని సమాదానపర్చు. శిరస్సు వాసన చూడరాదా? దూరం పోతున్నావే! కడసారి మాటగా బుద్ధి చెప్పవా? వానరేంద్రా! నిన్ను చంపి రామభద్రుడు గొప్ప పని చేశాడు. అదేంటంటావా? సుగ్రీవుడికి చేసిన ప్రమాణం సార్ధకం చేసి ఆ అప్పు తీర్చుకున్నాడు. (సుగ్రీవుడిని చూసి) సుగ్రీవా! విరోధం పోయేట్లు అన్నను చంపావు. ఇక హాయిగా రుమతో, రాజ్యరమతో సుఖపడు. (మళ్లీ వాలిని చూసి) ప్రియా! నీ ప్రియురాళ్ళందరూ ఇక్కడ ఏడుస్తున్నారు. వాళ్లతో ఒక్క మాట మాట్లాడకూడదా?"

ఇలా తార అనగా, వాలి ప్రియురాళ్ళు, ఆడ కోతులు, తార, అంగదుడిని కౌగలించుకుని, తమ హృదయేశ్వరుడైన వాలితో ఇలా అన్నారు. "కపిరాజా! నీ ముద్దుల కొడుకును, గుణాల్లో నీతో సమానమైన వాడిని, అంగదుడిని, వదిలి పరదేశం పోవచ్చా? ఇలా చేయడం నీకు సరైంది కాదు. ఆలోచించు. వీరుడా మమ్మల్ని, నీ కొడుకును వదిలి స్థిరంగా పరలోకానికి పోవడం నీకు తగునా? నువ్వు మమ్మల్ని వదిలిపోవడానికి మేం కాని, నీ కొడుకు కాని ఏం తప్పు చేశాం? ఒకవేళ మేం పొరపాటున అలాంటి దోషం చేస్తే మంచి స్వభావం కలవాడా! మమ్మల్ని క్షమించు. కపిశ్రేష్టా నీపాదాల మీద పడుతున్నాం. దయచూడు".

ఇలా ఏడుస్తూ తక్కిన ఆడ కోతులతో తార తన మగడి సమీపంలోనే ప్రాయోపవేశం చేయడానికి ఆలోచించింది.

సర్గ–21
తారను ఓదార్చిన హనుమంతుడు

ఆకాశాన్నుండి నేలమీద పడ్డ నక్షత్రంలాగా చంద్రుడి లాంటి ముఖం కల తారతో హనుమంతుడు ఇలా అన్నాడు. "దేవీ ఎందుకు ఏడుస్తున్నావు? ఏడవడం మాను. దేహదారులెవ్వరైనా తెలిసి చేసినా, తెలియక చేసినా, వారు చేసిన పుణ్యకార్యమైనా, పాపకార్యమైనా కర్మకు తగ్గ ఫలితం అనుభవించక తప్పదు. పుణ్యకర్మకు శుభం, పాపకర్మకు కీడు కలిగించడానికి వారివెంట పరలోకానికి పోవడం జరుగుతుంది. అలాగే వాలి కూడా తన శుభాశుభ కర్మఫలం అనుభవించడానికి పోయాడు. దీనికోసం నువ్వు సుగ్రీవుడిని కాని, రాముడిని కాని నిందించాల్సిన అవసరం లేదు. వారు నిమిత్తమాత్రులే. దేవీ! అందరికీ శరీరాలు నీటిబుగ్గల్లాగే అల్పకాలం వుండేవే కాని శాశ్వతంగా వుండవు. కాబట్టి శరీరానికోసం ఎందుకు ఏడుస్తావు? వాస్తవానికి నువ్వు ఏడ్వాల్సింది నీకోసం కాని ఇతరుల కొరకు కాదు. నువ్వు చేసింది నిన్నే బాధిస్తుంది కాని ఇతరులు చేసింది నిన్ను భాదించదు. కాబట్టి నువ్వు చేయకూడనివి విడిచినా ఇలా చేశానుకదా అని ఏడువు. ఇతరులకు ఏడవడం వల్ల నీకు కలిగే మేలేంటి? నువ్వే ఎంతో దీనురాలివి. నిన్ను నీవు ఉద్ధరించుకోలేని దశలో వున్నావు. ఇక మరొకరి దీనస్థితికి వగచి ఏమి ఫలం? తమల్ని తాము కాపాడుకోలేని వారు ఇతరులను ఎలా రక్షిస్తారు? పడిపోయే చెట్లు పడుతున్న చెట్లను కాపాడగలవా? కాబట్టి లోకంలో ఎవరు ఎవరికై ఏడ్వాలి? జరిగిపోయినదానికి బాధపడకుండా జరగాల్సిన పని చక్కబెట్టడానికి ప్రయత్నం చేయి. నిన్నేం చేయమంటావా?"

"నువ్వు చేయాల్సింది చెప్తా విను. నీ కొడుకు అంగదుడు బాలుడు. తప్పులు

తెలిసినవాడు కాదు. వాడు జీవించి వున్నాడు. అలాంటివాడిని నువ్వు కాకుండా మరెవ్వరు రక్షిస్తారు? నీ కడుపున పుట్టినవాడిని రక్షించే శ్రద్ధ నీకే లేకపోతే ఇతరులకు ఎలా వుంటుంది? ఆ భారం నీమీదే కదా వుంది? వాడికి ఇకమీద జరపాల్సిన శుభ ప్రయోజనాలు జరపాల్సినదానివి నువ్వే కదా? ఈ మాత్రం ఆలోచించకుండా దేహం ఎందుకు వదలాలనుకున్నావు? దుఃఖం నీ తెలివిని నాశనం చేసిందా? నిర్మలచిత్తా! ఈ లోకంలో పుట్టినవేవీ స్థిరంగా వుండవు. మరణించినవి మళ్లీ పుట్టకపోవు. ఈ రెండూ నిత్యం జరిగేవే. పుట్టినవి చావడం నిజం....చచ్చినవి పుట్టడం నిజం. ఇది నీకు తెలియదా? కాబట్టి మనకు ప్రియమైనవారికి బతికి వున్నప్పుడు వారి మేలుకొరకు ఈ లోకకార్యాలు ఎలా చేస్తామో, మరణించి పరలోకానికి పోయినప్పుడు అక్కడ కూడా వారికి మేలుకలిగే ప్రేతకార్యాలు చేయాలి. వారిని గురించి ఈ లోకకార్యాలైన రోదనలు చేయకూడదు. అలా చేస్తే వారికి కీడు కలుగుతుంది. బ్రతికినవారికి ప్రేతకార్యాల లాగా చనిపోయినవారికి రోదనలు నిషిద్ధం''.

"వాలికొరకు ఎందుకు ఏడుస్తున్నావు? పరలోక సుఖం కోసం కావలసిన వాటిని ఈ లోకంలో చేసుకోకముందే మరణించాడని ఏడుస్తున్నావా? వేల, లక్షల, కోట్ల సంఖ్యకల వానరశ్రేష్ఠ సమూహాన్ని పరిపాలించాడు. తన్నాశ్రయించిన బంధువులను, స్నేహితులను అనేక విధాలుగా గొప్ప మనస్సుతో వారి–వారికి తగిన జీవనాలు కల్పించి బ్రతుకుతెరువు కలిగించాడు. ధర్మం మీద ఆసక్తితో శాస్త్రంలో చెప్పిన విధంగా తత్త్వార్థం తెలుసుకుని సామ,దాన, శాంతి అంటే ప్రేమకలవాడయ్యాడు. ఇలా ఈ లోకంలో చేయాల్సినవన్నీ చేసి లోకాన్ని వదిలాడు వాలి. అంగదుడికి, కపిశ్రేష్టులకు, భల్లూక శ్రేష్టులకు, కపిరాజ్యానికి నువ్వే దిక్కు. సమస్త భారం నీమీదే వుంది. ఏడవడం ఆపుచేయి. క్రమక్రమంగా నీ సహాయంతో నీ కొడుకు రాజ్యం చేయడం నువ్వు చూసి సంతోషిస్తావు. కాబట్టి ఇలా దుఃఖపడవద్దు. గతించిన దానికొరకు నువ్వు ఏడ్చి ప్రయోజనం లేదు. భవిష్యత్ లో నీకు, నీకొడుక్కు రాగల కష్టం ఏదీ లేదు. కాబట్టి వర్తమానంలో జరగాల్సింది ఆలోచించు. లోకులు ఏ ప్రయోజనం కోరి కొడుకులు కావాలని కోరుకుంటారో అది నెరవేరే కాలం అంగదుడికి సంభవించింది. నీ కొడుకును తండ్రికి ఉత్తర క్రియలు చేయనివ్వు. అంగదుడు తండ్రికి సంస్కారం చేయగా అతడి రాజ్యాన్ని స్థాపించి నువ్వు దుఃఖం పోగొట్టుకుంటావు''. ఇలా అన్న హనుమంతుడికి తార ప్రత్యుత్తరం ఇచ్చింది.

హనుమంతుడికి ప్రత్యుత్తరం ఇచ్చిన తార

హనుమంతుడి మాటలకు ప్రత్యుత్తరం ఇస్తూ తార, "హనుమంతా! అంగదుడు లాంటి కొడుకులను వందమందిని కనడం కంటే శౌర్యమే సంపదగా కలిగి, యుద్ధంలో మరణించిన నా భర్త దేహాన్ని కౌగలించుకోవడమే శ్రేష్ఠం. వాలికి ప్రేతకార్యాలు చేయడానికి నేనెవ్వరిని? అంగదుడికి రాజ్యం అప్పగించడానికి నేనెవరిని? అవన్నీ చేయగల సమర్థుడు వాడి పినతండ్రి సుగ్రీవుడు. నా ప్రాణేశ్వరుడే స్వర్గానికి పోగా రాజ్యానికి రాజు సుగ్రీవుడా? అంగదుడా అన్న మీమాంస నాకెందుకు? ఎవరు రాజైనా నాకు కలిగే గౌరవం, సుఖం, లాభం ఏముంది? నా ప్రాణేశ్వరుడు వున్న చోటే కదా నా ప్రాణం వుండాలి? ఆంజనేయా! అంగదుడి విషయంలో నేను ఆలోచించాల్సిన, విచారపడాల్సిన అవసరం లేదు. కొడుకుకు విద్యాబుద్ధులు నేర్పి, గుణవంతుడిని చేయాల్సిన భారం తండ్రిది కాని తల్లిది కాదు. తల్లి మీద దేహ పోషణ భారం మాత్రమే వుంది. తల్లితండ్రులు ఇద్దరూ లేనివారికి ఏ తల్లైనా ఇంత కూడు పెట్టదా? పరలోకంలోనైనా, ఈ లోకంలోనైనా, వాలిని ఆశ్రయించి వుండడం కంటే ఉత్తమమైనది నాకు కనబడడం లేదు. కాబట్టి రణంలో ఎదురు ముఖంగా దెబ్బతినిన వీరుడి వీర శయనం మీద నేను పడుకోవడం సరైనదే".

సర్గ–22

తాను చేసిన అపకారం మరిచిపొమ్మని సుగ్రీవుడికి చెప్పిన వాలి

ఇలా వీళ్లు మాట్లాడుకునే సమయంలో కొంచెం ఊపిరికల వాలి మెల్లగా ఊపిరి పీల్చుకుంటూ కళ్లు విప్పి, తన దగ్గర వున్న అంగదుడిని, అతడి సమీపంలో వున్న సుగ్రీవుడిని చూసి, స్నేహపూర్వకమైన మాటలతో స్పష్టంగా ఇలా అన్నాడు. "సుగ్రీవా! నీమీద పగసాధించానని నన్ను దూషించవద్దు. నీలో ఏదోషం లేదు. ఇదిలా జరగాలని వుండడం వల్ల నా ఫలం నన్ను బట్టుకుని యీడ్చి, బలవంతంగా జ్ఞానహీనుడిని చేసింది. అన్నదమ్ముల మర్యాద ప్రకారం మనం ఒక్కటిగా వుండలేకపోయాం. తమ్ముడా! ఇది దైవం చేసిన పని. దాన్ని తప్పించడం మన శక్యమా? ఇక నేను జీవించలేను. ఈ వానర రాజ్యాన్ని నువ్వు సంతోషంగా పాలించు. ప్రాణం, రాజ్యం, సంపద, భూమీ్మద మూడులోకాల పొగడ్తలు కన్న యశస్సు వదిలి స్వర్గానికి పోతున్నాను.

సుగ్రీవుడికి అంగదుడిని అప్పచెప్పిన వాలి

"సుగ్రీవా! నువ్వే రాజువి. నా ఈ మరణావస్థలో నువ్వు చేయడానికి కష్టమైన పని నేను చెప్పినా, నువ్వు చేయననకుండా చేయడమే ధర్మం. అదిగో నేను పెంచిన బాలుడిని, బుద్ధిమంతుడిని, ఏడుస్తున్న వాడిని, సుఖపడే అర్హుడని నేనెప్పుడూ గారాబంగా పెంచిన పిల్లవాడిని, అంగదుడిని, నా కుమారుడిని, నా ప్రాణాలకంటే ఎక్కువైన వాడిని, నువ్వు కన్నకుమారుడిలాగా అన్నివేళలా కాపాడు. తండ్రివి, తాతవు, అన్నీ ఇక నువ్వే. వాడు బాలుడు కాబట్టి భయపడినప్పుడు ఆ భయాన్ని పోగొట్టు. పరాక్రమంలో, వేగంలో, గమనంలో, నీకు సమానుడు వాడు. యుద్ధంలో రాక్షసులను చంపాల్సి వస్తే నీ కళ్లెదుటే పరాక్రమించగలడు. వాడి వయస్సు, శక్తికి తగిన పనులు చేయగల సమర్థుడు.

యుద్ధంలో దక్షుడు. సందేహం లేదు''.

"ఈ తార సుషేణుడి కూతురు. సూక్ష్మ విషయాల్లోనూ ఎలా కార్యం నిర్వహించాలో తెలిసిన సమర్థమైన మనస్సు కలది. శకునాలను బట్టి రాగల కీడును చెప్పగల పండితురాలు. ఆమె ఏదైతే మంచిది అంటుందో, దాన్ని సందేహించకుండా, స్త్రీ బుద్ధి కదా అని అనకుండా ఆ పని చేయవచ్చు. ఇంతెందుకు? ఆమె ఇది చేయవచ్చు అని అంటే చేయి. వద్దంటే మాను. ఏదైనా సరే, రాముడి కార్యం అయితే నువ్వు సందేహించకుండా అవశ్యం చేయాలి. చేయకపోవడం అధర్మమే కాకుండా నువ్వు ఆయన్ను అవమానించావని వెంటనే చంపుతాడు. కాబట్టి భయం, భక్తీ కలిగి వుండు. వానర రాజా! నేను మరణిస్తే నా ఈ బంగారుహారం మహిమను కోల్పోతుంది. నువ్విప్పుడే దీన్ని తీసుకుని ధరించు. ఇది ధరించే శత్రువులను సంహరించు. ఇది గొప్ప మహిమకల బంగారుదండ''.

ఇలా వాలి తనకు చెప్పగా సుగ్రీవుడు గ్రహణం పట్టిన చంద్రుడిలాగా కాంతిహీనుడయ్యాడు. అన్న మాటలు విన్న సుగ్రీవుడు తన మనస్సులో పూర్వం ఆయన మీద వున్న విరోధం, రోషం వదిలి శాంతించి, బంగారు సారాన్ని ఆయన ఆజ్ఞానుసారం తీసుకున్నాడు.

అంగదుడికి నీతి బోధించిన వాలి

వాలి తన కొడుకును ఉద్దేశించి ధర్మాన్ని ఇలా ఉపదేశించాడు. "కుమారా! కార్యాలు చేయడానికి ఏ దేశంలో, ఏకాలంలో, ఏ కార్యాన్ని ఎలా చేయాలో తెలుసుకుని చేయి. అన్ని దేశాలు, అన్ని కాలాలు సమానం అని భావించవద్దు. ఒక దేశంలో ఉచితమైన కార్యం మరో దేశంలో, ఒక కాలంలో ఉచితమైన పని మరో కాలంలో ఉచితమైనది కాదు. కాబట్టి సందర్భోచితంగా ప్రవర్తించు. ప్రియమైనా, అప్రియమైనా సహించాలి. ప్రియమైతే సంతోషంతో పొంగిపోకు. అప్రియమని కుంగిపోకు. రెండు సార్లూ నీ మనస్సుని సమానంగా చూసుకో. అలాగే రాజు ఏదైనా చెప్తే, నీకు అది ప్రియమైనదైతే ఎలా చేస్తావో, అప్రియమైనా అలాగే చేయి. ప్రభు కార్యాలు చేసేటప్పుడు ప్రియా-ప్రియాలు లెక్కలోకి రానివ్వకు. అలాగే కార్యాలు చేసేటప్పుడు సుఖ, దుఃఖాలు ఏవి కలిగినా సహించు. ఈ విధంగా ప్రవర్తిస్తూ నువ్వు సుగ్రీవుడి అధీనంలో వుండు''.

"నాయనా! నువ్వు నాదగ్గర ఎలా చనువుగా వున్నావో అలా సుగ్రీవుడి దగ్గర

ప్రవర్తిస్తే నిన్ను నాలాగా ఆయన క్షమించడు. బుజ్జగించడు. ఏదో పిల్లతనంతో చేశాడని వూరుకోడు. దండిస్తాడు. కాబట్టి నా విషయంలో ప్రవర్తించినట్లు ఆయన విషయంలో ప్రవర్తించవద్దు. సుగ్రీవుడి పగవారితో కాని, స్నేహితులతో కాని నువ్వు స్నేహం చేయవద్దు. అది సందేహానికి కారణం కావచ్చు. ఇతడి పనులే ఓర్పుతో చేయి. నాయనా! ఎవరితో కూడా మితిమించిన స్నేహం చేయవద్దు. అది అవజ్ఞతకు కారణమవుతుంది. ఎవరితో కూడా విరోధించవద్దు. అతి సర్వత్రా వర్జయేత్తను సూక్తి ప్రకారం ఈ రెండూ చెడు కలిగించేవే! కాబట్టి హెచ్చరికతో మధ్యస్థుడిగా వుండు".

మరణించిన వాలి

ఈ విధంగా చెప్పి, వాడిగల బాణాల వల్ల బాధపడుతూ, గుడ్లు గిర-గిరా తిప్పుతూ, పళ్ళు తెలిసేట్లు నోరు తెరిచి వానర రాజు ప్రాణాలను విడిచాడు. కోతి గుంపులన్నీ హా! హా! అని ఏడ్చాయి. ఆ ప్రభువు చనిపోగా కిష్కింధ పాడుబడినట్లు కాంతిహీనమై కనిపించింది. కొండలు, తోటలు, గుహలు, పూర్వం ఉన్నట్లుగా కాకుండా పాడుబడినట్లు అయిపోయాయి.

"వేగంగా నడిచినప్పుడు అడవుల్లోని నిండార పూచిన చెట్లు ఎవడి వెంట వచ్చునో అలాంటి వాలి లాంటి బలం కలిగి ఆ ప్రకారం ఎవడు చేయగలడు? గోలభుడు అనే గంధర్వుడితో పదిహేను సంవత్సరాలు విడువకుండా హోరాహోరీ యుద్ధం రేయింబగళ్ళు చేసి పదహారో సంవత్సరంలో ఆ దుష్టుడిని చంపి మాకందరికీ భయం లేకుండా రక్షించినటువంటి వీరుడు ఇంక ఎవరున్నారు? ఇలా చేసిన ఆవీరుడిని మళ్లీ చూడలేంకదా?" ఇలా అంటూ, ఆవుల మందకు రక్షణగా వున్న ఆబోతు చస్తే రక్షణ చెడ్డ ఆవులు భయంకరమైన సింహాలు వుండే అడవిలో దుర్బలులై ఘోషిస్తున్నట్లు వానరులు వాలికొరకై ఏడ్చారు.

సర్గ–23

వాలి మరణానికి ఏడ్చిన తార

మరణించిన (వాలి) భర్త ముఖం చూస్తూ విస్తార శోక సముద్రంలో మునిగి ఏడుస్తూ, మగడిని కౌగలించుకుని తార నేలమీద పడింది.

ఇలా వాలిమీద పడ్డ తార ఆయన ముఖం దగ్గరికి తన ముఖం చేర్చి, దుఃఖంతో ఇలా అన్నది. "అయ్యో! నా మాట వినకుండా ఇటు వచ్చి గడుసురాళ్లమీద నీ శరీరాన్ని చేర్చావు కదా. వానరేశ్వరా! నా కళ్ళ ముందరే, నువ్విలా చేస్తే నేనేమైపోతానో అని శంకించకుండా భూదేవిని కౌగలించుకుని, సంతోషపరచి నాతో మాట్లాడవేంటి? నీకు అది అంతటి ప్రియురాలా? ఆర్యా! దైవం సుగ్రీవుడికి అనుకూలించింది కదా? భూమ్మీద శూరాగ్రణి అంటే సుగ్రీవుడే! అతడు కాకుండా నిన్ను యుద్ధంలో ఎదిరించి ఎవరైనా బతికారా? మేమంతా గొల్లుమని ఏడుస్తుంటే మా దీనవాక్కులు నీ చెవిన పడలేదా? ఇది నీకు తగిన కార్యమా? పూర్వం నీచేతిలో చంపబడ్డ శత్రువులు ఏ వీరశయనం మీద పండుకున్నారో యుద్ధప్రియుడవైన నువ్వు కూడా దానేమీదే కూలావుకదా? నన్ను దిక్కులేని దాన్ని చేసి ఎక్కడికి పోయావు? జ్ఞానం కలవారు తమ కూతుళ్లను శూరులకు భార్యలుగా ఇవ్వకూడదు. ఎందుకంటావా? శూరుడి భార్యనైన నాకే గతి పట్టిందో, వైధవ్యంతో ఎలా చచ్చానో అలాగే వారికి కూడా జరగవచ్చు".

"రాణి అనే గౌరవం పోయింది. ముత్తైదువు చావు లేకపోవడాన సద్గతి కూడా లేదు. ఎంత లోతో తెలియని దుఃఖ సముద్రంలో సంపూర్ణంగా మునిగాను. నా హృదయం రాయి కావచ్చు. లేకపోతే, మోహించే శరీరంకల నా భర్త చావగా చూసి కూడా అది నూరు ముక్కలు కాలేదు. నా స్నేహితుడు, నా దైవం, నా రక్షకుడు, నా మేలు కోరేవాడు, నా పెన్నిధానం, అసహాయశూరుడు, నన్ను

దిక్కులేని దాన్ని చేసి స్వర్గానికి పోయాడు. ఎంతమంది కొడుకులున్నా, ధాన్యం, సంపద ఎంత వున్నా, ధనం దండిగా వున్నా, మగడు లేని ఆడదాన్ని చులకనగా విధవ–విధవ అని అంటారు కదా! కొడుకులు, ధనం లేకపోతే కొరతగా చెప్పారు కాని, భర్త లేకపోతే అందరూ నిర్లక్ష్యంగానే చూస్తారు. ఆరుద్ర పురుగులాగా, ఎర్రటి కాంతితో, మనోహరమైన మెత్తటి పాన్పుమీదలాగా ఈ నెత్తురు వరద మధ్య నువ్వు పండుకోనాలని విధి కలిగించిందికదా? వానరరాజా! నెత్తురు వరదగా కారుతుంటే, దానిమీద దుమ్ములాగా పేరుకుంటే, కాంతిహీనమైన నీ మెత్తటి దేహాన్ని నేనెలా కౌగలించుకోవాలి? సుగ్రీవుడే కృతకృత్యుడు. దేహాన్ని వదిలిన నిన్ను దూరం నుండి చూడడం తప్ప రొమ్ములో నాటిన బాణం వల్ల నిన్ను కౌగలించుకోలేక పోతున్నాను".

ఇలా తార ఏడుస్తుంటే నీలుడు వచ్చి వాలి రొమ్ములో వున్న రామ బాణాన్ని లాగాడు. ఆ బాణం లాగడంతో వానర శ్రేష్టుడి గాయాల నుండి నెత్తురు కాలవల్లాగా పారింది. అప్పుడు తార వాలి శరీరం మీద వున్న ధూళిని తన కన్నీటి ధారలతో సర్వావయాలను కడిగింది. ఆ తరువాత తార అంగదుడిని దగ్గరకు తీసుకుని వాలిని చూపించి, "నీ తండ్రిని కళ్లారా చూశావా? పాపకార్యం వల్ల కలిగిన విరోధం ఈ రోజుతో దేహంతో వదిలాడు. కుమారా! ఇదే కడసారి, ఇక నీ తండ్రి ముఖం నువ్వు చూడబోవు. కాబట్టి మొక్కు. బాల సూర్యుడు లాంటి దేహం కలవాడు ఒక్కడే యమపురికి పోతున్నాడు". అని చెప్పింది. తల్లి అలా చెప్పగా, అంగదుడు వాలిపాదాల మీద పడి, "తండ్రీ! నేను అంగదుడిని. నమస్కరిస్తున్నాను. అంగీకరించు" అని అన్నాడు.

ఇలా అంగదుడు మొక్కగా తార వాలిని చూసి, "నాథా! కొడుకు నమస్కరిస్తుంటే కన్నెత్తి ఎందుకు చూడవు? దీర్ఘాయుష్మంతుడివి కమ్మని ఎందుకు దీవించవు? మేం దుఃఖపడుతుంటే తెలియడం లేదా? భయంకర యుద్ధమనే యజ్ఞాన్ని చేసి, రామచంద్ర బాణం అనే నీటిలో భార్యనైన నన్ను వదిలి అవభృథ స్నానం చేయవచ్చా? యుద్ధంలో నీ విషయంలో సంతోషించి, ఇంద్రుడు ఇచ్చిన నీ ప్రియమైన బంగారుహారం నీ శరీరం మీద లేదే? దాన్నెందుకు వదిలావు? అస్తమించిన సూర్యుడి కాంతి మేరు పర్వతాన్ని వదలదు. అలాగే, నువ్వు మరణించినా రాజ్యలక్ష్మి నిన్ను వదలలేకుండా వుంది. అయ్యో! నీకు మేలైన విషయం నేనెంత చెప్పినా వినలేదుకదా! అంతకంటే గట్టిగా చెప్పి అడ్డగించే సామర్థ్యం నాకు లేకపోయె. దాని ఫలం ఏమిటి? నేను, నా కొడుకు దిక్కులేనివారిమై పోయాం. నువ్వు వదిలినట్లే మాంగల్య లక్ష్మి కూడా నన్ను వదిలింది".

సర్గ-24
వాలికొరకు దుఃఖించిన సుగ్రీవుడు

అంగదుడితో కూడి ఇలా తార దుఃఖపడుతుంటే, ప్రాణం పోయి తన అన్న నేలమీద పడివుండడం చూసిన సుగ్రీవుడు ఇదంతా తన వల్లే కదా జరిగిందనీ, తానే దీనంతటికీ కారణమనీ కళ్ళనీళ్ళ పర్యంతమయ్యాడు. తార ముఖం చూస్తుంటే ఆయన హృదయం కళవళపాటు చెందింది. అప్పుడు సుగ్రీవుడు మెల్లగా రామచంద్రమూర్తిని సమీపించి, నిట్టూర్పు విడుస్తూ ఇలా అన్నాడు. "రాజోత్తమా! నువ్వు అన్న ప్రకారం నీమాట చెల్లించుకున్నావు. కపిరాజ్యం నాకు లభించింది. కాని రాజ్య సుఖాల మీద, ప్రాణం మీద ఆశ నశించిపోయింది. నా మాట నేను చెల్లించలేను. నన్ను క్షమించు. ఎందుకంటే నా అన్నకు తోడుగా నేను కూడా పోతాను. జీవించలేను. మా అన్న రాని శోకాన్ని, పట్టణంలో వున్న వారి దుఃఖాన్ని, నా మూలంగా మా అన్న చచ్చి పడి వుండడాన్ని, బతకాలా-వద్దా అన్న సంశయంలో వున్న అంగదుడిని చూసిన తరువాత రామచంద్రా! నా మనస్సు రాజ్య భోగాల మీదకు పోవడం లేదు. అప్పట్లో రోషంతో, కోపంతో, నన్ను తిరస్కరించిన కారణాన మా అన్న చావు ఇష్టమై వుండేది కాని, ఇప్పుడు దుఃఖం ఆపుకోలేక పోతున్నాను".

"అన్నను చంపడం వల్ల ఇంద్రత్వం లభించినా నాకు వద్దు. పూర్వంలాగే ఋశ్యమూక పర్వత శిఖరం మీద కాయకూరలు తిని బతుకుతాను. దుఃఖకరమైన ప్రభుత్వం కంటే శోకరహితమైన ఏకాంతవాసమే మంచిది. పేరుకు అన్నే కాని, ఆయనేమన్నా లోక సామాన్యుడైన అన్నా? శూరులలో శ్రేష్టుడు. ఉత్తముల్లో ఉత్తముడు. అలాంటివాడిని చంపించాను. ఆయనను చంపడం వల్ల వచ్చిన రాజ్యలాభం వల్ల కలిగిన సంతోషం గొప్పదా? కలిగిన దుఃఖం గొప్పదా? కామం ఆడించినట్లు ఆడాను. ధర్మం ఆలోచించలేదు.

యుద్ధంలో నన్ను చంపే శక్తి వున్నా, తన గొప్పతనం, పౌరుషం ఆలోచించి దుర్బలుడిని ఎందుకు చంపాలి? అని నన్ను వదిలాడు. మూర్ఖుడనైన నేను నన్ను చంపకుండా వదిలినవాడిని చంపించాను. నాది దుష్ట మనస్సు. కామక్రోధాలు కళ్లను కప్పితే ఎదుటివారి సద్గుణాలు కనపడవు. అలాంటి గొప్ప గుణాలున్న అన్నను చంపించాను. సోదర ధర్మం, ఆర్య ధర్మం, బలహీనులను చంపరాదనే శాస్త్రీయ ధర్మం, ఆయన్ను రక్షించాయి. నేను కామం వల్ల, క్రోధం వల్ల కోతి గుణాన్ని రక్షించాను. నేను అన్నను చంపించిన పాపం అసమానమైనది. ఇలా అని చింతించనలవి కానిది. సాధువులు వర్జించ తగింది. నా పాపాన్ని ఎవరు పంచుకుంటారు? పరమ పాప స్వభావుడిని. నీచ గుణాలు కలవాడిని. లోకానికి అపకారం చేసే వాడిని".

"మిట్ట నీళ్లు పల్లానికి వచ్చి కదలకుండా నిలిచిపోయినట్లే ఘోర వ్యసనం నన్ను ముంచుకుంది. పండితశ్రేష్టా! రామచంద్రమూర్తీ! అన్నను చంపడమనే అధర్మంతో కూడిన, అంగదుడు చావడం వల్ల వంశనాశనకరమైన చెడ్డపని చేసినవాడిని. కాబట్టి పూరిప్రజలు ఇచ్చే గౌరవానికి, యౌవరాజ్యానికి నేను అర్హుడిని కాను. అలాంటప్పుడు గౌరవంతో కూడిన రాజ్యలక్ష్మికా నేను తగినవాడిని? అన్నను చంపడమనే తోక, సంతాపాతిశయం అనే శిరస్సు, కొమ్ములనే తొండం, కళ్ళుకల మహాపాపం అనే ఏనుగు పెరిగి-పెరిగి ఏటిగట్టులాగా నన్ను మళ్లీ తోస్తున్నది. నా సాధువృత్తం పాపంతో కలిసిన కూటమికి అసహ్యించుకుని వెడలిపోయింది. నేను చేసిన ఈ ఘోరపాపం వల్ల సహించరాని అంగదుడి దుఃఖంవల్ల వానరులంతా అతడు చస్తాడేమో అని కొనవూపిరితో వున్నారు. అతడు చనిపోతే అందరూ చస్తారు. లోకంలో అందరికీ కొడుకులు లేరా? ఉండగానే లాభం ఏమిటి? ఇలాంటి మంచివాడు, మంచి బుద్ధికలవాడు, అంగదు లాంటివాడు, ఎందరు కలరు? కొడుకులు కలిగితే కలగవచ్చు కాని, తోడబుట్టినవాడు ఏ దేశంలో లభిస్తాడు?".

"అంగదుడు బతికితే, వాడిని కాపాడుకోవడానికి తార కూడా బతుకుతుంది. వాడు బతకకపోతే ఆమె కూడా బతకదు. ఇది నిజం. అన్నతోను, కొడుకుతోను, స్నేహంగా వుండడానికి నేను మండే మంటల్లో శరీరాన్ని వదులుతాను. నీ పనెలా అవుతుంది అంటావేమో? ఇదిగో ఈ వానరులందరూ వున్నారు. వాళ్లు సీతను వెతికి తెస్తారు. నీ పనిని కోతులు చేస్తావని అంటున్నావే!!! నేను చేసిన ప్రమాణం ఏమయింది అని అడుగుతావేమో? ఈ వానరులు నువ్వు చెప్పిన పని చేస్తారని నమ్మకం ఏమిటి? అని అడుగుతావేమో? రామచంద్రా! నేను

మరణించినంత మాత్రాన, ఈ కోతులు నీకు సహాయం చేయనంత మాత్రాన, నీ కార్యం ఆగిపోదని నాకు తెలసు. ఎందుకంటే నువ్వు నీ పనిని ఏ లోపం లేకుండా చక్కగా నేరవేర్చుకోగల సామర్థ్యం కలవాడివని నాకు తెలుసు. వంశాన్ని నాశనం చేసుకున్న వాడిని, ప్రాణాలను భరించలేని వాడిని, నీకెలా తోడ్పడతాను? నేను బతికినా, ఇలాంటి ఘోర పాపకార్యం చేసినవాడిని అలాంటి పుణ్యకార్యాలు చేయగలనా? నేను గొప్ప అపరాధం చేశానే? నాకు చావడానికి అనుమతినివ్వు".

అని చెప్తున్న సుగ్రీవుడి మాటలు విని, శత్రు సంహారంలో దక్షుడైన, సమర్థుడైన రామచంద్రమూర్తి, సుగ్రీవుడిలాగే తానూ కళ్ళనీళ్ళ పర్యంతమై కొంచెం సేపు దుఃఖపడ్డాడు.

(దీనికే కరుణారసం అని పేరు. పరుల దుఃఖం తన దుఃఖంగా భావించి దుఃఖపడడమే కరుణ లక్ష్యం. ఈ అవతారంలో ఈ రసం విశేషంగా కనిపిస్తుంది. సీతకొరకు రామచంద్రమూర్తి ఏడ్చింది ఇలాంటి కారణం వల్లే అని అర్థం చేసుకోవాలి. ఇది దొంగ ఏడ్పు కాదు. మాయ అంతకంటే కాదు. నిజమైన దుఃఖం. ఆత్మార్థహానికై వచ్చింది కాదు. ఇలాంటి కరుణ కలవాడు కాబట్టే రామచంద్రమూర్తికి కరుణాకాకుత్థ్సుడని బిరుదు వచ్చింది. ఆశ్రితుల దుఃఖం ఆయన కొంచెమైనా సహించలేడు. ఇది భగవంతుడిలో కల కళ్యాణ గుణాల్లో ఒకటి. భగవంతుడు ఆశ్రిత వత్సలుడు. అందుకే ధృడంగా కావాలని ఎవ్వరేది కోరినా అనుగ్రహిస్తాడు. కాని, చెడ్డ కోరికలు కలవారు ఫలితాన్ని అనుభవించేటప్పుడు దుఃఖపడుతుంటే, అయ్యో! వీరిలాంటి పాపపు కోరికలు కోరి ఇలా దుఃఖపడుతున్నారే, వీళ్లెప్పుడు బాగుపడతారా? అని వారిలాగే తానూ దుఃఖపడతాడు).

తారను ఓదార్చడానికి పోయిన శ్రీరాముడు

ఆ సమయంలో, భూదేవితో సమానమైన ఓర్పుకల రామచంద్రమూర్తి, తనను అదేపనిగా అనేకసార్లు చూస్తున్న తారను గమనించి, ఆమె తనకేదో చెప్పాలని అనుకుంటున్నదని భావించి, తానే ఆమెను ఓదార్చాలని అనుకుని, ఆమె దగ్గరకు పోయాడు. అప్పుడు మంత్రులు తారను సమీపించి ఆమెను వాలినుండి వేరు చేశారు. అప్పుడామె రాజచిహ్నాలుకల రామచంద్రుడిని చూసి, ఇతడే తన భర్తను చంపిన రామభద్రుడని మనసులో అనుకుంది. గొప్ప మనస్సుకల రామభద్రుడు తనదగ్గరకు రావడం భావ్యం కాదని తలచి, తారే

వేగంగా ఆయన దగ్గరకు పోయింది. మగాడి చావుకు కారణమైన రాముడిని దుఃఖాతిశయంతో ఏదో అనబోయింది. ఆమెకు నోరారా రాముడిని తిట్టాలని మనసులో ఉన్నప్పటికీ, ఆయన్ను చూడగానే తిట్లకు బదులు స్తుతించడం మొదలుపెట్టింది. రాముడు మానవమాత్రుడు కాదనీ, భగవంతుడేననీ భావించింది.

తనను కూడా చంపమని శ్రీరాముడిని కోరిన తార

రాముడితో తార ఇలా అంటుంది. "రామచంద్రా! నీ గుణగణాలు లెక్కించలేం. అప్రాప్యుడివి. ఇంద్రియాలను జయించినవాడివి. రాముడొక్కడే గొప్ప ధర్మాత్ముడని ప్రసిద్ధికెక్కావు. శాశ్వతకీర్తివి. దూరాలోచనకలవాడివి. ఓర్పులో భూదేవతతో సమానుడివి. పుండరీకాక్షుడివి. శరచాపధారివి. మహాబలవంతుడివి. పాపస్పర్శ లేనివాడివి. సర్వాంగ సౌష్టవం కలవాడివి. మనుష్యలోకానికి వచ్చినప్పటికీ మర్త్య శరీరాన్ని ధరించకుండా శుద్ధసత్త్వమయ దివ్యమంగళ విగ్రహం ధరించావు. రామచంద్రా! నువ్వింతటి మహానుభావుడివి. వాత్సల్యనిధివి. ఆశ్రితవాంఛాప్రదాన దక్షుడివి. నువ్వెంత గొప్పవాడివైనా నా కర్మ, నా ధర్మం, నా దుఃఖం నాకు తప్పదు కదా! కాబట్టి నిన్ను నేనొకటి ప్రార్థిస్తున్నాను. నా భర్తను బతికించమని నేను కోరను. ఎందుకంటే ఆయన నీ అనుగ్రహం వల్ల ఇంతకంటే ఉత్తమగతులకు పోయాడు. అలాంటివాడిని అధమగతులకు తెమ్మని నేను కోరను. నన్ను కూడా ఆయన వున్న చోటుకు పంపమని అడుగుతున్నాను. ఇది నీ చేతిలోని పని. ఈ దేహంతో నేను పోలేనంటే, అది సాధ్యపడదంటే, నాకీ దేహంతో పనిలేదు. వాలిని ఏ బాణంతో చంపావో, అదే బాణంతో నన్ను చంపు. నేను పోయి నా భర్తతో కలుస్తాను. నిన్ను చంపమనకుండా నేనే చావచ్చుకదా అంటావేమో? నేను ఆత్మహత్య చేసుకోరాదు. కొడుకున్న ఆడది సహగమనం చేయకూడదు. ఈ కారణాన నేను జీవించ కూడదు. కాబట్టి నువ్వు నన్ను చంపితే నేను ఉభయలోక దోషాలను వదిలి నా భర్త దగ్గరకు పోతాను".

"నేను పోకపోతే ఏమవుతుంది...అక్కడ దేవతా స్త్రీలు లేరా అంటావేమో? ఎంతమంది వున్నా నేను లేకపోతే ఆయనకు సుఖం లేదు. భార్య వుంది భర్తను సుఖపెట్టడానికేకదా? ఆయనకు అక్కడ సుఖం లేకుండా చేసి ఇక్కడ నేనేం చేయాలి? ఉత్తముల్లో ఉత్తముడా! నా భర్త స్వర్గంలో ఎంతమంది దేవతాస్త్రీలను చూసినప్పటికీ నేను లేని కారణాన ఆయనకు సుఖ సంతోషాలు లేవు. కాబట్టి భార్యాభర్తలను కలిపి పుణ్యం కట్టుకో. సర్వ సుఖ స్థానమైన స్వర్గంలో వున్నప్పటికీ

నా భర్త నన్ను ఎడబాసి వుండవలసి వచ్చినందున శోకం, దైన్యంతో శుష్కిస్తాడు. ఇది నిజం. ఇది సత్యమనడానికి నువ్వే సాక్షివి. నువ్వు ఋశ్యమూక పర్వతం దగ్గర సీతకోరకు ఎలా ఏడ్చావో అలాగే ఇతరులని భావించు. యౌవనంలో మగవాడు తన ప్రియురాలిని వదిలి వుండడం వల్ల కలిగే దుఃఖం నీకు అనుభవంలో తెలిసినదే. అలాగే వాలి నన్ను విడిచి ఎంత తపిస్తున్నాడో తెలుసా రామచంద్రా! ఆయన మీద వేసిన బాణమే నామీద వేయి. నేను చనిపోయి నా మగడిని కలుస్తాను".

"మహానుభావా! తాటకాంతకా! స్త్రీని చంపితే పాపం కలుగుతుందని భావించవద్దు. నీకా పాప సందేహంతో పనిలేదు. నీకు పాపం రాదు. భర్త ఆత్మే భార్య కదా అన్న అభిప్రాయంతో దయగలవాడివై నా భర్తను చంపినట్లే నన్ను కూడా చంపు. భార్య వేరు, భర్త వేరు అంటావేమో? భర్తకు భార్యే ఆత్మా అని వేదశాస్త్రాలు చెప్తున్నాయి. రాజశ్రేష్టుడా! ప్రేమకల భార్యను భర్తకు దానం చేయడమే అన్ని దానాలలో కల్లా ఉత్తమ దానం అని జ్ఞానులు చెప్తారు. కాబట్టి ధర్మాన్ని తలచి నా భర్తతో నన్ను కలిపితే నీకు పుణ్యం వస్తుంది. సంహారం చేస్తే పాపం రాదు. నేను దిక్కులేని దాన్ని. మిక్కిలి దీనురాలిని. భర్త కూడా నన్ను వదిలి పోయాడు. నీకు నమస్కారం చేస్తాను. ఒక్క బాణం నామీద వదులు. వాలిని విడిచి దీర్ఘకాలం నేను ప్రాణాలతో వుండగలనా? దీర్ఘకాలం కృశించి చనిపోవడం కంటే ఒక్కసారి చావడం మంచిది".

తారను ఆశ్వాసించిన శ్రీరాముడు

ఇలా ఏడుస్తున్న తారను చూసి ఆమె దుఃఖం పోవడానికి రామచంద్రమూర్తి ఇలా అన్నాడు. "నువ్వు వీరుడి భార్యవై వుండి ఇలా విపరీత బుద్ధికలదానివి కావడం తగునా? ఇంత పేదమనస్సు కలదానివి అలాంటి వీరుడికి ఎలా భార్యవయ్యావు? సమస్త లోకాలు బ్రహ్మ సృష్టించినవే. సుఖం, దుఃఖం అనేవి కూడా వారి–వారి కర్మానుసారంగా ఆయన వల్లే కలుగుతుంటాయి. అందుకే కదా సుఖం, దుఃఖం బ్రహ్మ తెచ్చి పెట్టాడని అంటాం. బ్రహ్మ ఏర్పాటు చేసినట్లు సర్వం జరుగుతుంది. ఆ బ్రహ్మ ముందుగానే చేసిన ఏర్పాటును అతిక్రమించి పోవడానికి కొంచెమైనా సాధ్యమేనా? వీరుల భార్యలు ఇలా దుఃఖపడతారా?వీరుడైన నా భర్తకు వీరయోగ్యమైన మరణం లభించింది కదా అని సంతోషించాలి కదా? నీ కొడుకు యువరాజుకాగా చూసి నువ్వు సంతోషిస్తావు".

అని రాముడు చెప్పడంతో తార దుఃఖం మానింది.

సర్గ-25
శిబికలో వున్న వాలిని చూసి ఏడ్చిన తార

హోరుమని ఏడుస్తున్న అంగదుడిని, తారను, సుగ్రీవుడిని చూసిన రాముడు వారితో సమానంగా ఏడుస్తూ, లక్ష్మణుడితో కలిసి ఓదార్చాడు వాళ్ళను.

ఓదారుస్తూ, "చనిపోయిన వారికోసం మనం ఏడుస్తుంటే వాళ్లకు పరలోకంలో ఉత్తమమైన మేలు, మోక్షం కలుగుతుందా? చెప్పండి. కాబట్టి నిష్ప్రయోజనమైన ఈ కార్యక్రమం వదిలిపెట్టి ఇకమీద చేయాల్సిన కార్యమేదో అది త్వరగా చేయాలి కదా! లోకంతో పాటు మీరు కూడా ఈ విధంగా చనిపోయినవారి కోసం ఏడ్చారు. ఇక చాలు. దీనివల్ల లాభం ఏమిటి? ఏడవకపోతే ఎవరైనా ఏమన్నా అనుకుంటారని ఏడుస్తున్నారా? కాలాత్మకుడైన భగవంతుడి ఆజ్ఞను మీరి మీరు చేయకలిగింది ఏముంది? లోకానికి ఆదికారణం దైవమే. సమస్త కార్యాలను సాధించేది దైవమే. ఇది నిజం. మనం స్వతంత్రించి చేసేది ఏదీలేదు. ఆయన చేయించినట్లే మనం చేస్తాం. ఆ దైవమే సమస్త భూతాలను నియమించడానికి కారణం. ఎవరు కూడా తాను స్వతంత్ర కర్త అని దేన్నీ చేయలేడు. ఫలానావాడు ఈ పని చేయాలని ఎవరు కూడా మరెవ్వరినీ ప్రేరేపించ లేడు. ఇదంతా కూడా దైవ తంత్రం వల్లే లోకంలో జరుగుతుంటుంది. ఆ దైవం కాలరూపంలో ఆయా పనులను చేయిస్తుంది".

"దైవం తన ఏర్పాటును తానై దాటిపోదు. తన సంకల్పం ప్రకారమే అంతా జరుగుతుంది. దానికి విరుద్ధంగా మరొక సంకల్పం కానీ, ఒకప్పుడు వృద్ధి, మరొకప్పుడు క్షయం కానీ వుండదు. దైవం తన స్వభావం వల్లే ప్రకాశిస్తుంది. తన నియమాన్ని తాను అతిక్రమించదు. కాలం దాటదు. కాలానికి

బందువులనేవారు లేరు కాబట్టి పక్షపాతం లేదు. కాలాన్ని స్వాదీనపర్చుకునే ఉపాయం లేదు. మన బలానికి కాలం భయపడి వశపడదు. కాలానికి స్నేహితులు లేరు. కాబట్టి అపరాదులందరినీ ఒకే విధంగా శిక్షిస్తుంది కాని దాక్షిణ్యం చూపించదు. అంతా ఈశ్వరుడే అయితే ఇక జీవుడు చేయాల్సింది ఏంటంటే చెప్తా విను. శాస్త్రాలలోని నిష్కృష్టాంశాలను తెలిసినవాడు ఈశ్వర ప్రేరణ వల్ల జీవుడు కర్మానుగుణంగా చేసే వ్యాపారాల వల్ల కార్య ఫలం కలుగుతున్నదని తలుస్తుండాలి".

"ఈశ్వరుడే చేసిన ఏర్పాటు ప్రకారం ధర్మం, అర్థం, కామం, మనం కోరినా,కోరకున్నా లభిస్తుంది. తప్పదు. లోక స్థితి ఇలా వుండబట్టే, వాలి గతంలో తాను ఏ ధర్మార్థకామాలను ఆచరించాడో వాటి వల్ల కలిగే ఫలితం అనుభవించడానికి నా దండనకు గురై తన పాపమంతా తొలగిపోగా శుద్ధతత్వమైన నాకము (అసలైన వైకుంఠము) చేరబోయాడు. తన ధర్మ గుణంతో స్వర్గాన్ని జయించాడు. దోషాన్ని దండానుభవం వల్ల చెరిపేసుకున్నాడు. అలాంటి స్వార్జిత స్వర్గాన్ని అనుభవించడానికి పోయాడు. అలాంటి వీరుడి కొరకు దుఃఖపడవచ్చా?పౌరుషమే దానంగా కల అతడు ఉత్తమోత్తమమైన పదాన్ని పొందాడు. దీనికొరకు ఎందుకు పరితపిస్తారు? ఏడ్చింది చాలు. ఇక జరగాల్సిన శాస్త్రీయ కార్యాలకొరకు దహనాది కార్యక్రమాలకు ప్రయత్నం చేయండి" అంటాడు శ్రీరాముడు.

వాలి సంస్కారాలకు ఏర్పాట్లు చేయమని సుగ్రీవుడికి చెప్పిన లక్ష్మణుడు

రామచంద్రుడు ఇలా చెప్పడంతో లక్ష్మణుడు దుఃఖసముద్రంలో మునిగిన సుగ్రీవుడితో సమయానికి తగ్గ మంచిమాటలను ఇలా చెప్పాడు.

"సుగ్రీవా! లేలెమ్ము. ఇలా కూర్చున్నావెందుకు? ప్రేత కార్యాలను పూర్తిచేయడానికి తార, అంగదుడితో కలిసి ప్రయత్నాలు చేయకూడదా? వాలికి దహనకార్యం నెరవేర్చడానికి కావాల్సిన గంధపు చెక్కల్ని ఇక్కడికే తెప్పించు. దుఃఖపడుతున్న అంగదుడిని సమాదానపర్చు. ఇంట్లో వున్న వాలి వస్త్రాలను, మాల్యాలను, నేయి, నూనె గంధపు వస్తువులను తెప్పించడానికి అంగదుడిని పంపించు. పట్టణమంతా నీ స్వాధీనంలో వుంది కాబట్టి నువ్వు చేయదలచుకున్నది కాదనేవారు లేరు. ఈ పామరత్వాన్ని వదిలేయి. నువ్వు పోయి త్వరగా పల్లకీ తే. ఇలాంటి ప్రేత కార్యాలలో త్వరపడితే మంచిదని

పెద్దలంటారు. వాలి పీనుగను మోయడానికి తగిన బలశాలులను ఏర్పాటు చేయి. దుఃఖం మాను". ఇలా సుగ్రీవుడికి చెప్పి లక్ష్మణుడు రామచంద్రమూర్తి పక్కన నిలబడ్డాడు.

లక్ష్మణుడు ఇలా ఆజ్ఞాపించగానే తారుడు శీఘ్రంగా కిష్కింధకు పోయి ఒక పల్లకిని తీసుకు వచ్చాడు. దాన్ని చూసి రామచంద్రుడు అందులో వాలిని వుంచమని లక్ష్మణుడికి చెప్పాడు. శీఘ్రంగా ప్రేతకార్యం చేయించమంటాడు. ఇలా చెప్పగా అంగదుడు, సుగ్రీవుడు దుఃఖం అతిశయిస్తుంటే వాలిని శిబికలో పత్తి పూలు, వస్త్రాలతో ప్రేతాన్ని అలంకరించి, అసమానసంపదకల మహారాజులకు ఎలా ప్రేతకార్యాలు తీరుస్తారో అలాగే ఏ లోపం లేకుండా చేయాలని వానరులను ఆజ్ఞాపించాడు. తారుడు లాంటివారు అంగదుడితో కలిసి బిగ్గరగా ఏడుస్తూ పల్లకి పక్కన గుంపులుగా పోయారు. తార మొదలైన స్త్రీలు వీరా! వీరా! అని ఏడ్చుకుంటూ వాలి పల్లకి మరో పక్కన పోయారు. వానరులు పల్లకీని మోసుకుపోయి మనుష్యులు లేని ఒక ఏటి నీటి ఒడ్డున ఇసుక ప్రదేశంలో చితిని పేర్చారు. వాహకులు వాలి శవాన్ని చితి పేర్చిన చోట దింపి ఏడుస్తూ నిలుచున్నారు. అప్పుడు తార శిబికలో వున్న వాలి శిరస్సును తన తొడమీద వుంచి ఏడ్చింది.

శిబికలో వున్న వాలిని చూసి ఏడ్చిన తార

శిబికలో వున్న వాలిని చూసి ఇలా ఏడ్చింది తార. "హా! వానరేంద్రా! హా! మహారాజా! హా హృదయేశ్వరా! హా! మహా శూరా! హా! యోగ్య పురుషా! దేవా! నువ్వు నన్నెంతో గౌరవించే వాడివే? అదంతా ఇప్పుడేమయింది? కన్నెత్తికూడా నన్నెందుకు చూడవు?ఇంతమంది నీకొరకు దుఃఖపడుతున్నారే? వారినైనా చూడకూడదా? ప్రాణం పోయినా నీ ముఖం బతికున్నప్పుడులాగా కళకళలాడుతున్నదే? నా కళ్ళు కరువుతీరా నిన్నెప్పుడు చూడగలను? అడవిలో వేసిన ఒక్క బాణంతోనే నీ రాణులందరూ ముత్తైదువు తనం హరించి యముడే రాముడిలాగా వచ్చి నిన్ను తీసుకునిపోయాడు. నీకెంతో ఇష్టమైన నీ భార్యలు, ప్రియురాళ్లు దూరం నుండి కాలినడకన నీదగ్గరకు వచ్చారే! అదైనా నీవు తెలుసుకోలేక పోతున్నావు కదా! ఈ చంద్రవదనలు అందరూ నీకు ప్రియురాళ్ళు కదా. వారినెందుకు పలకరించవు? అదిగో నీ తమ్ముడు...అతన్నెందుకు ప్రేమతో పలకరించవు? ఇది నీకు తగునా? మహారాజా? వీరంతా తారుడు, ఇతర మంత్రులు. వారితో ఎందుకు మంత్రాలోచన చేయవు? ఈ వూరి ప్రజలంతా

నిన్ను చుట్టుకుని వున్నారు. వారి–వారికి అనుగుణంగా ఆజ్ఞలు ఇవ్వు. వీరంతా వెళ్లిపోతే మనం సంతోషంగా కామం తీరేంతవరకు మనోహరమైన ఈ వనప్రదేశంలో తిరుగుదాం. ఎందుకు నాథా ఊరుకున్నావు?"

వాలిని సంస్కరించిన అంగదుడు

ఇలా ఏడుస్తున్న తారను స్త్రీలు పట్టుకుని లేపారు. ఆ తరువాత సుగ్రీవుడు సహాయపడుతుంటే అంగదుడు తన తండ్రికి చితిని పేర్చి, ఏడ్చుకుంటూ, పరలోకానికి పోతున్న వానర శ్రేష్టుడికి అగ్నిని చితిమీద వుంచాడు. అప్రదక్షిణంగా తిరిగాడు. వాలికి ఈ విధంగా సంస్కారాలు చేసి శాస్త్ర పద్ధతిలో నీళ్లు విడవడానికి చల్లని నీళ్లున్న నదిని చేరి తార, సుగ్రీవుడు అంగదుడితో కలిసి వాలికి నీళ్లు వదిలారు. వారితో సమానంగా రాముడు కూడా దుఃఖిస్తుంటే సుగ్రీవుడితో ప్రేత కర్మలు జరిపించారు. యుద్ధంలో చనిపోయిన అన్న వాలికి దహనాది కార్యక్రమాలు జరిపించి సుగ్రీవుడు రాముడి దగ్గరకు వచ్చాడు. మిగిలినవారంతా, స్త్రీలు, పౌరులు, కిష్కింధకు పోయారు.

సర్గ–26
సుగ్రీవుడికి పట్టాభిషేకం జరిపించమని శ్రీరాముడిని వేడుకున్న హనుమంతుడు

తడిబట్టలతో, దుఃఖభారంతో, బాధపడతున్న సుగ్రీవుడిని మంత్రులంతా సేవించారు. వీరంతా కలిసి రామచంద్రమూర్తిని సేవిస్తుంటే ఆయన మునులతో సేవించబడే బ్రహ్మలాగా వెలిగాడు. ఇలా అందరూ కూర్చున్న తరువాత హనుమంతుడు రామచంద్రమూర్తితో "రఘుకులదీపకా! నీ దయవల్ల ఈ వానరశ్రేష్టుడు సుగ్రీవుడు దుఃఖం వదిలి తనకు ఏ విధంగానైనా సాధ్యపడని ప్రభుత్వాన్ని సంపాదించగలిగాడు. దేవా! నువ్వు సమ్మతిస్తే సుగ్రీవుడు కిష్కింధ చేరి దివ్యౌషధులతో పవిత్ర స్నానం చేసి వానరులతో మిగిలిన పట్టాభిషేక కార్యక్రమం జరిపిస్తాడు. మీరు కిష్కింధకు వస్తే మిమ్మల్ని సుగ్రీవుడు విలువైన రత్నాలతో, సుగంధ పూలతో, భక్తితో పూజిస్తాడు. అదే గుహ. దూరం లేదు. పోదాం రండి. ఆయనకు మీరు పట్టాభిషేకం చేసి ఈ వానర సమూహాల కన్నీటికి సంతోషం కలిగించు" అన్నాడు.

సుగ్రీవుడి పట్టాభిషేకానికి అనుమతి ఇచ్చిన శ్రీరాముడు

జవాబుగా రామచంద్రమూర్తి ఆంజనేయుడితో ఇలా అన్నాడు. "ఆంజనేయా! తండ్రి ఆజ్ఞ కారణాన నేను పద్నాలుగేళ్లు పూర్తయ్యేదాకా పట్నంలోకి కాని, పల్లెల్లోకి కాని ప్రవేశించ కూడదు. కాబట్టి నేను కిష్కింధకు రాకూడదు. సుగ్రీవుడు వూరికి చేరి సుఖంగా పట్టాభిషిక్తుడై శాస్త్రవిధి తప్పకుండా వానర రాజ్యాన్ని పాలించాలి".

ఇలా అని సుగ్రీవుడితో చెప్పాడిలా. "ఈ అంగదుడిని యువరాజుగా పట్టాభిషేకం చేయి. బలంలో నీతో సమానుడు. మీ అన్నకు పెద్దకొడుకు. ఏ

విధంగా, బలం చేత కానీ, బంధుత్వం చేతగానీ, చూసినా ఇతడికి యౌవరాజ్యం ఇవ్వడం సబబే. నిన్ను కిష్కింధకు పోయి పట్టాభిషేకం చేసుకోమంటే నా పని మరిచానని కాదు. దానికి సమయం ఇది కాదు. వానాకాలంలో మొదటిది శ్రావణ మాసం. అది మొదలు నాలుగు నెలలు వర్షాకాలం అంటారు. ఈ నాలుగు నెలలు దండయాత్రకు పనికిరావు. కాబట్టి నీ వూరికి పో. నేను, లక్ష్మణుడు ఈ గుహలో వుంటాం. ఇక్కడ గాలి రమ్యంగా వుంది. విశాలంగా వుంది. కొలనుల్లో కమలాలు, కలువలు వున్నాయి. కార్తీక మాసం రాగానే రావణ వధకు కావాల్సిన ప్రయత్నాలు, వానర సేనను పోగు చేయడం జరగాలి. నువ్విప్పుడు వూరికి పోయి నీ స్నేహితులు సంతోషించే విధంగా రాజువై సుఖపడు".

(కాల నిర్ణయ విషయంలో వ్యాఖ్యాతల్లో అభిప్రాయ భేదాలున్నాయి. రాముడు చెప్పిన నాలుగు నెలలు ఏవి? శ్రావణం, భాద్రపదం, ఆశ్వయుజం, కార్తీకం అని కొందరి అభిప్రాయం. అట్లయితే, కార్తీకం ముగియక ముందే ఎందుకు శ్రీరాముడు తొందరపడి లక్ష్మణుడిని కిష్కింధకు పంపాడని సందేహం కలుగవచ్చు. సీతాపహరణం జ్యేష్ఠమాసంలో జరిగిందని చెప్పడం జరిగింది. జ్యేష్ఠమాసంలో సీతను వెతికి, ఆషాడంలొ సుగ్రీవుడితో స్నేహం చేసి, రామచంద్రమూర్తి వాలిని చంపాడు. ఇదంతా ఆషాడంలో జరిగిన వ్యవహారమే. నాలుగు నెలల లెక్క ఆషాడ శుద్ధ పూర్ణిమ మొదలు అనుకోవాలి. అదే వర్షాకాల గణన దినం. ఈ పౌర్ణమి మొదలు కార్తీక పౌర్ణమి వరకే కదా సన్న్యాసులు చాతుర్మాసం ఆచరిస్తారు. కాబట్టి రామచంద్రమూర్తి చెప్పిన నాలుగు నెలలు ఆషాడ పూర్ణిమ మొదలు కార్తీక పూర్ణిమ వరకని భావించాలి).

సుగ్రీవుడి పట్టాభిషేకం

రామచంద్రమూర్తి పొమ్మనడం అంటే పట్టాభిషేకానికి సంకేతం ఇచ్చినట్లే అని సుగ్రీవుడు భావించాడు. రామచంద్రమూర్తి ఆజ్ఞ ఇవ్వగానే సుగ్రీవుడు కిష్కింధకు పోయాడు. అక్కడ ఆయనకు వానర గుంపులు, పౌరులు, సాష్టాంగ నమస్కారం చేశారు. వారిని మర్యాదగా లేవనెత్తాడు సుగ్రీవుడు. ఆ తరువాత తన అన్న అంతఃపురానికి పోయి, దుఃఖపడుతున్న తారను సమాధాన పరిచాడు. బయటకొచ్చిన ఆయన్ను వానరులు దేవతల లాగా అభిషేకించగా సుగ్రీవుడు దివ్యతేజస్సుతో ప్రకాశించాడు. బంగారు పూలతో చేసిన తెల్లటి గొడుగు, బంగారు కాడల చామరాలు, నవరత్నాలు, అన్ని ఔషధులు, పాలుకారుతున్న

చెట్ల చిగుళ్లు, పూలు, నవధాన్యాలు, తెల్లటి వస్త్రాలు, తెల్లటి గంధం, మంచివాసన కల మెట్ట పూలు, నీళ్లలో పుట్టిన పూలు, అగరు, చందనం, అక్షతలు, కాంచనం, పులితోలు, నేయి, అడవిపంది తోలు, చెప్పులు, గసగసలు, మీగడ, పెరుగు, తేనెలతో సహా మనిసిల, గోరోచనం, పచ్చకర్పూరం, కుంకుమపువ్వు తీసుకుని పదహారుమంది పెళ్లికాని పడుచులు సంతోషంతో వచ్చారు.

అప్పుడు బక్ష్యాలతో, మణులతో, వస్త్రాలతో, బ్రాహ్మణులను తృప్తి పరిచారు. తదుపరి, శాస్త్రంలో చెప్పిన విధంగా దర్భలు పరిచిన భూమీ్మద అగ్నిని నిలిపారు. పవిత్ర మంత్రాలతో హోమాలు చేయించి, మంత్రాలు తెల్సినవారు చిత్ర మాల్యాలతో ప్రకాశించే మేడలో మనోహరమైన బంగారు పీటమీద తూర్పు ముఖంగా సుగ్రీవుడిని నిలబెట్టారు. అనేక నదుల నుండి, ఉపనదుల నుండి, సముద్రం నుండి జలాలను తెచ్చి, బంగారుకుండలో పోసి, బంగారు పాత్రలను ఎద్దుకొమ్ములతో ఆ నీళ్లలో ముంచారు. ఆ తరువాత శాస్త్రంలో చెప్పినట్లు మైందుడు, ద్వివిదుడు, గంధమాదనుడు, గజుడు, గవాక్షుడు, గవయుడు, హనుమంతుడు, జాంబవంతుడు, నలభుడు, శరభుడు సంతోషంగా సుగ్రీవుడిని, ఇంద్రుడిని అభిషేకించినట్లు మిక్కిలి సువాసన కల మంచినీటితో ప్రేమతో అభిషేకించారు. సుగ్రీవుడు సంతోషంగా పట్టాభిషిక్తుడై ఆ తరువాత రామచంద్రమూర్తి చెప్పిన విధంగా అంగదుడిని యువరాజుగా అభిషేకించగా అందరూ సంతోషించారు. సుగ్రీవుడిని పొగిడారు.

సుగ్రీవుడికి పట్టాభిషేకం, అంగదుడికి యౌవరాజ్యం ఇచ్చినందుకు అందరూ రామచంద్రమూర్తిని, లక్ష్మణుడిని మెచ్చుకున్నారు. పట్టణమంతా కాంతితో ప్రకాశించింది. అభిషేకం జరిగిన వార్త విష్ణుసమానుడైన రామచంద్రమూర్తికి తెలియచేసి, సుగ్రీవుడు తన భార్య అయిన రుమతోను, తారతోను, యథేచ్ఛసుఖాలను అనుభవిస్తున్నాడు.

(ఇప్పుడు కిష్కింధ అని చెప్పబడే ప్రదేశాన్ని చూస్తే, అదొక చిన్న పట్టణం లాగా కనపడుతుంది. కాని, వాలి–సుగ్రీవులు పాలించినది ఆ చిన్న పట్టణం కాదు. కిష్కింధా రాజ్యం అల్ప రాష్ట్రం కానే కాదు).

సర్గ-27
ప్రస్రవణగిరి గుహ చేరిన శ్రీరామలక్ష్మణులు

సుగ్రీవ, అంగద పట్టాభిషేక వార్త విన్న రామచంద్రుడు, అక్కడి నుండి లక్ష్మణుడితో కలిసి బయల్దేరి పులుల-సింహాల ధ్వనితో కూడి, నానా రకాల పొదలతో నిండి, పలురకాల చెట్లు కలిగి, కోతులు, కొండముచ్చులు, ఎలుగులు, పిల్లులు కలిగి, నల్లటి మబ్బులాగా వున్న, మనోహరమైన నీళ్లు కల ప్రస్రవణమనే కొండకు పోయాడు. అక్కడ తమ్ముడు లక్ష్మణుడితో ఇలా చెప్పాడు.

"లక్ష్మణా! ఈ గుహ చూశావా? మిక్కిలి విశాలంగా, రమ్యంగా, విస్తారమైన గాలితో, అలరారుతున్నది. వర్షాకాలమంతా మనం ఇక్కడే సంతోషంగా వుంటే మంచిది. ఈ పర్వత శిఖరం తెల్లటి, ఎర్రటి, నల్లటి రాళ్లతో; దాటు సమూహాలతో; కొండవంకల, గుహల వరుసలతో; అనేకరకాల చెట్ల గుంపులతో; నెమళ్ళ, పక్షుల గుంపులతో; వావిలి, కడప, మొల్ల పొదలు, జాజి, మద్ది, ఏరుమద్ది పూలతో మనోహరంగా వుంది చూశావా? ఇంపుగా, వింతగా తీగలతో ఆవరించి ప్రకాశిస్తున్నది. ఎక్కడ చూసినా గోరంట్ల చెట్లు రమ్యంగా వున్నాయి. గుహకూడా ఎత్తుగా వుంది. ఇదే మనకు తగిన స్థలం. అదిగో తటాకం చూశావా? లక్ష్మీదేవి హస్తంలాగా మనోహరమై, వికసించిన తామరపూలకు స్థానమై, నిర్మలమై మన గుహ సమీపంలోనే సంతోషం కలిగిస్తున్నది. ఈ గుహ నైరుతి ముఖంగా బల్లవున్న సహజమైన ఏర్పాటువల్ల గాలి కూడా ఎంత కావాలో అంత మితంగానే వీస్తుంది".

"ఉత్తరాన మరో శిఖరం విరిసిన కాటుక కుప్పలాగా వుంది. చూడు. అది దొంతి మబ్బుల పంక్తిలాగా వుంది. దక్షిణాన ఒక తెల్ల శిఖరం కైలాసంలాగా వుంది. ముందు భాగంలో తూర్పు ముఖంగా ఏరు (తుంగభద్ర) పారుతున్నది.

ఇది బురద లేకుండా త్రికూటంలో జాహ్నవిలాగా వుంది. మద్ది, తాటి, చీకటి, తక్కోలం, బొట్టుగు, రేల, గిరకతాడు పొగడ, ప్రబ్బ, పద్మకం, సరళం, వెదుళ్ల చెట్లున్న విధం చూడు. అక్కడక్కడ రకరకాలైన చెట్లు నదీతీరంలో ప్రకాశిస్తూ, భూషణాలు, వస్త్రాలతో అలంకరించుకున్న స్త్రీలాగా వుంది. పక్షి సమూహాలు శ్రావ్యమైన నాదం కలిగి, ఒకదానితో మరోదానికి సమానమై, పూర్ణమైన అనురాగం కల చక్రవాకాలతో ప్రకాశిస్తూ, మనోహరమైన, ఎత్తైన ఇసుకదిబ్బలతో, కమలాలతో, హంసలతో, తుమ్మెదలతో కూడి ఈ నది నవ్వుతున్న స్త్రీలాగా వుంది చూశావా? లక్ష్మణా! చూశావా? ఈ నది ఎంత అందంగా వుందో? ఒకచోట ఇంపైన కలువల గుంపు, ఒకచోట ఎర్ర కమలాల గుంపులు, ఒక పక్క తెల్లకలువల మొగ్గలు, ఒక చోట ప్లవ పక్షుల అందాలు, ఒక పక్క నేమిళ్ళ కేకలు, ఒకచోట క్రౌంచ పక్షుల అందాలు, ఒక పక్క చందన వృక్షాలు, ఒక చోట మునుల పర్ణశాలలు కలిగి వుంది. మనం ఇక్కడే వుందామా? ఇక్కడికి కిష్కింధ పెద్ద దూరం కాదు. అక్కడి ధ్వనులు ఇక్కడికి వినపడుతున్నాయి. సుగ్రీవుడు సంతోషంగా వున్నాడు".

ఈ విధంగా చెప్తూ రామచంద్రమూర్తి ఆ ప్రస్రవణ పర్వతం మీద నివసించాడు. అన్ని సుఖాలున్నా తనకు ప్రాణమైన భార్యలేని దుఃఖంతో ఆయనకు సంతోషం లేదు. ఆయనకు పడుకోవడానికి సుఖమైన శయ్య వున్నా కన్ను మూయలేదు. కన్నీళ్లతో శుష్కిస్తున్న శ్రీరామచంద్రమూర్తిని చూసి ఆయన దుఃఖంతో సమానమైన దుఃఖం కల లక్ష్మణుడు ఆయన దుఃఖం పోయేట్లు సమాధాన పరచాడు.

శ్రీరాముడిని అనునయించిన లక్ష్మణుడు

దుఃఖపడుతున్న శ్రీరాముడిని అనునయిస్తూ లక్ష్మణుడు ఇలా అన్నాడు.

"అన్నా! రాజ్యభ్రంశం, సీతావియోగం, అనే ఆపదలు చాలక దుఃఖమనే ఆపద కూడా తెచ్చుకుని ఈ విధంగా శుష్కించడం నీకు తగునా? దుఃఖం అతిశయిస్తే పనులు చెడుతాయని నీకు తెలియదా? నిద్రించే సింహం నోట్లో మృగాలు చొరబడనట్లు పురుష ప్రయత్నం లేకుండా ఏ పనీ ముందుకు సాగదని నీకు తెలియదా? అలాంటి పౌరుషం, దైవం తోడ్పాటు లేకపోతే విత్తనం వేయని క్షేత్రంలాగా ఫలం కలగదు. కాబట్టి దైవ సహాయం ఆవశ్యకమనీ, ఆ దైవ సహాయం కలగడానికి దైవభక్తి కావాలనీ తెలిసినవాడివై కూడా ఈ విధంగా ప్రవర్తించవచ్చా? ఆ పురుష ప్రయత్నం కూడా ధర్మపద్ధతిని అనుసరించి

చేస్తావుకాని ధర్మం తప్పి చేయవు. చేయదలచిన పని ధృఢనిశ్చయ ప్రయత్నంతో చేస్తావు కాని అలసత్వంతో సంధిగ్ధచిత్తంతో చేయవు. దీనికి కారణం ఏమిటి?".

"నీకు 'దైవం కలదు-పరలోకం కలదు' అనే జ్ఞానం వుంది. ఇలాంటి మాహాత్ముడివి, పురుష ప్రయత్నానికి మూలాధారమైన ధైర్యం లేనివాడివైతే, ఎలా, వంచకుడు, రాక్షసులకు అధీశ్వరుడు అయిన శత్రువును యుద్ధభూమిలో నీ భుజబలంతో చంపగలవు? ఏడిచే వాడిదగ్గర ధైర్యం ఎలా వుంటుంది? కాబట్టి శోకాన్ని సమూలంగా శీఘ్రంగా నాశనం చేయి. కార్యం సాధించడానికి ధృఢనిశ్చయుడివై, ధృఢమైన ధైర్యాన్ని తెచ్చుకో. సేవకులతో, కొడుకులతో, స్నేహితులతో కూడిన రాక్షసుడిని ధ్వంసం చేయి. ఇవే నువ్వు చేయాల్సిన పనులు. వీటిని వదిలి అంతులేని దుఃఖంతో కుళ్లడం సరైంది కాదు. నువ్వు పూనుకుంటే కొండలు, అడవులు, సముద్రంతో కూడిన ఈ భూమినే తలకిందులుగా తిప్పగలవు. ఇక ఒక్క రాక్షసుడేమి లెక్క? ఎన్నాళ్ళు సహించి వుండమని అంటావా? ఎంతో కాలం లేదింక. వానాకాలం రానే వచ్చింది. ఇది పోగానే శరత్కాలం వస్తుంది. అప్పుడు కార్య ప్రయత్నం చేద్దాం. అంతదాకా ఓపిక పట్టు. ఆ తరువాత రావణాసురుడిని బంధుమిత్రులతో సహా చంపవచ్చు. ఆ సమయం రాగానే నేను నిన్ను హెచ్చరిస్తాను. అప్పటిదాకా సహించి వుండు".

అని లక్ష్మణుడు చెప్పగా, తనకు హితమైన, శుభమైన ఆయన చెప్పిన మాటలు అర్థం చేసుకున్న శ్రీరాముడు తమ్ముడితో ఇలా అన్నాడు.

"తమ్ముడా! నువ్వు అనురాగం, హితం, స్నేహం, సత్యం, శౌర్యం, దర్పం వెలయునట్లు చక్కగా చెప్పావు కాబట్టి కార్యాన్ని నాశనం చేసే దుఃఖాన్ని వదిలాను. నువ్వు చెప్పినట్లు నదులు, సుగ్రీవుడు అనుగ్రహించేదాకా వేచివుంటాను. వీరుడైన పురుషుడు తనకు మేలు చేసినవారికి తానెంత కష్టపడైనా తిరిగి మేలు చేస్తాడు కాని వదిలిపెట్టడు. అలా ప్రత్యుపకారం చేయకుండా మరిచే క్రూరుడు సాధువుల మనస్సు కూడా నొప్పిస్తాడు. అదే వాడికి చాలా కీడు కలగచేస్తుంది".

ఇలా చెప్పగా లక్ష్మణుడు అన్నతో "రామచంద్రా! నువ్వన్నట్లు సర్వం అనుకూలంగావస్తుంది.తగినసమయంరాగానేసుగ్రీవుడుప్రయత్నపూర్వకంగా సహాయం చేస్తాడు కాని మాట తప్పడు. కాబట్టి వానలు ఆగేదాకా సహించి ఇక్కడే వుందాం. ఆ తరువాత శత్రువులను ధ్వంసం చేద్దాం" అన్నాడు.

సర్గ-28
వర్ష ఋతు వర్ణన

లక్ష్మణుడి మాటలకు రామచంద్రమూర్తి ఆయన్ను చూసి ఇలా అన్నాడు.

"తమ్ముడా! చూశావా! వానాకాలం వచ్చింది. భూమ్మీద చీకట్లు కమ్మినట్లు ఆకాశం మీద పెద్ద కొండలాగా మేఘాలు దట్టంగా వ్యాపించాయి. ఒకదానిమీద మరొకటి పేర్చినట్లు నిచ్చెనలాగా వున్నా మేఘాల వెంట ఎక్కి ఆకాశానికి పోయి, మృదువైన పూలతో సూర్యుడిని అలంకరించవచ్చు! మధ్య-మధ్య సాయంకాలపు ఎర్రటి ఎండ కాంతులు కలిగి కోనల్లో మిక్కిలి తెల్లగా నీటిలో నిండిన మబ్బులను చింపి గుడ్డలు కట్టిన పుండులాగా ఆకాశం వున్నది చూడు లక్ష్మణా! తెలుపు మేఘాలతో కూడిన ఆకాశం విరహతాపం వల్ల బాధపడే వాడిలాగా వుంది. విరహతాపంతో దుఃఖించే సీతలాగా భూమి కూడా ఎండవేడికి కాగి, వాన నీళ్ళతో తడిచి, ఆవిరులు కక్కుతున్నది. (కాలిన పెనం మీద నీళ్లు పడితే ఆవిరి లేచినట్లు కాలిన భూమ్మీద మొదట చినుకులు పడ్డప్పుడు ఆవిరి లేవడం అందరికీ తెలిసన విషయమే). వాయువు మేఘాల మధ్యనుండి వెలువడి కమలాల మీదుగా వచ్చి మొగలి పూల వాసనలతో నిండి వుండడం వల్ల నీళ్లలాగా చుట్టుకొనడానికి సాధ్యమవుతున్నది".

"శత్రువును అణచిన సుగ్రీవుడు గంధం పూసుకున్నట్లు, ఈ పర్వతాలు, మొగిలి పుప్పొడితో వ్యాపించి, అతడు పూలను ధరించినట్లు పర్వతాలు ఏరుమద్ది పూలను ధరించి, అతడు అవభృథ స్నానం చేసినట్లు ఇవి వర్షధారలతో తడిసి అందంగా వున్నాయి. ఈ పర్వతాలు మేఘమనే కృష్ణాజినం, జలధారలనే యజ్ఞోపవీతాలు ధరించి గుహలలో చల్లగాలి నిండగా వేదాధ్యనం చేసే

బ్రాహ్మణుడిలాగా కనిపిస్తున్నాయి. కొరడాలతో కొట్టితే ఏడ్చే బ్రహ్మచారిలాగా అందమైన అపరంజి బంగారు కాంతులను మించిన మెరుపులున్న ఆకాశం ఉరుములతో ధ్వనిస్తూ వుంది. నల్లటి రావణాసురుడి రొండిలో పచ్చని బంగారువన్నెకల సీత వణికినట్లు మేఘాన్ని ఆశ్రయించిన మెరుము కదులుతున్నది చూశావా లక్ష్మణా? దిక్కులన్నీ నల్లటి మబ్బులతో వ్యాపించడం వల్ల శుక్రాది గ్రహాలు కానీ, చంద్రుడు కానీ, కనబడడం లేదు. ఇది ఫలానా దిక్కని గుర్తించడం కష్టంగా వుంది. బాగా వాన పడడం వల్ల సంతోషించిన కొండమల్లెలు, కొండ చరియలలో అవి ఎగిసిపడుతుంటే కామాన్ని ఉద్రేకించేదిగా వున్నది చూశావా? దుమ్ములు పోయాయి. గాలి చల్లగా వీస్తున్నది. దేహం మీద చెమటలు పట్టడం లేదు. విసనకర్రలతో విసురుకోవాల్సిన అవసరం లేదు. దూరంగా వున్నవారు తమ ఇళ్లకు చేరుకున్నారు. రాజులు దండయాత్రలు ఆపుచేసి వారి–వారి వూళ్లలోనే వుండిపోయారు".

"మానస సరస్సులో నివసించాలని కోరికగల హంసలు కాంచారాలు మాని ఎక్కడెక్కడో దాక్కున్నాయి. చక్రవాక పక్షుల దంపతులు తమ ప్రియులు లభించడం వల్ల మనోహరంగా, సంతోషంగా ప్రకాశించాయి. మేఘాల నుండి భూమి దాకా ఎడతెరిపి లేకుండా ఒక్కధారగా వానలు కురియడం వల్ల బాటలలో బండ్లమీద ప్రయాణాలు కుదరవు. లక్ష్మణా! ఆకాశాన్ని చూడు. మేఘాలు లేనిచోట అజ్ఞానరహితుడి బుద్ధిలాగా విశదంగా ప్రకాశిస్తున్నది. ఒక్కోచోట అజ్ఞాని బుద్ధిలాగా ప్రకాశం లేకుండా వుంది. మొహభ్రాంతుడి చిత్తంలాగా ఒక్కొక్కచోట పర్వతాలతో అడ్డగించబడి వుంది. ఒక్కొక్క చోట సంధిగ్ధరహితుడి చిత్తంలాగా సాంతంగా, అలలులేని సముద్రంలాగా వుంది. మద్దిపూలతో, కడప పూలతో కలిసి, గైరిక ధాతువుల వల్ల ఎర్రటి నదులు, నెమిళ్ళ ధ్వనులతో అనుసరించబడి, చాలా వేగంగా పారుతున్నాయి చూశావా? తుమ్మెదల్లాంటి నేరేడు పండ్లను, గాలికారణాన నేలమీద తెగిపడ్డ మాగిన మామిడి పండ్లను లోకులు భుజిస్తారు సుమా! మెరుపులతో కూడి యుద్ధరంగంలోని ఏనుగుల్లాగా మేఘాలు అన్నీ గర్జిస్తున్నాయి. నెమిళ్ళ గుంపు విలాసంగా నాట్యం చేస్తుంటే, మబ్బులు వర్షిస్తుంటే, అపరాహ్ణకాలంలో అడవులు అందంగా వున్నాయి".

"ఎక్కువ నీటి బరువు కలగగా, మేఘాలు గర్జిస్తూ నిలిచి, నిలిచి లేచిపోతున్నాయి చూశావా? గర్భధారణ కోరి మేఘాలు కామించి, వాటి దగ్గరకు కొక్కెరలు పోతున్నాయి. అవి అలా పోతుంటే తెల్లతామర పూల సరంలాగా

వున్నది చూడు లక్ష్మణా. ఆరుద్ర పురుగులు దండిగా అక్కడక్కడా ఆకుపసర లేత పచ్చికల మీదా రాలగా, భూమి ఎర్రపట్టుతో మొగ్గలుగా కసీద కుట్టగా ప్రకాశించే చిలుక పచ్చవన్నె చీరకట్టుకున్న స్త్రీలాగా వుంది. నది వేగంగా తన భర్త అయిన సముద్రాన్ని చేరడానికి ప్రవాహించ సాగింది. కొక్కెరలు గర్భార్థం మేఘాలను సమీపించాయి. విష్ణువు యోగనిద్రకు ఉపక్రమించాడు. కాముక ప్రియుడి దగ్గరకు చేరింది. నెమిళ్ళ ఆటలు అతిశయించాయి. కడప చెట్లకు పూలతో సహా కొమ్మలు వచ్చాయి. భూమి పైరులతో కళకళలాడింది. ఆవులమీద కోడెలకు, కోడెల మీద ఆవులకు సమానమైన ప్రేమ కలిగింది. నెమిళ్ళు ఆడాయి. భారతాలను విడిచి వున్న స్త్రీల చింత శుష్కించింది. వనాలు ప్రకాశించాయి. ఏనుగు దంపతులు పాడాయి. కోతులు చపలత్వాన్ని వదిలాయి. వానలు ధారలుగా కురిశాయి. వంకలు పారాయి".

"సెలయేళ్ల సమీపంలో అతిశయించిన సంతోషంతో మదించిన ఏనుగు గుంపులు, కొండ శిఖరాల మీదనుండి పడే సెలయేళ్ల ధ్వనికి ఉలిక్కిపడుతూ మదించి, నాట్యం చేసే నెమిళ్ళ గుంపులతో కలిసి దిక్కులు పిక్కటిల్లేట్లు ధ్వనిస్తున్నాయి. వసంత ఋతువులో బాగా పూసిన పూలలోని తేనెను ఇష్టం వచ్చిన విధంగా, తనువు తీరా తాగి, మత్తెక్కిన తుమ్మెద గుంపులు, ఇప్పుడు తేనే లేనందువల్ల దిగులుతో కడప చెట్ల కొమ్మల్లో వేలాడుతున్నాయి. నల్లటి నేరేడు పండ్లు విస్తరించి కప్పుకొనగా తుమ్మెదలు కప్పుకున్నట్లు నేరేడు చెట్లున్నాయి చూడు లక్ష్మణా! ధ్వజాలు కలిగి, గంభీరమైన ధ్వనితో యుద్ధభూమికి బయల్దేరు ఎనుగుల్లాగా ఆకాశంలోని మబ్బులున్నాయి చూడు. వనాలు కొన్ని నెమిళ్ళలాగా ఆడుతున్నాయి. కొన్ని తుమ్మెదల్లాగా పాడుతున్నాయి. కొన్ని ఏనుగుల్లాగా మదించి వున్నాయి. తుమ్మెదల ఝుంకారం వీణతంతుల ధ్వనిగా, కప్పకూతలు కంఠతాళాలుగా, మబ్బుల ఉరుములు మద్దెల ధ్వనులుగా, అడవుల్లో సంగీత గోష్టి జరుగుతున్నది. సంగీత గోష్టిలో కొందరు పాడుతారు. కొందరు చూస్తారు. కొందరు అలంకరించుకుని వుంటారు. అలాగే కొన్ని నెమిళ్ళు పాడగా, కొన్ని ఆడగా, కొన్ని చెట్లకొమ్మల కొనల్లో నిలవగా, నెమిలి పించాలానే ఆభరణాలతో సింగారించుకుని వనాలలో సంగీత గోష్టి జరుగుతున్నది".

"చాలా కాలంగా నిద్రపోతున్న కప్పలు మేఘాల ఉరుములకు మేల్కొని మిక్కిలి సంతోషంతో నానా విధాలైన ధ్వనులు చేసుకుంటూ, వానధారలను చూసి సంతోషించాయి. దొర్లుతున్న గడ్డలను దాటుకుని, పూలు పండ్లు లాంటి

కానుకలు తీసుకుని, నదులనే ప్రౌఢస్త్రీలు సంభోగాసక్తితో, శీఘ్రంగా ప్రయాణం చేయాలన్న ఉత్సాహంతో, తమ భర్తైన సముద్రం దగ్గరకు పోతున్నాయి. సంతోషంగా పొంగిపోయి కేకలు వేసే నెమిళ్ళు, ఆరుద్రపురుగులతో కూడిన పచ్చిక నేలలు, మంచి సువాసనలు వ్యాపింపచేసే కడప, మద్దిచెట్ల వనాలలో ఏనుగులు విజృంభించి తిరుగుతున్నాయి. ఎడతెగకుండా పడుతున్న నీటి ధారలతో అందం చెడ్డ ఆకరువులను, కాంతి తొలగిన కమలాలను వదిలిన తుమ్మెదలు కడప పూల గుంపులను తాకాయి. లక్ష్మణా! ఈ వానాకాలంలో ఏనుగులు మిక్కిలి సంతోషంతో మదించాయి. ఆబోతులు మేత దండిగా దొరకడం వల్ల సంతోషంగా వున్నాయి. సింహాలు బడలాయి. పూలతో కొండలు మనోహరంగా వున్నాయి. మేఘాల దొంతులతో ఇంద్రుడు ఆడుకుంటున్నాడు. రాజులు దండయాత్ర లేక శాంతంగా వున్నారు''.

"సముద్ర ధ్వనిని ఛీ కొట్టుతూ, దానితో సమానమై ఆకాశంతో రాసుకుంటూ,ఏరులను, కొలకులను, బావులను, చెర్వులను, మేఘాలు సమానంగా చేశాయి. అన్నీ సముద్రంలాగా నిండి వున్నాయి. భూమ్మీద దట్టమైన చీకట్లు వ్యాపించేట్లు జోరుగా, ఏకాధారగా జడివానలు కురియడం వల్ల, దానికి తోడు రివ్వు–రివ్వుమని గాలి కఠినంగా వీస్తుంటే, ఒడ్డులు అదిరిపడేట్లు ఏర్లు పొంగి, తోవ, డొంక లేక, పోయిందే తోవగా తప్పు తోవల్లో చాలా వేగంగా పారుతున్నాయి. భూమ్మీద ప్రజలతో అభిషిక్తులైన రాజులు తమ వైభవాన్ని లోకులకు కనబడే విధంగా చేసినట్లే, పర్వతాలు మేఘ సమూహాలతో అభిషిక్తమై శ్రీయుక్తమైన తమ స్వరూపాన్ని కనబరుస్తున్నాయి. రాత్రుళ్లు నక్షత్రాలతో కూడి ఆకాశం మేఘాలనే ముసుగును ధరించింది. పగలు సూర్యుడు ఏ పక్కన వున్నాడో తెలియడం లేదు. భూమి విస్తారమైన జలాలతో తృప్తి పొందింది. అంతటా చీకటి వ్యాపించింది. దిక్కులలో కాంతి మాసిపోయింది. ఏది ఏదిక్కో తెలియడం లేదు. సాటిలేని నీటి ధారలతో కడుగబడి పారావత శిఖరాలు మంచిముత్యాల సరాల లాగా తన కొండ శిఖరం నుండి పడే సెలయేళ్ల సమూహాలతో భోగ పురుషుడిలాగా ప్రకాశిస్తున్నాయి''.

"ఇంద్రలోకంలోని స్త్రీలు రతికేళి జరుపు సమయంలో వారి మెడల్లోని ముత్యాల సరాలు తెగి నేలమీద పడుతున్నాయా అన్నట్లు వాన నీటి ధారలు విశేషంగా కనపడుతున్నాయి. పక్షులు గూళ్లలో దాగివుండడంవల్ల, కమలాలు ముకుళించడం వల్ల, జాజులు వికసించడం వల్ల, సూర్యుడు కుంకాడని

అర్థమవుతున్నది. లక్ష్మణా! ఈ భాద్రపద మాసంలో సామవేద పఠనానికి ఇదే సమయం కాబట్టి బ్రాహ్మణులు సామవేదాధ్యయనం చేయడం మొదలు పెట్టారు. మన భరతుడు భోగేచ్ఛమాని ఆషాఢ శుద్ధ పౌర్ణమి మొదలు శ్రద్ధగా చాతుర్మాస వ్రతాన్ని జరుపుతున్నాడు కదా! అయోధ్య వదిలి వచ్చిన నన్ను చూచి పౌరులు చేసిన ధ్వని లాగానే ఇప్పుడు సరయూనది వేగంగా పారుతున్నది కదా? శుభకరమైన ఈ సమయంలో శత్రువును జయించిన సుగ్రీవుడు భార్యతో కలిసి రాజ్య భోగాలను అనుభవిస్తుండవచ్చు కదా? నేనేమో శత్రువును జయించలేకపోతిని. భార్య కూడా లేదాయే! రాజ్యం లేదాయే! కాబట్టి సహించలేని దుఃఖంతో కుమిలిపోతున్నాను".

"ఈ వానాకాలం దాటి జీవించడమే కష్ట సాధ్యం. ఎందుకంటే నా మనస్సులోని శోకాగ్ని విస్తారమయింది. ఒకవేళ బతికినా భయంకర బలంకల రావణుడుని తుదముట్టించడం అంత సులభం కాదు. వాలి వధానంతరం సుగ్రీవుడు తననేమి చేయమంటారని అడుగుతే, వచ్చేది వానాకాలం కాబట్టి వూరికి పొమ్మన్నాను. మనం చేసిన మేలు ఎలాంటిదో, దానికి ప్రత్యుపకారం ఎలా చేయాలో సుగ్రీవుడికి బాగా తెలుసు. కాబట్టి ఆ సుగ్రీవుడి అనుగ్రహం కలిగేదాకా ఆగుదాం. ఏరులు ఇంకిపోవాలి, సుగ్రీవుడు రావాలి, మన కార్యం కావాలి, తొందరపడి లాభం లేదు. సుగ్రీవుడు ప్రత్యుపకారం చేస్తాడని నమ్మకం ఏమిటి అని అడుగుతావేమో? అలా కాదు. వీరుడైన వాడు, సామర్థ్యం కలవాడు, ఉపకారికి ప్రత్యుపకారం ఎలాగైనా చేస్తాడు కాని మానడు. ప్రత్యుపకారం చేయని క్రూరుడు సుజనుల మనస్సు నొప్పించిన వాడవుతాడు. అది వాడికి కీడు చేస్తుంది. కాబట్టి లోకానికి భయపడైనా, లేదా, తన మేలుకొరకైనా చేస్తాడు".

ఇలా రామచంద్రమూర్తి చెప్పగా విన్న లక్ష్మణుడు "రామచంద్రా! నువ్వు చెప్పినదంతా నిజం. సుగ్రీవుడు సమయం చూసి సహాయం చేస్తాడు. చేయకుండా వుండడు. కాబట్టి వానలు ఆగేదాకా మనం ఇక్కడే వుందాం. ఆ తరువాత శత్రు సంహారానికి ప్రయత్నం చేద్దాం" అని అంటాడు.

సర్గ–29

కామపరతంత్రుడైన సుగ్రీవుడికి బోధించిన హనుమంతుడు

(హనుమంతుడు రామచంద్రమూర్తి భక్తుడైనప్పటికీ తన స్వామైన సుగ్రీవుడి ఆజ్ఞ లేనందువల్ల రాముడి దగ్గర వుండకుండా సుగ్రీవుడి దగ్గరే వుంటున్నాడు. కాబట్టి తన ప్రభువు ద్వారా సర్వప్రభువైన రామచంద్రమూర్తి కార్యం నెరవేర్చడానికి పూనుకున్నాడు. దీనివల్ల భగవత్కార్యపరుడైన భక్తుడు ఎల్లవేళలా స్వామి సన్నిధానంలోనే వుండాలన్న నియమం లేదు. లక్ష్మణుడి లాగా దగ్గరే వుంది కైకర్యం చేయవచ్చు. హనుమంతుడి లాగా దూరంగా వుండి కూడా సేవ చేయవచ్చు. స్వామికార్యం నెరవేర్చే ఉపాయం ఆలోచిస్తూ స్వయంగానో, పరుల ద్వారానో, అది నెరవేర్చాలి. అదికూడా సాధ్యపడకపోతే భరతుడిలాగా చేయాలి. పరులను సేవించాల్సి వస్తే భగవత్సేవాసక్తికలవారి దగ్గర వుండాలి కాని వాలిలాంటి భగవద్విముఖుల దగ్గర వుండకూడదు).

రామచంద్రమూర్తి కార్యం నెరవేర్చాల్సిన కాలం సమీపించిందని హనుమంతుడు భావించాడు. ఆ విషయాన్ని సుగ్రీవుడు ఆలోచించక పోవడం కూడా గమనించాడు హనుమంతుడు. భోగభాగ్యాలతో అనుభవిస్తూ ధన–రత్నాది సమృద్ధితో కూడి స్వామి కార్యం మరచిన సుగ్రీవుడిని గుర్తించాడు. కామం ఒక్కటే ముఖ్య కార్యంగా వుంచుకుని స్వామి కార్యం చెరుస్తున్నాడు సుగ్రీవుడు అని భావించాడు హనుమంతుడు. సజ్జనులు నడిచే శుభమార్గానికి సుగ్రీవుడు దూరమయ్యాడని కూడా తలచాడు. ధర్మ విచారం, అర్థ విచారం చేయడం లేదు సుగ్రీవుడని నమ్మాడు. తన పని పూర్తి చేసుకున్న వాడిని, ఉత్తమ స్త్రీతో రతిలో ఆసక్తి కలవాడిని, తన కోరిక తీరడంతో రాత్రి ఏదో–పగలేదో మరచిన వాడిని, తన భార్యతోనే కాకుండా తారతో కూడా క్రీడా వినోదాల్లో

మునిగిన వాడిని, రాచకార్యం మంత్రులకు వదిలిన వాడిని హెచ్చరించాలనుకున్నాడు హనుమంతుడు.

రాజకీయ వ్యవహారం మంత్రుల మీద వేసిన సుగ్రీవుడిని, వారేం చేస్తున్నారో, ఎలా చేస్తున్నారో విచారణ చేయని వాడిని, అలా అయితే ప్రభుత్వం వుంటుందా అని ఆలోచన చేయని వాడిని, తననెవ్వరూ ఏమీ చేయలేరని భావించిన వాడిని, రాజైనప్పటికీ ఆయన ఇవ్వాల్సిన ఆజ్ఞలు ఇవ్వని వాడిని, సర్వదా మన్మథ క్రీడల్లో మునిగిన వాడిని, వాస్తవార్థం తెలసిన హనుమంతుడు, వినయంగా హెచ్చరిస్తూఇలా అన్నాడు.

"వానర రాజా! నీకేమో యశస్సు, సంపద, భూమి లభించింది. స్నేహితుల కార్యం ఇంకా నేరవేరాల్సి వుంది. అనుకూల–ప్రతికూల కాలం తెలుసుకుంటూ, ఆ కాలంలో స్నేహితులతో తగు రీతిన ప్రవర్తిస్తే అతడి కీర్తి, రాజ్యం, శౌర్యం వృద్ధి చెందుతుంది. వానర రాజా! సేనాబలం, మిత్రబలం, సుహృద్బలం, కోశబలం, అనే ఈ నాలుగున్న రాజు రాజ్యం పూర్ణంగా వృద్ధి చెందుతుంది. నువ్వు స్వభావ రీత్యా మంచి నడవడి కలవాడివి. నీ మనస్సు సన్మార్గంలో వుంటుంది. కాబట్టే నేను నిన్ను హెచ్చరించగలుగుతున్నాను. శీఘ్రంగా నువ్వు నీకు మేలుచేసిన వారి పని చేయడానికి ప్రయత్నాలు చేయి. అదే మంచిది. తన పనులన్నీ వదులుకుని తన స్నేహితుల పనులు చక్కబరిచేవారికి ఎప్పటికీ కీడు కలగదు. అనుకూలం లేనప్పుడు మిత్రుడి కార్యానికి ఎంత ప్రయత్నించినా, ఎంత శ్రమించినా ఫలితం వుండదు".

సీతను వెతికించమని సుగ్రీవుడికి చెప్పిన హనుమంతుడు

హనుమంతుడు ఇంకా ఇలా చెప్పాడు. "ఈ కారణం వల్ల సరైన సమయంలోనే మిత్ర కార్యం చేయి. మంచి మనస్సున్న సుగ్రీవా, సీతను వెతకడానికి వానరులను పంపు. ఇప్పటికే సమయం మించి పోయింది. బుద్ధి సంపద కలవాడు, నీకు వశుడైన రామచంద్రుడు, సీతాన్వేషణకొరకు తొందరున్నప్పటికీ, సమయం, కాలం తెలిసన వాడైనందున నిన్ను హెచ్చరించక ఊరుకున్నాడు. ప్రజ్ఞావిభవుడు, త్వద్వశుడు కాబట్టి తానే నిన్ను హెచ్చరించకుండా నీ నడవడి పూర్తిగా తెలిసేవరకు తొందర పడకూడదని వేచి వున్నాడు. ఆయన తన పని విషయం మర్చిపొయాడని అనుకోవద్దు. 'నా పని అయిపోయింది కదా! ఇంక నా సౌఖ్యం వదులుకుని అతడికొరకు కష్టపడకపోతే ఏమవుతుంది' అంటావా? అలా

అనవద్దు. ఆయన నీ వంశాన్ని రక్షించాడు. ఆ కారణాన దీర్ఘకాల స్నేహానికి తగినవాడు. అదీ కాకుండా నువ్వు అతడికి సామంతరాజువి కాబట్టి నీకు గౌరవపాత్రుడు. ఆ అధికారం లేకపోయినా ఆయన చెప్పనలవికాని మహిమకలవాడు. ఆ కారణాన కూడా నీకు రామచంద్రమూర్తి పూజ్యుడే''.

“నువ్వు చేయాల్సిన సహాయం వూరికే ధర్మానికి చేస్తున్నది కాదు. లోకమంతా తెలిసేట్లు నీకాయన ముందుగా సహాయం చేశాడు. కాబట్టి నువ్వతడికి మారుమేలు చేయాలికదా? అది నీకర్తవ్యం కదా? చేయకపోతే తప్పుకాదా? కాబట్టి సీతను వెతికించడానికి వానరులందరినీ ఇక్కడికి పిలిపించాలని కోరుతున్నాను. కాలం అతిక్రమించింది కదా! ఇంక చేసినా వ్యర్థమే కదా! అంటావేమో? కాలం కొంత అతిక్రమించినా, ఎదుటివారు హెచ్చరించక ముందే కార్యం మొదలుపెట్టితే కాలం అతిక్రమించి చేసిన దోషం పోతుంది. పరులు హెచ్చరించిన తరువాత చేస్తే కాలదోషం కలుగుతుంది. ఇప్పుడు కాలదోషం కొంచెం అతిక్రమించినప్పటికీ రామలక్ష్మణులు ఇంకా హెచ్చరించలేదు. వారు హెచ్చరించక ముందే చేస్తే దోషం లేదు''.

(కార్తీకమాసంలో పున్నమితోనో, అమావాస్యతోనో కదా నాలుగు మాసాలు ముగిసేది. దండయాత్రకు మార్గశిరం రావాలికదా? ఇప్పుడింకా ఆశ్వీయుజమాసమే కదా? గడువు తీరిందని ఆంజనేయుడెలా చెప్పాడు? మార్గశిరమాసం దండయాత్రకు సైన్యంతో పోదగ్గ సమయం. అంతకు ముందే సేనలన్నీ సంసిద్ధంగా వుంటేనే కదా, మార్గశిరంలో పోవడం సాధ్యపడేది. ఈ లోపున సీతాదేవి ఎక్కడ వున్నదో తెలుసుకోవాలి. దానికెంత కాలం పట్టుతుందో తెలియదు. అలా తెలిసిన తరువాత సేనలు సమకూడాలి. దానికీ కొంతకాలం, పట్టవచ్చు. రెంటికీ కలిపి రెండు నెలలు అనుకున్నా, ఆశ్వీయుజ మాసంలో దానికి కావాల్సిన సన్నాహాలు మొదలుకావాలి. ఇప్పుడు ఆశ్వీయుజం అయిపోవస్తున్నది. కాబట్టి కాలం అతిక్రమించిందని హనుమంతుడు చెప్పాడు. ఆయన చెప్పింది తప్పుకాదు. రామలక్ష్మణులు ఆక్షేపించింది కూడా ఏ ప్రయత్నం చేయలేదనే కాని, సేనలతో బయల్దేరలేదని కాదు).

“నీ లాంటి సద్గుణ సంపత్తి కలవాడు, ఉపకారం చేయని వాడికి కూడా ఉపకారం చేయతగిన వాడు. అదే శ్లాఘ్యమైంది. అలా వుండగా, రామచంద్రమూర్తి నీకిప్పటికే ఉపకారం చేసి, విస్తార రాజ్యం, సంపద అనుగ్రహించాడు. అలాంటివాడికి ఉపకారం చేసే విషయంలో ఇక చెప్పాల్సింది

ఏముంది? యుద్ధమంటే ప్రాణాపద కలిగించే కార్యమని భయపడ్డావని అనుకోమంటావా? నువ్వు ధైర్యం కలవాడివి. ఆపదలకు భయపడేవాడివి కాదు. బలహీనుడివీ కానేకాదు. రావణాసురుడితో ఎలా యుద్ధం చేయాలి అని అనుకునేవాడివి కూడా కాదు. నువ్వు బలవంతులకే బలవంతుడివి అన్న పేరున్నవాడివి. పరోపకార బుద్ధి నీలో లేదని అనుకోవడానికి వీల్లేదు. అన్ని వుండి కూడా ఎందుకు రామచంద్రమూర్తి విషయంలో ఉపేక్షిస్తున్నావు? నువ్వు చేయకపోతే రామచంద్రమూర్తి భయపడతాడని అనుకుంటున్నావా సుగ్రీవా? నువ్వు సహాయం చేయకపోతే రామకార్యం వ్యర్థమైపోతుందని భావించవద్దు. వాడికల ఆయన బాణాలతో రాక్షసులను, దేవతలను, పాతాళలోక వాసులను, క్షణంలో నాశనం చేయగలడు. అలా అయితే ఎందుకు వూరుకున్నాడని అంటావేమో? నువ్వు సహాయం చేస్తానని వాగ్దానం చేశావు కదా? కాబట్టి ఎంతమాత్రం చేస్తావో, చేయవో అని చూస్తూ సహించి వున్నాడు. కాని తన కార్యం తాను చేసుకునే శక్తిలేక కాదు".

"యుద్ధమే ప్రాణాపదకరమైన కార్యం. అందులోనూ వాలితో యుద్ధం ప్రాణ గొడ్డమైనదని నీకు తెలుసు. అలాంటి విషయంలో ఏ కొంచెం తప్పిదం జరిగినా తన ప్రాణం మీదకు వస్తుందే అని సందేహించకుండా, సాహసించి నీకు మేలు చేశాడు. కాబట్టి నువ్వుకూడా సేనలతో పోయి ఆయన భార్యను భూమ్మీద, ఆకాశం మీద వెతికించు. రాక్షసులంటే రామచంద్రమూర్తి భయపడుతాడని తలచావా? దేవతలు, దైత్యులు, మరుత్తులు, గరుడులు, పన్నగులు, లేదా అందరూ, ఒకటిగా కలిసి తనమీదకు వచ్చినా రామచంద్రమూర్తిని భయపెట్టలేరు. ఇక ఒక్క రాక్షసులంటే ఆయనకు భయమా? లక్ష్యమా? కాబట్టి అలాంటి అభిప్రాయం వుంటే వదిలి, నీకుపకారం చేసిన గొప్పవాడికి మారుమేలు చేయడానికి ప్రయత్నం చేయి. ఆ ఆలోచన మినహా వేరే ఆలోచన చేయకు".

"భూమ్మీద, ఆకాశంలో, నీళ్లలో, నిప్పుల్లో, పాతాళంలో వేగంగా, అడ్డంగా–నిలువుగా పోగల సమర్థులైన వానరులున్నారు. నువ్వు ఆజ్ఞ ఇవ్వు. నీ ఆజ్ఞలేకుండా వారేదైనా ఎలా చేయగలరు? కార్యదీక్షపూని ఎలాంటి పనైనా తమ సామర్థ్యంతో చక్కపర్చకల నేర్పున్న వానరులు కోటానుకోట్లు వున్నారు. వారేం చేయాల్లో ఆజ్ఞాపించు. నువ్వు చేయాల్సింది మాట మాత్రమే".

అని హనుమంతుడు చెప్పగా కాలానికి ఉచితమైన ఆయన మాటలు విని

సుగ్రీవుడు వానర సేనానాయకుడైన నీలుడిని చూసి, వానరయూధ నాయకులందరూ పదిహేను రోజుల్లో తమ సేనలతో తన దగ్గరికి రావాలనీ, రానివారి ప్రాణాలు తీయబడుతాయనీ అంటాడు. ఆ విధంగా ప్రకటించమని నీలుడిని ఆజ్ఞాపించాడు. అంగదుడితో కలిసి నీలుడు ఆ పని చేయాలని చెప్పి, అంతఃపురంలోకి పోయాడు.

(దీనివల్ల అర్థమయ్యేది, సుగ్రీవుడు ఎక్కువ కాలం అంతఃపురంలోనే గడిపేవాడనీ, రాజ్యతంత్రం ఎక్కువగా విచారించే వాడు కాదనీ, హనుమంతుడు హెచ్చరించక పోతే రామకార్యం మరిచేవాడనీ).

సర్గ–30
శరత్కాలంలో సీత విరహాన తపించిన శ్రీరాముడు

వానలు ఆగిపోగా, ఆకాశం తెల్లగా కాగా, చంద్ర మండలం పరిశుభ్రంగా కానరాగా, శరద్రాత్రి అనే స్త్రీ, వెన్నెల అనే గంధం పూసుకుని, సుగ్రీవుడు సుఖిస్తూ వుంటే, గడువు దాటిపోయింది. వాన భయం లేనందున, ఆకాశం నిర్మలంగా వుండడం వల్ల, గుహ విడిచి బయటకు వచ్చిన రామచంద్రుడు, కొండమీదకు పోయి, అక్కడ కూర్చుండి, సీతాదేవిని తలచుకుని, ఇలా పరితపించాడు.

"సీతాదేవి ఆశ్రమంలో వున్నప్పుడు సారసాల తియ్యటి కంఠంలాంటి రవముతో నన్నెంతగానో సంతోషపరిచేది. అలాంటిది ఇప్పుడు నాకిప్పుడు ఎలా సుఖం ఇవ్వగలదో? పూచిన చెట్ల గుంపులను, నిర్మలమైన అసనాలను చూస్తూ పుష్పకోమలమైన సీత నేను దగ్గర లేనందున ఎంత బాధపడుతున్నదో? పూర్వం కలహంసలాగా మధురమైన సూక్ష్మరవాన సీతాదేవి పలుకుతే తెలుసుకున్నాను. ఇప్పుడు నేనెలా తెలియగలను? అనురాగంతో ఎడబాయక కూడా కలిసి తిరిగే చక్రవాక దంపతుల ధ్వని విని సీతాదేవి నన్ను విడిచి ఒంటరిగా వుండడం వల్ల దీనురాలిగా ఎలా పరితపించునో కదా?కమలాల లాంటి అరచేతులుకల, మీనాల లాంటి కళ్ళుకల, తీగలాంటి దేహంకల, అమృతం లాంటి చిలకపలుకులుకల సీత లేకుండా ఈ సరస్సులు, ఈ నదీ తీరాలు, ఈ తోటలు, ఈ అడవులలో సంచారం చేయడానికి సంతోషం కలగడం లేదు".

శ్రీరాముడి దుఃఖాన్ని ఆపిన లక్ష్మణుడు

ఏకాగ్రమైన మనస్సుతో సీతాదేవి గురించి పరితపిస్తున్న రామచంద్రమూర్తిని చూసి లక్ష్మణుడు చాలా బాధపడ్డాడు. బాధపడి, అన్నతో ఇలా అన్నాడు:

"ఎందుకిలా చేస్తున్నావు? నీ పరాక్రమానికి అవమానం కలిగేట్లు కామానికి వశుడవై ఇలా మాట్లాడవచ్చా? ధైర్యంగా పని చక్కబరుచుకోవాల్సిన సమయంలో దుఃఖపడుతున్నావే? మనం ఇప్పుడు ఏమి చేయాల్నో ఆలోచించి, మనస్సు నిర్మలం చేసుకుని, కాలమున్న స్థితిని అంచనావేసుకుని, సుగ్రీవుడి సహాయం జ్ఞాపకం చేసుకుని, దేవతా ప్రార్థన, సేవ మనస్సులోకి తెచ్చుకుని, ప్రకాశించు. పరాక్రమంతో అతిశయించు. శ్రీనివాసా! నీవు నాథుడిగా కలిగిన భూమి పుత్రి సీత ఇతరులకు సులభం అవుతుందా? ఆమెను ఎవడు ఆశించినా అగ్నిజ్వాలల్లో పడినవాడు నశించిన విధంగా వాడు కూడా నశిస్తాడు కాని బతగకలడా?"

ఈ విధంగా భవిష్యత్కాలంలో మేలు చేసేవి, తత్కాలానికి ఇంపైనవి, నీతి, ధర్మం, మంచితనంతో కూడినవైన మాటలను లక్ష్మణుడు చెప్పగా రామచంద్రమూర్తి ప్రీతితో విన్నాడు. "నాయనా! నువ్వు చెప్పిన మంచి మాటలు మేలైనవే. కష్టసాధ్యమైన పని ఎలా చేయవచ్చో అని ఆలోచించాల్సిన విషయమే. దానికి తగిన ప్రయత్నం చేయాల్సిందే" అని అన్నాడు.

శరద్ఋతు వర్ణన

అలా చెప్పిన రామచంద్రమూర్తి, ఆ తరువాత, సీతాదేవిని తలచుకుని, లక్ష్మణుడితో ఆర్తితో ఇలా అన్నాడు.

"ఇంద్రుడు వర్ష ధారలతో భూమిని తడిపి పైరులను రక్షించి కృతకృత్యుడయ్యాడు. చెట్లమీదుగా, కొండలమీదుగా, పోయే మేఘాలు ధ్వనించి కురిసి, అలసట చెంది, బడలిక తీర్చుకుంటున్నాయి. వానాకాలపు మబ్బులు దిక్కులను నల్లగా చేసి, మదం వుడిగిన ఏనుగుల్లాగా వేగం తగ్గినవయ్యాయి. లోపల నీళ్లుండి మహా వేగం కలిగి, కొండమల్లెపూల, మద్దిపూల వాసనలతో నిండి వానకు ముందు వచ్చే గాలులు విసిరి-విసిరి వీచి చాలించుకున్నాయి. మేఘాల గుంపుల, మదించిన ఏనుగుల గుంపుల, నెమళ్ళ గుంపుల, కొండ వంకల ధ్వని ఒక్కసారిగా నిలిచి పోయింది. మేఘజల ధారలతో చక్కగా, నిర్మలంగా, మురికి పోయేట్లు కడగబడిన కొండల్లోని శిఖరాల వరసలు విచిత్ర కాంతులతో పూయబడినట్లున్నాయి. ఔరా! ఆశ్చర్యం! సిగ్గుకల స్త్రీ తన భర్తతో కొత్తగా సంగమిస్తున్నప్పుడు మెల్ల-మెల్లగా కటి ప్రదేశాన్ని చూపించినట్లే శరత్కాల నది కూడా మెల్ల-మెల్లగా తనలోని ఇసుక దిబ్బలను కనపడేట్లు చేస్తున్నది".

"శరత్కాలం తన సారవంతమైన తెల్లటి కాంతిని కర్పూరపు అరటి కొమ్మల్లోను, నక్షత్రాల్లోను, సూర్య-చంద్రుల కిరణాల్లోను, గొప్ప ఏనుగుల్లోను వుంచింది. (అంటే, ఏడాకుల అరటిలో పూలుగాను, నక్షత్ర-సూర్య-చంద్రుల్లో నిర్మల కాంతిగాను, ఏనుగులలో క్రీడగాను, శరత్కాలం ప్రవేశించింది). శరత్కాలగుణాలను పొంది, మిక్కిలి మనోహర కాంతులు కలిగిన, కొత్త ఇంపైన కాంతి గల బాల సూర్యుడి కిరణాలతో మేల్కొల్పబడిన తామరకొలను మరింత అందంగా కనిపించింది. పచ్చ కర్పూరపు చెట్ల పూలవాసనలు కలిగి, మదించిన తుమ్మెదల ఝుంకారాలు కలిగిన పిల్లగాలులు మదించిన ఏనుగులకు గర్వం కలిగేట్లు చేశాయి. లక్ష్మణా! జక్కవలు, హంసలు, జోడు-జోడుగా ఏటి ఇసుక దిబ్బలల నుండి వచ్చి కొలకుల్లో క్రీడించడానికి ప్రయత్నించి, తమ రెక్కలు విదిల్చి, విజృంభించి, క్రీడించి, పూల పుప్పొడిని గంధంలాగా దేహం నిండా పూసుకుని, సంతోషంగా ఎదురెదురుగా ఆటలాడుతున్న విధానం చూశావా? మదం ఎక్కువ కాగా తిరిగే ఏనుగులందు, కొవ్వుపట్టి తిరిగే కోడెలందు, తేరిన తేటనీరున్న నదులయందు, శరదృతువు కాంతి కనపడుతున్నది. మబ్బులు లేని ఆకాశాన్ని చూసి తమ పింఛాలను, ఆభరణాలను వదిలి, ప్రియురాళ్ళను వదిలి, కాంతి చెడి, నెమళ్లు సంతోషహీనములై ధ్యానం చేస్తున్నాయి".

"నిర్మలమైన అపరంజి బంగారు వన్నె పచ్చని కాంతులు దిక్కులు నిండగా, నిండార పూసిన పూల బరువుతో కొమ్మలు నేలను తాకుతుంటే, మిక్కిలి కన్నుల పండుగగా కమ్మని వాసనలను ఘుమ్మని దిక్కులందు వ్యాపింప చేయగల మంకెన పూలతో అడవులు అందంగా కనపడుతున్నాయి. సౌమిత్రీ! ఈ అడవిలోని ఏనుగులను చూశావా? ఆడ ఏనుగులు తమ వెంట రాగా మదపు నీళ్లు కారడం వల్ల పగిలిన చెక్కిళ్లు కల మగ ఏనుగులు మదరసాతిశయంతో ఊగులాడుకుంటూ మెల్లగా నడుస్తున్నాయి. దుమ్ము తుడిచి, మెరుగు పెట్టి, కత్తుల కాంతితో ఆకాశం ప్రకాశిస్తున్నది. ఏటి జలాలు సన్నగిల్లాయి. కమలాల చల్లటి గాలులు సంచారం చేస్తున్నాయి. దట్టమైన చీకట్లు తమని వదిలి పోవడం వల్ల దిక్కులు కాంతివంతమయ్యాయి. సూర్యుడి ఎండ వేడికి బురదలు పగుళ్లు పారుతున్నాయి....నేల మాడినట్లు దుమ్ములు రేగుతున్నాయి. రాజులు తమ విరోధాలు, కోపాలు తీర్చుకోవడానికి ఒకరినొకరు జయించటానికి దండయాత్ర చేయడానికి ఇదే సరైన సమయం. మందల్లోని కోడెలు బలిసి, గర్వించి, జంకు, భయం లేకుండా తిరుగుతూ హుమ్మని కొమ్ములు పక్కకు వంచి రంకెలు వేస్తూ, కలహానికి దిగుతున్నాయి".

"మన్మథుడి పీడకు గురై, ఆ కారణాన అనురాగం కలిగి, తమలాంటి ఏనుగులతో కూడి, కూరిమితో నడుస్తూ, మనోహరంగా ఆడ ఏనుగుల గుంపు మదించిన తమ భర్తను విడువకుండా వెంటనే వుంది, అడవుల్లో పోతున్నాయి చూశావా లక్ష్మణా? తమకు అలంకారాలుగా వున్న పురులను వదిలి నదీతీరాలకు పోగా అక్కడున్న హంసలు బెదిరిస్తే వెనక్కు మళ్లిపోతున్నట్లు దీనంగా వున్న నెమళ్ళను చూడు. చక్రవాకాలను, నీరుకోళ్ళను, ఏనుగులు బాగా తరిమికొట్టి ధ్వనులు చేస్తూ, కమలాలతో అలంకరించబడ్డ ఈ కొలనును కలియబెట్టి మరీ నీళ్లు తాగుతున్నాయి. బురద అడుగంటి తేలిన తేట నీళ్లు, ఇసుక ప్రకాశిస్తుంటే ఆవులమందతో కూడిన బెగ్గురు పక్షులు ధ్వనులు చేస్తూ స్నానం చేస్తున్నాయి చూడు. విడవకుండా దూకుతున్న సెలయేళ్ల చప్పుడు పెరుగుతూ వదలకుండా మోగే నెమళ్ళ కేకలు, గాలిమోతలు తగ్గకుండా కర్రర్రర్రని కూసే కప్పల కూతలు మేఘ గర్జనలతో క్షీణించాయి".

"కొత్త మేఘాలు ఉరిమినప్పుడు భయపడి పుట్టల్లో దూరి బయటకు రానందున ఆకలితో కడుపు కాలి, ఆ కారణాన, బక్కచిక్కిన పలురకాల పాములు ఇప్పుడు దిగులు పోయి బుస్సు-బుస్సు అంటూ బయటకు వచ్చి తిరుగుతున్నాయి. సంధ్య అనే స్త్రీ, చంద్రుడనే నాయకుడు కరస్పర్శతో ఒప్పుతూ సంతోషంగా వికసించిన నక్షత్రాలనే కంటిపాపలు కలదై, ఎర్రటి కాంతి అనే అనురాగం అతిశయిస్తుంటే తనకు తానే ఆకాశం అనే చీరను వదులుతున్నది. ఉదయించే చంద్రుడనే ముఖం కలిగి, కనిపిస్తున్న నక్షత్రాలనే కళ్ళు కలదై,శరత్కాలపు వెన్నెలనే చీర కలదై, రాత్రి తెల్ల చీరె కట్టుకున్న స్త్రీలాగా వుంది. పండిన పైరుల కంకుల గుత్తులను ముక్కుల్లో కరుచుకుని ఆకాశంలో గాలికి ఎగిరి, మిక్కిలి వేగంగా బెగ్గురులు పరుగెత్తుతున్నాయి. ఇది చూస్తుంటే ఆకాశం నానా వర్ణాల పూల దండలను ధరించిన స్త్రీలాగా వున్నది. తూగుతున్న హంసలు, నిర్మలమైన తెల్ల కలువల గుంపులతో కూడిన లోతైన మడుగుల్లోని నీళ్ళు, మేఘాలు కనబడక పోతే, నిండు పౌర్ణమి నాడు చంద్రుడితో, చుక్కలతో ముద్దులు మూటగట్టుతున్న ఆకాశాన్ని స్మరణకు తెస్తున్నది".

"అందం పెరుగుతున్నట్లు రాజ హంసలు ఒడ్డాణం లాగా చుట్టుకుంటే, వికసించిన నల్ల కాలువలు, కమలాలు, నీలరత్నాల హారాల్లాగా ప్రకాశిస్తుంటే బావులు అలంకరించిన స్త్రీ రత్నాలలాగా వున్నాయి చూడు లక్ష్మణా! గొల్ల పిల్లలు వాయించే పిల్లనగ్రోవి ధ్వనులు, ఉదయాన రెప-రెపమని వీచే మందమారుతాల

ధ్వని, గొల్లలు పెరుగు చిలకగా వచ్చే ఘుంఘుమ్మనే నాదం, బలిసిన కోడెలు కామోద్రేకంతో చేసే హుంభారవం, దూడలను విడిచే సమయం అయినందున అవి ఆకలికి అంబా అని అరిచే అరుపులు, చేలకు-చెట్లకు పోయే కాపువారి ధ్వనులన్నీ ఒకదానితో ఒకటి కలిసిపోయాయి. మనోహరమైన ప్రవాహంలోని పూల గుంపులతో ప్రకాశిస్తూ, పలచటి, మృదువైన గాలికి మెల్లగా కదులుతూ, సన్నటి తెల్ల పట్టు వస్త్రం కాంతికల రెల్లు పూలు అందమైన నదీతీరాలలో వున్నాయి చూశావా తమ్ముడా? పెద్ద అడవుల్లో అడ్డం లేకుండా తేనె తనివితీరా, కడుపు నిండా తాగుతూ, సంతోషంగా ఆడ తుమ్మెదలు తమ వెంట వస్తుంటే గండు తుమ్మెదలు కమలాల మీద వున్న పుప్పొడి సోకడం వల్ల పచ్చటి కాంతి కలవై, మదించి, పరిమళంతో కూడి పోతున్న గాలివెంట ఆ వాసనకొరకై అవి కూడా పోతున్నాయి చూడు".

"ఏరులలో నీళ్లు బురద లేకుండా నిర్మలంగా వున్నాయి. కలువలు వికసించాయి. క్రౌంచ పక్షులకు తీయటి నాదం తీరింది. కార్తీకపు వరిపైరులు పండాయి. గాలి మెల్లగా వీచింది. వానాకాలం పోవడం వల్ల చంద్రుడు దట్టంగా వెన్నెల కాస్తున్నాడు. చేపలు అనే ఒడ్డాణాలు ధరించి, నదులు అనే స్త్రీలు ప్రియులతో కలిసి, రతికేళి తేలి, అలసి-సొలసి మెల్లగా తమ ఇండ్లకు పోయే వేశ్యల్లాగా మెల్లగా పోతున్నాయి. జక్కవలతో, అతిశయించిన నాచుతో, రెల్లు పూలనే తెల్లటి చీరెలతో, నదుల ముఖాలు స్త్రీల ముఖాలలాగా పత్రాలతో కూడి వున్నాయి. పూచిన నల్లటి గోరటలు, వేగిసలు కలిగి తేనె తాగడం వల్ల మదించిన తుమ్మెదల సంచారాలు కలిగి, వనంలో మన్మథుడు సంచారం చేస్తున్నాడు. ప్రపంచంలోని జీవులందరికీ జీవనమనే జీవనం దానమిచ్చి, ఏరులు, చెరువులు, కొలకులు వాటి-వాటి యోగ్యతానుసారంగా నిండించి, భూమ్మీద పైరు పంటలు వృద్ధి చేసి మేఘాలు నష్టపోయాయి. నిర్మల జలకాంతితో మనోహర క్రౌంచ ధ్వనితో విలాసంగా తిరిగే జక్కవల గుంపులతో కొలకులు మహదానందంగా వున్నాయి. కొండ చరుల్లో తెగడ చెట్ల పూలు, మంకెన పూలు, కాంచన పూలు, ఆసనాలు, ఏడాకుల అరటులు విస్తారంగా వాసనలు వెదజల్లుతున్నాయి చూశావా? ఇసుక దిన్నెల్లో క్రౌంచాల వికాసాలు, బెగ్గురుల విహారాలు, హంస దంపతుల కలకల ధ్వనులు, ఎంతో మనోహరంగా వున్నాయి. శత్రువులైన రాజులు ఒకరినొకరు జయించాలన్న కోరికతో దండయాత్ర పోవడానికి కావాల్సిన సైన్యాన్ని, సామాగ్రిని సిద్ధం చేసుకునే సమయం ఇదే. ఇక ఆలశ్యం చేయకూడదు".

సుగ్రీవుడు సమయాన్ని అతిక్రమించినందుకు విచారపడ్డ శ్రీరాముడు

"లక్ష్మణా! సుగ్రీవుడేమో ఇక్కడికి రాలేదు. రాకపోతే పోనియ్యి. ఏదైనా ప్రయత్నం చేశాడా అంటే అదీ లేదు. కొత్త కోతులేవీ వచ్చినట్లు లేదు. సంతోషపరవశత్వంతో నన్ను కూడి ఆడే సీతాదేవి లేని కారణాన శోకంతో తపించే నాకు ఈ వర్షాకాలం నాలుగు నెలలు కూడా వంద సంవత్సరాల లాగా గడిచాయి. ఆడ చక్రవాకం మగడిని విడిచి వుండలేక కూడా వున్నట్లు కష్టకారణమైన ఈ ఘోరారణ్యాలకు, ఉద్యానవనానికి పోయే సంతోషంతో బతికి మేలు చేయాలన్న కోరికకలదై వయసులో చిన్నదైన సీత వచ్చింది. నాయనా! లక్ష్మణా! అయ్యో! రాముడు పెళ్లాం లేనివాడే! ఆ దుఃఖంతో తపిస్తున్నాడే! రాజ్యాన్నంతా పోగొట్టుకున్నాడే! దేశం విడిచి కానని దేశం వచ్చాడే! అని నామీద సుగ్రీవుడికి దయరాలేదు చూశావా? ఈ ప్రకారం ఆలోచించకుండా సుగ్రీవుడు, 'రాముడా రాజ్యాన్నంతా పోగొట్టుకున్నాడు, రాక్షసుడిచే అవమానించబడ్డాడు, నీవా అనే దిక్కులేదు, పక్షికైనా ఒక గూడు వుంటుంది, వాడికి అదీ లేదు, ఉత్త అసమర్థుడు, పెళ్లాం–పెళ్లాం అని ఏడుస్తున్నాడు, నా పెళ్లాన్ని నువ్వైనా తెచ్చి ఇమ్మని నా కాళ్లమీద పడ్డాడు' అని నామీద అలక్ష్యంగా వున్నాడు. సుగ్రీవుడు తన పని అయిపోయింది కదా అనీ, మనతో ఏం పని అనీ, సీతను వెతికే పని ఆలోచించడం లేదు. తగిన కాలంలో తన బాధ్యతను మరచాడు".

లక్ష్మణుడిని కిష్కింధకు పోయి రమ్మన్న శ్రీరాముడు

"లక్ష్మణా! ఇక మనం చేయాల్సిన పని చెప్తా విను. నువ్వు కిష్కింధకు వెళ్లు. మూర్ఖుడై భోగాల మరిగిన కుటిల మనస్సుకల ఆ సుగ్రీవుడిని చూడు. చూసి నేను చెప్పానని వాడితో ఇలా అను. 'కార్యం వుంది ఆశ్రయించిన యోగ్యులకు. అంతకు పూర్వమే తనకు ఉపకారం చేసినవారికి ప్రత్యుపకారం చేస్తానని ప్రమాణం చేసి కూడా అది నెరవేర్చక పోవడం చేసినవాడిని పురుషాధముడు అంటారని ప్రాజ్ఞులు చెప్తారు. ముందు మాట చెప్పి ఆ ఆమాట నెరవేర్చడానికి పాపమైనా, పుణ్యమైనా ఆడినమాట తప్పక సత్యం మీద వుండే కార్యనిర్వాహకుడే పురుషోత్తముడని పేరు పొందుతాడు. తన కార్యం నెరవేర్చి మేలు చేసిన స్నేహితుడిని మరిచిన కృతఘ్నుడు చస్తే వాడి పీనుగను కుక్కలు,గద్దలు, నక్కలు తినకపోగా అటువైపు కూడా చూడవు'. అని ఈ విధంగా చెప్పు".

"అతడి ప్రస్తుత మనస్థితి చూడడానికి గొప్పదైనప్పటికీ, నా బంగారు కట్ల,

బాగా లాగాబడిన, ఉరుములాగా ధ్వనించే, మెరుపుల లాంటి కాంతి కల విల్లును వాడు చూడాలని అనుకుంటున్నాడు. నేను కనుబొమలు ముడి వేసుకుని, కోపంతో, మండుతున్న చిత్తంతో, భయంకరంగా లాగుతే పిడుగులు కక్కే నా అల్లెతాటి భయంకర ధ్వనిని మరోసారి వాడు చూడాలనుకుంటున్నాడు. వృక్షాన్ని నరకడం, వాలిని చంపడం ద్వారా నా గాఢ పరాక్రమం, నా బాణ శక్తి, నీ తోడ్పాటు తెలిసి కూడా లక్ష్యం చేయడం లేదు. తన పనులు చక్కబడి సుఖం మరిగినందువల్ల తాను చేసిన ప్రమాణాన్ని మరిచాడు. ఎందుకు తనతో స్నేహం చేశాను? ఎందుకు వాలిని చంపాను? వర్షాకాలం దాటగానే తానేం చేస్తానని ప్రమాణం చేశాడు? ఇవన్నీ తన పని అయిపోగానే మరిచాడు కదా? సుగ్రీవుడు వానలు ఆగిపోగానే ఇక్కడికి తాను వస్తానని నాతో చెప్పాడు. వాన నెలలు గడిచాయి. కాని, ఇచ్చా విహారంలో ఆసక్తికలవాడైనందున దానిని తెల్సుకోలేక పోతున్నాడు. తనకు ఇష్టమైన వారితో సరస సల్లాపాలు ఆడుతూ ఇష్టమొచ్చిన విధంగా తాగి మన కష్టం కానీ, దుఃఖంతో బాధపడుతున్న నామీద దయకానీ తలచడం లేదు".

"కాబట్టి లక్ష్మణా! నువ్వు కిష్కింధకు వెళ్లు. పోయి నా కోపానికి తగిన విధంగా నువ్విలా చెప్పు. 'వానరరాజా! వాలి పోయిన మార్గంలో గంపలు మొలవలేదు. నీకిష్టముంటే నువ్వు కూడా పోవచ్చు. అయినా వాలి పోయిన దారిలో నువ్వు పోవద్దు. వానరుడా! నువ్వేం ప్రమాణం చేశావో ఇప్పటికైనా జ్ఞాపకం తెచ్చుకో. వాలిచేసిన దోషానికి వాడు మాత్రమే దండించబడవలసిన వాడైనందున వాడిని మాత్రమే దండించాను. ద్రోహబుద్ధివై సత్యవాక్యం గమనించని నిన్ను, మూడుఢవైన నిన్ను, బంధువులతో సహా చంపుతాను. వానరరాజా! నువ్వు చెప్పిన ప్రమాణ వాక్యాలను జవదాటవద్దు. శాశ్వతమైన ధర్మ మార్గాన్ని వ్యర్థపరచవద్దు. నా వాడి బాణాలతో చనిపోయిన నీ అన్నను చూడడానికి పోవద్దు'. అని నా మాటలుగా నేను చెప్పానని సమయోచితంగా ఇంకేదైనా చెప్పాలనుకుంటే కలిపి చెప్పు".

సర్గ–31
సుగ్రీవుడిని తాను వధిస్తానని శ్రీరాముడితో చెప్పిన లక్ష్మణుడు

విష్ణు సమానుడైన రామచంద్రమూర్తి ఎంతో కోపంగా ఇలా పలుకగా ఆయన తమ్ముడైన లక్ష్మణుడు అంతే కోపంతో, తన కార్యం తాను సాధించే శక్తి కలవాడైనప్పటికీ దీనుడై వున్న అన్నను చూసి లక్ష్మణుడు ఇలా అన్నాడు. "ఆహా! ఏమి ఆశ్చర్యం? సత్పురుషుల నడవడి తిరస్కరించి రామచంద్రుడితో స్నేహం కలగడం వల్లే కదా, నాకీ భోగాలు, సౌఖ్యాలు కలిగాయని మనస్సులో భావించక వున్నవాడు సుగ్రీవుడు రామా! రాజ్యసౌఖ్యాలు నాశనమైనప్పుడు కాని నిన్ను తలచుకోడు. నీచమైన గ్రామ్య సుఖాలు మరిగి బుద్ధిమాలినవాడై చేసిన మేలు ఎరగని కోతికా రాజ్యసంపద? నా బాణాలతో వాలిపోయిన తోవలోనే ఆయన కూడా పోవును కాక! అన్నయ్యా! నేను కోపాన్ని అణచుకోలేదు. అసత్యవాదైన వానర రాజును చంపుతాను. మన పని ఎలా అంటావా? అంగదుడు సీతాదేవిని వెతికిస్తాడు".

లక్ష్మణుడిని శాంతపరిచి కిష్కింధకు పంపిన శ్రీరాముడు

భయంకర బాణాన్ని, విల్లును ధరించి సుగ్రీవుడిని చంపగల సామర్థ్యం కలిగి, ఘోర యుద్ధానికి కావాల్సిన కోపం తెచ్చుకున్న తమ్ముడు లక్ష్మణుడిని చూసి శ్రీరాముడు ఆయనతో ఇలా అన్నాడు. "ఏమి లక్ష్మణా! సద్గుణాలతో ధన్యుడవైన నీలాంటి వాడు కూడా మిత్రవధ అనే పాపకార్యం చేయాలని అనుకోవచ్చా? వద్దు..వద్దు. అలా చేయవద్దు. వాడికి, మనకు కల స్నేహం, ఇంతకు పూర్వం వాడి నడవడి, ఇవన్నీ దృష్టిలో వుంచుకుని గతంలోలాగే ప్రేమగా వుండు. ఎవరైతే పాపాన్ని యుక్తాయుక్త జ్ఞానంతో కాలుస్తాడో వాడు మనుష్యులలో ఉత్తముడని కీర్తి వహిస్తాడు. కాని తొందరపడి పనిచేసేవాడు

కాదు. లక్ష్మణా! నేను కోపంతో చెప్పిన మాటలు నువ్వు పరమార్థాలుగా మనస్సులో ఉంచుకోవద్దు. సుగ్రీవుడితో కఠినంగా మాట్లాడక మెత్తటి మాటలతో గడుపు. నువ్వు మరిచితివని హెచ్చరికగా మందలించు".

ఇలా అన్న తనకు చెప్పగా లక్ష్మణుడు సుగ్రీవుడిని చంపాలన్న తన పూర్వాభిప్రాయాన్ని మానుకున్నాడు. ఇంద్ర ధనస్సుతో సమానమై ప్రకాశించే విల్లు ధరించి ప్రళయకాల యముడిలాగా లక్ష్మణుడు శిఖరంతో కూడిన మందరపర్వతం లాగా వెలిగిపోయాడు. బృహస్పతితో సమానుడైన లక్ష్మణుడు, అన్న తనకు చెప్పిన మాటలను, తాను సుగ్రీవుడికి చెప్పాల్సిన మాటలను తనలో తానే మననం చేసుకున్నాడు మళ్లీ. తన దారికి అడ్డమొచ్చిన ఇనుమద్ది, పెద్దమద్ది, తాటిచెట్లను గాలి దెబ్బలతో పడగొట్టుతూ వాటిని పొడి-పొడిలాగా చేశాడు. ఏనుగును జ్ఞప్తికి తెచ్చుకుంటూ కామక్రోధాల వల్ల పుట్టిన రాముడి కోపాన్ని తాను ఆవరింప చేసుకుని, భయంకరమైన గాడ్పులాగా చాలా వేగంగా నడవసాగాడు. తన కుడికాలును దూర-దూరంగా వుంచి నడచుకుంటూ చాలా వేగంగా కిష్కింధ వైపు వెళ్లాడు. సుగ్రీవుడు పాలిస్తున్న కిష్కింధా నగరాన్ని తన ఎదురుగా చూశాడు.

లక్ష్మణుడిని చూసి భయపడి పరుగెత్తిన కోతులు

కిష్కింధ ప్రవేశించిన లక్ష్మణుడు వూరి బయట కోతులను చూశాడు. వారిలో కొందరు కొత్త మనిషి ఎవరో యుద్ధానికి వస్తున్నాడని భావించి, భయపడి, గుంపులు-గుంపులుగా దిక్కుల వెంట పరుగెత్తారు. మరికొందరు సుగ్రీవుడి ఇంటికి పోయి లక్ష్మణుడు కోపంతో వచ్చాడని చెప్పారు. కామాతురుడై తారతో నానా రకాల ఆనందంతో ఓలలాడుతున్నందున, అంతఃపురంలో వున్న ఆయనకు వారి మాటలు చెవికెక్కలేదు. ఇదిలా వుండగా మంత్రుల ఆజ్ఞ మేరకు బలవంతులైన వానర శ్రేష్ఠులు చేతిలో చెట్లు తీసుకుని, కోటలను, ప్రాకారాలను, అగడ్తలను కావలి కాయసాగారు. అన్న పడుతున్న బాధను, సుగ్రీవుడు హెచ్చరిక తప్పి బాధ్యత మరచిపోవడాన్ని, లక్ష్మణుడు తలచుకుని కోపంతో వేడి నిట్టూర్పులు విడుస్తూ కళ్లెర్ర చేశాడు. లక్ష్మణుడు ఐదుతలల పాములాగా కోదండాన్ని ధరించాడు.

తన ఆగమన వార్త సుగ్రీవుడికి చెప్పమని అంగదుడిని పంపిన లక్ష్మణుడు

ప్రళయ కాళ అగ్నిహోత్రుడులాగా కోపంతో మండుతూ, పెద్ద పామో అన్నట్లు

బుసకొట్టుతూ, చాలా కోపంతో వున్న లక్ష్మణుడిని చూసి, భయపడి, ఆయన దగ్గరికి వచ్చిన అంగదుడితో ఇలా అన్నాడు లక్ష్మణుడు. "నాయనా! నువ్వు పోయి నీ పినతండ్రికి చెప్పు. అన్న దుఃఖం చూడలేక తొట్రుపాటు, సంతాపం కలవాడై, మదించిన శత్రువులను అణచే లక్ష్మణుడు నీతో మాట్లాడడానికి వాకిట్లో నిలిచి వున్నాడు. ఆయన మాటలు వినడానికి నీకిష్టమైతే, వానరుడా! ఎలా ప్రవర్తించాలో అలా చేయి. నువ్విక్కడికి వస్తావా? నన్ను అక్కడికి రమ్మంటావా? నేను రాను, నువ్వు రావద్దు...నీ తోవన నువ్వు పొమ్మంటావా? నువ్వీమాట చెప్పి ప్రత్యుత్తరం ఏమిస్తాడో తెలుసుకుని త్వరగా రా".

ఈ మాటలకు అంగదుడు శోకిస్తూ పోయి తారకు, రుమకు నమస్కారం చేసి, వృత్తాంతమంతా స్పష్టమైన మాటలతో చెప్పాడు. అంగదుడు ఈ మాటలు సుగ్రీవుడి సన్నిధిలో తారా, రుమలకు చెప్పినప్పటికీ, కామంతో తప్పతాగి, దేహం తెలియక నిద్రమబ్బులో వున్నా సుగ్రీవుడికి ఈ మాటలు చెవికెక్కలేదు. తీవ్రమై, పొంగి వస్తున్న ప్రవాహం లాంటి లక్ష్మణుడిని చూసి గుండెలు పగలగా కోతులు గుంపులు-గుంపులుగా సుగ్రీవుడి సమీపంలో కిచ-కిచమంటూ తమ మీద దయ చూపమని కోరాయి.

సుగ్రీవుడికి హితబోధ చేసిన మంత్రులు

కోతుల కిల-కిలారావముకు మెల్ల-మెల్లగా మేల్కొన్నాడు సుగ్రీవుడు. మెడలోని హారాలు ఒకదానికి మరొకటి పెనవేసుకుని వున్నాయి ఆయన మెడలో. సుగ్రీవుడు అంగదుడి మాటలను విన్నాడప్పుడు. ఆయనతో సహా అంగదుడు పిలుచుకుని వచ్చిన వారు, అంతఃపురంలోకి రాదగినవారు, మాట చెల్లుబడికలవారు, సుగ్రీవుడికి ఇష్టమైన మంత్రులైన ప్లక్షుడు, ప్రభావుడు, సుగ్రీవుడితో ధర్మార్థ విషయాలు మాట్లాడానికి వచ్చిన లక్ష్మణుడి గురించి ఆయనకు మేలు కలిగే విధంగా ఇలా అన్నారు.

" అన్నదమ్ములైన రామలక్ష్మణులు, నీకు రాజ్యాన్ని, సంపత్తిని ఇచ్చినవారు, నీకు ముఖ్య స్నేహితులు, దశరథరాజ కుమారులు, భూభారం వహించి రాజ్యాన్ని పాలించే యోగ్యతా కలవారు, మిక్కిలి సత్యసంధులు, గొప్ప పుణ్యాత్ములు. వారిలో లక్ష్మణుడు విల్లు ధరించి రావడంతో అతడిని చూసి భయపడి కోతులన్నీ కూతలు పెట్టున్నాయి. రాజా! విన్నావు కదా? లక్ష్మణుడు ఒంటరిగా ఈ దుర్గ ప్రదేశానికి ఎలా వచ్చాడంటావా? పగవారిని సాధించాలన్న

దృఢనిశ్చయం రథంగా, రాముడి మాటే సారథిగా, రాముడి ఆజ్ఞప్రకారం వచ్చాడు. శీఘ్రంగా అంగదుడిని నీదగ్గరికి పంపాడు. రథమెక్కి వచ్చాడని అన్నావుకదా? యుద్ధ సన్నాహంలో వచ్చాడా? వినోద సంచారానికి వచ్చాడా? అని అడుగుతావేమో? బాణాలతో కాదు, చూపులతోనే వానరులందరినీ మాడుస్తున్నాడు. కాబట్టి నువ్వు కొడుకులతోను, చుట్టాలతోను పోయి ఆయన పాదాలమీద పడి క్షమాపణ కోరు. ధర్మాత్ముడైన రామచంద్రమూర్తి ఏం చెప్తే అదే చేయి. నువ్వు అన్నమాట మీద నిలబడి సుగ్రీవుడు సత్యవాదనే కీర్తి సంపాదించుకో".

సర్గ–32

లక్ష్మణుడు వచ్చిన వార్త విని భయపడ్డ సుగ్రీవుడు

దశరథరాజ కుమారుడు లక్ష్మణుడు తన వాకిట్లో కోపంగా వచ్చి నిలబడ్డాడని చెప్పిన అంగదుడి మాటలు వినగానే, సుగ్రీవుడు,కూర్చున్నవాడు కూర్చున్నట్లే ఆసనం మీద వణక సాగాడు. వణుకుతూ మంత్రులతో ఇలా అన్నాడు. "నేను వారిని ఒక్క మాటైనా కీడు మాట పలకలేదు. వారిని ధిక్కరించి ఔనన్నది కాదని కానీ, కాదన్నది ఔనని కానీ చెప్పినవాడిని కాదు. వారికి చెడ్డ చేయడానికి ఆలోచించను. ఎందుకు నామీద లక్ష్మణుడికి కోపం వచ్చింది? రాముడికి, నాకు విరోధం కలిగించడానికి ఎవరైనా నామీద పిర్యాదులు చేశారేమో! ఇప్పుడు నేనేమి చేయాలి? మనం ఏదైనా పని తలపెట్టే ముందు అతడి ఆలోచనా విధానం, ఆయన ఇక్కడ ఏం చేయదల్చుకున్నాడు వివరంగా తెలుసుకోవాలి. ఆయన ఉద్దేశం తెలుసుకోకుండా మనం ఏమీ చేయకూడదు. నేను లక్ష్మణుడికి, రాముడికి భయపడను. కాని ప్రియస్నేహితుడు కారణం లేకుండా కోపానికి వచ్చాడు కదా అని బాధపడుతున్నాను. స్నేహితులను సంపాదించడం సులభం. అలా సంపాదించిన వారితో మైత్రి చెడిపోకుండా కొనసాగించడం, కాపాడుకొనడం చాలా కష్టం. మనస్సు చంచలమైనందున చిన్న కారణానికే మైత్రి చెడిపోతుంది. రామచంద్రమూర్తి నాకు చేసిన మేలుకు నేనేమి ప్రత్యుపకారం చేయగలను? అది తలచుకున్న కొలదీ నేనేమీ చేయలేనే! ఏం చేయాల్నా అని భయం కలుగుతున్నది".

సుగ్రీవుడికి హితభోద చేసిన హనుమంతుడు

సుగ్రీవుడు ఇలా చెప్పగానే హనుమంతుడిలా చెప్పాడు. "సుగ్రీవా! ఆ మహాత్ములు చేసిన ఉపకారాన్ని నువ్వు మరవకుండా వుండడం ఆశ్చర్యం కాదు.

వీరులలో శ్రేష్టుడైన రామచంద్రమూర్తి ఏమాత్రం భయపడకుండా నీకు ప్రియం చేయడానికి ఇంద్రసమానుడైన వాలిని చంపాడు కదా! అలాంటివాడు స్నేహపూరకమైన కోపంతో పంపుతే లక్ష్మణుడు వచ్చాడు. ఎందుకు వచ్చాడంటావా? నువ్వు తప్పతాగి, శరీరం తెలియకుండా మత్తులో వుండి, గడువు దాటిపోయినా గుర్తించక, విలాస క్రీడల్లో మునిగి ఉన్నందున స్నేహితుడవైన నువ్విలా చేయవచ్చునా అని నిన్ను హెచ్చరిస్తున్నాడు. గడువు దాటిందా అని అంటావేమో? స్పష్టంగా దాటింది. కపురపుటనటులు వికసించడం, ఆకాశాన గ్రహాలు–నక్షత్రాలు విశదంగా కనిపించడం, మేఘాలు చెల్లాచెదరైపోవడం, దిక్కులలో, కొలకుల్లో, ఏరులలో, తెల్లటి కాంతులు వ్యాపించడం లాంటివి వర్షాకాలం పోయి శరత్కాలం రావడం సూచిస్తున్నది''.

“యుద్ధయాత్రకు పోయేవారు తగిన ప్రయత్నం చేయాల్సిన సమయం ఇదే. అయినప్పటికీ, నువ్వు వారిదగ్గరికి పోయి వారికి తగిన సమాధానం చెప్పి, వారేం చెప్తారో విచారించలేదు. కాబట్టి నిన్ను మత్తులో వున్నవాడిగా వారు భావించారు. ఆకారణాన నిన్ను హెచ్చరించడానికి లక్ష్మణుడు వచ్చాడు. భార్యను కోల్పోయి అమితమైన దుఃఖంలో వున్న మహాత్ముడు రామచంద్రమూర్తి పంపడం వల్ల లక్ష్మణుడు నిన్ను కఠినంగా పలికినా నువ్వు దాన్ని సహించుకోవాలి కాని ఎదిరించి మాట్లాడకూడదు. ఎందుకంటే, దోషం నీలో వుంది. ప్రథమ దోషానికి తోడు తిరస్కారభావం చూపిస్తే ఒక తప్పుకు రెండవుతాయి. సుగ్రీవా! నువ్వు వారి విషయంలో దోషం చేశావు. ఆ దోషానికి ప్రాయశ్చిత్తం నువ్వు లక్ష్మణుడికి రెండు చేతులు జోడించి మొక్కడమే. ఇంతకు మించి ఉపాయం లేదు. నిన్ను పోయి మరొకడి కాళ్లమీద పడి మొక్కమని నేను చెప్పవచ్చునా? అని నువ్వు అడగవచ్చు. రాజులకు ఏది మేలో అది చెప్పడానికి మంత్రులను నియోగించుకుంటారు కాని ఇచ్చకాయల మాటలు చెప్పడానికి కాదు. అలా హితం ఉపదేశించకపోతే వారు ద్రోహులే కాని మంత్రులు కాదు. ఆ కారణాన నీ మేలుకోరి, భయపడకుండా నీకు హితమైన దానినే చెప్పాను. ఆ ప్రకారం చేస్తే బాగుపడతావు''.

“రామచంద్రమూర్తి అంటే నువ్వేమనుకుంటున్నావు? తన పని తాను చేసుకోలేక అసమర్థుడై నిన్ను ఆశ్రయించడానికి వచ్చాడనుకుంటున్నావా? ఆయనకు కోపమే వచ్చి విల్లు చేతపట్టుకుంటే, దేవతలతో, రాక్షసులతో వెలిగే ఈ ప్రపంచమంతా తనకు లోబడేట్లు చేసుకోగలడు. పూర్వం రామచంద్రమూర్తి

చేసిన ఉపకారం తలచి తిరిగి మేలుచేయడానికి ప్రయత్నించు. నువ్వు అపరాధం జరిగిందనీ, క్షమించమనీ ప్రార్థిస్తే మెత్తటి మనస్సుకల రాముడు నీమీద కోపం తెచ్చుకుంటాడా? అది ఆయనకు సాధ్యమేనా? నువ్వు బయల్దేరి పుత్రులతోను, స్నేహితులతోను రాముడి దగ్గరకి పోయి రెండు చేతులు జోడించి నమస్కరించి ఆయనకు వశమై పో. వానరేంద్రా! నేను నీ మంచి కోరి, హితం కోరి ఈ మాటలు చెప్తున్నాను. కపిరాజా! నువ్వు రామాజ్ఞ కాని,లక్ష్మణుడి ఆజ్ఞ కాని మీరడానికి మనస్సునందైనా తలచవద్దు. ఇంద్రసమానుడైన తమ్ముడితో కూడిన రాముడి మనుష్య బలం ఎలాంటిదో నీకు తెలియదా?".

సర్గ–33
సుగ్రీవుడి అంతఃపురంలోకి అంగదుడితో కలసి వచ్చిన లక్ష్మణుడు

అంతఃపురంలో ఈ విధంగా సమాలోచనలు జరుగుతుంటే, వాకిట్లోనే వున్న లక్ష్మణుడిని, అంగదుడు లోపలికి రమ్మని పిలిచాడు. అంగదుడి వెంట పోతున్న లక్ష్మణుడు దారిలో అంగదుడి, మైందుడి, గజ, విధ, గవాక్ష, శరభ, విద్యున్మాలి, సంపాతి, సూర్యాక్ష, ఆంజనేయ, వీరబాహు, సుబాహు, తార, సుశేణ, నల, నీల, కుముద, జాంబవంతుల ఇండ్లను, దధివ్రక్త, సునేత్ర, సుపాటలు నివసించే గృహాలను, తెల్లటి మబ్బుల్లాగా ప్రకాశించే ధాన్య, ధన, స్త్రీ సమూహాలను చూశాడు కోపంతో కూడిన మనస్సుకలవాడై. ఆ తరువాత సుగ్రీవుడి ఇంటిని చూశాడు. సూర్యుడు ఆకాశంలో ప్రవేశించిన విధంగా లక్ష్మణుడు లోనికి పోయాడు. అక్కడ లక్ష్మణుడు వీణ ధ్వనికి సమానంగా పాడబడే పదాలు, అక్షరాల ధ్వనులను విన్నాడు. అందమైన అలంకారాలు కల స్త్రీలను చూశాడు. అందెల ధ్వనులను, ఒడ్డాణాల ధ్వనులను, ఆ మేడలో విన్నాడు లక్ష్మణుడు. ఆ ధ్వనులు విన్న లక్ష్మణుడికి కోపం వచ్చింది. వీరంతా ఇంత పగటి వేళలో కూడా కామంలో మునిగి వున్నారని కోపంతో అన్ని దిక్కులూ వినపడేట్లు తన అల్లె తాడు మీటి, త్వర–త్వరగా పోయి రాముడికి కలిగిన తాపం వల్ల బాధపడుతూ, స్త్రీలు లేని ప్రదేశంలో నిలబడ్డాడు. ఆ అల్లెతాటి ధ్వని విన్న సుగ్రీవుడు, లక్ష్మణుడు వచ్చెరా! అని భయపడి తెల్లబారిన ముఖంతో ఆయన కూర్చున్న పీఠం మీదే వణికాడు.

లక్ష్మణుడిని సమాదానపర్చడానికి తారను పొమ్మన్న సుగ్రీవుడు

అంగదుడు వచ్చి సుగ్రీవుడితో లక్ష్మణుడు వచ్చాడని చెప్పాడు. అప్పుడు సుగ్రీవుడు తారను చూసి, మెత్తటి వాడైన లక్ష్మణుడు ఇంత కోపంలో ఎందుకు

ఉన్నాడో కనుక్కొమ్మని, కారణం లేకుండా లక్ష్మణుడికి కోపం రాదని, అలా కోప్పడడానికి మనలో ఏదో నేరముండాలని అన్నాడు. "కారణం లేకుండా పురుష శ్రేష్టుడైన సాధువు కోపగించుకోడు. కాబట్టి లక్ష్మణుడు కోప్పడడానికి మనలో ఏదో నేరం వుండాలి. నువ్వు బుద్ధిమంతురాలివి. అదేదో విచారించి నాకు తెలియచెప్పు. అలా మన దోషమేదో తెలుసుకోవడం సాధ్య పడకపోతే నువ్వే పోయి రాజకుమారుడిని కలిసి మంచిమాటలతో సమాధానపరచి, మనమీద ప్రేమకలిగేట్లు చేసి, ఆయన అనుగ్రహం సంపాదించు. మగవాడిని నేను పోవడానికి భయపడుతుంటే ఆడదానివి నువ్వెలా పోతానంటావేమో? లక్ష్మణుడు నిర్మలమైన మనస్సు కలవాడు. కల్లాకపటం ఎరగనివాడు. కాబట్టి అపరాధిని కాని నిన్ను చూసి కోపం తెచ్చుకోడు.ఎందుకంటే మహాత్ములెప్పుడూ స్త్రీల విషయంలో క్రూరంగా వుండరు. ముందు నువ్వు పోయి మంచిమాటలతో సమాధానపర్చు. దాంతో ఆయన శాంతించి కోపం మానుతాడు. అప్పుడు నేను ఆయన్ను చూడడానికి వస్తాను".

లక్ష్మణుడితో సంభాషించిన తార

ఈ విధంగా సుగ్రీవుడు చెప్పడంతో, సంభోగ కేళిలో అలసటతో పడుకున్న తార వున్నపాటున తటాలున లేచి, మెల్లగా అడుగులో-అడుగు వేసుకుంటూ, భయపడే కళ్ళతో, మణుల ఒడ్డాణం వంటిమీద వేలాడుతుంటే, వంగిన శరీరంతో సంభోగ చిహ్నాలతో పోయింది. ఇలా వస్తున్న తారను చూసి మహాత్ముడైన లక్ష్మణుడు, వచ్చేది స్త్రీ కాబట్టి, శిరస్సు వంచి, కోపం తనకు తానే చల్లార్చుకుని, ఉపేక్షించి వూరికే వుండిపోయాడు. ధర్మాత్ముడైన లక్ష్మణుడు కోపం వదిలి ప్రసన్నమైనాడని అర్థం చేసుకున్న తార సమాధాన వాక్యాలతో ఇలా అన్నది. "దశరథరాజకుమారా! నీకోపానికి కారణం ఏమిటి? ఎవడు మదంతో నీ ఆజ్ఞ ధిక్కరించాడు?ఎవడు నీ కోపానికి పాత్రుడు కావాలనుకున్నాడు?". కపటం లేకుండా తార తన కోప కారణం అడగ్గా లక్ష్మణుడు సమాధానం చెప్పడిలా.

సుగ్రీవుడు సమయాతిక్రమణం చేశాడని తారతో చెప్పిన లక్ష్మణుడు

"ఏమిటీ! నా కోపం నిష్కారణమనీ, నీ మగడిలో దోషం లేదనీ అంటున్నావా? పతిమేలు కోరేదానా! ఈ మాత్రం కూడా నువ్వు ఆలోచించ లేకపోయావా? కామ విజృంభణమే ప్రధానంగా చేసుకుని, అర్థ-ధర్మ విచారం చేసినవాడు కాదు. ఇలా చేయమనా మేం చెప్పింది? భూపాలన చక్కగా చేస్తున్నాడా? ఇది

అర్థాన్ని ఉపేక్షించడం కాదా? మిక్కిలి దుఃఖంలో వున్న మమ్మల్ని, లోగడ ఉపకారం చేసిన మమ్మల్ని లెక్కపెట్టలేదు. ఇది ధర్మాన్ని ఉపేక్షించడం కాదా? ఎందుకిలా చేస్తున్నాడని అంటే, మద్యపానరతుడై తెలివితప్పి వున్నాడు. ఇది దోషం కాదా? మూఢురాలా! నాలుగు నెలలకు వస్తానని మాట ఇచ్చి, సారా తాగుతూ, స్త్రీలతో ఆటలాడుతూ, కాలం తెలియకుండా ప్రవర్తిస్తున్నాడు".

"నీ మగడిలా చేస్తుంటే, నాకిన్ని మాటలు చెప్పినదానివి ఆయన్ను ఎందుకు హెచ్చరించవు? నీ మగాడిలో ఏమి దోషం వుందన్నావు? మద్యపానాసక్తుడు కావడమే దోషం. ధర్మ లాభం, అర్ధ లాభం కోరేవారు పానాన్ని మెచ్చుకోరు. పానం అర్థాన్ని చెరుస్తుంది. పానం ధర్మాన్ని, ధర్మమైన కామాన్ని చెరుస్తుంది. కాబట్టి పానం మహాదోషం. పానం వల్ల కలిగే కీడు వివరిస్తా విను. ఉపకారం చేసిన వారికి ప్రత్యుపకారం చేయకపోవడం వల్ల ధర్మహాని మొదటి దోషం. తాగుబోతుకు ఆ విషయంలో ఆలోచన చేయడానికి కూడా మెదడు వుండదు కదా! రెండోది వున్న ధనం కరిగిపోతుంది. మూడో దోషం, తాగుబోతుల మాట నమ్మరాదు కాబట్టి, ధననాశనం కావడం, సుగుణవంతులైన స్నేహితులు వదిలిపోవడం జరుగుతుంది. దానివల్ల కామం నాశనం అవుతుంది. ఈ విధంగా తాగుబోతు మూడింట చెడుతాడు".

"తారా! అర్థం కంటే, కామం కంటే శ్రేష్టుడు మిత్రుడు. అందులో కూడా నిర్మలమైన నడవడి కలవాడిని, సత్యం-ధర్మం పరమావధిగా కలవాడిని వదిలిపెట్టి ధర్మానికి హాని కలిగించాడు. ధర్మం చెడినప్పుడు అర్థం,కామం, వాటంత అవే చెడిపోతాయి. కాబట్టి వీటిని నీ మగడు వదిలాడు. ఇక వాడెలా బాగుపడతాడని అనుకుంటున్నావు? వానరరాజు ఈ విధంగా ప్రవర్తించాడు కాబట్టి మేం చేయాల్సిన పనేంటో ఆలోచించి నువ్వే చెప్పు".

ఇలా లక్ష్మణుడు చెప్పగా ఆయన మాటలను ఆలకించిన తార ఆయనతో ఇలా అన్నది.

లక్ష్మణుడిని సమాధానపర్చిన తార

"మానవ శ్రేష్టా! నువ్వు చెప్పిన దోషం సుగ్రీవుడిలో వున్నదనేది వాస్తవం. ఆ కారణాన అతడు దోషం చేసినట్లే. అయినా నీకు కోపం రావద్దు. దానిని చంపు. ఇది నువ్వు కోపగించుకోవాల్సిన సమయం కాదు. ఎందుకంటావా? ఎవరిమీద నువ్వు కోప్పడాలి? ప్రతికూలురైన శత్రువుల మీదా? అనుకూలురైన బంధువుల

మీదా? నువ్వు కోపించడానికి ప్రతికూల శత్రువు ఇక్కడ ఎవరున్నారు? మీ పనిమీద శ్రద్ధకలవాడు, మనసులో కల్మషం లేనివాడు, పొరపాటు చేస్తే నీలాంటి వాడు క్షమించి హెచ్చరించాలి కదా! చంపడానికి పూనుకోవాలా? నువ్వు వీరులైన శత్రువుల మీద నీ ప్రతాపం చూపించాలి కదా? అనుకూలురైన మిత్రుల మీద చూపించవచ్చా? బలవంతుడైన వాడు తనతో సమానుడైన బలవంతుడి మీద కోపం తెచ్చుకుంటాడు కాని బలహీనులమీద కోప్పడతాడా? పౌరుషానికి ఇదా లక్షణం? అట్లయితే కోపం తామస గుణం. శాంతితత్త్వంకల నీలాంటివాడు కోప్పడాలని అనుకోవచ్చా? ఇది స్వభావ విరుద్ధం కాదా? చంద్రుడు ఎప్పుడైనా వేడి ఎండలు కాస్తాడా?"

"నా మగడి దోషం నాకు తెలియదా? ఎందుకు హెచ్చరించ లేదన్నావు. కాలం మీరడం నాకు తెలుసు. నాకు తెల్సింది, నీకు తెలియంది ఇంకోటి వుంది. కామబలం వల్ల కలిగే చిత్త వికారం అణచలేమని నాకు తెలుసు. నీకు తెలియదు. సుగ్రీవుడికి కామ బలంతో చిత్త వికారం కలిగించింది ఎవరో నాకు తెలుసు. నీకు తెలియని విషయం ఒకటుందన్నాను కదా! అది నీకెందుకు తెలియదో దానిని గురించి చెప్తా విను. నాయనా! నీ మనస్సు సులభంగా కోపానికి వశపడినట్లు పిల్లవాడివైనందున మన్మథతంత్రానికి వశపడదు. ఆ కారణాన మదనపరతంత్రుల చిత్తవృత్తి ఎలాంటిదో నీకు తెలియదు. ధీర హృదయా! గట్టి గుండె కలవాడా! మన్మథ పరతంత్రుడైన వాడికి దేశం, కాలం, ధర్మం, అర్థం ఇవన్నీ తెలుస్తాయా? తెలుసుకోవడం సాధ్యమా? ఇంతమాత్రం నువ్వు తెలుసుకోలేక పోయావు కదా! ఒక పనిలో పూర్తిగా నిమగ్నమైన వాడు రెండో పనిని ఎలా ఆలోచిస్తాడు?".

"దయానిధానా! సుగ్రీవుడు ఏ స్త్రీలతో కూడి కామాసక్తుడయ్యాడో వారిని నేనెరుగుదునని చెప్పాను. ఆ స్త్రీ మరెవరో కాదు. నేనే. అతడు కామ వ్యాపారంలో మునిగింది నాతోనే. ఆ వ్యాపారంలో అతడికి శరీరం మీద బట్ట వుందా? లేదా? అనేది కూడా సిగ్గువిడిచి మర్చిపోయాడు. తన బట్ట పోయింది తెలియని వాడికి మీ పనెలా ఆలోచించగలడు? కాబట్టి దోషం నాది. నేను నీ మరదలు శ్రుతకీర్తి లాంటిదాన్ని. నీ తమ్ముడు సుగ్రీవుడు. నువ్వు సుగ్రీవుడిని చంపితే శత్రుఘ్నుడిని చంపి శ్రుతకీర్తికి దుఃఖ కలిగించినట్లు నాకూ దుఃఖం కలిగించిన వాడివవుతావు. కాబట్టి క్షమించు. ఏ దోషం లేని తపస్సు చేసేవారు, పాపరహితులు, నిష్కల్మషమైన ధర్మాన్ని వర్తించేవారు అయిన మహర్షులే కామసౌఖ్యాలను

మరిగి, విశేష మోహానికి వశపడి, చపలులై పోతుంటే, కపి అయినవాడు విశేష సుఖ వ్యాపారంలో మునిగిపోవడం చిత్రమా? కృపాగుణమే అలంకారం కలవాడా నువ్వే చెప్పు".

ఇలా అర్థంతో కూడిన మాటలను చెప్పిన తార తన మాటలకు లక్ష్మణుడు సమాధాన పడినట్లు గ్రహించి మళ్లీ ఇలా అన్నది. "రాజకుమారా! సుగ్రీవుడు కామాసక్తుడైనాడని నేను చెప్పడం వల్ల మీ పనులు పాడు చేశాడని అనుకోవద్దు. మన్మథవశుడైనా నువ్వు రాకముందే మీ కార్యం నెరవేర్చడానికి కావాల్సిన ప్రయత్నం చేశాడు. ఏమి ప్రయత్నం చేసాడంటావా? అతడి పిలుపు మేరకు బలవంతులైన, కోరిన రూపం ధరించగల అనేకులు, కోటానుకోట్ల వానరులు, మడుగుల్లో తిరిగేవారు, కార్యం సాధించే శక్తికలవారు వచ్చి వున్నారు. అంతఃపురంలో పరస్త్రీలుంటారని, వారిని చూస్తే దోషం వస్తుందని, ఇక్కడ వున్నావు. సదాచారాన్ని బాగా కాపాడావు. ఇక చాలు. మిత్ర భావంతో మంచి మనసున్న నీలాంటి వారు తమ మిత్రుల భార్యలను చూడడం దోషమా?".

స్త్రీ రత్నమైన తార పిలవడంతో అంతఃపురంలోకి పోయాడు లక్ష్మణుడు. అక్కడ దివ్యాభరణాలు ధరించిన, ఇంద్రుడితో సమానమైన, సులభంగా జయించనలవికాని, దేవతా సంబంధమైన పూలు-వస్త్రాలు ధరించిన, దివ్యరూపంతో వెలిగే స్త్రీలతో చుట్టబడిన కీర్తిశాలి, దేవసమానుడైన సుగ్రీవుడిని చూశాడు లక్ష్మణుడు. కోపంతో కళ్ళు ఎర్రగా కాగా, ప్రళయకాల యముడిలాగా వున్న లక్ష్మణుడిని, కోపంవల్ల విశాల నేత్రాలు కలవాడిని, రుమతో కూడి వున్న సుగ్రీవుడు చూశాడు.

సర్గ–34
సుగ్రీవుడిని చూసి నిష్ఠూరాలు ఆడిన లక్ష్మణుడు

తార చెప్పిన మాటలతో లక్ష్మణుడు సంతృప్తి చెందలేదని, సమాధానపడలేదనీ అర్థం చేసుకున్న సుగ్రీవుడు లక్ష్మణుడి కోపాన్ని, రోషాన్ని, అగ్నిజ్వాలలాగా వెలుగుతున్న మనిషినీ, ఆయన సంతాపాన్నీ కూడా గమనించాడు. తానేం చేయాలని బాధపడసాగాడు. సుగ్రీవుడు తానున్న బంగారు పీఠంమీదనుండి కిందకు దుమికాడు. ఆయనతోనే వున్న రుమ, ఇతర స్త్రీలు కూడా తటాలున కిందికి దుమికారు. అప్పుడు సుగ్రీవుడు తన రెండు చేతులు జోడించి, వణకుతూ, కల్పవృక్షం లాగా ప్రకాశించసాగాడు. నక్షత్రాలతో కూడిన చంద్రుడిలాగా, స్త్రీల మధ్యన, భార్య రుమ పక్కన వున్నా వానరరాజు సుగ్రీవుడిని చూసి లక్ష్మణుడు క్రూరమైన కోపంతో ఇలా అన్నాడు.

"గొప్ప వంశంలో పుట్టి భూపాలన చేసే రాజు రాజుకాదు. సత్యవాది, కృతజ్ఞుడు, ఇంద్రియ జయం కలవాడు, మిక్కిలి దయగలవాడు మాత్రమే రాజు. వాడే లోకపూజ్యుడు. వీటిలో ఒక్కటైనా నీలో లేదు. కాబట్టి నువ్వు రాజుగా వుండడానికి తగినవాడివి కాదు. తనకు మేలు చేసినవాడికి తిరిగి మేలు చేస్తానని ప్రమాణం చేసి, మాట తప్పి, ధర్మాన్ని ఉపేక్షించిన వాడికంటే మూర్ఖుడు, నీచుడు ఎవరో చెప్పు. నువ్విలానే చేశావు కదా! గుర్రం విషయంలో అసత్యం చెప్తే నూరు గుర్రాలను చంపినా పాపం తగులుతుంది. మనుష్యుడి విషయంలో అసత్యం ఆడితే తనను, తనవారిని సమూలంగా చంపిన వాడవుతాడు. ముందుగా తనకు మేలు చేసిన హితులకు మరల మేలు చేయడానికి ఆలోచించని నీచుడుని, కృతఘ్నుడిని, భూత సమూహంతో చంపతగిన వాడిని, ఎలా చంపినా దోషం లేదు. 'రాముడి విషయంలో నేను అపరాధిని....రాముడు నన్ను

దండించవచ్చు.....నన్ను దండించడానికి నువ్వెవడివి?'....అంటావేమో. అలాంటి వాడిని ఎవడైనా చంపవచ్చు. వానరరాజా! పూర్వం కృతఘ్నుడిని చూసి బ్రహ్మ ఇలా చెప్పాడు. ఆ ధర్మ పద్ధతిని ఇప్పటికైనా నువ్వు తెల్సుకో. 'బ్రహ్మ హత్య చేసినా, కల్లు తాగినా, దొంగిలించినా, వ్రతభ్రష్టుడైనా, ప్రాయశ్చిత్తం వుంది. మేలు మరచిన వాడికి ప్రాయశ్చిత్తం లేదు'."

"ముందు రామచంద్రుడితో నీ పని చేయించుకుని ప్రత్యుపకారం చేయని కారణాన నువ్వు కృతఘ్నుడివి. నువ్వు మానహీనుడివి. నువ్వు వంచకుడివి. నువ్వు నీచుడివి. నువ్వు అసత్యవాదివి. ధర్మ సందేహం కలిగినప్పుడు కదా మరొకరు మధ్యవర్తి లాగా చెప్పాలి. నేను అడుగుతాను...నువ్వే చెప్పు. రామచంద్రమూర్తి వల్ల నీ ప్రయోజనం నెరవేర్చుకుని, ప్రత్యుపకారం చేయాలని నీ మనస్సులో వుంటే, సీతాదేవిని వెతకడానికి శీఘ్రంగా నువ్వెందుకు ప్రయత్నం చేయలేదు? స్త్రీ సంభోగ ఆసక్తుడిని, అసత్యవాదిని, నిన్ను,కప్పకంఠధ్వని కల పాముని రాముడు తెలుసుకోలేక పోయాడు. కప్పలు తనదగ్గరికి రావడానికి కప్పలాగా కూసి, అవి రాగానే వాటిని మింగే పాములాగా నువ్వు వంచక బుద్ధితో మంచి మాటలు చెప్తున్నావు. బలహీనుడవై, దీనవాక్యాలతో నువ్వు వేడుకుంటే, నిన్ను చూసి జాలిపడి, అయ్యో పాపం! అని, పాపాత్ముడా! నీకు రాజ్యాన్ని లభించ చేశాడు శ్రీరాముడు. అలాంటి మహాత్ముడికి మేలుచేయడానికి అంగీకరించని నిన్ను వాలి పోయిన చోటుకే ఆయన పంపుతాడు. పాపాత్ముడా! వాలి పోయిన దారి ఇంకా మూతపడలేదు. తెరిచే వుంది. ఆ తోవలో పోవడానికి నువ్వు ఆలోచించవద్దు. నువ్వు చేసిన శపథం గుర్తుచేసుకో. సత్యం పలుకు. రామచంద్రమూర్తి విల్లు నుండి బయటకు వచ్చే, వజ్రాయుధాలతో సమానమైన బాణాలు, నువ్వు చూడలేదు. ఆ కారణాన, బుద్ధిలేనివాడా!, రామకార్యాన్ని ఆలోచించడం లేదు. ఇది నిజం".

సర్గ-35
లక్ష్మణుడిని శాంతపర్చిన తార

ఈ విధంగా కొరివితో కాల్చినట్లు చాలా కోపంగా మాట్లాడుతున్న లక్ష్మణుడిని చూసి తార సమాధాన పరచేందుకు ఇలా అన్నది.

"లక్ష్మణా! నువ్విలా మాట్లాడ కూడదు. నిర్దోషి కాబట్టి ఇలాంటి మాటలు సుగ్రీవుడు వినడానికి తగడు. అందునా, నీ నోటి నుండి వెడలగా వినడానికి బొత్తిగా అర్హుడు కాదు. ఎందుకంటే సుగ్రీవుడు నువ్వన్నట్లు కృతఘ్నుడు కాదు. క్రూరుడు కూడా కాదు. వంచకుడూ కాదు. నీచుడు కానే కాదు. నువ్వు ఆరోపించిన దోషాలు ఒక్కటి కూడా అతడిలో లేవు. దృఢమైన బలం కలవాడా! సుగ్రీవుడు కృతఘ్నుడు కాదు. మేలు మర్చినవాడే కదా కృతఘ్నుడు? సుగ్రీవుడు, ఇతరులకు సాధ్యపడని గొప్ప యుద్ధంలో, రామచంద్రమూర్తి అనుగ్రహంతో, స్థిరమైన వానరరాజ్యాన్ని, ఇంపైన సుఖాన్ని, రుమను, నన్ను పొందాడు. ఈ విషయాన్ని జ్ఞప్తికి మళ్లీ-మళ్లీ తెచ్చుకుని మీరు చేసిన సహాయాన్ని మెచ్చుకున్నాడే కాని మరచిపోలేదు. ఇలాంటివాడు కృతఘ్నుడు ఎలా అవుతాడు? అలా అయితే ఎందుకు రామకార్యానికి ప్రయత్నం చేయలేదని అంటావా? ఉన్న వాస్తవాన్ని చెప్తా విను. చాలా దుఃఖపడిన వాడైనందున, వెంటనే కలిగిన సుఖాలను అనుభవించడంలో గడువు దాటినా విషయం విశ్వామిత్రుడి లాగా తెల్సుకోలేక పోయాడు. ఇది మాత్రమే అతడిలోని లోపం కాని, ఇంకే లోపం లేదు".

"అంతలా మైమరుపు కలిగించే కామానుభావం వుంటుందా? అని అంటావేమో! మీ గురువైన విశ్వామిత్రుడు ఘృతాచికి (మేనకకు) కామవశుడై చిక్కి, ఎంతో ధర్మాత్ముడై వుండి కూడా, పది సంవత్సరాలు ఒక రోజుగా భావించి

సంధ్యాది నిత్యకృత్యాలు మానలేదా? అంతకంటే సుగ్రీవుడు గొప్పవాడా? జితేంద్రియుడా? ధర్మనిష్ఠకలవాడా? భయంకర తపశ్శాలి అయిన విశ్వామిత్రుడంతటివాడే కామవశుడై కాలం మర్చిపోయి నిత్యకృత్యాలను మర్చిపోయాడు. లక్ష్మణా! ఇక పామరుల గురించి ఏమని చెప్పాలి? సత్పురుషులు పొగిడే సదాచారం కల లక్ష్మణా! దేహస్వభావ గుణం వదలడం సాధ్యం కాదు. అందులోనూ కామం మీద మనసు పెట్టుకున్నవాడు తృప్తి లేకపోవడం వల్ల కాలం తెల్సుకోలేక పోయాడు. ఇది తప్పే. క్షమించు. నీకు కనిపించింది ఇంతమాత్రమే. వాస్తవం నీకు తెలియదు. నువ్వు సుగ్రీవుడు దోషి అంటుంటే నేనెందుకు వాదించాలి అని దోషం అంగీకరించాను. కాని నువ్వు వాస్తవం తెలుసుకోకుండా మూఢుడిలాగా కోపం తెచ్చుకోకూడదు. వాస్తవం ఏమిటి అంటావా? చెప్తా విను. పరమ దయాశాలీ! సుగ్రీవుడు రామచంద్రుడి కార్యార్థమై నన్ను కానీ, రుమను కానీ, ధనధాన్యాదులు కానీ, బంగారం కానీ, తన కపిరాజ్యాన్ని కానీ, మరేదైనా కానీ వదలి పెట్టుతాడని నా అభిప్రాయం. ఆ కార్యం అంటే అంత ఆసక్తి కలవాడు”.

సుగ్రీవుడు కపిసేనలను రప్పించిన వార్త లక్ష్మణుడికి చెప్పిన తార

“లక్ష్మణా! సుగ్రీవుడు తాను చేసిన ప్రమాణం ప్రకారం యుద్ధంలో రావణుడిని చంపి రామచంద్రుడితో సీతను కలపగలడు. పదిరోజులు ఆలస్యమైనంత మాత్రాన ఆదరబాదరగా పరుగెత్తుకుని వచ్చావే? నీకెందుకు సందేహం కలిగింది? సుగ్రీవుడు ఒంటరిగా వచ్చి మీ ఎదురుగా కూర్చుంటే కలిగే ఫలితం ఏమిటి? లంకలో లక్ష కోట్లపైన, పదికోట్ల మూడులక్షల అరవై వేల రాక్షసులు ఉన్నారనీ, వారందరినీ చంపేదాకా రావణుడిని చంపడం సాధ్యం కాదనీ, సహాయం లేకుండా సుగ్రీవుడు ఒక్కడే రావణాసురుడిని ఎలా చంపగలడనీ, వాస్తవం తెలసిన వాలి నాతో చెప్పాడు. నాకెప్పుడు వాలి చెప్పాడంటావా? అలా చెప్పడానికి కారణం ఏమిటి అంటావా? మీరు రావణ వధ నిమిత్తమై సుగ్రీవుడితో స్నేహం చేశారని వేగులవాళ్ళు వాలికి చెప్పారు. అంగదుడు నాతో చెప్పాడు. వాలి సుగ్రీవుడితో యుద్ధానికి పోయే ముందర నాతో ఈ విషయం చెప్పాడు. యుద్ధంలో మీకు సహాయం చేయడానికి వానర సమూహాలను ఇక్కడికి రమ్మని ఇంతకు ముందే సుగ్రీవుడు ఆజ్ఞాపించాడు. ఆ గడువు నేటితో ముగుస్తున్నది. తగిన తోడు లేకుండా యుద్ధానికి పోయి ప్రయోజనం లేదని భావించిన సుగ్రీవుడు, తగిన తోడు తీసుకునే రామకార్యం సాధించాలని ఇంతదాకా

బయల్దేరలేదు. ఈ ఒక్కరోజు నువ్విక్కడ వుంటే, నూర్లకొలది కొండముచ్చులు, ఎలుగులు, కోతులు, మహాబలపరాక్రమ సంపన్నులు కోట్లకొలది నీ సేవ చేయకలవారిని చూస్తావు. నువ్వే దోషం సుగ్రీవుడిలో వుందని ఆరోపించావో ఆ దోషం ఆయనలో లేదు. కాబట్టి పురుష శ్రేష్టా! కోపం చాలించు. నిన్ను చూసి సుగ్రీవుడు, ఆయన తోటి స్త్రీలు భయపడుతున్నారు. వారే ఎందుకు? మాకు కూడా పూర్వస్థితి రాలేదు. కాబట్టి సుగ్రీవుడి మీద మునుపటి ప్రేమ కలిగి వుండు. ప్రీతిగా అతడి భయం పోగొట్టు".

సర్గ–36
లక్ష్మణుడిని సమాధానపర్చిన సుగ్రీవుడు

ఇలా తార చెప్పగా, మెత్తటి స్వభావం కల లక్ష్మణుడు ఆమె చెప్పిన ధర్మంతో కూడిన మాటలకు తన తీవ్రమైన కోపాన్ని వదిలాడు. అది చూసిన సుగ్రీవుడు లక్ష్మణుడంటే భయాన్ని వదిలాడు. తన మేడలో వాలి ఇచ్చిన బంగారు మాలను తీసేసి, అణకువతో ఇలా అన్నాడు.

"లక్ష్మణా! పూర్వం పోయిన వానరరాజ్యం, సంపద, కీర్తి, ఇవన్నీ రామచంద్రమూర్తి దయవల్ల మళ్లీ నాకు లభించాయి. ఇది సత్యం. అంతటి పరాక్రమ సంపదకలవాడికి, స్వకార్యంతో దిక్కులంతటా వ్యాపించిన కీర్తికల అంతటి వాడికి ఎవడు అపకారం చేయగలడు? రామచంద్రమూర్తి సీతను మళ్లీ పొందగలడు. దానికోసం దుష్టుడైన రావణుడిని చంపగలడు. సందేహం లేదు. అయినప్పటికీ నేను నిమిత్తమాత్రంగా సహాయం చేస్తాను. నా సహాయం లేకపోతే ఆయన తన కార్యం చేసుకోలేడని నా అభిప్రాయం కాదు. ఏడు చెట్లను, భూమిని, కొండను, ఒక్క బాణంతో చీల్చిన మహాబలశాలికి ఇతరుల సహాయంతో పనిలేదు. ధనుస్సు పూని అల్లెతాడు మీటినంత మాత్రానే ఆ ఠంకారానికే బిరుసుచెడి కొండలతో సహా భూమి గడ–గడలాడుతుంది. అంతటి గొప్పవాడికి ఇతరుల సహాయం కావాలా? విరోధి అయిన రావణాసురుడిని గొప్ప సైన్యంతో సహా వెళ్లి చంపబోయే రామచంద్రమూర్తి వెంట పోవడానికి ఇప్పుడే సిద్ధంగా వున్నాను. నా మాట దక్కించుకోవడానికి నేను వస్తున్నానే తప్ప ఆయన చేయలేని పని నేను చేయగల శక్తి కలవాడినని కాదు. నాకు కల చనువు వల్లో, ప్రేమ వల్లో, ఈ మీ దాసుడు కొంచెం తప్పు చేసినా క్షమించతగ్గ వాడినే కాని దండించతగ్గ వాడిని కాదు. ఎందుకంటే లోకంలో తప్పుచేయని వాడెవడు?

అందరినీ దండించడం అంటే, ఇక మీరు రక్షించేది ఎవరిని?".

సుగ్రీవుడిని ప్రశంసించిన లక్ష్మణుడు

తనతో ఇలా చెప్తున్న సుగ్రీవుడిని చూసి సంతుష్టుడైన లక్ష్మణుడు అన్నాడీవిధంగా: "సుగ్రీవా! నువ్వు వినయం కలవాడివి. నీ మనశ్శుద్ధి, నీ చక్కటి నడవడి, నీ ప్రభావం చూడగా నువ్వు వానర లక్ష్మిని అనుభవించతగినవాడివే అనడంలో సందేహం లేదు. నీ సహాయంతో రామచంద్రమూర్తి రావణుడిని యుద్ధంలో చంపగలడు. ధర్మంతో కూడిన గుణాలు కలవాడా, కృతజ్ఞుడా, జయశీలీ, నువ్వు చెప్పింది చక్కగా వుంది. కార్యసాధనకు గొప్ప శక్తి కలిగున్నా, తన దోషం ఇదీ అని తెలుసుకుని, ఆ దోషం తమలో కలదని అంగీకరించగల వారిద్దరే వున్నారు. ఒకడు మా అన్న రామచంద్రమూర్తి, మరొకరు సుగ్రీవా నువ్వే. చాలా మంది తమ దోషాలను తాము తెలుసుకోలేరు. ఎవడైనా తెలుసుకున్నా ఆ విషయాన్ని బయట పెట్టక తాను నిర్దోషి అనే అంటాడు. ఇది సామాన్యజన స్వభావం".

"సుగ్రీవా! శౌర్యంలో, పరాక్రమంలో, సాహసంలో నువ్వు రామచంద్రమూర్తికి సమానుడివి. దైవ వశాత్తు మీ ఇద్దరికీ స్నేహం కుదిరింది. ఇక పోదాం లే. భార్యా వియోగ దుఃఖంతో బాధపడే రామచంద్రమూర్తిని సమాధానపర్చు. ఎప్పుడూ ఎవరినీ పరుషం మాటలనని రాముడు దుఃఖంతో అన్న మాటలు విని సహించలేక నిన్ను దూషించాను".

సర్గ–37
వానరుల కొరకు మళ్లీ దూతలను పంపమని హనుమకు చెప్పిన సుగ్రీవుడు

లక్ష్మణుడు ఇలా చెప్ప గా విన్న సుగ్రీవుడు తన సమీపంలో వున్న హనుమంతుడితో అన్నాడీవిధంగా. "హిమవత్పర్వతంలో, మహేంద్ర, వింధ్య, కైలాస, మందర పర్వతాలలో, బాలసూర్య కాంతికల సముద్ర తీర పర్వతాలలో, పడమటి కొండల్లో, సంధ్యాకాల మేఘం లాంటి ఉదయ పర్వతంలో తిరిగే కోతులను, పద్మతాల వనంలో వున్న వానరులను, నల్లటి మేఘాలతో సమానమై ఏనుగు బలం కలవారైన అఙ్జనాపర్వత వానరులను, మనిషిల విశేషంగా వుండే గుహలల్లో ఉన్నవారిని, మునీశ్వరుల ఆశ్రమాలలో వున్నవారిని, ఇంకా భూమ్మీద ఎక్కడెక్కడో వున్నవారందరినీ, భయంకర వానరులందరినీ పిలిపించు. సామంతో వచ్చేవారిని సామంగా, దానంతో వచ్చేవారిని దానంతో పిలిపించు. ఆలస్యం చేయవద్దు. మంత్రీ! ఆంజనేయా! ఇంతకు ముందే వానరులను పిలుచుకుని రావడానికి దూతలను పంపాను. పోయినవారు ఆలశ్యం చేయకుండా రావడానికి వారికొరకు వేగంగా పోయే మరికొందరిని, విస్తారమైన వానర సమూహాన్ని పంపించు".

"సుఖాసక్తులై ఇండ్లను, భార్యలను, పిల్లలను విడిచి రాలేనివారిని, రేపో–మాపో పోదాంలే అని సోమరితనంతో జాగు చేస్తున్నవారిని, నా ఆజ్ఞాప్రకారం ముందుగా రావడానికి, అలా పిలిచేవారిని పంపించు. ఎవరైనా వానరుడు రాజాజ్ఞ మీరి పది దినాలలో రాడో వాడి తల నరికిస్తాను. ఆంజనేయా! ఇది అందరికీ తెలియచేయి. ఆంజనేయా! వందలు, వేలు, కోట్లుగా వానరులను దిక్కు–దిక్కులుగా పంపించు. మేఘాలతోను, పర్వతాలతోను, సమానులై వారు ఆకాశమంతా కప్పుకుని ఇప్పుడే పోవాలి. ఎక్కడెక్కడ కోతులున్నాయో

తెల్సినవారిని అక్కడికి పంపించు”. అని సుగ్రీవుడు చెప్పగా హనుమంతుడు కోతులను అన్ని దిక్కులకూ అప్పుడే పంపాడు. వారు కూడా పక్షులు, నక్షత్రాలు పోయే మార్గంలో అతి త్వరగా పోయి నదీ తీరాల్లో, గుహలలో, అడవుల్లో వున్నవారందరికీ రాముడి కార్యాన్ని తెలియచేశారు.

కిష్కింధకు వచ్చిన వానర సేనలు

ప్రళయ కాలంలోని మృత్యుదేవతతో సమానమై, భయంకరమైన సుగ్రీవాజ్ఞ ప్రకారం వానర ముఖ్యులు దిక్కులు కనబడనట్లు యుద్ధకాంక్షతో వచ్చారు. అంజనా పర్వతం నుండి కాటుకలాంటి నల్లటి దేహం కల వానరులు మూడు కోట్లమంది, పడమటి కొండ నుండి బంగారువన్నె దేహం కల పది కోట్ల వానరులు, కైలాసం నుండి సింహం మెడమీది వెంట్రుకల లాంటి కాంతి కల వేయికోట్ల మంది వానరులు, హిమవత్పర్వతం దగ్గర పండ్లు, వేళ్ళు తినే కోతులు వేయివేల కోట్ల మంది, వింధ్య పర్వతం నుండి నిప్పులాంటి ఆకారం కల కోటి వేలమంది కపులు, పాలసముద్రం తీరం నుండి టెంకాయలు తినే వానరులు లెక్కలేనంత మంది వచ్చారు. వీరంతా రాముడి కార్యం సాధించడానికి వచ్చారు. వీరంతా సుగ్రీవుడు పెట్టిన గడువుకు సరిగ్గా వచ్చారు. వానరులను పిలవడానికి పోయి వచ్చినవారు తెచ్చిన పళ్ళు, పూలు, కానుకలను సుగ్రీవుడి ముందుంచి, “వానర రాజా! మీ ఆజ్ఞ కోతులందరికీ తెలియచేయగా వారంతా కిష్కింధకు వచ్చారు” అని చెప్పారు. సుగ్రీవుడు చాలా సంతోషించి వారి కానుకలను స్వీకరించి, వారందరినీ ఇండ్లకు పొమ్మని ఆజ్ఞాపించాడు.

సర్గ–38
సేనతో సహా శ్రీరాముడి దగ్గరికి పోయిన లక్ష్మణ సుగ్రీవులు

ఇలా వానర సేనను పిలుచుకుని వచ్చినవారిని పోవడానికి ఆజ్ఞ ఇచ్చిన సుగ్రీవుడు తాను రామచంద్రుడి కార్యం నేరవేర్చానని సంతోషించాడు. అప్పుడు లక్ష్మణుడు సుగ్రీవుడితో రామచంద్రమూర్తిని చూడడానికి పోదామా అని అడిగాడు. ఆయన ఆజ్ఞ ప్రకారం అలాగే చేద్దామని అన్నాడు సుగ్రీవుడు. తారను ఇతర స్త్రీలను పొమ్మని చెప్పి వానర శ్రేష్టులను తమ వెంట రమ్మని అన్నాడు సుగ్రీవుడు. తన కొరకు పల్లకి సిద్ధం చేయమని పల్లకి మోసేవారికి చెప్పాడు. ఏమాత్రం ఆలశ్యం కావద్దని కూడా అన్నాడు. "లక్ష్మణా! నువ్వు ఎక్కు పల్లకి" అని అనగా ఆయన ముందు ఎక్కాడు. ఆయన ఎక్కిన తరువాత సుగ్రీవుడు తానెక్కాడు. రెండువైపులా వింజామరలు వీస్తుంటే, పైన తెల్ల గొడుగు వుండగా, సంతోషంతో నగారాలు, శంఖాలు ధ్వనిస్తుంటే, కోతులు సింహనాదాలు చేస్తుంటే వానర రాజ్యలక్ష్మికి తగిన వైభవంతో రామచంద్రమూర్తి వున్న చోటుకు పోయారు. దూరంలోనే పల్లకీ దిగి, లక్ష్మణుడితో కలిసి భక్తితో రామచంద్రుడి సమీపంలోకి పోయి, హస్తపద్మాలు మోడ్చి, నమస్కారం చేసి, నిలవబడ్డారు. మిగిలిన వానరులు రామచంద్రుడి ఎదుట చేతులు జోడించి భక్తితో నిలిచారు. తామరకొలనులాగా వున్న వానరసేనను చూసి రామచంద్రమూర్తి సుగ్రీవుడిని దయగా, ప్రేమగా పలకరించాడు.

సుగ్రీవుడికి నీతి బోధించిన శ్రీరాముడు

తన పాదాలమీద వాలిన సుగ్రీవుడిని లేపి, సంతోషంతో కౌగలించుకుని, కూర్చోమని చెప్పి, అతడు కూర్చున్నతరువాత ప్రేమతో ఇలా అన్నాడు. "సుగ్రీవా!

ధర్మం, అర్థం, కామం అనేవాటిని వేర్వేరుగా భాగించుకుని, ఏఏ వేళల దేనిని అనుష్ఠించాల్నో తెల్సుకుని, ఒకటి చేసేటప్పుడు ఇంకొకటి చేయకుండా, దేన్నీ ఉపేక్షించకుండా వాటిని సేవించే వాడే రాజని కీర్తి వహిస్తాడు. (సుగ్రీవుడు ధర్మార్థాలను సేవించాల్సిన సమయంలో కామం అనుభవించాడని, అది రాజనీతి కాదని ఇక్కడ భావం). ధర్మాన్ని వదిలి, అర్థాన్ని మరిచి, ఎప్పుడూ కామంమీదే ఆసక్తికలవాడు చెట్టు కొనకొమ్మ మీద నిద్రపోయి, నేలమీద పడి మేల్కొన్నవాడితో సమానం. శత్రువులను చంపుతూ, స్నేహితులను సంపాదించుకుంటూ, హెచ్చరికగా ధర్మార్థ కామ ఫలాలను అనుభవించే రాజు ధర్మ మార్గంలో నడిచిన వాడవుతాడు. సుగ్రీవా! ఇది మన పనికోసం ప్రయత్నం చేయాల్సిన సమయం. మంత్రులు, దండనాయకులు, ఇతరులతో ఇప్పుడే సభ ఏర్పాటుచేయి. ఎలా కార్యం ముందుకు తీసుకుపోవాలో ఆలోచిద్దాం".

తాను వానర సేనలను సిద్ధపర్చినట్లు శ్రీరాముడికి చెప్పిన సుగ్రీవుడు

రామచంద్రమూర్తి చెప్పిన మాటలకు జవాబుగా సుగ్రీవుడు ఇలా అన్నాడు. "మహాత్మా! నాకు పోయిన మహైశ్వర్యం, వానర రాజ్యలక్ష్మి, గొప్ప కీర్తి, ఇవన్నీ నీ వల్ల, నీ తమ్ముడివల్ల, మీ ఇద్దరి అనుగ్రహం వల్ల, నాకు లభించాయి. ఇలాంటి నీకు ప్రత్యుపకారం చేయతలచనివాడు ఎల్లప్పుడూ నిందించతగిన వాడే. రామచంద్రా! భూమండలంలోకల కోతులను, కొండముచ్చులను, ఎలుగులను, బలవంతులను పిలిపించాను. వీరంతా దేవతల, గంధర్వుల కుమారులు. సాధారణమైన కోతులు కావు. భయంకర ఆకారాలు కలవారు. కోరిన రూపం ధరించగలవారు. అడవి మార్గాలు తెల్సినవారు. తమతమ సేనలతో వందలు, వందవేలు, వంద లక్షలు, అయుతాలు, శంకువులు, అర్బుదాలు, ఖర్వాలు, మధ్యములు, అంతములు, సాగరములు, పరార్ధాలుగా వస్తున్నారు. ఇంద్రుడితో సమానమైన పరాక్రమం కలవారు. మేరు, మందర పర్వతాలతో సమానమైన వారు. వింధ్యాద్రిలో వుండేవారు వస్తున్నారు. దుష్టుడైన రావణుడిని చంపి వీరు నీ భార్యను తెచ్చి నీకు సమర్పిస్తారు".

సుగ్రీవుడిలా చెప్పగా, ఆయన చేసిన యుద్ధ ప్రయత్నమంతా తెలుసుకుని, సుగ్రీవుడిని కౌగలించుకుని, రామచంద్రమూర్తి సుగ్రీవుడితో ఇలా అన్నాడు.

సర్గ-39
సుగ్రీవుడిని ప్రశంసించిన శ్రీరాముడు

"సజ్జనరత్నమా! సూర్యుడు ఆకాశంలో చీకటిని నాశనం చేయడం, ఇంద్రుడు ప్రజలను సంతోషపెట్టడానికి వానలు కురిపించడం, చంద్రుడు భూమిని చల్లగా చేయడం, నీలాంటి సత్పురుషులు స్నేహితులకు చేసిన మేలుకు ప్రతి మేలు చేయడం, విచిత్రమా? ఇవి వారికి సహజమైన కృత్యాలు. సూర్యనందనా! నీలాంటి మిత్రరత్నం మిత్రులకు మేలు చేయడంలో ఆశ్చర్యం ఏముంది? నువ్వు సహాయం చేస్తున్నావంటే ఇక నేను యుద్ధంలో గెలిచినట్లే. విస్తార కీర్తిశాలీ! నువ్వు నాకెప్పుడూ ప్రియమైన విషయాలే చెప్తావని నామనస్సుకు బాగా తెలుసు. సఖుడా! నువ్వు నాకు ఇష్టుడివి. మంచి మనసున్న స్నేహితుడివి. ఈ సమయంలో నాకు సహాయపడు. పూర్వం అనుహ్లాదుడు వంచన చేసి శచీదేవిని అపహరించినట్లు రావణుడు తాను నాశనమై పోవడానికి నా ప్రియురాలిని మోసంతో అపహరించాడు. ఇంద్రుడు ఆ దైత్యుడిని చంపినట్లు నేను వాడైన బాణ పరంపరలతో రాక్షసుడిని చంపుతాను".

శ్రీరాముడి దగ్గరకు వచ్చిన వానరసేనలు

ఇలా శ్రీరామ సుగ్రీవులు మాట్లాడుకుంటున్న సమయంలో ఆకాశంలో విస్తారంగా దుమ్ము రేగింది. సూర్యుడి కాంతి తగ్గిపోయింది. ధూళి కమ్మడం వల్ల దిక్కుల అందం చెడింది. కొండలతో, అడవులతో, నదులతో భూమి గడగడలాడింది. నిమిషంలోనే పర్వతాల లాంటిది, పదునైన కోరల కలది, అణపరాని బలం కలది, లెక్కకు మించినది అయిన వానరసేన భూమంతా నిండింది. అక్కడ, కొండల్లో, సముద్ర తీరాల్లో, నదీ తీరాలలో నివసించే వారు, కోరిన రూపాలు దరించగలవారు, కఠినదేహాలు కలవారు, ఉరుముల్లాంటి

కంఠధ్వని కలవారు, అడవుల్లో తిరిగేవారైన కపులు నిండారు. బాల సూర్యుడి లాంటి ఎర్రటి దేహం కలవారు, చంద్రుడి లాగా తెల్లటి కాంతి కలవారు, ఆకరుల్లాగా పచ్చటి శరీరం కలవారైన కోతులు పదివేల కోట్లు కొలుస్తుంటే శతవలి వచ్చాడు. భయంకరమైన కోపం కలవాడు, శత్రువులను సంహరించువాడు, తారకు తండ్రైన సుషేషణుడు పదివేల కోట్ల సేన కొలుస్తుంటే వచ్చాడు.

రుమ తండ్రైన తారుడు కోటి సహస్రాల కోతులతో వచ్చాడు. బాల సూర్యుడిలాంటి ముఖం, బుద్ధిబలం కల హనుమంతుడి తండ్రైన కేసరి వెయ్యి అనీకములు కొలుస్తుంటే వచ్చాడు. భయంకర శత్రువులను శిక్షించే గవాక్షుడు కోటివేల కపులతో వచ్చాడు. రెండు కోట్ల ఎలుగులతో శత్రు భంజనుడైన ధూమ్రుడు వచ్చాడు. పనసుడు మూడు కోట్ల కపులతో వచ్చాడు. నల్లకాటుక పోగులాంటి దేహంకల నీలుడు పదికోట్ల కోతులతో, గవయుడు ఐదు కోట్ల వానరులతో వచ్చారు. వేయి కోట్ల కోతులతో దరీముఖుడు, మూడు కోట్లతో గజుడు, వేయి కోట్ల కోతులతో అశ్వినీ దేవతలా కుమారులు ద్వివిదుడు, మైందుడు, పదికోట్ల కోతులతో జాంబవంతుడు వచ్చారు. ఆశ్చర్యకరమైన బలం కల నూరుకోట్ల కపులు సేవిస్తుంటే రుమన్వంతుడు సుగ్రీవుడి ఆజ్ఞానుసారం రామచంద్రుడి దగ్గరకు వచ్చాడు.

నూరు వేల కోట్ల కోతులతో గంధమాదనుడు వచ్చాడు. నక్షత్ర కాంతి కల తారుడు ఐదు కోట్ల కోతులతో వచ్చాడు. తండ్రి పరాక్రమంతో సమానమైన పరాక్రమం కల తార కొడుకు అంగదుడు వేయి పద్మాలు, నూరు శంకువులు సంఖ్య కల కోతులతో వచ్చాడు. ఇంద్రజాను శూరుడు పదకొండు కోట్ల వానరులు కొలుస్తుంటే చాలా వేగంగా రామచంద్రుడి దగ్గరికి వచ్చాడు. సింహం లాంటి బలం కలవారు, నమ్మదగిన వారు, భుజబలం కలవారైన పదివేల లక్షల కోతులు కొలవగా రంభుడు వచ్చాడు. ఉదయకాల సూర్య తేజస్సు కల, దేవతలా వంశాన పుట్టిన రెండు కోట్ల కోతులు సేవిస్తుంటే దుర్ముఖుడు వారితో వచ్చాడు. కైలాస పర్వత శిఖరం లాగా ఎత్తైన రూపం కల బలవంతులైన వేయి కోట్ల కోతులు సేవిస్తుంటే హనుమంతుడు వచ్చాడు. నలుడు, వీరులైన ఇతర వానరులు శత లక్ష కోట్లతో, దదిముఖుడు పది కోట్ల వానరులతో, వహ్నికుముదుడు, భుజ బలం కల రంహుడు, ఉగ్ర శరభుడు మొదలైన వానర సమూహాలు వచ్చాయి. వీరు కాకుండా కొండల సమూహాల్లో, నదుల ఒడ్డులలో,

అడవుల్లో వుండే వారు వచ్చారు. వారి సమాఖ్య ఇంత అని చెప్ప అలవికాదు.

ఇలా వచ్చిన వాళ్లలో కొందరు నమస్కారం చేసి పోయారు. కొందరు చేతులు జోడించుకుని పక్కన నిలబడ్డారు. కొందరు దిక్కులు పిక్కటిల్లేట్లు సింహనాదాలు చేశారు. కొందరు దుమికారు. ఇలా ఇంతమంది చుట్టుకొనగా సుగ్రీవుడు మేఘాలు చుట్టుకున్నసూర్యుడిలాగా కనిపించాడు. భుజబలపరాక్రమవంతులైన వానరులు కిలారింపులతో వచ్చి వారు వచ్చిన సంగతి సుగ్రీవుడికి తెలియచేసి, నమస్కారం చేసి వెళ్లి పోయారు. కొందరు రాజు దగ్గర వుండాల్సిన పద్ధతిలో వస్త్రాలు ముడిచి కట్టుకుని, ఉత్తరీయాన్ని నడుముకు చుట్టుకుని, చేతులు జోడించి, విశేష వినయంతో సుగ్రీవుడి దగ్గర నిలబడ్డారు. వచ్చిన వారందరినీ సుగ్రీవుడు వాళ్ల గురించి రామచంద్రుడికి తెలియచెప్పి, వారి క్షేమ సమాచారాలను విచారించాడు. వారిని వాళ్ల సేనలతో అడవుల్లో, కొండల్లో వుండమని ఆదేశించాడు.

సర్గ-40
శ్రీరాముడికి తన సేనలను నివేదించిన సుగ్రీవుడు

ఇలా ఆజ్ఞాపించిన సుగ్రీవుడు రామచంద్రుడిని చూసి ఇలా అన్నాడు. "నేనెరిగిన దేశంలో వుండేవారు, కోరిన రూపాలు ధరించగలవారు, మదపు ఏనుగుతో సమానమైన వారు, పరాక్రమవంతులు, చక్కటి నడవడి కలవారు, దైత్యులతో సమానమైన వారు, భయంకర ఆకారాలు కలవారు, ఎంత శ్రమకైనా ఓర్చుకునే వారు, ప్రసిద్ధికెక్కిన బలం కలవారు, పేరు పొందిన పరాక్రమం కలవారు, ప్రయత్నం చేసి కార్యం సాధించే వారు, భూమీద, నీటి మీద తిరగ గలిగే వారు, అడవుల్లో వుండే వారు కోట్ల కొద్దీ వచ్చారు. వీరందరినీ ప్రేమతో చూడు. వీరంతా స్వామి కార్యం చేయడానికి ఆసక్తి కలవారే. ఆజ్ఞ జవదాటరు. నువ్వెలా చెప్తే అలానే చేస్తారు. ఈ సేన అంతా నీదే. నీ ఆజ్ఞకు లోబడి నీ ఆజ్ఞానుసారం నడచుకుంటారు. ఇక ఏమి చేయాలో సెలవివ్వు. ఇక్కడ వున్న వానరులు అప్పచెప్పిన పని చేయడానికి సమర్థులు. వీరందరినీ నేను ఎరుగుదును. అయినప్పటికీ నువ్వు ఆలోచించి తగిన విధంగా వీరితో పని చేయించుకో".

అని సుగ్రీవుడు చెప్పగా రామచంద్రమూర్తి ఆయన్ను కౌగలించుకుని ఇలా అన్నాడు. "దశకంఠుని ఇంట్లో సీతాదేవి బతికున్నదో, లేదో మొదట తెల్సుకోవాలి. ఆమె మరణించి వుంటే మనం ఏ ప్రయత్నం చేయలేం కదా? కాబట్టి రావణుడు వుండే ప్రదేశం, సీతాదేవి బతికున్నదా? లేదా? అనే విషయం, బతికుంటే ఎలా వుంది అనే సంగతి, తెలసిన తరువాతే నువ్వు చేయాల్సిన సహాయం గురించి చెప్తాను. ఈ సమాచారం కనుక్కోవడానికి నువ్వే సమర్థుడివి. నేను కాని, నా తమ్ముడు కాని కాదు. జరగాల్సిన కార్యం గురించి ఆలోచిస్తుంటే

కార్యమంతా నెరవేర్చడానికి నువ్వే సమర్థుడివి. ఇక్కడ నువ్వే మాకు దిక్కు. ఎందుకంటే జరిగింది, జరగాల్సింది నీకు తెలుసు. కాబట్టి ఎవరెవరిని ఎక్కడికి పంపాలో నువ్వే పంపించు. నువ్వు విక్రమవంతుడివి. కావాల్సిన కార్యం తెలిసినవాడివి స్నేహంలో మా లక్ష్మణుడి తరువాత నువ్వే. మాకు మేలు చేయాలని నీ మనస్సులో వుందని నాకు తెలుసు".

సీతను వెతకడానికి తూర్పు దిశకు వినతుడిని పంపిన సుగ్రీవుడు

రామచంద్రమూర్తి ఇలా సుగ్రీవుడికి చెప్పగానే, ఆయన రామలక్ష్మణుల ఎదుటనే, పెద్ద పర్వతంతో సమానుడైనవాడు, మేఘ ధ్వనిలాంటి కంఠధ్వని కలవాడైన వినతుడిని శీఘ్రంగా పిలిచి ఇలా అన్నాడు. "నువ్వు దేశం, కాలం తెలిసిన వాడివి. సమస్త కార్యాలలో మేలేదో, కీడేదో తెలిసినవాడివి. కాబట్టి వానరేంద్రా! నువ్వు సూర్య-చంద్ర వంశంలో పుట్టిన లక్షల కొద్దీ వానరులు నిన్ను సేవిస్తుంటే, తూర్పు దిక్కుగా రావణాసురుడు వుండే స్థలం వెతకడానికి త్వరగా వెళ్లు. ఆ దిక్కున వున్న అడవుల్లో, కొండల్లో, నదుల దగ్గర, వెతుకు. అలాగే సరయూ నదిని, గంగను, కౌశికిని, మనోహరమైన సింధును, యమునను, దాని ప్రాంత పర్వతాన్ని, సరస్వతిని వెతుకు. కొండలతో, వనాలతో కూడిన మహీనదిని, కాలమహి, బ్రహ్మమాల, విదేహం, మాలవం, కాశికాపురం, మగధదేశ గ్రామాలు, కోసలం....వీటన్నిటిలో మీరు దశరథరాజు కోడలిని, రాముడి భార్యను వెతకాలి. ఇవి దాటిపోయి సముద్రంలో వుండే కొండలను, పట్టణాలను, మందరంలో వుండే ముక్కిడులను, పెదవులంటు చెవులు కలవారిని, లోహముఖులైన ఒంటికాలివారిని, వేగంగా పోయే బలవంతులను, మనుష్యులను తినేవారిని, చెవుల్లో వెంట్రుకలు వుండేవారి స్థలాలను చూడాలి".

"కిరాత సమూహాలు, పైడివన్నె దేహం కలవారు, ద్వీపాలలో వుండేవారు, పచ్చి చేపలను తినేవారు, నీళ్లలో తిరిగేవారు, నరవ్యాఘ్రాలు వుండే చోట వెతకాలి. ఆ తరువాత సముద్రమధ్యాన వుండడం వల్ల నేలమీద నడిచి పోవడం సాధ్యం కాదు. కాబట్టి పర్వతాల మీదుగా, పడవల మీద, ఎగిరి దాటడం ద్వారా, చూడడానికి సాధ్యమైన ఏడు ఖండాలతో కూడిన యవద్వీపం, స్వర్ణరూప్యకమనే దీవులను దాటి ఆకాశాన్ని అంటే శిఖరంకల శిశిరం అనే పర్వతాన్ని, గొప్ప గుహలను వెతకండి. అది దాటిపోయి, ఎర్రటి నీళ్లు, లోతు, మహా వేగంకల శోణ నాదం వుంటుంది. ఇది సముద్రానికి అవతలి ఒడ్డున వుంటుంది. అక్కడ వున్న రేవుల్లో, ఇతర ప్రదేశాల్లో సీతను, రావణుడిని వెతకండి. ఒక్కరినే వెతుకుతే

ప్రయోజనం లేదు. రావణుడిని చంపి సీతను తేవాలి. సీత లేకపోతే రావణుడిని చంపి ప్రయోజనం లేదు. కొండల్లో పుట్టిన రమ్యమైన ఏళ్లు, తోటలు, సముద్రం మధ్యలో వుండే ద్వీపాలు మీరు వెతకాలి. అక్కడ సముద్రంలో పెద్ద దేహాలు కలవారు, దీర్ఘకాలంగా ఆకలితో వున్నవారైన రాక్షసులు బ్రహ్మ వరం వల్ల నీడను చూసి జంతువులను ఆపి పట్టుకుంటారు. కాబట్టి వేరే మార్గాన పోకుండా చుట్టయినా రేవు మార్గంలోనే సముద్రాన్ని దాటి పొండి. లేకపోతే వారి బారిన పడతారు".

"కపులారా! ఎర్రటి నీళ్లున్న సురాసముద్రాన్ని చూసుకుంటూ పోతే, మీరు కొండ బూరుగు చెట్టును, బంగారం, మణులతో ప్రకాశిస్తూ కైలాసంతో సమానమైన, విశ్వకర్మ నిర్మించిన గరుత్మంతుడి గృహాన్ని చూస్తారు. అక్కడ రాక్షసులు, నానారకాల భయంకరాకారులు, మందేహులనే వాగు కొండ శిఖరాలమీద వ్రేలాడుతుంటారు. అలా వ్రేలాడుతూ సూర్యుడిని ఉదయం సమయంలో పట్టుకుంటారు. ఆ సమయంలో బ్రాహ్మణులు విడిచే అర్ఘ్య జలాలు అస్త్ర రూపంలో వారిని పడగొట్టగా వాళ్ళు మళ్లీ కిందబడి, తిరిగి వ్రేలాడుతుంటారు. అక్కడ తెల్లటి మేఘంలాగా పాలసముద్రం వుంది. అది చాలా అసాధ్యమైనది. అక్కడ రావణుడితో సహా సీతాదేవిని వెతకండి. నిర్మలమైన పాల సముద్రం మధ్యలో ప్రసిద్ధమైన ఋషభ పర్వతం వుంది. అది తెల్లటి కాంతికలదై, దివ్యమైన పరిమళాలతో, పూలతో కూడిన బంగారి చాయకల చెట్లతో నిండి వుంటుంది. అక్కడ చూస్తుంటే బడలిక పోయే సుందరమైన కొలను వుంటుంది. దాని పేరు సుదర్శనం".

"ఆ కొలనులో తెల్లటి కింజల్కాలుకల తెల్ల కమలాలు వుంటాయి. వాటి కోసం రాజహంసలు గుంపులుగా వచ్చే విధంగా, కిన్నరులు, చారణులు, దేవతలు, వారి సమూహాలు, అప్సరసలు, జలకేళి కొరకు వస్తుంటారు. ఆ పాల సముద్రాన్ని దాటిపోతే, ప్రాణికోటికి భయం కలిగించే, యౌర్య మహర్షి కోపం మూలాన పుట్టిన గుర్రపు ఆకారంకల అగ్ని కనబడుతుంది. ప్రళయకాలంలో ఆ అగ్ని బారినపడి సకల లోకాలు నాశనం అవుతాయి. ఎంత బలమైన జంతువులైనా బడబాగ్నిని చూసి భయపడి కూతలు పెట్టుంటే ఆ పక్కన ఉన్నవారికి అవి వినిపిస్తాయి. ఆ శుద్ధోదక సముద్రాన్ని దాటి అటువైపు పోగా అక్కడ పదమూడు యోజనాలు కల బంగారు రాయికల బంగారు కొండ వుంది. దానిమీద చంద్రుడి లాంటి కాంతి కలవాడు, భూమిని మోసేవాడు, పద్మాల

లాంటి కళ్ళుకలవాడు, నీలవస్త్రం ధరించిన అనంతుడిని చూస్తారు. ఆ మహాత్ముడికి బంగారు తాలధ్వజం వుంది. దానికి మూడు తలలున్నాయి. కొండ శిఖరం మీద వుందది. దాన్ని తూర్పు దిక్కుకు ఎల్లగా దేవతలు నిలిపారు''.

"అటు పిమ్మట బంగారుమయమైన తూర్పు కొండ వుంది. ఆ పర్వత సమూహంలో ఆకాశాన్ని తాకుతూ, బంగారుమయమై, నూరామడల విస్తీర్ణం కల అందమైన అరుగు వుంది. అక్కడ మద్ది చెట్లు, తాటి చెట్లు, చీకటి మాకులు, కొండ గోగులు, సూర్యకాంతితో పూచి వ ఉంటాయి. అక్కడ యోజనం వెడల్పున, పది ఆమడ ఎత్తున పర్వత శిఖరం వుంది. దాని పేరు సౌమనసం. దాంట్లో పూర్వం వామనుడు త్రివిక్రముడైనప్పుడు ఒక పాదాన్ని వుంచి రెండోది మేరువు మీద నిలిపాడు. సూర్యుడు జంబూద్వీపం ఉత్తర భాగంలో తిరుగుతూ ఆ కొండమీదకు వచ్చినప్పుడు మేరువు దక్షిణ దిక్కువారికి కనపడుతుంది. అక్కడ సూర్య కాంతికల ఆరువేల మంది వాలఖిల్యులు, వైఖానసులు అనే మునులుంటారు. దాని పక్కదే సుదర్శనం. ఈ గొప్ప ద్వీపంలో సమస్త ప్రాణి సమూహాలకు నేత్రకాంతి కలిగించే గొప్ప తేజంతో సూర్యుడు ప్రకాశిస్తుంటాడు''.

"తూర్పు పర్వతం వున్న అడవుల్లో గుహలలో శిఖరాలలో సీతను వెతకాలి. సూర్యుడి కాంతి, బంగారు పర్వత కాంతి తన మీద వ్యాపించడం వల్ల పూర్వ సంధ్య ఎర్రటి కాంతితో ప్రకాశిస్తుంది. బ్రహ్మ దేవుడు భూలోకానికి, తక్కిన లోకాలకు, ద్వారంగా చేసిన కారణాన, సూర్యుడు సంచరించడానికి మొదలు అక్కడి నుండే బయల్దేరడం వల్లా, దాన్ని పూర్వ దిశ అంటున్నారు. ఆ తూర్పుకొండకు ఆవల దేవతలు వుంటారు. అక్కడ చంద్ర-సూర్య కాంతులు లేవు. చీకట్లు వ్యాపించి వుంటాయి. అక్కడి దాకా పోవచ్చును కాని ఆ తరువాత పోవడం సాధ్యపడదు. కాబట్టి ఆలోపల నేను చెప్పిన ప్రదేశాల్లోనే కాకుండా చెప్పని చోట్ల కూడా సీతను వెతకండి. నేను చెప్పలేదని మానవద్దు. తూర్పు పర్వతం దాకా మీరు సీతను, రావణుడు వుండే ప్రదేశాన్ని వెతికి నెలలోపల మరలి రండి. అలా రాకపోతే మీరు చంపబడతారు. కార్యసిద్ధులై వచ్చి కీర్తి సంపాదించి హాయిగా సుఖపడండి''.

సర్గ-41
హనుమదాదులను దక్షిణ దిక్కుకు పొమ్మని చెప్పిన సుగ్రీవుడు

తూర్పు దిక్కున వెతకడానికి వానర శ్రేష్టులను పంపిన సుగ్రీవుడు ఆ తరువాత దక్షిణ దిక్కుకు పంపించే సంగతి ఆలోచించాడు. ఆ దిక్కున వెతకడానికి సమర్థులైన అగ్ని కొడుకు నీలుడిని, హనుమంతుడిని, బ్రహ్మ కొడుకైన జాంబవంతుడిని, గజుడిని, సుహోత్రుడిని, గవయుడిని, శరారిని, శరగుల్మడిని, సుషేణుడుని, ఋషభుడిని, గవాక్షుడిని, అశ్వనీ దేవతల కుమారులైన మైంద-ద్వివిదులను, గంధమాదనుడిని, విజయుడిని, ఉల్కాముఖుడిని, అంగదుడిని, తదితర ప్రసిద్ధ బలులను పంపాలని భావించి కొంత సేనను వారికంటే ముందుగానే దక్షిణ దిక్కుకు పంపాడు. వీళ్లందరినీ తన దగ్గరికి పిలిచి దక్షిణ దిక్కున కల కొండల, గుట్టల, అడవుల గురించి ఇలా అన్నాడు.

"అనేక వృక్షాలు, లతలు, వేయి శిఖరాల పర్వత శ్రేష్టం వింధ్యము, పెద్ద-పెద్ద పాములు కల నర్మదను, విశాలమైన గౌతమీ అనే పేరున్న నదీ తీరాన్ని, కృష్ణ, మహానది, వరద, మేఖల (ఇదే అమరటంక పర్వతం...ఇక్కడే నర్మద పుట్టుతుంది), ఉత్కలం, దశార్ణము, ఆశ్వవంతి, అవంతి, విదర్భ, మహిషి ఋషికాలు, వంగ, కాశీ, కళింగ, అంగ దేశాల్లో వెతకండి. కొండలు, గుహలు, నదులున్న దండకారణ్యంలో గోదావరి నదిలో కొంచెమైనా విడువకుండా సీతాదేవిని వెతకండి. ఆంధ్ర, పుండ్ర, చోళ, పాండ్య, కేరళ, దేశాలలోను, సహ్యా పర్వతం దగ్గర చూడండి. కావేరిని చూడండి. మలయ పర్వతం దగ్గర మహా తపశ్శక్తికల దివ్య ఋషీశ్వరుడైన అగస్త్యుడు వుంటాడు. ఆయనను చూసి నమస్కారం చేస్తే మీ కోరికలు ఫలిస్తాయి. ఆయన ఆజ్ఞ తీసుకున్న తరువాత తాబేళ్లు, ఎండ్రకాయలు, మొసళ్లు, విస్తారంగా కలిగి, సముద్రాన్ని కలియబోయే

తామ్రపర్ణీనదిని చూడండి".

"వానరులారా! దానికి అవతల దివ్యమై, కొత్త ముత్యాలతో అలంకరించబడి, బంగారు రేకులతో ప్రకాశించే, శోభావిలసితమైన పాండ్యనగరి తలవాకిటిని చూడండి. సముద్ర తీరం చేరి దాన్ని దాటే మార్గం ఆలోచించండి. సముద్రం లోపల, అగస్త్యుడు పూర్వం, మహేంద్ర పర్వతం నిలిపాడు. అది నీళ్లల్లో మునిగీ–మునగనట్లు కనిపిస్తుంది. అదంతా బంగారుమయం. అన్నిరకాల తీగెలు కలదది. దేవర్షులు దాన్ని సేవిస్తారు. ఆ పర్వతంలో యక్షులు, సిద్ధులు, దేవతా స్త్రీలు గుంపులుగా ఎల్లప్పుడూ వుంటారు. పర్వదినాలలో ఇంద్రుడు స్నానం చేయడానికి వస్తాడు. సముద్రం మధ్యలో మనుష్యులు పోలేని నూరామడల విస్తారంకల ద్వీపం వుంది. అక్కడ మీరు సీతాదేని వెతకాలి. ఆ ద్వీపంలోనే వధ్యుడు, చెడు మనస్సు కలవాడు, ఇంద్రుడి తేజస్సుతో సమానమైన వాడు, రాక్షసరాజు, సీతాదేవిని చెరలో వుంచిన వాడు, దయలేనివాడు అయిన రావణాసురుడు వుండే పట్టణం వుంది. కాబట్టి వానరులారా! మీరు జాగ్రత్తగా అక్కడ కొంచెమైనా వదలకుండా సీతాదేవిని వెతకాలి".

"దక్షిణ సముద్రం మధ్యలో అంగారక (దీన్నే సుందరకాండలో సింహిక అని పిలిచారు) అనే రాక్షసి వుంది. అది ఆకాశాన పోయే వారి నీడను పట్టుకుని నిలిపి బక్షిస్తుంది. కాబట్టి దాని బారిన పడకుండా తప్పించుకోవాలి. ఆ ద్వీపంలో సీతాదేని, రావణుడిని హెచ్చరికగా వెతికి లేరని నిశ్చయించుకున్న తరువాత, అక్కడి నుండి, నూరామడ పోతే, అక్కడ సిద్ధులు, చారణులు వుండే, సూర్య–చంద్ర కిరణాలతో సమానమై, అందంగా వుండి, సముద్ర జలాలతో చుట్టబడ్డ, ఆకాశాన్ని తాకే శిఖరం కలిగిన పుష్పితకం అనే పర్వతం కనిపిస్తుంది. దాని బంగారు శిఖరాన్ని రాసుకుంటూ సూర్యుడు దక్షిణాయనంలో దాని వెండి శిఖరానికి వస్తాడు. దక్షిణాయనంలో దీనికి దక్షిణంగా సూర్యుడు పోడు".

" ఆ పర్వతాన్ని దాటి పద్నాలుగు ఆమడలు పోతే వైద్యుతమైన సూర్యవంతం అనే కొండ వస్తుంది. అక్కడ మీరు కందమూలాలు, పళ్ళు తిని, తేనె తాగి, ప్రయాణ బడలిక తీర్చుకుని, తరువాత కుంజరం అనే పర్వతాన్ని చూడండి. ఆ కొండలోనే విశ్వకర్మ అగస్త్యుడికి బంగారంలాగా ప్రకాశించే ఆమడ వెడల్పు, పది ఆమడ ఎత్తుకల, దివ్య రత్నాలతో విలసిల్లే ఇల్లు నిర్మించి ఇచ్చాడు. ఆ మహా పర్వతంలో సర్పాలతో రక్షించబడే భోగవతి అనే పేరుకల సర్పరాజైన వాసుకు నివాస స్థలం వుంది. ఆ పాముల నగరంలోపల అక్కడక్కడా రహస్య స్థలాలు

వున్నాయి. అవన్నీ మీరు వెతుకుతూ పోతుంటే, వృషభాకారం కలిగి, కాంతివంతమై, దేవతా సంబంధమై, అగ్ని కాంతితో, గోరోచన కాంతితో వెలిగే ఋషభం అనే పర్వతం వుంటుంది. తామర రేకుల వన్నె, నీలవర్ణం కల చందనం ఆ కొండమీద వుంది. దాన్ని మీరు చూడండి కాని తాకవద్దు. ఎందుకంటే వాటిని క్రూరులైన గంధర్వులు, రోహితులనే గంధర్వులు ఎప్పుడూ కాపాడుతుంటారు. బభ్రువు, శైలాషుడు, శుక్రుడు, శిగ్రుడు, గ్రామణి అనే ఐదుగురు సూర్యకాంతి కల, సూర్యచంద్రాగ్ని సమానులైన గంధర్వులు అక్కడనివసిస్తుంటారు. అది భూమికి పొలిమేర. అంటే ఆవల సముద్రం వుందని అనుకోవాలి. ఆ కొండలో తమ తపస్సుతో స్వర్గాన్ని జయించిన వారు, అలక్ష్యం చేయరాని వారు, పాప రహితులు, ఫలించిన కర్మం కలవారు వుంటారు".

"దాన్నీ దాటిపోతే ఆ పిమ్మట భయానకమైన యమలోకం వుంటుంది. కాబట్టి మనుష్యులకు ఆ యమలోకానికి పోవడం సాధ్యం కాదు. ఆ నగరాన్ని చుట్టుకుని భయంకరమైన చీకటి వ్యాపించి వుంటుంది. వానరులారా! మీరక్కడి దాకా పోవచ్చు. ఆ తరువాత పోవడం అసాధ్యం. ఇప్పుడు నేను చెప్పిన సర్వం, నేను చెప్పనిదీ, దారిలో కనపడితే వాటిల్లో వేటినీ వదలకుండా సీతాదేవిని హెచ్చరికగా వెతకండి. ఒక్క నెలలోపల 'చూచితి సీతను' అన్నవాడు సౌఖ్యాలలో, అసమాన భోగాలలో, నాతో సమానంగా అనుభవిస్తాడు. వాడికంటే ప్రియమైనది నాకీ సమస్త భూమండలంలో ఏదీ లేదు. వాడు ఇదివరకు ఎంత దోషం చేసినా నాకు బంధువే. వానరులారా! మీరందరూ బలపరాక్రమాలలో గొప్పవారు. గొప్ప వంశంలో పుట్టినవారు. విస్తారమైన మంచి గుణాలున్నవారు. కాబట్టి ఎంత ప్రయత్నం చేసైనా, ఏ విధంగానైనా సీతాదేవిని వెతకాలి".

సర్గ-42
సుషేణుడుని, ఇతరులను పశ్చిమ దిక్కుకు పొమ్మన్న సుగ్రీవుడు

హనుమంతుడిని, ఇతరులను దక్షిణ దిక్కుకు పొమ్మని ఆజ్ఞాపించిన సుగ్రీవుడు తన మామ, తారకు తండ్రైన, మహాబల పరాక్రమవంతుడు సుషేణుడిని పిలిచి, నమస్కారం చేసి, అణకువగా ఇలా అన్నాడు. అలాగే అతిశయించిన భయంకర పరాక్రమం కలవాడిని, ఇంద్రుడి కాంతిలాంటి కాంతికల వాడిని, విశేష ధైర్యంలో పర్వతం లాంటివాడిని, శౌర్యగర్వంకల వానరులతో చుట్టబడిన వాడిని, గరుత్మంతుడి లాంటి వేగం కలవాడిని, మరీచి మహర్షి కుమారుడిని, మారీచుడనే వాడిని, మిగతా మారీచులను, శూరులను చూసి సుగ్రీవుడు ఇలా అన్నాడు.

"సుషేణుడు మొదలైన వానరులారా! మీరంతా శ్రీరామచంద్రుడి భార్యను, సీతాదేవిని వెతకడానికి పోవాలి. మీతోపాటు రెండు లక్షల కోతులను తీసుకుని పశ్చిమ దిశగా పొండి. అక్కడ సురాష్ట్రం (ఇప్పటి సూరత్), బాహ్లికం, శూరము, భీమమనే దేశాలు విశాలంగా వుంటాయి వాటిని, చిరకాలం నాటి పల్లెలను, పున్నాగం అనే అడవిని, పొగడవనాన్ని, మొగిలి అడవులను చూడండి. పడమటగా ప్రవహించే నదులు, మునులుండే అడవులు, కొండలు, నీరులేని ప్రదేశాలు, పెద్దరాల దేశాలను వెతుక్కుంటూ పోయి పశ్చిమ సముద్రాన్ని చేరండి. చేపలతో, మొసళ్ళతో వ్యాపించిన లోతైన ఆ సముద్రాన్ని చూసి, దాని తీరంలో వున్న మొగిలివనంలో, గానుగ తోపుల్లో, టెంకాయ తోటల్లో సంతోషంగా సంచరించండి. తీరం వెంటే వున్న గొప్ప పర్వతాలలో, అడవుల్లో, సీతాదేవిని, రావణాసురుడిని వెతకండి. అది దాటిపోయి మురచీ పట్టణం, జటీపురం, అవంతిని, అంగలోపను చూడండి. పట్టణాలలో, రాష్ట్రాలలో,

మనుష్యులు పోవడానికి కష్టమైన అడవుల్లో చక్కగా వెతికి అక్కడి నుండి సింధు నది సముద్రంలో పడేచోటు చూడండి. అక్కడ దక్షిణలోయల వెంట వుండే హాల పర్వతాన్ని చూడండి. అక్కడ పెద్ద మ్రాకులు, అనేక శిఖరాలు కలిగి ఆకాశాన్ని అంటే, రెక్కలుకల దానిలాగా ఎగిరే సింహాలుండే చరియలు కల హేమగిరిని చూడండి".

"తిములను, చేపలను, ఏనుగులను, తీసుకుని పోయి ఈ సింహాలు కొండకొనల్లోని గూళ్లలో ఉంచుతాయి. అక్కడ మదించిన ఏనుగులుంటాయి. పాపరహితమైన నడవడి కలిగిన వానరులారా! మీరా పర్వతం అంతా వెతికి త్వరగా నూరామడలు పోయి, చూడడానికే అసాధ్యమైన పారియాత్ర పర్వత (పశ్చిమ రాజపుత్ర స్థానంలో వున్న ఇప్పటి సోలేమాన్ రేంజ్ కావచ్చు) శిఖరాన్ని చూడండి. అక్కడ చాలా బలవంతులు, కామరూపులు, అగ్నితో సమానమైన తేజస్సుకలవారు, ఇరవైనాలుగు కోట్లమంది వుంటారు. సింహబల పరాక్రమం లాంటి పరాక్రమం కలవారైన గంధర్వులు వుంటారక్కడ. వారి సమీపానికి మీరు పోవద్దు. అక్కడి కందమూలాలను, పండ్లను వారు కాపాలా కాస్తుంటారు. ఇతరులను తీసుకుని పోనివ్వరు.(గంధర్వులు అంటే వీరు మనుష్య గంధర్వులు. వీరి దేశం గాంధార దేశం. ఇది ఇప్పటి ఆఫ్ఘానిస్తాన్. ఇందులోని గాంధారం అంటే కాందహార్). అక్కడ మీరు సీతను వెతకండి. అక్కడ పవిత్రమైన వైడూర్యకాంతికలదై వజ్రాల దృఢమైన కొండ వుంది".

"ఆ కొండ పేరు వజ్రధరం. అది ఎన్నో చెట్ల గుంపుల తీగలు కలది. అందులో చిత్రమైన నూరామడల చదరమైన నెల వుంది. దానికి ఆవల వున్న గుహలన్నీ వెతికి ముందుకు పోతే, సముద్రంలోని నాల్గవ భాగంలో చక్రవంతం అనే పెద్ద పర్వతం వుంటుంది. అక్కడ విశ్వకర్మ రచించిన సాహస్రార చక్రం వుంది. దానికి వేయి అంచులున్నాయి. దాన్ని రక్షించే హయగ్రీవుడిని, పంచ జనుడిని చంపి, విష్ణువు హయగ్రీవుడి చక్రాన్ని, పంచ జనుడి వెన్నెముక అయిన శంఖాన్ని తీసుకున్నాడు. పంచజనుడి వల్ల లభ్యమయింది కాబట్టే శంఖానికి పాంచజన్యమని పేరు వచ్చింది. ఆ కొండ చరియలలో వున్న గుహలలో సీతను, రావణుడిని వెతకాలి. ఆ తరువాత అరవై ఆమడలు పోతే సముద్రంలో విశాలమైన వెండి శిఖరంతో కూడిన వరాహ పర్వతం వుంటుంది. విశాలమైన ఆ పర్వతంలో ప్రాగ్జ్యోతిషం (దీని ఇప్పటి పేరు అస్సాం) అనే పట్టణం వుంది. అక్కడ, ఆ గుహ ప్రదేశంలో క్రూరమైన మనస్సుకల నరకుడనే రాక్షసుడు (ఈ

నరకుడు నరకాసురుడి వంశస్తుడు) నిర్భయంగా నివసిస్తున్నాడు''.

"ఇవన్నీ కలయ చూస్తూ పోతుంటే సెలయేళ్లున్న సర్వసౌవర్ణం అనే పేరున్న కొండ వస్తుంది. అక్కడి నీళ్ళ దూకుడు ధ్వనికిఏనుగులు, సింహాలు, పులులు, పందులు ప్రతిధ్వనులు ఇస్తుంటాయి. ఇంద్రుడిని దేవతలంతా ఎక్కడ అభిషిక్తుడిని చేశారో ఆ పర్వతానికి మేఘవంతం అనే పేరు వచ్చింది. అది దాటిపోతే అరవై వేల కొండలు వస్తాయి. అక్కడ చూడడానికి అందంగా వున్న సూర్య కిరణాల కాంతి కల బంగారుమయమైన చెట్లు పూచి వుంటాయి. ఆ పర్వతాల మధ్య ప్రదేశంలో ఉత్తర మేరుసావర్ణి అనే పర్వతం వుంది. ఆ కొండను చూసి సూర్యుడు ఆ పర్వతోత్తమాన్ని ఆశ్రయించిన వారు ఉదయం, సాయంకాలం తన అనుగ్రహాన బంగారు కాంతి కల శరీరం కలవారవుతారు అని అన్నాడు. దానిమీద నివసిస్తున్న దేవసమూహాలు, గంధర్వులు మొదలైన వారు మనోహర కాంతితో ప్రకాశించే దేహాలు కలవారై ఎర్రటి దేహకాంతి కలవారవుతారని అన్నాడు. విశ్వులు, ఆదిత్యులు, మరుత్తులు, వసువులు మొదలైనవారు ప్రసిద్ధులైన దేవతలను సాయంకాల సమయంలో భక్తితో బంగారు కొండమీద వున్న సూర్యుడిని సేవించడానికి వస్తారు. ప్రాణకోటికంతా కానరానివాడై లోకమంతా చీకటిలో మునిగేట్లు చేసి తానూ పడమటి కొండకు పోతాడు''.

"గడియకు పదివేల ఆమడల వంతున పోయి సూర్యుడు పడమటి కొండకు చేరుకుంటాడు. ఆ పర్వత శిఖరం కొనలో సూర్యకాంతి కల మేడలతో నిండిన దివ్యమైన ఒక ఇల్లు వుంది. అది విశ్వకర్మ నిర్మితం. నానారకాలైన పక్షులున్నాయక్కడ. అందమైన చెట్లతో ప్రకాశిస్తుంది. అక్కడ అస్తపర్వతానికి, మేరుపర్వతానికి మధ్యన బంగారుమయమై, చిత్రమైన అరుగు కలిగి, పది తలల తాల వృక్షం కళ్లకు ఆనందంగా కనపడుతుంది. అక్కడ అసమానమైన తపో నిష్టకలవాడు, మిక్కిలి ధర్మాత్ముడు, బ్రహ్మతో సమానమైనవాడు, మేరుసావర్ణి అనే ఋషి వుంటాడు. ఆయనకు మీరు నమస్కారం చేసి సీతాదేవి జాడ అడగండి. సూర్యుడు ఉదయ సమయాన ఇంతదాకా తన తేజస్సుతో చీకట్లను తరిమి పడమటి కొండకు పోతాడు. ఆ తరువాత సూర్యరశ్మి వుండదు. కాబట్టి ఏమున్నదో తెలియదు. చీకట్లు వ్యాపించి వుంటాయి. అంతదాకా సీతను వెతికి రండి. ఒక్క నెలలో రావాలి. అంతకు మించి ఎవడైనా తెలివి మీరి రాకపోతే వాడు చంపబడతాడు. మీరంతా ప్రసిద్ధ బలపరాక్రమ సంపత్తి కలవారు. మీ

వెంట మా మామ సుషేణుడు వస్తాడు. ఆ ప్రసిద్ధ బలుడిని ఆజ్ఞప్రకారం మీరు నడుచుకొండి. మీకందరికీ ఆయనే పెద్ద. ఈయనను మీరు పెద్దగా గ్రహించి కార్యం సాధిస్తే మనం ధన్యులమై భూతలాన రామకార్యనిర్వాహకులనే కీర్తి సంపాదించగలం. నేను చెప్పినంత మాత్రమే కాకుండా దేశకాల ప్రయోజనం, మేలు ఆలోచించి సందర్భానుసారంగా చేయాల్సినదంతా చేయండి. మీరు పశ్చిమ దిశగా పొండి”.

సర్గ-43
శతవలిని ఉత్తర దిక్కుకు పొమ్మన్న సుగ్రీవుడు

తన మామను పశ్చిమ దిక్కుగా పంపిన సుగ్రీవుడు మహాబలవంతుడైన శతవలి అనే వాడిని చూసి రామచంద్రమూర్తికి, తనకు మేలయ్యే విధంగా ఇలా చెప్పసాగాడు.

"ఉత్తరాన హిమవత్పర్వతం వుంది. నువ్వు ఆ దిక్కుగా, నీలాంటి బలవంతులను, నూరువేల వానరులను యమపుత్రులతో సహా తీసుకుని సీతాదేవిని వెతకడానికి వెళ్లు. ఈ కార్యాన్ని సాధించి, రామచంద్రమూర్తికి పూర్తిగా సంతోషం కలిగిస్తే, మనం ఋణం తీర్చుకున్న వాళ్లమై ఉత్తములనే కీర్తిని పొందుతాం. మనకు రామచంద్రమూర్తి మేలు చేశాడు. కీర్తి కలిగే విధంగా, మన జన్మ సార్థకం అయ్యేట్లు మనం బదులు మేలు చేయతగిన ఉపాయం ఇదేకదా? ఉపకారం చేయనివారికే ఉపకారం చేస్తే జన్మ సఫలమవుతుంది. ఇక ఉపకారం చేసినవాడికి ప్రత్యుపకారం చేయడం అత్యంత ఆవశ్యమని వేరే చెప్పాల్నా? ఈ విషయాల్ని మనసులో పెట్టుకుని ఏ విధంగా నడచుకుంటే సీత కనబడుతుందో ఆ విధంగా చేయండి. నిర్మలమైన మనస్సుకలవారా! ఎల్లప్పుడూ నా మేలే కోరే మీరు మీ నేర్పంతా చూపించి రామచంద్రమూర్తి కార్యాన్ని నెరవేర్చండి. ఈ రామచంద్రమూర్తి మనకే కాదు, సమస్త ప్రాణికోటులకు పూజింపతగ్గవాడు. శత్రువులపాలిటి రుద్రుడిలాంటివాడు. స్నేహితులమైన మనమీద అమితమైన దయకలవాడు. కాబట్టి సీతాదేవిని అడవుల్లో, కొండల్లో వెతకండి".

"హెచ్చరికగా పోయి మ్లేచ్ఛ దేశంలో శూరసేన, పుళింద, ప్రస్థర, మద్రక,

భారత (హస్తినాపుర), దక్షిణ కురుభూముల్లో, కాంభోజ, యవన, శకదేశంలో, అరట్ట, బాహ్లిక, పౌరవ, టంకణ, ఋషిక దేశాల్లో, జీనా దేశంలో, పరమ చీన (మంచూరియా–మంగోలియా) దేశంలో, నిహార, దరద ప్రదేశాల్లో, హిమవత్పర్వత ప్రాంతంలో వున్న దేవదారు వనాలలో, పద్మకాష్టాలలో వున్న వనాలలో సీతాదేవిని, దుర్నీతిపరుడైన రావణుడిని వెతకాలి. సోమాశ్రమం, కాలపర్వతం అవతలవైపున గుహలలో సీతను వెతకండి. ఆ పర్వతం దాటి పోగా సుదర్శనం అనే పర్వతం వస్తుంది. అది దాటిపోయిన తరువాత అనేక పక్షి సంఘాలతో నిండిన దేవసఖమనే పర్వతం వుంటుంది. దానికి అవతల కొండలు, నదులు, చెట్లు, జీవజంతువులు లేని నూరామడల పొడవున్న దేశం వుంటుంది. దీన్ని గోబి, శాము ఎడారి అంటారు. ఆ మరుభూమిని దాటిపోతే కైలాసపర్వతం కనబడుతుంది. (హిమాలయానికి ఉత్తరాన టిబెట్ దేశం వుందిప్పుడు). దాన్ని చూడగానే మీ బడలిక తీరుతుంది. అక్కడ తెల్లటి మేఘంతో సమానమై, బంగారంతో అలంకృతమై, తెల్లటి కాంతికల కుబేరుడి ఇల్లుంది. దాన్ని విశ్వకర్మ నిర్మించాడు".

"అక్కడ ఆహ్లాదకరమై, తెల్లకలువలు, హంసలున్న, దేవతాస్త్రీలు సేవించే వస్వౌకసార అనే కొలను వుంది. ఆ కొలను సమీపంలో దేవతాస్త్రీలు విహరిస్తుంటారు. దేవతలు, యక్షులు, కొలుస్తుంటే కుబేరుడు ఎల్లప్పుడూ అక్కడ వినోదంగా క్రీడిస్తుంటాడు. ఆ ప్రదేశంలో రావణుడిని, సీతాదేవిని వెతకండి. దానికి అవతల క్రౌంచపర్వతం వుంది. దాంట్లో పూర్వం కుమారస్వామి శక్తి ప్రయోగంతో నిర్మించిన శిబిరం వుంది. ఆ దారిలోనే హంసలు మానస సరస్సుకు పోయివస్తుంటాయి. ఆ బిలంలోకి పోవడం అంత సులభం కాదు. జాగ్రత్తగా అందులోకి ప్రవేశించండి. దాంట్లో సూర్యకాంతి కల దేవర్షులు, మహర్షులు వుంటారు. అవే కాకుండా తక్కిన గుహలను, చారులను, గుహలకింది నేలలను, మధ్యనున్న ప్రదేశాలను చక్కగా వెతకండి. అక్కడ వృక్షం, కామశైలం, మానసం అనే పర్వతాలున్నాయి. దేవదానకులకు కూడా మాంసం అనే పర్వతం దగ్గరికి పోవడానికి సాధ్యంకాదు. కాబట్టి కొండపక్కనే వెతకండి".

"క్రౌంచపర్వతం దాటిన తరువాత మైనాక పర్వతం వస్తుంది. ఆ పర్వతం మీద మయుడనే దానవుడు కట్టుకున్న సుందరమైన గృహం వుంది. అక్కడ గుహలలో, చరులలో సీతాదేవిని వెతకాలి. గుర్రాల ముఖాల లాంటి ముఖాలున్న

స్త్రీల ఇండ్లున్నాయక్కడ. వాటిని దాటిపోతే వాలఖిల్యులు, సిద్ధులు తపస్సు చేస్తుంటారు. వారికి నమస్కారం చేయడి. అణకువతో వారిని సీత జాడ అడగండి. ఆ సిద్ధులుండే ప్రదేశంలో ప్రకాశిస్తున్న బంగారు కమలాలతో కప్పబడిన వైఖానసం అనే సరస్సు వుంది. అక్కడ బాలసూర్యుడి కాంతికల హంసలున్నాయి. అక్కడికికుబేరుడి ప్రియమైన వాహనం,సార్వభౌమమనే పేరుకల ఏనుగు, ఆడ ఏనుగుల గుంపుతో వస్తుంది. ఆ కొలను సమీపంలోని ప్రదేశాలలో అంతటా వెతకండి. ఆ సరస్సుకు ఆవల సూర్యకాంతి, చంద్రకాంతి, నక్షత్రకాంతి లేదు. అక్కడ మేఘాలు లేవు. ఆకాశం శబ్దం లేకుండా వుంటుంది. అక్కడ మునులు సూర్యుడిలాగా వారి-వారి తేజస్సుతో ఆ స్థలాన్ని వెలుగుతో నింపుతారు. మీరది దాటిపోతే శైలోదం అనే శిలానది వుంది. దానికి ఇవతల, అవతల కీచకాలు అనే పేరుకల వెదుళ్ల పొదలుంటాయి. ఆ ఏటి నీళ్లలో దిగినవారు రాళ్లుగా మారిపోతారు కాబట్టి ఆ నది దాటాలంటే, ఆ పొదల వెదుళ్ళు పట్టుకుని పోవాలి, రావాలి. ఆ దరిన, ఈ దరిన వెదుళ్లు కలిసికొని అల్లుకుని వుంటాయి. అది సిద్ధులకు సాధ్యమే కాని ఇతరులకు సాధ్యం కాదు. ఆ ఉత్తర కురుభూములు పుణ్యం చేసిన పురుషులకు భోగస్థానాలై వుంటాయి''.

"అక్కడ అనేక నదులున్నాయి. వాటిల్లో వైడూర్యాలున్న ఆకులు కలిగిన బంగారు కమలాలుకల తామరతూండ్లు వున్నాయి. అక్కడ ఎర్రటి కలువల వనాలున్నాయి. అక్కడి సరస్సులు బంగారువన్నె, బాలసూర్యుడివన్నె కలిగి వుంటాయి. చూడడానికి చాలా సంతోషకరములై వుంటాయి. జాతినీలాల కాంతికల రేకులు, అపరంజి బంగారు కాంతికల కింజల్కాలున్న నల్లటి కలువలతో నిండిన సరస్సులు అక్కడ అందంగా వుంటాయి. అక్కడి నీళ్లు కాంతులతో ప్రకాశిస్తుంటాయి. అగ్నితో సమానంగా బంగారు కాంతితో కొండలక్కడ దండిగా వున్నాయి. సర్వకాలాలలో పూలు, పండ్లు కొల్లలుగా కలిగి వేలకొద్ది పక్షుల గుంపులు కలిగి, మంచివాసనలను ఇస్తూ, అక్కడి చెట్లు కోరిన కోర్కెలను ఇస్తాయి. అక్కడ కొన్ని పర్వతాలు నానారకాలైన వస్త్రాలను ఇస్తాయి. కొన్ని పర్వతాలు స్త్రీ-పురుషులకు యోగ్యంగా అన్ని ఋతువుల్లోనూ సేవించడానికి యోగ్యంగా, ఇష్టం వచ్చిన విధంగా మంచి ఫలితాలను ఇస్తాయి. కొన్ని శ్రేష్టమైన సొమ్ములను ఇస్తాయి''.

"ఆ ఉత్తర కురు భూముల్లో కొన్ని పర్వతాలు అసమానమైన, ఆశ్చర్యకరమైన పీటలు, మంచాలు కాస్తాయి. కొన్ని చెట్లు భక్ష్యాలను, పానాలను, మనస్సుకు

ఇంపైన పూలసరాలను కలిగిస్తాయి. అక్కడ సుందరులు, యౌవనవతులు, సుగుణ సంపత్తికల స్త్రీలు వుంటారు. అక్కడ గంధర్వులు, సిద్ధులు, నాగాసమూహాలు, కిన్నరులు, విద్యాధరులు సూర్య తేజస్సు కలవారై, తమ స్త్రీలతో వినోదంగా కోరికలు తీరా తిరుగుతుంటారు. అక్కడి జనాలు పుణ్యకర్మలు చేస్తూ రతి ప్రధానంగా భోగిస్తుంటారు. చిరునవ్వులతో స్త్రీలు సంగీత వాద్యాల ధ్వనులు నిండేట్లు చేస్తుంటే అవి ఎప్పుడూ ప్రాణికోటులకు వినిపిస్తుంటాయి. ఆ ఉత్తర కురుభూముల్లో సంతోషం లేనివాడు, భార్యలేని వాడు ముచ్చటకైనా వుండరు. ప్రజల్లో పూట-పూటకు మనోహరమైన గుణాలు వృద్ధి చెందుతుంటాయి. దాన్ని దాటి ఉత్తరంగా పోతే, సముద్రంలో సోమశైలం అనే పేరున్న బంగారుమయమైన పర్వతం వుంటుంది. దాన్ని చూడండి. దాన్ని ఇంద్రలోక వాసులు, బ్రహ్మ లోకవాసులు కాపాడుతుంటారు.ఆ ప్రదేశంలో సూర్యకాంతి లేకపోయినా ఆ బంగారు కాంతి వల్ల వస్తువులు కనబడుతుంటాయి".

"అక్కడ షాడ్గుణ్య పరిపూర్తికలిగి ప్రపంచ స్వరూపుడైన విష్ణువు, ఏకాదశ మూర్తులు ధరించి, మన్మథ విరోధి అయిన శివుడు, ప్రపంచాన్ని సృష్టించిన బ్రహ్మ కాపురం వుంటారు. ఉత్తర కురుభూములకు ఉత్తరంగా మీరు పోవద్దు. దేవతాసమూహానికి కూడా సోమపర్వతం చేరబోవడం సాధ్యపడదు. అంత శక్తి వుండదు. మీరు దూరం నుండే చూడండి. చూసి, మరలి రండి. ఆవలి దేశం కట్టుపాటు లేనిది. సూర్యకాంతి వుండదు. అక్కడ ఏమున్నదో ఎవరికీ తెలియదు. వానరులారా! నేను చెప్పిన, చెప్పని స్థలాలు సీతకొరకు వెతకాలి. అగ్నిహోత్రుడితో సమానమైన వనారులారా! సీతాదేవిని మీరు చూడడం వల్ల రామచంద్రమూర్తికి, అంతకంటే నాకు సంతోషం కలిగించిన వారవుతారు. అలా చేసిన తరువాత మీరు హితులతో, బంధువులతో కలిసి-మెలిసి ఆనందంగా మీ ఇష్టానుసారం స్వేచ్ఛగా సంచరించండి".

సర్గ-44
కార్యభారాన్ని హనుమంతుడి మీద పెట్టిన సుగ్రీవుడు

ఈ విధంగా నలుదిక్కులకు పోయేవారికి చెప్పాల్సిన మాటలు చెప్పిన సుగ్రీవుడు హనుమంతుడిని చూసి, ఇతడివల్లే ఈ కార్యం సాధ్యమవుతుందని, ఇతడే ఈ పనిని సాధించగల సమర్థుడని ఆలోచించి, నిశ్చయించి, పరాక్రమశాలైన హనుమంతుడితో ఇలా అన్నాడు.

"ఓ వానరసత్తమా! నీళ్లల్లో, నిప్పుల్లో,స్వర్గంలో, ఆకాశంలో, నీ గమనం అనివార్యం. నువ్వు పోవాలనుకుంటే అడ్డం రాగలది, ఆటంకపర్చగలది ఏదీ లేదు. ఇది నిశ్చయం. నాకు తెలుసు. అసురులతో, గంధర్వులతో, దేవతలతో, సర్పాలతో, మనుష్యులతో, కొండలతో, సముద్రంతో కూడిన ఈ సమస్త భూమండలంలో నీకు తెలియరానిది వుందా ఆంజనేయా? వేగంలో, తేజంలో, తేలికలో పోవడానికి, బలాతిశయం చూపడానికీ నువ్వు నీ తండ్రితో సమానం ఆంజనేయా! ఓ కపీశ్వరా! నీ అతిశయించిన తేజస్సును పోల్చి చూస్తే నీకు సమానమైన ప్రాణి ఈ భూమ్మీద లేదు. దేహబలం, బుద్ధిబలం, అధిక పరాక్రమం, ఫలానాది చేస్తే మంచి, ఫలానాది చేస్తే చెడు, ఫలానాది దోషం, ఫలానాది గుణం అని ఆలోచించే శక్తి, ఏ దేశంలో-ఏ కాలంలో ఎలా ప్రవర్తించాలో అలా చేయడం, ఇవన్నీ నీలో నిలకడగా పాతుకుని వున్నాయి నీతిమంతుడా! కాబట్టి హనుమంతా! రామచంద్రమూర్తి భార్యను సాధించి మరల తెచ్చే ఉపాయం ఏదో అది నువ్వే చేయాలి. నీకు తప్ప ఇతరులకు అది సాధ్యంకాదు".

(హనుమంతుడు ఇంత బలశాలి, గొప్పవాడు అని సుగ్రీవుడికి తెలుసు కదా! ఎందుకు అతడిని వాలిమీదకు యుద్ధానికి పంపలేదు? హనుమంతుడు

తనంతట తానే ఎందుకు వాలిని నిరోధించలేదు? ఇంత బలవంతుడు సహాయుడిగా వుండి కూడా ఎందుకు సుగ్రీవుడు కష్టపడ్డాడు? హనుమంతుడు సుగ్రీవుడి బంటు. స్వామి ఆజ్ఞ లేకుండా ఏదీ చేయకూడదు. తాను వాలిని జయించలేను, అని చెప్పి బంటు సహాయం కోరలేదు కదా! అలా కోరడం తనకు అవమానంగా సుగ్రీవుడు భావించి వుండవచ్చు. తనంతట తానే వాలిని నిరోధిస్తే అది సుగ్రీవుడిని అవమానించినట్లే. ఒక వేళ హనుమంతుడు సుగ్రీవుడి పక్షాన యుద్ధానికి వస్తే వాలి పక్షం వారంతా అతడిని ఎదిరించడానికి వస్తారు. ఆ పోరుకు అంతం ఎక్కడ? కాబట్టి అన్నదమ్ములే కొట్టుకుని చావనీ అని మిగతా వారంతా వూరుకున్నారు. హనుమంతుడికి కూడా తన బలం తనకు తెలియదు. స్వయంగా దేనికీ సాహసించడు. జాంబవంతుడి లాంటివారు వుండాలి ప్రోత్సహించడానికి. హనుమంతుడికి భయపడడం వల్లే వాలి సుగ్రీవుడిని భయపెట్టాడు కానీ చంపడానికి పూనుకోలేదు).

హనుమంతుడి చేతికి తన ముద్రికను ఇచ్చిన శ్రీరాముడు

ఇలా సుగ్రీవుడు అంటుంటే రామచంద్రమూర్తి ఆలోచించాడు ఇలా."సుగ్రీవుడు కార్యభారాన్ని హనుమంతుడి మీద పెట్టున్నాడు. కార్యసాదనలో ఎవరు, ఏపని చేయగలరో నిశ్చయించే శక్తి కలవాడు సుగ్రీవుడు. ఇక ఈ అంజనేయుడేమో నిశ్చయించిన కార్యం చేసే శక్తికలవాడు. ఇది వాస్తవం. పూర్వం కూడా గొప్ప పనులు చేసి, కీర్తి–విశ్వాసం సంపాదించిన నమ్మిన బంటు కాబట్టి ఇతడివల్ల నిజంగా కార్యం నెరవేరుతుంది".

ఇలా భావించిన రామచంద్రమూర్తి ఎంతో సంతోషించి తాను కృతకృత్యుడైనానని తలచి, తన బంగారపు ఉంగరాన్ని తన చేతిలో తీసుకున్నాడు. తన పేరు చెక్కబడిన ఆ ఉంగరాన్ని చూస్తూ, హనుమంతుడితో "వానరశ్రేష్టా! దీన్ని తీసుకునిపో. సీతకు చూపించు. ఇది చూపిస్తే నువ్వు నిజంగా నా దూతవేనని భయం లేకుండా నీతో మాట్లాడుతుంది. సుగ్రీవుడు అప్పచెప్పిన పని చేయగల సమర్థుడివి నువ్వే అని నాకు అనిపిస్తున్నది. ఈ కారణాన దీన్ని నీదగ్గర వుంచుకో" అని అన్నాడు.

(రామచంద్రమూర్తికి ఈ ఉంగరం ఎక్కడినుండి వచ్చింది? సర్వం త్యజించిన వానప్రస్థుడు ఉంగరం దరించవచ్చా? అయితే, రామచంద్రమూర్తి వానప్రస్థాశ్రమం స్వీకరించలేదని అయోధ్యకాండలో చెప్పడం జరిగింది. కైకేయి

కోరిక ప్రకారం నారచీరెలు ధరించాడే కాని, తక్కిన ఆశ్రమ చిహ్నాలను అనుష్ఠించలేదు. ఆ కారణాన ఉంగరం ధరించడం వల్ల వ్రతభంగం కలగలేదు. కాగల కార్యం ఆలోచించి సుబాహుడితో మారీచుడిని ఎందుకు చంపలేదో, అలాగే, ఈ ఉంగరాన్ని కూడా పరిత్యజించలేదు. కాని సొగసుకోసం వుంచుకోలేదు. ఇంకో విషయం....ఈ ఉంగరం సీత రామచంద్రమూర్తికి ఇచ్చింది. వివాహ సమయంలో వధూవరులు ఉంగరాలు మార్చుకునే ఆచారం ఇప్పటికీ వుంది. దాని విలువ మాత్రం కొంచెం చెడింది. ఈ ఉంగరాలను భర్త జీవించినంతకాలం భార్య, భార్య జీవించినంతకాలం భర్త విడవరాదు. స్త్రీలకు మంగళసూత్రం ఎలాగో, అలాగే, భర్తలకు ఈ ఉంగరం అలాంటిది. తక్కినవన్నీ త్యజించినప్పటికీ దీన్ని మాత్రం త్యజించకూడదు. దాన్ని త్యజించడం అంటే భార్యను త్యజించినట్లే. ఆ కారణాన రామచంద్రమూర్తి దాన్ని విడవకుండా ధరించాడు. సీతాదేవిని నమ్మించకలిగింది మరేదీ లేదు కనుక, తానిచ్చిన ఉంగరాన్ని, రాముడి వేలుకుండే ఉంగరాన్ని, సీత ఎప్పుడూ చూస్తుండే ఉంగరాన్ని హనుమంతుడికి ఇచ్చాడు శ్రీరాముడు).

హనుమంతుడితో ఉంగరాన్ని ఇస్తూ ఇంకా ఇలా అన్నాడు శ్రీరాముడు. “నీ పరాక్రమ సమృద్ధి, నీ విస్తార బలం, నీ ప్రయత్నం, సుగ్రీవుడి నియోగం, ఇవన్నీ చూస్తుంటే నీవల్లే ఈ కార్యం నిజంగా అవుతుంది. మహాబలం, సింహవిక్రమం కలవాడా! నువ్వు గొప్ప పరాక్రమం పూని, అల్పకార్యమని అశ్రద్ధ చేయకుండా, ఏవిధంగానైనా పని పూర్తిచేస్తే సీతాదేవిని చూడడానికి వీలవుతుందో అలాగే చేయి. నేను నీ బలాన్ని ఆశ్రయించి వున్నాను”.

శ్రీరాముడిలా చెప్పగా, హనుమంతుడు ఉంగరాన్ని తీసుకుని, శిరం మీద ధరించి, రెండు చేతులు జోడించి, రామచంద్రమూర్తి పాదాలకు నమస్కరించి నిలబడ్డాడు.

సర్గ-45
సీతను వెతకడానికి వెళ్లిన వానరులు

వానరేంద్రుడైన సుగ్రీవుడు వానరులందరినీ చూసి, రామచంద్రమూర్తి కార్యాన్ని సఫలం చేయడానికి వారంతా త్వరగా పొమ్మని అంటాడు. తాను చెప్పిన స్థలాలన్నీ వెతకమని మళ్లీ చెప్పాడు. ఆ వెంటనే వానరులు అందరూ భక్తితో, తమ ప్రభువు అజ్ఞానుసారం పెద్ద మిడతల దండులాగా భూమంతా ఆక్రమించుకుంటూ చాలా వేగంగా పోయారు. వారిలో వానర సమూహంతో వినతుడు తూర్పుగా, సుషేణుడు పడమరగా పోయారు. శతవలి ఉత్తర దిక్కుగా పోయారు. దక్షిణ దిక్కుగా దారుడు, అంగదుడు తోడురాగా ఆంజనేయుడు నక్షత్రాలతో కూడిన మేఘాల లాగా నిర్మలమైన ఆకాశంలోని చంద్రుడి లాగా వానరుల గుంపు తన వెంట వస్తుంటే పోయాడు. (మార్గశిర మాసం ప్రారంభమయిందని సూచన). సుగ్రీవుడు వానరులందరినీ పంపాల్సిన విధంగా పంపి, తానూ చేయాల్సిన పని చేశాను కదా అని సంతోషించాడు. రామలక్ష్మణులు సుగ్రీవుడు పెట్టిన నెలరోజుల గడువు ఎప్పుడు తీరుతుందా అని అనుకుంటూ ప్రస్రవణాద్రిలో వుండి పోయారు.

వానరులంతా ఎవరికీ వారే తామే సీతను వెతుకుతామనీ, సీతను వెతికి తెస్తామనీ కేకలు వేయసాగారు. గట్టిగా అరుస్తూ, పండ్లు కొరుక్కుంటూ, దిక్కులు అదిరేలా తోకలు నేలమీద కొట్టుతూ, సింహనాదాలు చేస్తూ వానరులు పరుగెత్తారు. "ఓ కోతులారా! ఈ చిన్న పనికి మీరంతా ఎందుకు? ఆగండి. నేనొక్కడినే పోయి రావణుడిని చేరి, యుద్ధంలో వాడిని అణగదొక్కి సీతాదేవిని తీసుకొస్తాను" అని ఒక వానరుడు అంటుంటే, ఇంకొకడు "చెట్టును పడగొట్టుతా, కొండలను పిండి చేస్తా, సముద్రాన్ని ఎండబెట్టుతా, భూమిని

భాదిస్తా, జానకిని తెస్తా" అని అన్నాడు. మరో వానరుడు, తాను వేగంగా పోయి నూరామడ దాటుతానంటే, ఇంకొకడు నూరామడ ఒక లెక్కా? అంతకంటే ఎక్కువ దాటుతానని అంటాడు. ఇలా ఒక్కొక్క వానరుడు తన వేగం, బలం తెలిసేలా మాట్లాడుతూ గర్వాధిక్యంతో సుగ్రీవుడి ముందు చెప్పారు.

సర్గ–46

తాను భూమండలం చూసిన విధానం శ్రీరాముడికి చెప్పిన సుగ్రీవుడు

వానరులంతా ప్రయాణమై వెళ్లిపోయిన తరువాత సుగ్రీవుడితో రామచంద్రమూర్తి, ఈ సమస్త భూమండలం ఆయనకెలా తెలుసని ప్రశ్నించాడు. భక్తితో జవాబు చెప్పాడు సుగ్రీవుడు శ్రీరాముడికి.

"దుందుభి అనే దైత్యుడు దున్నపోతుగా వాలిమీదకు యుద్ధానికి వచ్చాడు. వాలి అతడిని మలయ పర్వతం దాకా తరిమికొట్టాడు. వాడు కూడా భయపడి ఆ పర్వతంలోని గుహలోకి ప్రవేశించాడు. వాడిని చంపాలని వాలి కూడా గుహలోకి వెళ్లాడు. నేను వినయంగా గుహద్వారం దగ్గర వుండిపోయాను. ఒక్క సంవత్సరం గడిచినా అన్న రాలేదు. నెత్తుటి వరదలు బిలమంతా నిండాయి. అది చూసి వాలి చనిపోయాడని బాధపడ్డాను. కొండ ఆకారంలో వున్న ఒక పెద్ద గుండును తెచ్చి గుహలోనుండి దైత్యుడు బయటకు రాలేక అక్కడే చావాలని వాకిటికి అడ్డంగా పెట్టాను. ఆ తరువాత కిష్కింధకు వచ్చి అన్న చనిపోయాడని నిశ్చయించి తారను, రుమను భార్యలుగా గ్రహించి, విస్తార రాజ్య భారాన్ని చేపట్టాను".

"ఆ పిమ్మట దానవుడిని చంపి వాలి నగరానికి చేరుకున్నాడు. నేనప్పుడు సంతోషంగా అతడి కాళ్లకు మొక్కి రాజ్యాన్ని అప్పగించాను. వాలి మాత్రం కోపంతో నన్ను ఇల్లు వెళ్లగొట్టి నన్ను చంపడానికి ప్రయత్నం చేశాడు. వాలిని తప్పించుకోవడానికి నేను నా మంత్రులతో సహా రేయింబవళ్ళు వేగంగా పరుగెత్తాను. వాలి కలహకాంక్షతో నన్ను వెంటాడాడు. అప్పుడు చక్రంలాగా గుండ్రంగా వున్న భూమండలం అంతా నాకు కాళ్లవాపు వచ్చేదాకా పరుగెత్తాను.

అప్పుడు స్పష్టంగా అద్దంలో చూసినట్లు భూమండలం అంతా చూశాను. తూర్పు దిక్కుగా పోయి, పెద్ద చెట్లు, సరస్సులు, నదులు, కొండలు, తూర్పు కొండ, పాలసముద్రం చూసి వెనక్కు తిరిగాను. వాలి తరుముతుంటే దక్షిణ దిక్కుగా పరుగెత్తాను. అటువైపుగా వింధ్య పర్వతాలలోని వృక్షాలను, చందనాలను చూశాను. పశ్చిమంగా పోయి అస్త్రాద్రి మొదలైనవి చూశాను. ఉత్తరంగా పోయి హిమాలయం, మేరువు, సముద్రం చూశాను. ఎక్కడకు పోయినా తలదాచుకునేందుకు జానెడు జాగా దొరకలేదు. అప్పుడు హనుమంతుడు ఇలా చెప్పాడు".

"పూర్వం మతంగమౌని వాలి విషయంలో కోపగించి ఈ పర్వతం ఆయన ఎక్కుటే తలపగిలి నేలకూలి మరణిస్తాడని శపించాడు. అది నాకిప్పుడు స్మృతికి వచ్చింది...అని చెప్పగా ఇక్కడికి వచ్చి స్థిరపడి సుఖపడ్డాను. శాప భయంవల్ల వాలి ఈ ఋష్యమూక పర్వతానికి, గుహకు రాడు. ఆ విధంగా ఆనాడు భూమండలమంతా కళ్లారా చూశాను".

సర్గ-47
సీత కనపడలేదని మరలి వచ్చిన వినతాదులు

సీతాదేవిని వెతకడానికి సుగ్రీవుడి ఆజ్ఞానుసారం పంపబడిన వానరులు ఆయన చెప్పినట్లే పోయి, దుర్గాలు, కొండలు, పట్టణాలు, నదులు, సరస్సులు, ఆకాశం, బయళ్లు, పొదలు, అడవి ప్రదేశాలు పగటి వేళల్లో వెతుకుతూ, రాత్రి సమయంలో తమకు దొరికినవి తింటూ నిద్రపోయేవారు. ఈ ప్రకారం భూమండలం అంతా వారు వెతికి నెల గడువు తీరగానే తిరిగి వెనక్కు వచ్చారు. తూర్పు దిక్కుకు పోయిన వినతుడు, ఉత్తర దిక్కుకు పోయిన శతవలి, పశ్చిమ దిక్కుకు పోయిన సుషేణుడు నెలకాగానే మరలి వచ్చి రామచంద్రుడితో, సుగ్రీవుడితో ఇలా చెప్పారు. (ఈ నెలరోజులు సుగ్రీవుడు రామచంద్రమూర్తి దగ్గరే వున్నాడు. కిష్కింధకు పోలేదు).

“సమస్తమైన పల్లెలు, ఊళ్ళు, కొండలు, వనాలు, గుహలు, ఏళ్ళు, మిద్రులు, పల్లాలు, పోవడానికి కష్టమైన స్థలాలు వెతికాం కానీ ఎక్కడా సీత కనబడ లేదు. అడవుల్లో భయంకరమైన జంతువులను చంపాం కానీ సీత జాడ లేదు. ఇది నిజం”.

ఇక హనుమంతుడు స్వభాసిద్ధంగా సాహసి. కార్యార్థమై ఎంతకైనా తెగించేవాడు. పండితుడు కాబట్టి ఆలోచించి కార్యసాధనకు దిగుతాడు. మహాబలవంతుల వంశానికి చెందినవాడు కాబట్టి ఆ వంశానికి కీర్తి తెస్తాడు కాని అపకీర్తి తేడు. వానరశ్రేష్టులలో రత్నంలాంటి వాడు. వీరందరికీ అసాధ్యమైన కార్యం ఆయనకు సుసాధ్యం. వాయుకుమారుడు కాబట్టి తండ్రి లాంటి వేగం, బలం అప్రతిహతంగా వున్నవాడు. దుష్ప్రవేశమైన స్థలం లేనివాడు.

కడుపులో దాచినా కనుక్కోగలడు. ఇక ఆయన పోయింది సీతాదేవి వున్న దక్షిణ దిక్కుకే. ఆయనతో కలిసి పోయినవారందరూ మహాశూరులే. కాబట్టి ఆయన సీతాదేవిని తప్పక చూసే వస్తాడని ఆయన రాకకొరకై అందరూ వేచి చూస్తున్నారు. ఆయన అలాంటి వాడనే కదా హనుమంతుడిని చివరగా పిలిచి ఆయనెలాగైనా కార్యాన్ని సాధించాలని సుగ్రీవుడు చెప్పాడు. ఆయన విషయంలో గడువుకు ప్రాధాన్యత ఇవ్వలేదు. కార్యం ముఖ్యం కాని కాలం కాదు.

సర్గ–48
అంగదాదులతో వింధ్యలో సీతను వెతికిన హనుమంతుడు

హనుమంతుడు సుగ్రీవుడు సూచించిన విధంగానే, అంగదుడితో, తారుడితో, ఇతరులతో కలిసి, ఆయన ఎక్కడి నుంచి వెతకమని ప్రారంభించమని చెప్పాడో అదే విధంగా వింధ్య పర్వతం దగ్గరకు పోయాడు. పోయి, కోతుల గుంపులతో తాను సహితం దుర్గాలు, కొండకొనలు, శిఖరాలు, అడవి ప్రదేశాలు, పెద్ద వృక్షాలు, గుహలు, భయంకరమైన కోటలు, మిగతా ప్రదేశాలు ఓర్పుగా తొందరపడకుండా సీతాదేవి కొరకై వెతికారు. సీత ఎక్కడా కనబడలేదు. గుహల సమూహాలతో నిండి ప్రవేశించవీలుకాని, సహించలేని ప్రదేశాల్లో కూడా చాలా కష్టపడి వెతికారు. అక్కడే దొరికిన పండ్లను తిన్నారు. జలాలలో, అడవుల్లో, మనుష్యులు లేనిచోట, సమస్త మృగాల ధ్వనులు వినిపించే అడవిలో వెతికారు. వెతుకుతున్న వానరులు పండ్లు, పూలు, ఆకులు లేని చెట్టుకలదానిని, నీళ్ళు లేని ఏరు కలదానిని, వేళ్ళు కూడా దొరకని దానిని, ఏనుగులు, మృగాలు, పులులు, అడవి దున్నలు, అడవిలో కనబడే మంచి పక్షులు లేనిదానిని, పాడుపెట్టినట్లు వున్నదానిని, చెట్లుకాని, పొదలు కాని, యోధులు కాని, తీగకాని లేని దానిని, ఒక ప్రదేశాన్ని చూశారు. అక్కడ నునుపైన వాసనకలిగి వికసించిన మెత్త తామరల్లో తుమ్మెదలు కూడా లేవు.

సత్యసంధుడు, తపస్వులలో శ్రేష్టుడు, కండుడు అనే మహర్షి పదహారేళ్ల వయసుకల ఆయన కుమారుడు ఆ అడవిలో తప్పిపోయి కనబడడం లేదు. ఆ కారణాన ఆ ధర్మాత్ముడు శపించినందువల్ల ఆ అరణ్యానికి ఈ గతి పట్టింది. జనులు చేర రానిదిగా, పక్షులు–మృగాలు లేనిదానిగా, జనహీనమైనదిగా, ప్రాణి రక్షణకు కావాల్సింది ఏదీ లేకుండా అయిందారణ్యం. నీటి తామరలు

కూడా మెట్ట తామరలయ్యాయి. ఆ పర్వత గుహలలో, నదుల్లో, అడవుల్లో, వానర సమూహాలు సీతాదేవిని కాని, ఆమెను అపహరించిన రాక్షసుడిని కానీ చూడలేక పోయారు. భయంకరమైన ఒక దానవుడు, దేవతలకు కూడా భయపడని వాడు కనబడగా వానరులు ధైర్యంగా యుద్ధానికి సన్నద్ధులయ్యారు. వాడినే వానరులు రావణుడని అనుకున్నారు. అప్పుడు అంగదుడు వాడిని అరిచేత్తో కొట్టడంతో వాడు నెత్తురు కక్కుకుంటూ కొండ కూలినట్లు కూలాడు. అప్పుడు వాళ్లు ఆ ప్రాంతంలో సీత ఉన్నదేమో అనుకుని బాగా వెతికారు. దాంతో పాటు మరొక అడవిని కూడా వెతికి అక్కడా సీతాదేవి కనబడక పోవడంతో శోకక్రాంతులై అంతా ఒక చోట చెట్టుకింద చేరి బాధపడుతూ కూర్చున్నారు.

సర్గ-49

కపులను ఉత్సాహపరచిన అంగదుడు

తోటి వానరులు వ్యసనపడుతూ ఒక చెట్టు కింద చేరి వుండడం చూసిన అంగదుడు, తానూ బడలికతో ఉన్నప్పటికీ, తనలాగే శ్రమపడిన వానరులను ఉత్సాహపరిచే మాటలు చెప్పాడిలా.

"దుర్గాలు చూశాం. గుహలు, కొండలు చూశాం. పొదలు చూశాం. పెద్ద-పెద్ద నదులను, అడవులను గాలించాం. దేవతా స్త్రీలాంటి సీత కానీ, ఆమెను ఎత్తుకు పోయిన రావణుడు కానీ కనపడలేదు. మనం బయల్దేరి చాలాకాలం గడిచింది. సుగ్రీవుడు ఆజ్ఞమీరినవాడిని క్షమించడు. కఠినంగా దండిస్తాడు. కాబట్టి మనమంతా గుంపుగా చేరి సీతను వెతకాలి. సోమరితనం లేకుండా, జాగుచేయకుండా, నిద్ర, దుఃఖం వదిలి సీతను వెతకాలి. తెలివి, ఉత్సాహం, వెతలు లేకపోవడం కార్యసిద్ధిని కలిగిస్తాయి. ఈ అడవిలో పోవడానికి దారిలేక పోయినా సీతను వెతకాలి. మనస్సులో విసుగు లేకుండా పట్టుదలతో పనిచేస్తే కార్యం సఫలమవుతుంది. ఇంతవరకూ మనం సీత కనపడలేదని బాధపడడం మానుదాం. బాధపడితే పనులు కావు. ఇది మనకు తగదు. సుగ్రీవుడు తీక్షణంగా దండించేవాడని మీకందరికీ తెలుసుకదా? గొప్ప మనస్సుకల రామచంద్రుడికి, సుగ్రీవుడికి మనం భయపడాలి. కార్యం కాకపోతే ఇరువురూ కోపించి దండిస్తారు. ఇది మీకు హితమని చెప్తున్నాను. మీకు ఇష్టమైతే మళ్లీ-మళ్లీ వెతుకుదాం. నేను చెప్పేది సరైంది కాకపోతే ఏం చేయాలో చెప్పండి".

అంగదుడి మాటలకు దప్పికతో వున్న గంధమాదనుడు ఇలా అన్నాడు.

"అంగదుడి మాటలు చాలా బాగున్నాయి. ఆయన చెప్పినది మేలైన విషయం

కాబట్టి, ఆయన చెప్పినట్లే, ఆ ప్రకారమే అన్ని పర్వతాలలో, గుహలలో వెతుకుదాం. సుగ్రీవుడు చెప్పిన మార్గాన దుర్గాలలో, గుహలలో, సమస్త భూమ్మీద వెతుకుదాం" అనగానే అంతా దక్షణాన వెతకడం ప్రారంభించారు. వెతుకుతూ పోయి-పోయి, శరత్కాల మేఘాల లాగా, తెల్లటి గుహలు, శిఖరాలు కలిగిన తెల్లటి కొండ ఎక్కి, కోద్రవనంలో, ఏడాకుల అరటి వనంలో అంతా గాలించారు. విస్తార పరాక్రమం కల ఆ వానరవీరులు తిరిగి-తిరిగి గుహలతో కూడిన పర్వతాలన్నీ వెతికి అలసట చెంది, వికల మనస్కులై కొండ కింద ఒక చెట్టునీడన కాసేపు సేద తీర్చుకుని, బడలిక తీరగానే మళ్లీ వింధ్య పర్వతం నాలుగు దిక్కులా వెతకసాగారు.

సర్గ-50
ఋక్షబిలం ప్రవేశించిన హనుమదాదులు

ఆంజనేయుడు తారుడితో, అంగదుడితో, కలిసి సింహాలు, పులులు కల ప్రదేశాలను, నదులను, కొండలను, పెద్ద ప్రవాహాలను, వెతికి వింధ్య పర్వతం మీద నైరుతిమూలగా కోతులతో వున్నప్పుడు సుగ్రీవుడు విధించిన గడువు అయిపోయింది. అప్పుడు హనుమంతుడు, ఒకరిదగ్గర ఇంకొకరుండే విధంగా, మైంద-ద్వివిదులను, అంగద, గజ, సుషేణ, గవాక్షు, గవయ, శరభులను, గంధమాదనుడిని నిలిపి, వరుసగా దక్షిణ దిక్కున వున్న దేశాలు వెతుకుతూ పోయారు. అలా పోతుంటే ఆకలిదప్పులకు చిక్కి సోలుతూ, నీటికి వెతకగా ఒకచోట, మయుడనే దానవుడి రక్షణలో వున్న ఋక్షబిలం అనే పేరుకల ఒక పెద్ద బిలాన్ని చూశారు వానరులు. ఆ బిలం లోపలి పోవడానికి వారికి మార్గం కనపడలేదు. బిలం కనిపించినా లోపలి పోలేక పోయినందుకు సంతాపించారు. అప్పుడు అడవుల లక్షణం బాగా తెలిసిన ఆంజనేయుడు ఈ విధంగా చెప్పాడు.

"దక్షిణ దేశాన వున్న అడవులన్నీ వెతికాం. సీతాదేవి కనబడలేదు. మనమంతా బాగా అలసిపోయాం. ఈ బిలం నుండి నీటిలో తడిసిన చక్రవాకాలు, క్రౌంచాలు, హంసలు, బెగ్గురులు బయటకొస్తున్నాయి. ఇక్కడ నీళ్లున్న బావో, మడుగో వుండడం నిజం. అదే కాకుండా బిలం బయట పచ్చటి చెట్లున్నాయి. నీళ్లులేని ప్రదేశంలో పచ్చటి చెట్లెలా వుంటాయి? కాబట్టి లోపలికి పోదాం". ఆయన ఇలా అనగానే, సూర్య-చంద్ర కాంతి సోకనిది, దట్టమైన చీకటి నిండినది, భయంతో గగుర్పాటు కలిగించేదైన ఆ బిలంలోకి ధైర్యం తెచ్చుకుని ప్రవేశించారు వానరులు. వారలా ప్రవేశించేటప్పుడు మృగాల, పక్షుల, పులుల, సింహాల గుంపులను చూసి వారు ఆశ్చర్యపోయారు. వారి తేజస్సు, కళ్ళు, గొప్ప

శౌర్యం వ్యర్థమైపోయింది. చీకటివల్ల, దారి తెలియకపోవడం వల్ల, వాయువేగం వృధా అయినప్పటికీ, త్వర–త్వరగా, భయంకరమైన, నానా వృక్షాలతో నిండిన ఆ బిలంలోకి పోతుంటే, ఒక ఆమడ దూరం దప్పికతో ప్రయాణం చేసిన తరువాత, వెలుతురున్న ఒక ప్రదేశాన్ని వానరులు చూశారు.

అక్కడ అగ్ని కాంతి, బంగారు వర్ణం కల మద్దులు, తాటి చెట్లు, చీకటి మ్రాకులు, చంపకాలు, పొన్నలు, పొగడలు, ఏరుమద్దులు, పున్నాగాలు, వెండిలాంటి పూలగుత్తులు, ఎర్రటి చిగుళ్ల తీగలు, బంగారు చెట్లు, బంగారు చేపలు, తాబేళ్లు నిండి వున్న నిర్మలమైన నీళ్ల తామర సరస్సులను చూశారు. అందమైన గృహాలను, పాన్పులను, పీతలను, పల్లకీలను, మేనాలను వానరులు చూశారు. బంగారు, వెండి, కంచు పాత్రలను, అగరు చందనాలను, ఇతర సువాసన పదార్థాలను, భుజించడానికి కావాల్సిన పదార్దాలను, కందమూలాలను, పండ్లను, తాగడానికి పనికొచ్చే పానకాలను, తియ్యటి తేనెలను, దివ్య వస్త్రాలను, దివ్య కంబళాలను, కృష్ణాజినం లాంటి చర్మాలను, అగ్నిహోత్రంతో సమానమైన కాంతి కల బంగారు తునకలకుప్పలను వానరులు చూసారు. వారంతా అలా–అలా వెతుకుతుంటే ఒక చోట నారచీరెలు, కృష్ణాజినం, వస్త్రంగా ధరించి తపస్సు చేస్తున్న ఒక స్త్రీ కనిపించింది. ఆమెను చూసిన వానరులు భయపడి, సమీపానికి పోకుండా దూరం నుండే చూస్తూ నిలబడిపోయారు.

సర్గ–51
స్వయంప్రభతో సంభాషించిన హనుమంతుడు

అప్పుడు హనుమంతుడు ఆ ముసలిదాని దగ్గరికి పోయాడు. చేతులు జోడించి, నమస్కారం చేసి, భయంతో–భక్తితో, "అవ్వా! నువ్వెవరివి? ఈ బంగారు బిలం, మణులు, ఇల్లు ఎవరివి చెప్పు. మేమంతా ఆకలిదప్పులతో అలసిపోయి, గాఢమైన అంధకారం కావడంతో, కళ్లు కానరాక భూమిలోని ఈ బిలాన్ని చూసి, ఇక్కడికి ప్రవేశించి, ఇక్కడున్న ఆశ్చర్యకరమైన పదార్థాలను చూసి, మరలిపోవడానికి దిక్కు తెలియక, ఏమీ చేయడానికి తోచక దుఃఖపడుతున్నాం. లేత సూర్యుడితో సమానమైన బంగారు చెట్లు, పవిత్రమైన భోజన పదార్థాలు, ఈ పండ్లు, ఈ విమానాలు, ఈ వెండి ఇండ్లు, రత్నమయమైన రంధ్రాలు, కిటికీలు, ఫలాలు, పుష్పాలు, పరిమళాల బంగారు చెట్లు, నిర్మల జలాలు, బంగారు కమలాలు, ఎవరి తపోమహిమవల్ల కలిగాయి? బంగారు చేపలు, తాబేళ్లు కలిసి తిరుగుతున్నాయి. ఇదెలా సంభవం? నీ గురించి, నీ మహిమ గురించి, ఎవరి అసమాన తపస్సు వల్ల ఇవన్నీ కలిగాయో దయచేసి చెప్పు".

హనుమంతుడికి ఋక్షబిల వృత్తాంతం చెప్పిన స్వయంప్రభ

హనుమంతుడు ఈ విధంగా అడగ్గా, సర్వప్రాణుల మేలుకోరే సాధునిష్ట అయిన స్వయంప్రభ ఇలా జవాబు చెప్పింది.

"మాయలుకల రాక్షస ప్రభువైన మయుడు తన అద్భుత శక్తితో దీన్ని నిర్మించాడు. రమ్యమైన ఈ బంగారు గృహాన్ని నిర్మించినవాడు రాక్షసులకు విశ్వకర్మ అయిన దనుజ శ్రేష్టుడు. అతడు వేయేండ్లు అడవిలో తపస్సు చేసి

బ్రహ్మ చేత శుక్రుడి సొత్తైన శిల్ప విద్యనంతా వరంగా పొంది అన్ని కోరికలు నెరవేర్చుకునే శక్తికలవాడై ఈ మనోహరమైన వనాన్ని కల్పించి ఇక్కడ వుండసాగాడు. దానవుడైన మయుడు దేవతాస్త్రీ అయిన హేమతో కలిసి వున్నందుకు కోపగించిన ఇంద్రుడు వజ్రధారతో అతడిని చంపాడు. ఆ మయుడు హేమకు ఈ బంగారు గృహాన్ని, వనాన్ని ఇచ్చాడు. ఇక్కడ సమస్త సుఖాలున్నాయి. హేమకు దీన్ని మయుడిస్తే మరి నేనెందుకు ఇక్కడ వుంటున్నానని అడుగుతావేమో? ఆటపాటల్లో నేర్పరైన హేమకు నేను ప్రేమపాత్రమైన సఖిని. ఆమెదే యీవనం. ఆమెవల్ల నేను దీన్ని వరంగా పొంది దీన్ని రక్షిస్తున్నాను. నేను మెరుసావర్ణి కూతురును. నా పేరు స్వయంప్రభ. ఓ వానరుడా! మీరెవరు? ఈ అడవుల్లో, దుర్గాలలో తిరగడానికి కారణం ఏమిటి? ఎవరికొరకు తిరుగుతున్నారు? ఎలా దేన్నీ మీరు చూడగలిగారు? ఈ మూలాలు, ఫలాలు, ఇతర పదార్థాలు, పానీయాలు తృప్తి తీరా తినండి, తాగండి. శ్రమ తీరిన తరువాత మీ వృత్తాంతం చెప్పండి”.

(రమ్యమైన ఈ బంగారు గృహాన్ని నిర్మించినవాడు రాక్షసులకు విశ్వకర్మ అయిన దనుజశ్రేష్టుడు. అతడు వెయ్యేండ్లు తపస్సు చేసి బ్రహ్మచే వరాలు పొందాడు. విశ్వకర్మ అంటే కంసాలి పని, వడ్రంగి పని, శిల్పపు పనుల లాంటివి అన్నీ చేసేవాడు. దేవతలకు ఈ పని చేసేవాడిని విశ్వకర్మ అంటారు. దేవతలకు విశ్వకర్మ ఎలాగో, అలాగే, దానవ రాక్షసులకు శిల్పపు పని చేసేవాడిని దానవ విశ్వకర్మ అంటారు. వీడు మయుడు. వీడు తన శక్తితో ఆద్భుతమైన పనులు చేయగలడు. కాబట్టి వీడి శక్తికి మాయ అనే పేరు వచ్చింది. మాయ అంటే ఆద్భుతమైన శక్తి అని అర్థం. మాయ అంటే అసత్యం అని అర్థం కాదు. మయ శబ్దం ఎవరిదో ఒకరి పేరు కాదు. దానవులకు, రాక్షసులకు, ఈ పనిచేసేవారందరికీ అదే పేరు వుంటుంది. ఇది ఉద్యోగ నామధేయం లాంటిది. ఇక్కడ ఈ మయుడు ఇంద్రుడిచే చంపబడ్డాడు. మయుడనేవాడు ద్వాపర యుగంలో పాండవులకు సభ నిర్మించాడని చెప్పడం జరిగింది. దేవశిల్పికి విశ్వకర్మ లాగే రాక్షస శిల్పికి మయుడని పేరు. త్రిపురాలు కల్పించినవాడు మయుడే. అవి శివుడివల్ల దహించిన తరువాత ఇక్కడికి వచ్చి ఈ గృహం ఏర్పరుచుకున్నాడని అంటారు. దానవ శిల్పి మయుడు కాదు).

సర్గ–52

హనుమంతుడిని కపుల వృత్తాంతం అడిగిన స్వయంప్రభ

కపుల చరిత్ర, ఇతర వివరాలు చెప్పమని అడిగిన తపస్విని స్వయంప్రభ "వానరులారా! మీరు ఫలాలను భక్షించి, బడలిక తీరిన తరువాతే నేను వినవచ్చని అనుకుంటే, మీ చరిత్ర చెప్పండి" అని అంటుంది. అప్పుడు హనుమంతుడు వున్నదున్నట్లు చెప్పడం ప్రారంభించాడు ఇలా.

"ఇంద్ర, వరుణులతో సమానుడైన దశరథ మహారాజు కుమారుడు రామచంద్రుడనేవాడు ప్రీతితో తన తమ్ముడు లక్ష్మణుడితో, తన భార్య విదేహరాజు కూతురు సీతాదేవితో దండకారణ్యంలో తిరుగుతున్నప్పుడు రావణుడనే రాక్షసరాజు ఆమెను బలవంతంగా దొంగతనంగా ఎత్తుకుపోయాడు. ఆ రామచంద్రుడి స్నేహితుడు, వానరరాజు సుగ్రీవుడు సీతాదేవిని, రావణుడిని వెతకడానికి మమ్మల్ని దక్షిణ దిక్కుగా పంపితే మేం వచ్చాం. దక్షిణం అంతా వెతికాం. ఆకలి,దాహం మమ్మల్ని బాధపెట్టాయి. వేగం తగ్గించి ఒక చెట్టు కింద కూర్చుని బాధపడసాగాం. చాలాకాలం ఇలా ఏమీ చేయడానికి తోచక వున్నప్పుడు, ఆలోచిస్తున్న సమయంలో, ఈ బిలం కనిపించింది. దీనిలో నుండి నీటితో తడిసిన బెగ్గురులు, హంసలు, లకుముకులు గుంపులు–గుంపులుగా రావడం చూశాం. ఇది గమనించిన నేను ఈ బిలంలో ప్రవేశించుదాం అన్నాను. ఆకలిదప్పులతో చావడం కంటే మించిన అపాయం ఏమొస్తుందని సాహసించి అందరం అంగీకరించి దట్టమైన చీకట్లో ఈ బిలంలోకి దూరాం. ఆ విధంగా నీ సమీపంలోకి రావడం జరిగింది. ఆకలిదప్పులతో ప్రాణం పోయే సమయంలో నీ పుణ్యాన నువ్విచ్చిన ఫలమూలాలు తిని మా బడలిక తీర్చుకున్నాం. ప్రాణాలు తిరిగి వచ్చాయి. మా ప్రాణాలు రక్షించావు. కాబట్టి నువ్వు చేసిన మేలుకు

మరుమేలు చేయాలనుకుంటున్నాం. మేము చేయదగ్గ కార్యం చెప్పు. ఆ పనిని నెరవేరుస్తాం".

ఇలా హనుమంతుడు చెప్పగానే సంతోషించి, సర్వం తెలుసుకున్న స్వయంప్రభ ఇలా అంది. "మీ మాటలు విని చాలా సంతోషం కలిగింది. నేను ధర్మం అనసరిస్తూ పరులకు ఉపకారం చేస్తుంటాను. కాబట్టి మీరు నాకు చేయాల్సిన కార్యం ఏదీ లేదు". ఇలా ఆమె అనగా హనుమంతుడు ఆ స్త్రీతో ఇలా అన్నాడు.

సర్గ-53

కపులను బిలం నుండి బయటకు చేర్చిన స్వయంప్రభ

"వానరరాజైన సుగ్రీవుడు విధించిన గడువు మేం ఈ బిలంలో వుండడం వల్ల మించిపోయింది. మమ్మల్ని ఈ బిలం నుండి మళ్లీ భూమ్మీదకు చేర్చు. గడువు తీరింది కాబట్టి దానితోపాటు ఆయుస్సు తీరినవారిమే కనుక మామీద నీ కరుణాకటాక్షాలు నిలిపి నీ దాసులను రక్షించు. ఓ ధర్మాత్మురాలా! మేం తప్పకుండా చేయాల్సిన కార్యం ఎంతో వున్నప్పటికీ, ప్రవేశించనలవికాని ఈ బిలంలోకి ప్రవేశించి ఇక్కడ చిక్కిన కారణాన ఏమీ చేయలేకపోయాం. తల్లీ! ఇది సత్యం". అని హనుమంతుడు చెప్పగా స్వయంప్రభ ఇలా అంది.

"దీనిలో ప్రవేశించి మళ్లీ ప్రాణాలతో వెళ్లడం అసాధ్యం అని నా అభిప్రాయం. కాబట్టి నా తపఃఫల బలంతో మిమ్మల్ని కాపాడుతాను. కళ్ళు మూసుకోండి. కళ్లుమూసుకోకపోతే మీరిక్కడనుండి వెళ్లడం అసాధ్యం". ఇలా ఆమె అనగానే వానరులంతా బిలం నుండి వెళ్లిపోవడానికి తొందర పడుతున్నందున అందరూ చేతులతో కళ్లుమూసుకున్నారు. చేతులతో కళ్లుమూసుకున్న వానరులందరినీ నిమిషంలో బిలం నుండి దాటించింది ఆ తపశ్శాలిని. అప్పుడు వాళ్లను సమాధానపరచి, "వానరులారా! ఇది వింధ్యపర్వతం. ఇదే ప్రస్రవణం అనే పెద్ద కొండ. వానరులారా! ఇదే సముద్రం. మీకు శుభం కలుగుగాక. నేను నా ఇంటికి పోతాను" అని చెప్పి స్వయంప్రభ వెళ్లిపోయింది.

(వింధ్యకు దక్షిణ దేశంలో తూర్పు-పడమర సముద్రందాకా వుండే కొండలన్నీ వింధ్యపర్వతశాఖలే. వాటన్నింటికీ వింధ్యపర్వతం అనే పేరే వుంటుంది. హిమవంతం మొదలు వింధ్య వరకు హిమవంతమనీ, వింధ్య

మొదలు దక్షిణ సముద్రం దాకా వింధ్య అని అంటారు. స్వయంప్రభ సర్వజ్ఞ అని అనుకోవాలి. ఆ కారణాన ఆమెకు భూత-భవిష్యత్-వర్తమానాలలో ఏం జరుగుతుందో తెలుసు. కాబట్టి ఎక్కడ వాళ్లను వదిలితే భవిష్యత్ కార్యం నెరవేరుతుందో అక్కడే, సముద్రతీరంలో విడిచిందని అర్థం చేసుకోవాలి)

భయంకరమైన ఆలలతో ఆవలి ఒడ్డు కనబడకుండా విపరీతమైన ధ్వనితో కూడివున్న ఆ సముద్రాన్ని వానరవీరులంతా ఆశ్చర్యంగా చూశారు.

గడువు దాటినందుకు విచారిం చిన అంగదుడు

అక్కడ పూచిన చెట్లను, తీగలను, ఫలించే వృక్షాలను చూసి వసంతం సమీపించిందని భావించిన కపిసేన గడువు మీరుతున్నందుకు భయపడి నేలకూలారు. అంగదుడు గడువు మీరిపోయిందనీ, వచ్చిన పని కాదాయేననీ భయపడుతున్న వృద్ధులైన, శిష్టులైన వానరనాయకుల దగ్గరికి పోయి వారిని ఓదార్చి వారికి ధైర్యం కలిగేట్లు ఇలా అన్నాడు.

"మనమంతా సుగ్రీవుడి ఆజ్ఞానుసారం బయల్దేరాం. ఒక నెలరోజులపాటు బిలంలోనే చిక్కుకు పోయాం. ఆశ్వయుజ మాసంలో ప్రారంభించాం. కాలం మించిపోయింది. నీతికోవిదులారా! ఇక చేయాల్సిన పని చెప్పండి".

(ఆశ్వయుజ మాసంలో ప్రారంబించం అంటే, సీతాన్వేషణకు ప్రయత్నం మొదలు పెట్టినట్లు లెక్క. ఆశ్వయుజ మాసం చివర్లోనే కదా తొలిసారి వానరులను పిల్చుకొని రమ్మని పదిహేను రోజులు గడువిచ్చిన సుగ్రీవుడు. వీరిని దక్షిణ దిక్కుగా వెతకమని పంపడం జరిగింది. మార్గశిరం-పుష్యంలో రమ్మని సుగ్రీవాజ్ఞ. ఆ నెల ముందే గడిచింది. కాబట్టి ఇది రెండో నెల. అదీ గడిచిందని అర్థం చేసుకోవాలిప్పుడు. ఇప్పుడు మాఖమాసం చివర్లోనో, మధ్య భాగంలోనో వుండాలి బహుశా. ఒక నెల బిలంలోనే గడిచిపోయినందున మాఖమాసం పోయి ఫాల్గుణ మాసం మొదలైంది. ఆ కారణాన గడిచినదానికి వగచిన లాభంలేదు. కాబట్టి జరగాల్సిందేమిటో చెప్తున్నాడు అంగదుడు).

"మీరంతా రాజుకు విశ్వాసపాత్రులైన సేవకులు. మీరెలాగైనా కార్యం సాధిస్తారని సుగ్రీవుడి నమ్మకం. ఇక మీరేమో ఎలాగైనా రాజుకు హితం చేయాలన్న పట్టుదలకలవారు. ఏ కార్యాన్నైనా సాదించే నేర్పరులు. ప్రసిద్ధమైన పరాక్రమం కలవారు. ఇలాంటి మీరంతా రాజాజ్ఞప్రకారం, రామకార్యం నెరవేర్చడానికి, నామీద ప్రేమతో నన్ను ముందుండే వాడిగా చేశారు. మీరెలాగైనా

కార్యం నెరవేర్చడానికి తగినవారనుకుని, మనకేం భయమని తలచి, ముఖ్యుడిగా వుండడానికి అంగీకరించి మీవెంట వచ్చాను. ఇంత చేసికూడా వచ్చినపని చేయకుండా మరలిపోతే సుగ్రీవుడు మనల్ని తునకలు–తునకలుగా నరుకుతాడు. ఇందులో సందేహం లేదు. సుగ్రీవాజ్ఞ నెరవేర్చకుండా బతికి సుఖపడేవాడు ఎవడు? నియమించిన గడువుకాలం దాటిపోయింది. మనం బాధపడి చేయగలింది ఏమీలేదు. కాబట్టి మనకిప్పుడు ప్రాయోపవేశం ఒక్కటే మార్గం అని తోస్తున్నది''.

భేదోపాయోక్తులు వచించిన అంగదుడు

"అనశనవ్రతమైన ప్రాయోపవేశం సాధించి ప్రాణం విడవాల్సినంత భయం ఏం వచ్చిందంటారా? సుగ్రీవుడు స్వభావసిద్ధంగా క్రూరుడు. దానికితోడు ఇప్పుడాయన రాజు. అధికార బలం వచ్చింది. రాముడి భార్య వార్త చెప్పకపోతే మనల్ని చంపుతాడు కాని క్షమించి వదలడు. కాబట్టి అక్కడికి పోయి చావడం కంటే ఇక్కడే చావడం మంచిది. చచ్చేవాళ్లం ఈ అడవుల్లో దిక్కులేని చావెందుకు చావాలి? అక్కడికే పోయి చద్దామంటారా? మనమంతా మరలిపోతే మన ధనం, భార్యలు, బిడ్డలు, ఇండ్లు అనుభవించవచ్చని అంటారేమో? అంతదాకా సుగ్రీవుడు పోనివ్వడు. పోయిన వెంటనే చంపుతాడు. అక్కడికి పోయి అవమానపడి ఘోరమైన చావు చావడం కంటే ఇక్కడే చావడం మేలుకదా! 'అయ్యా! నువ్వు రాజంతటి వాడివి. రాకుమారుడివి. యువరాజువి. నిన్ను చంపుతాడా? పుత్రవాత్సల్యంతో చంపడు. నిన్ను చంపనప్పుడు మమ్మల్ని కూడా చంపడు' అని అంటారా? అలాకాదు. నాకు యౌవరాజ్యం ఇచ్చినవాడు సుగ్రీవుడు కాదు. రామభద్రుడు. ఆయన ఆజ్ఞ మీరలేక తనకిష్టం లేకున్నా నన్ను యువరాజు చేశాడు. నామీద సద్గుణభద్రుడైన రామభద్రుడికి దయ వున్నదికాబట్టి నన్నప్పుడు ఏమీ చేయలేక వూరకున్నాడు. ఇప్పుడు సమయం దొరికింది కాబట్టి ఆయన ఆజ్ఞ మీరానన్న నెపంతో నన్ను చంపుతాడు. అక్కడికి పోయి చంపబడితే నా మిత్రులు యావజ్జీవం నాకొరకు దుఃఖపడతారు. కాబట్టి అక్కడికి పోయి చావడం కంటే పుణ్యస్థలమైన ఈ సముద్రతీరంలో చావడం మేలు''

అంగదుడిలా చెప్పడంతో వానరశ్రేష్టులు దుఃఖపడుతూ అతడితో ఇలా అన్నారు.

అంగదుడి మాటలకు ఆమోదం తెలిపిన కపులు

"అంగదా! నువ్వు చెప్పినట్లు సుగ్రీవుడు స్వభావసిద్ధంగా చాలా కఠినమైనవాడు. రామభద్రుడేమో స్వభావంగా మంచివాడేకాని తన భార్య విషయంలో, ఆమె మీద ప్రేమతో బాధపడుతున్నాడు. కాబట్టి సీత కనపడలేదని మనం చెప్పితే రాముడిని సంతోషపరచడానికి సుగ్రీవుడు మనల్నందరినీ చంపుతాడు. అపరాధం చేసినవారు రాజు ఎదురుగా పోకూడదు. కాబట్టి సీతను ఇంకా వెతుకుదాం. కనపడితే సుగ్రీవుడి దగ్గరికి పోదాం. కనబడకపోతే యమపురికి పోదాం".

వానరులు ఆ ప్రకారం చెప్పగా భయపడుతున్న వారి మాటలు విన్న తారుడు ఇలా అన్నాడు. "మీరెందుకు దుఃఖపడతారు. చావాల్సిన పనిలేదు. మనమంతా ఈ బిలంలో మళ్లీ ప్రవేశించుదాం. మనకు కావాల్సిన చెట్లు, తినడానికి భోజ్యాలు, కందమూలఫలాలు, పరిశుద్ధమైన వనం, పరిశుద్ధమైన నీరు అక్కడ వున్నాయి. అవేకదా మనకు కావాల్సింది. భయం మాట కూడా అక్కడ వినపడదు. అక్కడ మనముంటే సుగ్రీవుడే కాదు, ఇంద్రుడైనా, ఇంద్రసమానుడైన రామచంద్రుడైనా మనల్ని చేరలేడు".

కిష్కింధకు పోవాల్సిన పనిలేదు....ఇక్కడే వుందాం...అని అంగదుడు చెప్పిన మాటలకు అనుకూలంగా తారుడు చెప్పిన మాట విన్న వానరులందరూ ఎలా చేస్తే మనకు కీడు కలగదో అలాగే చేద్దామని అన్నారు.

సర్గ–54
అంగదుడిని సమాధానపర్చిన హనుమంతుడు

అంగదుడు, తారుడు ఇలా మాట్లాడడం, దానిని వానరులు ఆమోదించడం గమనించిన హనుమంతుడు, సుగ్రీవుడి రాజ్యాన్ని అంగదుడు హరించాడని భావించాడు. (తారుడు చెప్పిన మాటలను అంగదుడు, ఇతరులు నిషేధించలేదు. అంటే వారందరూ బిలంలోకి ప్రవేశించి అక్కడో, బయట అడవులలోనో వానర రాజ్యం ఒకటి ఏర్పరుచుకుంటారు. అప్పుడు ఏకంగా వున్న వానర రాజ్యంలో ద్వైవిధ్యం పుటుతుంది. అప్పుడు సుగ్రీవుడి రాజ్యం చెడిపోతుంది. సుగ్రీవుడిని విభేదించేవారు, వాలి పక్షపాతులు ఇక్కడికి చేరుతారు. అదలా వుండగా ప్రారంభించిన రామకార్యం చెడిపోతుంది. ఈ విధంగా ఆలోచించ సాగాడు హనుమంతుడు).

అంగదుడు పద్నాలుగు గుణాలు, ఎనిమిది అంగాలు కల నిర్మల బుద్ధి, నాలుగు రకాల బలసంపద కలవాడని హనుమంతుడు తెలుసుకున్నాడు. అలాంటి అంగదుడిని ఓదార్చడానికి హుమంతుడు పూనుకున్నాడు. "ఏమీ అంగదా! నువ్వీవానరులను నీ చేతికిందకు తీసుకుని ప్రత్యేక వానరరాజ్యం స్థాపించాలని ఉపాయంతో వున్నావా? ఎలా చేస్తావో నేనూ చూస్తాను. వీరంతా రామకార్యం కొరకు నీవెంట వచ్చారు కాని నీతోపాటు కలకాలం ఇక్కడ తమ ఇండ్లు–వాకిళ్లు, భార్య–బిడ్డలను వదిలి ఈ అడవిలో అల్లాడడానికి వచ్చారని అనుకుంటున్నావా? వీరంతా నీకు లోబడ్డారనుకో! అలాగైతే, నేనిప్పుడే పోయి రామలక్ష్మణులను, సుగ్రీవుడిని, తక్కిన సైన్యాన్ని మీ దురుద్దేశం చెప్పి ఇక్కడికి పిలుచుకొస్తాను. ఇప్పుడు మనం చేసింది అబుద్ధి పూర్వకాపరాధం. అప్పుడు మీరు చేయబోయేది రాజద్రోహం. బుద్ధిపూర్వకాపరాధం. కాబట్టి ఇప్పుడు

దండం తప్పవచ్చు కాని అప్పుడు దండం తప్పదు. అప్పుడు నువ్వు, నీరాజ్యం ఏం కాబోతున్నదో ఆలోచించు". అని కోపంగా, ఉపాయంగా, భయం కలిగేట్లు చెప్పి మళ్లీ సామమార్గంలో ఇలా చెప్పాడు.

"అంగదా!నువ్వు యుద్ధంలో నీ తండ్రి కంటే నేర్పుకలవాడివి. కపిరాజ్యం అంతా తండ్రిలాగే భరించే శక్తికలవాడివి. అయినా ఒక్కటి ఆలోచించు. ఈ కోతులు ఎప్పటికీ చపల చిత్తులే. ఇప్పుడున్న బుద్ధి ఇంకాసేపటికి వుండదు. ఇలాంటి వీళ్లు తమ పెళ్లాలను, పిల్లలను, బంధువులను వదిలి కలకాలం ఇక్కడ నిన్నెందుకు కొలుస్తారు. ఇక్కడ వున్నవారంతా నీకు లోబడి వుంటారని అనుకుంటున్నావేమో? అది పొరపాటు. సుగ్రీవుడిని సుహోత్రుడు, నీలుడు, జాంబవంతుడు ఎలా వదలరో అలాగే నేనూ వదలను. నువ్విక్కడ నీ ప్రయత్నం మొదలు పెట్టగానే మేం సుగ్రీవుడి దగ్గరికి పోయి అంగదుడు ఇలా చేస్తున్నాడని చెప్పేవాళ్ళమే. వీరిని నువ్వు ఏవిధంగానైనా నీలో కలుపుకోలేవు. నువ్వు ఇంకోటి ఆలోచించడం లేదు. ఇక్కడ నీకున్న సేనకంటే అక్కడ సుగ్రీవుడికి ఎక్కువ సేనకలదని తెలుసుకో. మూడు భాగాలు అక్కడ వుంటే ఇక్కడ ఒక్క భాగం వుంది. కాబట్టి నీవల్ల సుగ్రీవుడికి భయం లేదు. బలవంతుడితో విభేదించి బలహీనుడు బతకగలడా?"

"ఇక్కడ ఇప్పుడు ఈ బిలంలో వుండడం మేలని చెప్పుకుంటుంటే విన్నాను. ఈ గుహలో ప్రవేశించి ఇంద్రుడు వజ్రాయుధంతో మయుడిని చంపాడని స్వయంప్రభ చెప్పగా విన్నాం కదా? ఇంద్రుడు చేసింది స్వల్ప కార్యం. రామచంద్రమూర్తి దాకా పోవాల్సిన పనిలేదు. లక్ష్మణుడే తీవ్రబాణాలు ప్రయోగించి బిలం పైభాగం ఎగిరిపోయి బిలాన్ని దొప్పలాగా కనబడేట్లు చేయడా? అప్పుడు వీరంతా ఎక్కడికి పోతారు? బోనులో చిక్కినట్లు చిక్కరా? వీరిక్కడ వున్నారని వారికెట్లా తెలుస్తుందని అంటారేమో? మేమంతా వెళ్లి వారికి చెప్పి మాతో తెస్తాం. ఇంద్రుడి దగ్గర ఒక్క వజ్రాయుధమే వుంది. రఘువంశదీపకుడైన లక్ష్మణుడి దగ్గర వజ్రాయుధంలాగా, పిడుగులాగా, కులపర్వతాలనైనా భేదించే తీక్షణాలైన బాణాలెన్నో వున్నాయి. కాబట్టి ఈ చిన్న గుహను భేదించడం ఆయనకు పెద్ద కష్టం కానేకాదు. అంగదా! వీరిమాటలు విని నువ్వు బిలంలో వున్నా, వారిని నమ్మి నువ్వు పినతండ్రితో పగబూనినా, వీరు చివరిదాకా నీతో వుండకుండా వెళ్లిపోతారు. నువ్వొక్కడివే మిగులుతావు. నువ్వు బుద్ధిమంతుడివి. ఆలోచించి చూడు".

“వానరులు నిలవరు...వెళ్లిపోతారని....నాకెలా తెలుసంటావా? భార్యాబిడ్డలను తలచుకుంటూ, ఇక్కడ తినడానికి కందమూలాలు, తాగడానికి నీళ్లు లేక, దినమొక గండంగా శ్రమపడుతూ, దుఃఖస్థానమైన ఈ శయ్యలమీద, రాళ్లమీద, రప్పలమీద, నీలమీద, గడ్డిమీద ఎండనక-వాననక నిద్రిస్తూ, ఆ శ్రమపడలేక నిన్ను వదిలి వెళ్లిపోతారు. సుఖజీవనానికి, సుఖ శయ్యలకు, బంధువుల తోడుకు, అలవాటుపడ్డవారు ఈ ఘోరారణ్యాలలో నీకోసం ఎందుకు కష్టపడతారు? నీ మేలుగోరు బంధువులు, నీ స్నేహితులు, నిన్ను వదిలిపోగా నువ్వు ఒంటరివాడివై భయంతో గాలికి గడ్డిపోచ వణికినట్లు ఏ సమయంలో ఏమవుతుందో అని భయపడతావు. ఉత్తభయం మాత్రమే కాదు. నీకు కీడుకూడా కలుగుతుంది. రాజుచెప్పిన పని చేయని నిన్ను భయంకరమైన లక్ష్మణుడి బాణాలు నిన్నెందుకు సంహరించవో ఒక్కసారి ఆలోచించు. నీ విరోధ బుద్ధి మానుకుని వినయంగా మా వెంట కిష్కింధకు రా. ఇదివరకులాగే నిన్ను నీ పినతండ్రి యువరాజుగా నియమిస్తాడు. ఇది నాకెలా తెల్సంటావా? నేను నీ మేలు కోరేవాడినేకాని కీడు కోరేవాడినికాదు. నీ తండ్రి ఆయనకు కీడుచేద్దామని అనుకున్నందువల్లే ఆయనతో విరోధించాడు కాని, నీమీద ఆయనకు ఎలాంటి ద్వేషం లేదు. నిన్ను హింసించడంవల్ల ఆయనకు కలిగే లాభం ఏమీలేదు. ధర్మం మీద అభిలాష వున్నవాడు కాబట్టి అధర్మమార్గంలో నిన్ను వధించడు. దృఢమైన వ్రతంకలవాడు. నిర్మలమైన మనస్సుకలవాడు. ప్రతిజ్ఞ తప్పనివాడు. నామాట నమ్ము. నీకెప్పుడూ సుగ్రీవుడు కీడుచేయడు. ఇదేకాదు...నీ తల్లిమీద అత్యంత ప్రేమ కలవాడు. ఆమెకు దుఃఖం కలిగే పనేదీ చేయడు. ఆమెకొరకు జీవించి వున్నాడు. ఆయనకు నువ్వుతప్ప సొంత కొడుకులు లేరు. నిన్ను చంపి వంశనాశనం చేసుకుంటాడా? కాబట్టి యువరాజా! కిష్కింధకు పోదాం”.

సర్గ-55

సుగ్రీవుడి గుణాలను నిందించిన అంగదుడు

హనుమంతుడిలా సుగ్రీవుడిని ప్రశంసించి చెప్పగా వినయంగా, రాజగౌరవంగా, ధర్మంగా వున్న ఆంజనేయుడి మాటలు విన్న అంగదుడు తమ మనసులో మాట మెల్లగా ఆయనకు చెప్పాడిలా.

"సుగ్రీవుడి మంత్రివి కాబట్టి నువ్వాయన్ను ఎంతైనా మెచ్చుకోవచ్చు కాని బుద్ధినిలకడ, ఆత్మపారిశుద్ధ్యం, మనస్సు పారిశుద్ధ్యం, ఋజుత్వం, దయ, ధైర్యం, పరాక్రమం, ఇవన్నీ సుగ్రీవుడిలో లేకపోవడం అనేది కొత్త విషయం కాదు. ఎందుకంటావా?.....తల్లిలాగా పూజించాల్సిన దాన్ని, తల్లితో సమానమైన దాన్ని, ఆమె భర్త జీవించి వుండగా తన భార్యగా గ్రహించిన వాడెలాంటి నీచుడో నువ్వే ఊహించు. బయటనుండి శత్రువులు రాకుండా తనను కాపలా వుండమని అన్న చెప్పినప్పటికీ, ఆ బిలద్వారాన్నే మూసిన తమ్ముడు ధర్మ మార్గం తెల్సినవాడా? చేతిలో చేయి వేసి ప్రమాణం చేసి, తనపని చక్కపరిచి తన ప్రాణం కాపాడిన ఋజుమనస్కుడు రామచంద్రుడినే మరచిపోయినవాడు మరింకెవరి మేలు కోరగలడు? ఇది కృతఘ్నుతకు దృష్టాంతం. సీతను వెతకడానికి వానరులను పంపడంలో సుగ్రీవుడి ఉద్దేశం, లక్ష్మణుడు తనను చంపుతాడేమోనన్న భయమేకాని, పంపకపోతే ధర్మహాని కలుగుతుందన్న భావన కానేకాదు. ఇలాంటివాడు ధర్మమార్గంలో నడుస్తాడా?"

"ఈ విధమైన చపల చిత్తుడుని, స్మృతిలేనివాడిని, పాపాత్ముడుని, కృతఘ్నుడుని సద్వంశంలో పుట్టి గౌరవంగా బతకాలనుకున్న వాడెవరూ నమ్మరు. ఆయన తనకొడుకుకు రాజ్యం ఇస్తాడు కాని విరోధి కొడుకైన నన్ను

ప్రాణాలతో కూడా వుండనిస్తాడా? ఆయనకు ఇప్పుడు కొడుకుల్లేకపోయినా ముందు–ముందు పుట్టరని ఏమిటి? కాబట్టి నేను బతికితే రాజ్యం ఆశిస్తాడని నన్ను చంపుతాడు. నా మనసులో వున్న ఆలోచనంతా చెప్పాను. ఈ కారణాన నేను స్పష్టంగా అపరాధం చేసినట్లే. దీనుడిని. నా రక్షణలో శక్తిలేనివాడిని. కాబట్టి నేను జీవించి దిక్కులేనివాడిలాగా కిష్కింధలో ఎలా వుండగలను? ప్రాణం తీపికదా? అనాధుడిగానో, సనాధుడిగానో పడివుండమని అంటే జీవించి వుండడం సాధ్యంకాదు. ఎందుకంటే మీలో ఎవరో ఒకరు సుగ్రీవుడికి నా ఆలోచన గురించి చెప్తారు. ఆ కారణాన నన్ను అతడు రహస్యంగానైనా బంధిస్తాడు, ఏవిధంగానైనా దండిస్తాడు. క్రూరకార్యాలు చేసేవాడు, మోసగాడు, దయలేనివాడు కాబట్టి సుగ్రీవుడు నేనెక్కడ రాజ్యానికి ప్రభువునైతానో అని నన్ను బతకనీయడు. అక్కడికి వచ్చి చెరసాలలో పడి చావడం కంటే ఇక్కడ ప్రాయోపవేశం చేయడం మేలు".

అని చెప్పి అంగదుడు తోటి వానరులతో, "వానరులారా! మీరు మీ ఇష్టం వచ్చినట్లు మీమీ ఇండ్లకు పోవచ్చు. ఆజ్ఞ ఇస్తున్నాను. నేను కిష్కింధకు రాను. నేనిక్కడే చావడం క్షేమం. శుభకరమైన బలంతో కూడిన రామలక్ష్మణులకు నమస్కరించి కుశలం అడిగానని చెప్పండి. ప్రభువు పినతండ్రైన సుగ్రీవుడికి నమస్కరించి కుశలం అడిగానని చెప్పండి. మా తల్లి రుమాదేవి క్షేమం అడిగానని చెప్పండి. అలాగే మా తల్లి తారాదేవిని రక్షించండి. ఆమె తప్ప నాకొరకు ఏడ్చేవారెవరూ లేరు. తారాదేవి నా కన్నతల్లి కాబట్టి సహజంగా కొడుకుమీద ప్రేమ వుంటుంది. తన భర్తకొరకు విలపిస్తున్నది. మంచినడవడికలది. నా మరణవార్త విని ఆమెకూడా చావడం ఖాయం. రెండు దుఃఖాలతో ఎలా జీవించి వుండగలదు?"

ప్రాయోపవేశం చేసిన అంగదాదులు

ఇలా చెప్పి సవినయంగా పెద్దవారికి నమస్కారం చేసి, దర్భలు పరచుకుని, ఏడుస్తూ, నేలమీద పడుకున్నాడు అంగదుడు. వానరులందరూ కూడా అంగదుడి విషయంలో బాధపడి, హా! అని ఏడుస్తూ, సుగ్రీవుడిని తిట్టుకుంటూ, వాలిని పొగడుతూ, పూర్వచరిత్రను స్మరిస్తూ, మరణించాలని కాంక్షతో, అంగదుడిని చుట్టుకుని ఆయన సమ్మతి తీసుకున్నారు. ఆ తరువాత కాళ్లు–చేతులు కడుక్కొని, ఆచమనం చేసి, దక్షిణ సముద్రపు ఉత్తరతీరంలో దక్షిణదిశవేపు కొనలుండే విధంగా దర్భలు పరచి, వాటిమీద తూర్పు ముఖంగా

కూర్చుని మరణమే మేలని నిశ్చయించుకున్నారు. రామచంద్రమూర్తి అడవులకు రావడం, దశరథమరణం, జనస్థానంలో ఖరాదులను చంపడం, జటాయువు మరణం, సీతాపహరణం, వాలి చావు, రాముడి కోపం, వానరసమూహానికి కలిగిన భయం తలచుకుంటూ పెద్ద ధ్వని చేశారు. వారి ధ్వనికి మేఘాలు ఉరిమిన విధంగా ప్రతిధ్వనులు వచ్చే విధంగా గుహలతో సహా పర్వతం ధ్వనించింది.

సర్గ–56

అంగదాదులను చూసిన సంపాతి

ఏ ప్రదేశంలోనైతే వానరులు చావాలని నిర్ణయించారో, అక్కడే, ప్రసిద్ధికెక్కిన బలప్రతాపాలు కలవాడు, జటాయువుకన్నా దీర్ఘకాలం జీవించివున్నవాడు, గద్దలకు రాజు, పర్వతగుహలో వున్నవాడు, సంపాతి బయటకు వచ్చి, వానరులందరినీ సంతోషంగా చూశాడు. ప్రాణికోటికి దైవమే ఆహారం ఇచ్చి రక్షిస్తుంది కాబట్టే తానున్న చోటుకే దైవం కొత్త ఆహారాన్ని తెచ్చిందనుకున్నాడు. ఈ వానరులను దినానికి ఒకరిని వంతున వరుసగా చంపి తింటాను అనగా ఆ మాటలకు భయపడ్డ అంగదుడు హనుమంతుడితో ఇలా అన్నాడు.

"ఆంజనేయా! ఆహారం మీద ఆశకల ఆ పక్షిని చూశావా? సీతనే నెపంతో యముడే వానరులను చంపడానికి ఈ రూపంలో వచ్చాడు. మనమేమో శ్రీరాముడి కార్యం నెరవేర్చలేకపోయాం. నెలలోపల పోయి సీత కనబడలేదని చెప్పినట్లయితే రాజాజ్ఞ నిర్వర్తించిన వాళ్లమై వుండేవాళ్ళం. ఇంతలో తటాలున ఈ ఆపద సంభవించింది. సీతాదేవికి మేలుచేయాలనుకున్న జటాయువుకు ఏం జరిగిందో మనందరికీ తెలుసుకదా! అలాంటి గతే మనకిప్పుడు తటస్థించింది. స్నేహంతో, దయతో, పశువులు, పక్షులు, ఇతర ప్రాణులన్నీ ప్రత్యేకంగా ఒకరి కొరకు ఇంకొకరు కాచుకోకుండా తమ ప్రాణాలు విడిచైనా శ్రీరామచంద్రమూర్తికి సహాయం చేస్తాయి కదా! రామచంద్రమూర్తికి ఉపకారం చేయడానికైనా ధర్మం తెలిసిన జటాయువు శరీరాన్ని విడిచి కీర్తి గడించింది".

"ఆ విధంగా మనం అడవుల్లో శ్రమ పడ్డాం. ధర్మం తెలిసన ఆర్తులను ఎలాంటివారైనా రక్షించాలి. వారిలో స్త్రీలను తప్పకుండా రక్షించాలి. అందునా,

శ్రీరామచంద్రమూర్తి భార్యను అవశ్యం రక్షించాలి. సీతాదేవిని అడవుల్లో ఎంత వెతికినా చూడలేకపోయాం. మరణకాలం ప్రాప్తించింది కాబట్టి మనమిక్కడ చావడానికి సిద్ధపడ్డాం. కాబట్టి ఇప్పుడు ఈ గద్ద మనల్ని తింటానని అంటే బాధ ఎందుకు పడాలి? రావణాసురుడి చేతుల్లో యుద్ధంలో నరకబడి పక్షిరాజు జటాయువు చనిపోయి పరమపదానికి పోయింది. ఆయన మనలాగా సుగ్రీవుడి భయానికి చావలేదు. మనమేమో సుగ్రీవుడు చంపుతాడని ఆయనకు భయపడి, చావబోతున్నాం. కాని ఆయనలాగా ధర్మార్థం కాదు. కాబట్టి ఆయనే పుణ్యాత్ముడు. నికృష్టపు చావు చావాలనుకున్న మనకు ఆయనలాగా పుణ్యలోకాలు ఎలా దక్కుతాయి? దశరథుడు చావడం, సీతను రావణుడు అపహరించడం వల్ల జటాయువు చావడం, వీటన్నిటివల్ల మనకు ప్రాణాపాయం సంభవించింది. సీతాదేవితో రాముడు, లక్ష్మణుడు అడవులకు రావడం, రాముడి బాణంతో వాలి చావడం, శ్రీరాముడికి కోపం రావడం, రాక్షసులు చావడం, ఇవన్నీ దశరథుడు కైకకు వరాలు ఇవ్వడం వల్లే కదా కలిగింది. దశరథుడు అనాలోచితంగా కైకకు వరాలిచ్చి తాను చావడమే కాకుండా మనందరి చావుకు కారణమయ్యాడు''.

సర్గ–57
అంగదాదులతో సంభాషించిన సంపాతి

నేలమీద పడిన వానరులు అంగదుడు చెప్పిన వృత్తాంతం వింటుండగా సంపాతి మనస్సు చలించి, పరితాపం కలగడంతో, ఇలా అన్నాడు.

"అయ్యో! ఎన్ని రోజులకు నా తమ్ముడి పేరు వినడం జరిగింది! నా ప్రాణాలకంటే వాడు నాకు ప్రియుడు. వాడి మరణవార్త వినడంతో నా హృదయం చలించింది. దండకలో రావణాసురుడికి, వాడికి యుద్ధం ఎందుకు జరిగింది? ఆ యుద్ధంలో వాడు ఎలా చనిపోయాడు? వానరా! ఆ కథంతా చెప్పే నువ్వెవరివి? మీరు గొప్ప మనస్సుతో నన్ను కొండ మీదనుండి కిందకు దింపమని వేడుకుంటున్నాను. నా తమ్ముడు మిక్కిలి బలశాలి. ఎన్నో సుగుణాలను తెలిసినవాడు. అతడిని మీరు పొగుడుతుంటే ఇన్నాళ్లకు ఇక్కడ వినగలిగాను. రామచంద్రమూర్తి తండ్రైన దశరథమహారాజుకు నా తమ్ముడు స్నేహితుడెలా అయ్యాడు? వానరులారా అదంతా వినాలని వుంది. వానర శ్రేష్టులారా! సూర్యకిరణాలతో నారెక్కలు కాలిపోవడంవల్ల నేను కొండ దిగలేను. నామీద కనికరం చూపి నన్ను మీదగ్గరకు తీసుకుపోండి".

సంపాతికి తమ వృత్తాంతం చెప్పిన అంగదుడు

పొంగిపొరలి విశేషంగా వచ్చే దుఃఖంతో మాట తడబడుతున్న గద్గ కంఠధ్వని విన్నప్పటికీ దాన్ని నమ్మలేదు వానరులు. ఎందుకంటే అది తమను చంపుతుందని భయపడ్డారు. ఎలాగూ చావడానికి సిద్ధపడ్డాం కాబట్టి దాన్ని తీసుకువద్దామని కొందరు వానరులు భావించారు. కొందరు వద్దన్నారు. ఇలా అంటూనే కొందరు పోయి దాన్ని కొండమీదనుండి కిందకు దింపారు. అప్పుడు అంగదుడు దాంతో ఇలా అన్నాడు.

"ఓ పక్షి శ్రేష్టమా! విను. బ్రహ్మతో సమానమైనవాడు ఋక్షరజుండు అనే వానర శ్రేష్టుడు వుండేవాడు. ఆయనకు ఇద్దరు కొడుకులు. వారిద్దరూ గొప్ప పరాక్రమం కలవారు. వారి పేర్లు వాలి, సుగ్రీవుడు. ఆ వాలే నా తండ్రి. గొప్ప పరాక్రమవంతుడు. అద్భుత కార్యాలనేకం చేసి కీర్తిమంతుడయ్యాడు. సకలలోక ప్రభువు, దశరథమహారాజు కొడుకు, రఘువంశంలో పుట్టినవారిలో శ్రేష్టుడు, నిర్మలమైన నడవడికలవాడు, రామచంద్రమూర్తి, న్యాయమార్గంలో సంచరించే వాడు కాబట్టి, తండ్రి ఆజ్ఞానుసారం బదులు చెప్పడానికి భయపడి, తన భార్యతో, తమ్ముడితో కాలినడకన దండకారణ్యంలో ప్రవేశించాడు. ఆ సమయంలో విపరీతపు నడవడికల రావణాసురుడు ఆ ముగ్గురూ జనస్థానంలో తిరుగుతున్నప్పుడు రామచంద్రమూర్తి భార్య సీతాదేవిని అపహరించుకుని పోయాడు".

"అలా తీసుకెళ్తున్న సమయంలో శ్రీరామచంద్రమూర్తి తండ్రికి స్నేహితుడైన గృధ్రరాజు జటాయువు జానకీదేవిని చూశాడు. ఆమెను విడిపించాలని ఆకాశంలో పోతున్న రావణుడిని ఎదుర్కొని వాడి రథాన్ని విరిచి ఆమెను భూమ్మీదకు దించాడు. అంతటితో ఆగకుండా రావణుడితో యుద్ధానికి దిగాడు. బడలికతో వున్న ముసలివాడైన పక్షిరాజు రెక్కలను, యుద్ధంలో రావణుడు నరికాడు. అంతట జటాయువు మరణించాడు. రామచంద్రమూర్తి అతడికి అగ్ని సంస్కారాలు చేసి ఉత్తమలోకాలు ప్రసాదించాడు. ఆ తరువాత నా పినతండ్రి సుగ్రీవుడితో స్నేహం చేసి నా తండ్రి వాలిని చంపాడు. సూర్యపుత్రుడైన నా పినతండ్రి నా తండ్రితో, ఆయన మంత్రులతో విరోధించాడు. ఆ కారణాన రామచంద్రమూర్తి వాలిని చంపి తన స్నేహితుడికి రాజ్యం ఇచ్చాడు. ఆ తరువాత సీతను వెతకడానికి రాముడి అనుమతితో మమ్మల్ని దక్షిణ దిక్కుకు పంపాడు. ఆమెకోసం మేం వెతికాం కాని ఆమె మాకు కనబడలేదు. అలా...అలా వెతుకుతున్న సమయంలో మాయ నిర్మితమైన బిలంలోకి ప్రవేశించాం. మాకిచ్చిన నెలరోజుల గడువు అక్కడే అయిపోయింది. మేమంతా రాజాజ్ఞకు బద్ధులం. కార్యం సాధించకుండా వెనక్కు తిరిగిపోతే మా ప్రాణాలు దక్కవు. కాబట్టి ఇక్కడే మరణిద్దామని నిశ్చయించుకున్నాం. రామచంద్రమూర్తికి, సుగ్రీవుడికి, లక్ష్మణుడికి కోపం కలిగేట్లు చేస్తే మా దేహాలలో ప్రాణాలు వుండవు. గృధ్రరాజా! ఈ మాట నిజం". అని చెప్పాడు.

సర్గ-58
జటాయువు తన తమ్ముడని వానరులకు చెప్పిన సంపాతి

మరణానికి సిద్ధమైన వానరులు కన్నీళ్లు కారుతుంటే దుఃఖపడుతూ తమ చరిత్రను తెలపగా సంపాతి వారితో ఇలా అన్నాడు.

"రావణుడి చేతిలో చనిపోయిన జటాయువు నా తమ్ముడు. అతడి మరణ వార్త తెలిసికూడా రెక్కలు కాలిపోవడం వల్ల, ముసలివాడినైనందున, పగ తీర్చుకునే బలం లేనందున, ఏమీ చేయలేక ఇలా అనాథలాగా పడి సహించి వూరికే వున్నాను. పూర్వం వృత్రుడికి, ఇంద్రుడికి యుద్ధం జరుగుతున్న సమయంలో మేమిద్దరం మా వేగం తెలుసుకోవడానికి, ఒకరినొకరు గెలవాలన్న కోరికతో ఆకాశానికి ఎగిరి, సూర్యమండలం సమీపించడానికి పోవడానికి ప్రయత్నించాం. చక్రాకారంలో గాలిలో తిరుగుతూ, ఆకాశాన మేం పోతున్నప్పుడు సూర్యుడు నడినెత్తికి వచ్చాడు. అప్పుడు తమ్ముడు ఆ ఎండ వేడిని సహించలేక బాధపడ్డాడు. నేనప్పుడు ప్రేమతో అతడికి ఎండ తగలకుండా రెక్కలతో కప్పాను. ఫలితంగా నా రెక్కలు కాలిపోవడం, నేను వింధ్యపర్వతం మీద పడడం జరిగింది. నేనిక్కడ వుండడం వల్ల నా తమ్ముడి గురించిన వార్తలు వినలేకపోయాను".

ఇలా అంటున్న సంపాతితో అంగదుడు ఇలా అన్నాడు. "నువ్వు జటాయువు అన్నవే అయితే, నేను చెప్పినదంతా విన్నావు కదా! నీకు తెలిసుంటే, రావణుడు వుండే చోటు ఇక్కడికి దగ్గరలో వుందా? దూరంలో వుందా? చెప్పు".

రావణుడి ఉనికి కపులకు చెప్పిన సంపాతి

అంగదుడి మాటలకు జవాబుగా వానరులకు సంతోషం కలిగించే మాటలు

చెప్పాడు సంపాతి. "నేనిప్పుడు శౌర్యం లేనివాడిని. గద్దను. రెక్కలు కాలినవాడిని. అయినా, వానరులారా! రామచంద్రమూర్తి కార్యాన్ని మొట్టమొదలు చేయాలి. ముసలివాడినైనందున బలం పోయింది. ప్రాణాలు వుంటాయా, పోతాయా అన్నట్లున్నాయి. కాబట్టి నేను విశేష సహాయం మాత్రం చేయలేను. మాట సహాయం తప్పకుండా చేస్తాను. నాకు రావణాసురుడి విషయమే కాదు..... ఇంకా పూర్వ వృత్తాంతం కూడా తెలుసు. వితలాది లోకాలు నాకు తెలుసు. విష్ణుమూర్తి త్రివిక్రమావతారంలో ప్రపంచాన్ని కొలిచిన విధానం, అప్పుడు దేవతలకు, రాక్షసులకు జరిగిన యుద్ధం, అమృతం కొరకు సముద్ర మథనం అంతా నాకు తెలుసు. రావణుడు తీసుకుని పోతుంటే నిడుపాటి కళ్ళుకల యౌవనవతిని, సమస్త భూషణాలతో ప్రకాశించే దానిని, కన్నీరు కారుస్తూ శరీరం మీద ఆభరణాలను ఒక్కటొక్కటే పారవేస్తూ బాధపడుతున్న ఒక స్త్రీని చూశాను. ఆమె పట్టుచీర రావణాసురుడి మీద పడుతుంటే గమనించాను. ఆమె రామా! లక్ష్మణా! అని ఏడిచింది. కాబట్టి ఆమె సీతాదేవి అని భావిస్తాను. ఆ రాక్షసుడు వుండే చోటు చెప్తా విను".

"విశ్రవుడి యౌరసపుత్రుడు, కుబేరుడికి తమ్ముడు, రావణాసురుడు లంకాపురంలో వుంటాడు. సముద్రానికి ఇక్కడి నుండి నూరామడల దూరంలో ఒక ద్వీపం వుంది. అదే రావణుడు వుండే పురం. బంగారు వాకిళ్లు, బంగారు పంచటరుగులు కలిగి, సూర్యకాంతి కల ప్రాకారంతో చుట్టబడి వుంటుంది. ఆ పురంలో, రావణాసురుడి అంతఃపురంలో, రాక్షస స్త్రీల కాపలాలో సీత దుఃఖిస్తున్నది. సముద్రం మీద నుండి దక్షిణ దిక్కుగా మీరు నూరామడలు పోతే, అక్కడ సముద్రమే అగడ్తగా కల లంక వుంటుంది. అక్కడికి పోయి రావణాసురుడిని చూసి, ఫలసిద్ధి పొంది రండి. మీ విస్తార పరాక్రమం చూపడానికి తొందరపడండి. ఆలశ్యం చేయవద్దు. నా జ్ఞాన దృష్టితో చూశాను. మీరు కార్యం సఫలం చేసుకుని రాగలరు".

"మేం దివ్య వంశంలో పుట్టినందున మాకు జ్ఞాన దృష్టి వుంటుంది. ఎందుకంటే ఆకాశంలో నేడు స్కంధాలున్నాయి. వాటిలో మొదటిది భూమికి సమీపంలో వుండేది. అందులో గుళింగాలు మొదలైనవి సంచరిస్తూ నేలమీద పడిన ధాన్యం తిని బతుకుతాయి. రెండవ స్కంధంలో కాకులు మొదలైనవి సంచరిస్తాయి. ఇవి చెట్లమీద పండిన పండ్లను తింటాయి. పై స్కంధంలో చేరినవి కింది స్కంధానికి రాగలవు కాని కింది స్కంధానికి చేరినవి పై స్కంధానికి పోలేవు.

క్రౌంచాలు, లకుముకులు, నీటికాకులు, మూడవ స్కంధానికి, డేగలు నాల్గవ స్కంధానికి, గద్దలు ఐదవ స్కంధానికి, బలవీర్యయౌవనాలు గల హంసలు ఆరవ స్కంధానికి చేరినవి. ఏడవగతి వైనతేయానికి కలదు. మేం ఆ వైనతేయుడి సంతతికి చెందిన వాళ్లం. ఇక్కడి నుండి సీతను, రావణాసురుడిని చూస్తాను. అలాంటి దూరపు చూపు, కంటి బలం మాకుంది. ఇలాంటి శక్తి మాకు కలగడానికి రెండు కారణాలున్నాయి. స్వభావసిద్ధమైనది ఒకటి కాగా, రెండోది మేం తినే ఆహార బలం వల్ల. కాబట్టి నూరామడ దూరాన్ని అనాయాసంగా చూడగలం".

"మాకు స్వభావంగా ఇలాంటి దృష్టి కలగడానికి కారణం మేమేమో దూరంగా వున్న ఆహారం తినడానికి పోవాల్సి వుంటుంది. మాకు కావాల్సిన ఆహారం సమీపంలో దొరకదు. ఆ కారణాన భగవంతుడు మాకు దూరదృష్టి ఇచ్చాడు. కోళ్లు మొదలైనవి తమ కాళ్ల దగ్గర దొరికినవే తింటాయి. కాబట్టి వాటికి దూరదృష్టితో పనిలేదు. రాక్షసుడు లోకం నిందించే పని చేశాడు. వానరులారా! దానికి తగ్గ విధంగా మీరు చేయబోయే కార్యం నా తమ్ముడిని చంపినడానికి బదులు కావాలి. సముద్రాన్ని దాటే ఉపాయం వెతకండి. సముద్రం దాటి లంకలో వున్న సీతను చూసి ధన్యులై జై అంటూ కిష్కింధకు మరలి పొండి. చనిపోయిన నా తమ్ముడికి సముద్ర జలంతో తర్పణం చేయాలి. కాబట్టి మీరు నన్ను సముద్రం దగ్గరికి తీసుకుని పొండి".

సంపాతి చెప్పిన విధంగానే వానరులు అలానే చేశారు. మళ్లీ ఆయన వున్న చోటుకు తెచ్చి దింపారు. సీతాదేవి వార్త తెలియడం వల్ల వానరులు సంతోషించారు.

సర్గ–59
సీతావృత్తాంతం జాంబవంతుడికి చెప్పిన సంపాతి

సంపాతి మాటలకు వానరులంతా సంతోషించారు. అప్పుడు జాంబవంతుడు లేచి నిలబడి సంపాతితో ఇలా అన్నాడు.

"సీత ఎక్కడ వుంది? ఎవరైనా చూశారా? ఆమెను అపహరించిన రాక్షసుడు ఎక్కడివాడు? పక్షిరాజా! అంతా చెప్పి వానరులను రక్షించు. వజ్రసమానమైన రామచంద్రమూర్తి బాణాలను ఆ మూఢుడు లక్ష్యం చేయడం లేదు".

జాంబవంతుడి ప్రశ్నకు ఇంతకు ముందే సమాధానం చెప్పిన సంపాతి, సీతాపహరణం గురించి తాను విన్నది, కన్నది, సీత వుండే ప్రదేశం గురించి మళ్లీ వినిపిస్తానని అన్నాడిలా.

"వానరులారా! వినండి. రెక్కలు విరిగినవాడినైనందున నేనీకొండమీదే వుంటాను. ఇలాంటి నా మీద పితృ భక్తివల్ల నా కొడుకు సుపార్శ్వుడు ఆహారం తెచ్చి ఇచ్చేవాడు. గంధర్వులలో కామం ఎక్కువ. పాములకు కోపం ఎక్కువ. మృగాలకు భయం ఎక్కువ. మాకు ఆకలి ఎక్కువ. ఆ కారణాన ఒకనాడు ఆకలి వేసి ఆహారానికి ఎదురు చూస్తుండగా సూర్యాస్తమానమైన తరువాత ఆహారం తేకుండానే నా దగ్గరికి వచ్చాడు. ముసలివాడికి కోపం ఎక్కువ కాబట్టి దప్పికతో వాడిని నిందించాను. నన్నాతడు శాంతపరచి ఏమన్నాడంటే.....తాను మహేంద్ర పర్వతం దగ్గర సముద్ర జంతువులు గుంపులుగా పోతుంటే దారికి అడ్డంగా తల నేలమీద వేసి తూగుతున్నట్లు వుండిపోయాడట. ఆ సమయంలో కాటుక కొండలాంటి శరీరం కలవాడు, సూర్య తేజస్సుతో సమానమైన తేజస్సు కలవాడు ఒక స్త్రీని తీసుకు పోవడం చూశాడట. అప్పుడు తనకు ఆహారం

దొరికింది కదా అని నిశ్చయించుకున్నాడు. వాడు తనని దారి ఇమ్మని ప్రార్థిస్తే సరే పొమ్మన్నాడట".

"వాడు రావణుడనే రాక్షస రాజని సిద్ధులు అంటుంటే విన్నాడు నా కొడుకు. ఆ సిద్ధులే, దుర్నీతిపరుడైన రావణుడు రాముడి భార్య సీతను బలవంతంగా అపహరించుకుని పోతున్నాడని, రామా! లక్ష్మణా! అని ఏడుస్తున్న ఆ స్త్రీ సీతేనని అన్నారట. ఇలా వారన్నారని నా కొడుకు నాకు చెప్పాడు. ఇది విని కూడా రాక్షసుడి మీదికి పోవడానికి మనస్సు చాలలేదు. నేనేమో రెక్కలు విరిగిన పక్షిని. ఏ పనీ చేయలేను. అయినా వాక్కు బుద్ధి గుణం చెడిపోలేదు. కాబట్టి మీ శక్తికి తగినవిధంగా చెప్తా వినండి. వానరులారా! ఏది రామకార్యమో, అది నా సొంత కార్యమే! ఇది సత్యం. ఇందులో సందేహం లేదు. మీరు బలవంతులు. బుద్ధిమంతులు. అందునా సుగ్రీవుడు పంపగా వచ్చారు. దేవతలకైనా మీరు అసాధ్యులు. రామలక్ష్మణుల బాణాలు ముల్లోకాలనైనా పొడి-పొడిగా చేయడానికి, రక్షించడానికి సమర్థమైనవి. రావణుడు బలపరాక్రమాలు కలవాడు. మీరు సమర్థులు. మీకు అసాధ్యం లేదు. కాబట్టి ఆలశ్యం చేయవద్దు. మీలాంటివారు పనిబడ్డప్పుడు వెనకంజ వేయరు".

సర్గ-60
నిశాకర ఋషితో తనకు జరిగిన సంభాషణ చెప్పిన సంపాతి

ఇలా చెప్పిన సంపాతి, వానరసమూహం తనను చుట్టుకున్న అంగదుడితో నిశాకరుడు తనతో చెప్పిన మాటలు ఆయనకు చెప్పాడు. వానరులను, చూడడం తనకు రెక్కలు మొలవడం అనే సంగతి నిశాకరుడు తనతో అన్నాడని అంటాడు. ఆయన చెప్పినట్లే జరిగిందంటాడు.

"వానరులారా! సీతావృత్తాంతం చెప్తా వినండి. సూర్యుడి వేడికి రెక్కలు కాలి ఈ వింధ్య శిఖరం మీద మూర్ఛపోయి ఆరు రోజులు పడి వున్నాను అలాగే. ఆ తరువాత తెలివి వచ్చి నాలుగు దిక్కులా చూస్తే ఏమీ కనిపించలేదు. మళ్లీ చక్కగా చూడగా సముద్రం, కొండలు, నదులు, సరస్సులు, సముద్ర తీరం కనపడగా అది దక్షిణ సముద్ర తీరంలో వుండే వింధ్య అని అనిపించింది. పూర్వం ఇక్కడ నిశాకరుడు అనే ముని ఘోర తపస్సు చేశాడు. ఆయన స్వర్గం చేరి ఎనిమిది వేల సంవత్సరాలు దాటింది. ఆ ఋషీశ్వరుడు నన్ను, నా తమ్ముడిని బాగా ఆదరించేవాడు. ఆ కారణాన ఆయన్ను కలవడానికి శ్రమపడి వింధ్యాద్రి దిగి, ఆయన ఆశ్రమ సమీపంలో ఒక చెట్టు నీడన ముని రాకకొరకు ఎదురు చూస్తూ విశ్రమించాను. ఆయన సముద్ర స్నానం చేసి ఉత్తర ముఖంగా ఆశ్రమానికి వచ్చాడు. ఆయన వెంట పులులు, సింహాలు, పాములు, మృగాలు వచ్చి ఆయన తన మేడలోకి పోగానే అవన్నీ వాటి ఇష్టప్రకారం వెళ్లిపోయాయి. ఆ ముని నన్ను చూసి లోపలి పోయి, మళ్లీ బయటకు వచ్చి, నా రెక్కలు కాలడం వల్లా, నన్ను వెంటనే గుర్తించలేకపోయానని అన్నాడు. నిమ్మదిగా నన్ను సంపాతిగా గుర్తించి, నా క్షేమ సమాచారాలు, నా తమ్ముడు జటాయువు విషయం అడిగి తెల్సుకున్నాడు. నా రెక్కలు పడిపోవడానికి కారణం అడిగాడు. నన్నిలా శిక్షించింది ఎవరని ప్రశ్నించాడు".

సర్గ-61

తన రెక్కలు కాలిన విధానం నిశాకరుడికి చెప్పిన సంపాతి

నిశాకరుడు అలా అడగ్గానే నేనిలా జవాబిచ్చాను. "మునీంద్రా! వంటి నిండా పుండ్లు వుండడం మూలాన, వాటి నొప్పివల్ల సమాధానం ఇవ్వలేక పోతున్నాను సరిగ్గా. పొగరుతో కళ్లు తెలియక పరాక్రమం తెల్సుకోగోరి కైలాస శిఖరంలో వున్న ఋషుల ఎదుట నేను, నా తమ్ముడు జటాయువు సూర్యుడు పడమటి కొండకు పోయే లోపల ఆయన దగ్గరికి పోవాలని పందెం వేసుకుని, ఒక్కసారిగా ఆకాశానికి ఎగిరాం. మా బలం తెలిసేట్లు ఆకాశంలో పోతున్నప్పుడు పట్టణాలు బండికండ్లంతలై కనబడ్డాయి. అప్పుడు అక్కడ వేదస్వరాలు వినపడ్డాయి. చక్కటి ఎర్ర చీరెలు కట్టుకుని సంగీతం పాడే స్త్రీలను చూసుకుంటూ సూర్యుడిని చేరబోయాం".

"అక్కడినుండి చూస్తుంటే అడవులన్నీ పచ్చికపట్టుల్లాగా కనిపించాయి. కొండలతో నిండిన భూమి గులకరాళ్లు పరిచిన కనబడని నేలలాగా వుంది. నదులు కల భూమి నూలుదారం చుట్టిన చెండులాగా కనిపించింది. హిమవంతం, వింధ్యం, మేరు పర్వతాలు మడుగులో పాముల్లాగా వున్నాయి. దేహంమీద చెమట, మనసులో దుఃఖ వచ్చింది. కళ్ళు గిర-గిరా తిరిగాయి. దక్షిణం ఏదో, పడమర ఏదో తెలియలేదు. దిక్కులు శూన్యమయ్యాయి. ప్రళయకాలంలో అగ్నిశిఖలతో పూర్ణంగా కాలిన ప్రపంచం లాగా అక్కడి నుండి చూస్తుంటే పాడైపోయినట్లు కనిపించింది. మనస్సు వ్యాకులపడింది. బలవంతంగా కళ్ళు తెరిచి సూర్యుడి ఛాయ చూడగా ఆయన భూమంత విస్తార దేహం కలిగి కనిపించాడు. ఒక్క మాట కూడా మాట్లాడకుండా నా తమ్ముడు భూమీమ్మీదకు దొర్లాడు. నేను శీఘ్రంగా పోయి నా రెక్కలతడికి అడ్డంగా కప్పాను.

దాంతో నా రెక్కలు సూర్య కిరణాలకు కాలిపోయాయి. నా తమ్ముడు జనస్థానంలో పడ్డట్లు ఉహించాను. నా రెక్కలు కాలిపోవడం వల్ల ఒక మొద్దులాగా ఈ కొండమీద పడ్డాను. తమ్ముడు పోయాడు....రెక్కలు పోయాయి....రాజ్యం పోయింది....పరాక్రమం పోయింది. అన్నీ పోగా ఈ ప్రాణం మాత్రం ఎందుకని కొండ మీదనుండి చావడానికి కిందపడ్డాను".

సర్గ–62

సంపాతికి రెక్కలు మొలిచే ఉపాయం చెప్పిన నిశాకరుడు

"అని చెప్పి నేను ఏడవగా ఆ మునీశ్వరుడు అల్పకాలం ఆలోచించి నాకు మళ్లీ రెక్కల బలం, కళ్ళు, పరాక్రమం, ఇదివరకు లాగానే వస్తాయి అన్నాడు. నేను నా తపోబలంతో దాన్ని చూశాను. ఇక్ష్వాకు వంశంలో దశరథరాజు పుట్టాడనీ, అతడికి రామభద్రుడు అనే కొడుకు కలుగుతాడనీ, ఆయన తండ్రి మాట ప్రకారం తమ్ముడు లక్ష్మణుడితో కలిసి అరణ్యాలకు వస్తాడనీ, ఆ రామచంద్రుడి భార్య సీతాదేవిని జనస్థానం నుండి రాక్షసరాజు రావణాసురుడు అపహరిస్తాడనీ, ఆమెకాయన ఏవిధమైన ఆహారం ఇచ్చినా ఆమె ముట్టదనీ, అప్పుడు దేవతలకు దుర్లభం అయిన అమృతాన్ని ఇంద్రుడామెకు ఇస్తాడనీ, దాంట్లో మొదటి భాగం ఆమె తీసుకుని మిగతా భాగాన్ని రామలక్ష్మణుల కొరకు వారికి చెందాలని భూమ్మీద వుంచుతుందనీ, రామదూతలైన వానరులు సీతాదేవిని వెతుకుతూ తను వుండే ప్రదేశానికి వస్తారనీ, వారికి సీతాదేవి వృత్తాంతం తెలిపితే నాకు మేలవుతుందనీ, నేను ఈ ప్రదేశం వదిలి ఎక్కడికీ పోవద్దనీ, ఇక్కడే వుండాలనీ నిశాకరుడు నాకు చెప్పాడు. తానే నాకు రెక్కలు మొలిచేట్లు చేయకలడు కానీ అలా చేయదలచుకోలేదని, ఎందుకంటే నేనిక్కడే వుండి జగానికి మేలైన కార్యం చేయాలనీ, నాకు రెక్కలు వస్తే నేనెక్కడికైనా పోవచ్చనీ అంటాడు ముని. ఇంద్రుడికి, మునులకు, బ్రాహ్మణులకు, దేవతలకు, రామచంద్రుడికి నేను ప్రియమైన పని చేయాల్సి వుందని కూడా ఆయన అంటాడు. విస్తార కీర్తికల రామచంద్రుడిని చూడాలని ఆశ వుందికాని, అంతకాలం బతకడానికి మనస్సంగీకరించడం లేదు. కాబట్టి దేహాన్ని వదులుతాను".

సర్గ–63
రెక్కలు వచ్చిన సంపాతి

"వాస్తవార్థం చెప్పిన ఆ మునీశ్వరుడు అనేక విధాలుగా నన్ను ఓదార్చి వెళ్ళమని చెప్పి లోపలికి పోయాడు. ఆ తరువాత నేను అతి కష్టం మీద ఈ కొండమీదకు చేరుకుని మీ రాకకొరకు ఎదురు చూస్తున్నాను. ఎనిమిది వేల సంవత్సరాలు గడిచిపోయాయి. ముని మాట నమ్మి ఇంతకాలం ఓర్పుగా కాచుకుని వున్నాను. ఆయన దేహాన్ని విడిచి స్వర్గానికి పోయాడు. నేనేమో ధైర్యం విడిచి, నానా రకాల చింతలతో అలసి సొలసి దుఃఖంతో ఇలా వున్నాను. మరణించాలనుకున్నాను కాని చావద్దన్న ముని వాక్యాలు జ్ఞప్తికి వచ్చేవి" అని ఇలా సంపాతి చెప్తుండగానే వానరులు చూస్తుంటే సంపాతికి రెక్కలు మొలిచాయి. తన రెక్కలను చూసుకుని సంపాతి సంతోషించాడు. "ఏవిధంగానైనే సరే, ఎంత కష్టపడైనా సరే మీరు సీతాదేవిని వెతకండి. నాకు రెక్కలు వచ్చిన వ్యవహారం చూస్తుంటే మీరు ఆయన చెప్పినట్లు సీతను చూడగలరని నమ్మకం కలుగుతున్నది. నాకు ఆజ్ఞ ఇస్తే నేను ఆకాశమార్గాన పోతాను". అని చెప్పి సంపాతి వెళ్లిపోగా వానరులు మళ్లీ పౌరుషం తెచ్చుకుని సీతాదేవిని వెతకడానికి అభిజిత్ ముహూర్తానికి ఎదురు చూస్తూ ఆమె వున్న దిక్కుకు పయనించారు.

సర్గ-64
సముద్రతీరం చేరిన వానరులు

ఈ విధంగా రావణుడు వుండే స్థలాన్ని సంపాతి చెప్పడంతో, అప్పటిదాకా భయపడుతున్న వానరులు, దాన్ని వదిలి, సంతోషంగా విజృంభించి, పొంగిపోతూ, గంతులేస్తూ, పుణ్యాత్మురాలు సీతను చూడాలన్న కోరికతో సముద్ర తీరాన్ని చేరారు. అక్కడ దక్షిణ సముద్రం ఉత్తర తీరానికి చేరి, బలవంతులైన వానరులు ఒక్కచోట కూర్చుండి సముద్రాన్ని తేరిపార చూశారు. వానరుల దేహాలు పులకరించాయి. వివిధ రకాల వికార జంతు సమూహాలతో నిండిన గగుర్పాటు కలిగించే ఆసముద్రాన్ని చూసి, విచారపడి, ఇక ఏం చేయాలి అని, ఎలా దాన్ని దాటాలా అని భయపడ్డారు. అలా భయంతో, దుఃఖంతో, వానర సమూహాలు బాధపడుతుంటే వారిని చూసిన అంగదుడు వారికి ధైర్యం కలిగేట్లు ఇలా చెప్పాడు.

"వానరులారా! విషాదపడవద్దు. పరాక్రమం చూపాల్సిన సమయంలో దుఃఖపడేవాడికి ధర్మార్థకామ మోక్షాలలో ఏదీ లభించదు. చేయాల్సిన కార్యం ఎలా చేయాలి అని ఆలోచించాలి". అని అంటాడు. వానరులప్పుడు "ఈ సముద్రాన్ని దాటేవారెవరు? ఈ వానరసేనను కాపాడడం అంగద, హనుమంతులకు ఎవరికి సాధ్యం" అని అనుకుంటారు.

కపులను సముద్రం దాటడానికి ప్రేరేపించిన అంగదుడు

"ఈ కార్యం ఎలా నెరవేరుతుంది? అసాధ్యంగా వుందే?" అని విచారపడుతున్న వృద్ధ వానరులను, సేనానాయకులను, సమాదానపరుస్తూ అంగదుడు సంతోషంతో అర్థవంతమైన మాటలతో ఇలా అన్నాడు.

"సుగ్రీవుడిని సత్యసంధుడిని చేయడానికి ఈ సముద్రాన్ని దాటగల మహాతేజం కలవాడెవరో? నూరామడల సముద్రాన్ని దాటి ఆ వానరుల ప్రాణభయం పోగొట్టగల మహాబలవంతుడు ఎవరో? ఎవ్వరి మహిమవల్ల ఇక్కడి నుండి పోయి వారి-వారి ఇంట్లో భార్యలతో, బిడ్డలతో వానరులు సంతోషంగా వుండగలరో? ఎవని దయవల్ల మనందరం సుఖంగా, సంతోషంగా మళ్లీ రామలక్ష్మణులను, సుగ్రీవుడిని చేరగలమో? అలాంటి సామర్థ్యంకల వానర శ్రేష్టుడు, సముద్రాన్ని దాటగలవాడు వుంటే ఆయన వానరులందరికీ ప్రాణదానం చేయుగాక!".

ఇలా అంగదుడు అనగా విని వారిలో ఒక్కడైనా ఏమీ అని బదులివ్వలేదు. సైన్యమంతా కదలక, మెదలక అలా వుండిపోవడంతో యువరాజు అంగదుడు మళ్లీ ఇలా అన్నాడు.

"వానరులారా! మీరు బలవంతులలో ఉత్తములు. అధిక పరాక్రమం వల్ల పొగడబడిన వారు. గొప్ప వంశంలో పుట్టినవారు. ఇలాంటి మీకు ఎలా పోయినా, ఏసమయంలో పోయినా, పోలేని స్థలం లేదు. ఇదివరకు లాగానే ఇప్పుడు కూడా అందరం కలిసి దాటిపోదామా? అని అనుకుంటే, అంతా పోలేరేమోనని అనిపిస్తోంది. అంతా దాటగలిగితే అందరం కలిసే పోదాం. ఈ సముద్రాన్ని ఎవరెవరు వారి-వారి శక్తికొలది ఎంతమేరకు దాటగాలరో ఆలోచించి చెప్పండి".

సర్గ–65

తమ–తమ లంఘన శక్తి గురించి అంగదుడికి వివరించిన వానరులు

అంగదుడి మాటలకు జవాబుగా గవయుడు, గవాక్షుడు, సుషేణుడు, ద్వివిదుడు, మైందుడు, గజుడు, జాంబవంతుడు, గంధమాదనుడు, శరభుడు ఇలా అన్నారు. గజుడు తాను పది ఆమడల సముద్రాన్ని దాటగలనన్నాడు. గవాక్షుడు ఇరవై, గవయుడు ముప్పై, శరభుడు నలబై, గంధమాదనుడు ఏభై, మైందుడు అరవై ఆమడలు దాటగలమని చెప్పారు. ద్వివిదుడు డెబ్బై ఆమడలు, సుషేణుడు ఎనబై ఆమడలు దాటగలమని అన్నారు. ఆ తరువాత జాంబవంతుడు ఇలా అన్నాడు.

"కపులారా! నాకు పూర్వం గమనశక్తి వుండేది. ఇప్పుడు చాలా ముసలివాడినయ్యాను. యౌవనం పోయింది. ఏదెలావున్నా, రామలక్ష్మణులు, సుగ్రీవుడు మనం ఎలాగైనా ఈ కార్యాన్ని సాధిస్తామని నమ్మారు. కాబట్టి దీన్ని ఉపేక్షించరాదు. కాబట్టి ఇప్పటి నా శక్తి ఆలోచిస్తే, తొంబై ఆమడ దాటగల భుజ శక్తి వుండవచ్చునేమో అనిపిస్తున్నది. నా శక్తి ఇంతేనా? అనవద్దు. పూర్వం బలిచక్రవర్తి యజ్ఞం చేసినప్పుడు విష్ణువు త్రివిక్రమావతారం ఎత్తగా, నేను వేగంగా ఆయనకు ప్రదక్షిణ చేశాను. మీలాగే నేను వయసులో వున్నప్పుడు అసమానబలం, వేగంకలవాడినై వుండేవాడిని. ఆ వయసు గడిచిపోయింది. ముసలితనం వచ్చింది. గమనం తగ్గిపోయింది. బలం కూడా తగ్గింది. కాబట్టి నేనెంత ఉత్సాహం చూపినా ఇంతకు మించి పోలేను. తొంబై ఆమడ పోవడం వల్ల కలిగే లాభం ఏదీ లేదు".

"తాతా! ఇంత ముసలివాడివైనా తొంబై ఆమడ దాటగలను అంటున్నావే?

నేను నూరామడ పోగలను కాని మరలి రాగలనో, లేదో, సందేహం". అన్నాడు అంగదుడు.

అప్పుడు జాంబవంతుడు, "వానరశ్రేష్టా! నీ శక్తి ఎంతపని అయినా సాధించగలదే. నూరామడ కాదు వేయామడ కూడా నువ్వు పోగలవు. మరల రాగలవు. అయినా నువ్వాపని చేయకూడదు. రాజు సేవకులతో పని చేయించాలి. కాబట్టి సేవకులు వూరికే కూర్చుండి రాజుకు పనులు చెప్పకూడదు. ఈ వానర సేనకంతా నువ్వు స్వామివి. వీరంతా నీసొమ్ము. సొమ్మును సొమ్ముకలవాడు ఇష్టం వచ్చినట్లు ఉపయోగించుకోవచ్చు కాని సొమ్ము ఇష్టప్రకారం స్వామి ప్రవర్తించ కూడదు. సేవకులు స్వామిని రక్షిస్తేనే వారికి క్షేమం కలుగుతుంది. కాబట్టి సేవకులు తమ క్షేమం కొరకు స్వామిని తమ రక్ష్య వస్తువులను తాము రక్షించుకొన్నట్లు రక్షించాలి. రాజు సేవకులతో రక్షించబడవలసిన వాడు. ఇది లోక మర్యాద కాబట్టి మేమంతా ఇక్కడ వుండి నిన్ను పంపడం మాకు మర్యాదకాదు. అదే కాకుండా ఈ కార్యానికంతా ఆధారం నువ్వే. మా ప్రభువు కుమారుడివైనందున నువ్వు మాకు ప్రభువువే. కాబట్టి నిన్ను ముందు వుంచుకుని కార్యం సఫలం చేస్తాం" అని చెప్పాడు.

అంగదుడు జవాబుగా, "తాతా! నన్ను పోవద్దంటున్నావు. వేరేవారెవరూ పోవడానికి సిద్ధంగా లేరు. కాబట్టి మళ్లీ ప్రాయోపవేశమే మార్గమా? చావడం ఎందుకు వూరికి పోదామంటావా? సుగ్రీవుడి ఆజ్ఞ నెరవేర్చకుండా అక్కడికి పోతే మన ప్రాణాలుండవు. సుగ్రీవుడు దండించడానికి, రక్షించడానికి సమర్థుడు. గడువు మీరి కార్యం సాధించకుండా పోతే చంపుతాడు. కాబట్టి ఏం చేయాలో చెప్పు" అన్నాడు.

అప్పుడు జాంబవంతుడు, "రాజకుమారా! ఈ కార్యానికి కొరత లేదు. ఈ కార్యం సాధించేవాడిని నేనిప్పుడే ప్రోత్సహిస్తాను" అని చెప్పి, హనుమంతుడిని కార్యోన్ముఖుడిని చేయడానికి ప్రోత్సహించసాగాడు.

సర్గ-66

హనుమంతుడిని ప్రోత్సాహపర్చిన జాంబవంతుడు

ఏం చేయడానికి కూడా ఆలోచన తోచక, ముఖాల్లో దుఃఖం పొంగి పొర్లుతుంటే, సంతోషంగా లేని వానర సమూహాన్ని చూసి, బుద్ధిశాలి జాంబవంతుడు హనుమంతుడితో ఇలా అన్నాడు.

"సర్వశాస్త్రాలలో ప్రసిద్ధమైన పాండిత్య సామర్థ్యం కలవాడా! వానరవీర శ్రేష్టుడా! పవననందనా! ఎందుకిలా ఎవరితో మాట్లాడకుండా ఒంటరిగా కూచున్నావే? రామకార్యంతో నీకు పనిలేదా? నువ్వు బలంలో, పరాక్రమంలో, తేజంలో, రామలక్ష్మణ సుగ్రీవులు ముగ్గురికీ సమానమైనవాడివి కదా? ఆ ముగ్గురు ఒక ఎత్తు, నువ్వొక్కడివే ఒక ఎత్తు కదా! పక్షిరాజైన గరుత్మంతుడి రెక్కలకు ఎంత బలం, వేగం వుందో నీ బాహువులకు కూడా అంతే వుంది. లోకంలో వుండే అందరికంటే తేజంలో, బుద్ధిబలంలో, ధైర్యంలో నువ్వే అధికుడివి. నిర్మలమైన మనస్సుకలవాడా! నీ శక్తి సామర్థ్యాలు నువ్వేల తెలుసుకోలేవు? దానికి కారణం ఏమిటో ఆలోచించు".

హనుమంతుడి జన్మ వివరాలు చెప్పిన జాంబవంతుడు

"అప్సరసలలో శ్రేష్టురాలైన పుంజికస్థల అనే ఒక ప్రసిద్ధ సుందరి శాపవశం వల్ల వానరస్త్రీగా అంజనాదేవి అనే పేరుతో కుంజరుడనే వానర ప్రభువుకు కూతురుగా పుట్టింది. కోరిన రూపం ధరించే వరం పొందిన ఆమె కేసరి అనే వానర వల్లభుడికి భార్య అయింది. అత్యంత సౌందర్యవతైన ఆ వానర స్త్రీ ఒకానొక రోజున సంతోషంగా మనుష్యస్త్రీ స్వరూపం ధరించి, అందమైన ఆభరణాలతో అలంకరించుకుని, మెడలో పూల పూలదండలు వేసుకుని, మృదువైన సన్నటి

చీర కట్టుకుని, మేఘవర్ణం కల పర్వత ప్రదేశంలో తిరుగుతున్నది. అప్పుడామె కట్టుకున్న ఎర్రటి అంచుకల పచ్చని దువ్వలువ కొండగాలికి మెల్లగా జారిపోయింది. ఆమె ఉబ్బిన స్తనాలు, బలిసిన తొడలు, సన్నటి నడుము, అందమైన ముఖం, పిరుదుల అందమైన ఆకారం చూసిన వాయుదేవుడు,మోహంతో, మన్మథ బాణాలకు గురై, ఆమె భుజాలను పట్టుకుని గట్టిగా కౌగలించుకున్నాడు''.

"ఆమె అప్పుడు భయపడి 'ఎవ్వడు నా పాతివ్రత్యానికి హానికలిగించాలని చూస్తున్నాడు?' అని అంది. వాయుదేవుడప్పుడు 'నీమీద మనస్సు కలిగి నేను కౌగలించుకున్నాను. అంతమాత్రాన నీ పాతివ్రత్యానికి హానిలేదు. నువ్వు భయపడవద్దు. నేను నిన్ను ఎప్పుడూ తాకే వాయుదేవుడిని. నీకు దీనివల్ల కీర్తి కలుగుతుంది. ఈదడంలో, దాటడంలో నాకు సమానమైన కొడుకు, మిక్కిలి వేగంగా పోయేవాడు,పరాక్రమవంతుడు,బుద్ధిబలం కలవాడు నీకు పుట్టుతాడు'. అని చెప్పగా నీ తల్లి మనసులో సంతోషించి అక్కడినుండి వెళ్లిపోయి, ఒక కొండ గుహలో వానర శ్రేష్టుడివైన నిన్ను కనింది''.

"అసమాన కీర్తికలవాడా! ఒకనాడు నువ్వాఅడవిలో ఉదయిస్తున్న సూర్యుడిని చూశావు. అది పండు అనుకున్నావు. నువ్వు ఆకాశానికి ఎగిరి మూడొందల యోజనాలు పోగా సూర్య కిరణాల వేడికి నీ దేహం తపించినప్పటికీ లక్ష్యం చేయకుండా సూర్యుడిని సమీపించగా ఇంద్రుడు కోపంతో నీమీద తన వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. వజ్రాయుధం దెబ్బకు నీ ఎడమ చెంప గాయపడ్డది. అప్పటినుండి నీకు హనుమంతుడు అనే పేరు వచ్చింది. నీకు కలిగిన బాధ చూసి కోపంతో వాయుదేవుడు కొంచెం కూడా సంచరించకుండా స్తంబించి వుండిపోయాడు. అప్పుడు లోకాలన్నీ గడ-గడలాడాయి. దేవతలు కలతచెంది వచ్చి, వాయుదేవుడిని సమాదానపర్చడానికి ప్రయత్నించారు. అప్పుడు వానరేంద్రా! నిన్ను చూసిన బ్రహ్మ నీకు శస్త్రాలతో మరణం లేకుండా వరాలిచ్చాడు. ఇంద్రుడు నువ్వు కోరేవరకూ నీకు మరణం రాకుండా వరం ఇచ్చాడు. నువ్వు కేసిరికి క్షేత్రజుడివి. వాయుదేవుడికి ఔరసుడివి. కాబట్టి గొప్ప తేజస్సుతో దాటులు వేయడంలో నీ తండ్రైన వాయుదేవుడికి సరితూగుతావు''.

"నాయనా! మా ప్రాణాలు పోతున్నాయి. పుణ్యాత్ముడా! మాకు ప్రాణదానం చేసి మమ్మల్ని రక్షించు. నువ్వీ సమయంలో రక్షించకపోతే మేమంతా చస్తాం. రామలక్ష్మణులు కూడా చనిపోతారు. వారికొరకు విలపిస్తూ అయోధ్యలోని

అందరూ చస్తారు. ఇంతమంది ప్రాణాలు నీచేతిలో వున్నాయి. నువ్వు ధైర్యంలో, కార్యసాధనలో, సామర్థ్యంలో రెండో గరుత్మంతుడివి. కొండలు, అడవులతో సహా వున్న ఈ భూమండలాన్ని త్రివిక్రమావతార సమయంలో ఇరవైఒక్క సార్లు ప్రదక్షిణగా తిరిగావు. సముద్ర మధన సమయంలో దేవతల ఆజ్ఞానుసారం మహౌషధుల తీగలను నేను పోగుచేసాను. ఆ తీగలలో అమృతం పుట్టింది. అప్పుడు నాకు అసమానమైన బలం, వేగం వుండేది. నాకాలం అంతా అయిపోయింది. ఇప్పుడు ముసలివాడిని. పరాక్రమహీనుడిని. ఇలా అయిపోయాను. విచారపడి ఏం ప్రయోజనం? నా మాట అలా వుంచు. నువ్విప్పుడు సమస్త సద్గుణాలు కలవాడివి. భూమ్మీద ఉన్నవారిలో బలంలో, దూరం పోవడంలో నువ్వే గొప్పవాడివి. నిన్ను మించినవాడు లేడు. ప్రాణికోటిలో నీలాగా ఏదీ పోలేదు. ఏదీ నీ విజృంభణం, పరాక్రమం చూపించు. మా హనుమంతుడు ఇంతటివాడు కదా అని ప్రత్యక్షంగా చూసి సంతోషిస్తాం. వానరోత్తమా లెమ్ము. ఈ సముద్రాన్ని దాటు. (ఉత్తిష్ఠ హరి శార్దూల లంఘ యస్వ మహార్ణవమ్....అనే వాల్మీకి రామాయణంలోని ఈ మాటల ఆధారంగా వాసుదాసు ఆంధ్రవాల్మీకి రామాయణ రచనకు పూనుకున్నారు) ఈ వానరసేనలు నీ వేగాన్ని, పరాక్రమాన్ని చూడడానికి ఆశతో వున్నారు. వీరి కోరిక తీర్చు. నీ శక్తి చూడడానికి కోరికగా వున్నారు వానరులు కాబట్టి నువ్వు ఉపేక్షించ వచ్చా?''

జాంబవంతుడు ఇలా ప్రోత్సహించగా, ప్రేరేపించగా ఆ క్షణంలోనే హనుమంతుడు విజృంభించాడు. వానరులు సంతోషంగా చూస్తుంటే తన దేహాన్ని పెంచాడు.

సర్గ–67

జాంబవంతుడి మాటలకు విజృంభించిన హనుమంతుడు

నూరామడల వెడల్పుకల సముద్రాన్ని దాటడానికి బలం పెంచుకుని, విజృంభిస్తున్న పరాక్రమవంతుడిని, సిద్దుడైన ప్రసిద్ధుడిని, వానరనాథుడిని, హనుమంతుడిని వానరులు చూసి తమ దుఃఖాన్ని వదిలి, సంతోషంచి కిల–కిలమని చప్పుడు చేస్తూ ఆంజనేయుడిని పొగిడారు. అలా వానరులంతా మితిమీరిన ఆశ్చర్యంతో తనను చూస్తుంటే, ఆంజనేయుడు దేహాన్ని పెంచి, విస్తారబలసంపన్నుడై, తోక జాడించాడు. కొండ గుహలోని సింహంలాగా ఆంజనేయుడు దేహాన్ని పెంచి విజృంభించగా వానర శ్రేష్ఠులు మేలు–మేలని పొగిడారు. అప్పుడాయన దట్టమైన కాంతితో ప్రకాశించాడు. ఆ సమయంలో ఆంజనేయుడి ముఖం ఎర్రగా, కాలిన పెనంలా, పొగలేకుండా కణ–కణ మనే నిప్పుల కుప్పలాగా కనిపించింది. దేహంలో వెంట్రుకలు నిక్కపొడుచుకాగా వానరుల మధ్యనుండి లేచి, వానరులలో పెద్దవారికందరికీ నమస్కారం చేశాడు.

కపులకు తన పరాక్రమం చెప్పిన హనుమంతుడు

అందరికీ నమస్కారం చేసిన ఆంజనేయుడు తన పరాక్రమం గురించి ఇలా అన్నాడు.“ సముద్రాన్ని దాటడం అనే గొప్పకార్యం సాధించడానికి లోకంలో నాకు సమానమైన వారు లేరు. నా తండ్రికి నేనే సమానమైన వాడిని. మేరు పర్వతానికి వెయ్యి సార్లు ప్రదక్షిణ చేసి రావాల్నా? సముద్రంలోని నీళ్లు చేతులతో ఎగజల్లి, కొండలతో, అడవులతో, మడుగులతో నిండిన భూమిని ముంచాల్నా? నేను పొయ్యేటప్పుడు నా పిక్కల వల్ల కలిగిన గాలితో మొసళ్లతో కూడిన సముద్రాన్ని ఆకాశానికి ఎగజిమ్మాల్నా? ఆకాశంలో వేగంగా తిరుగుతున్న

గరుత్మంతుడిని వెయ్యి సార్లు ప్రదక్షిణ చేయాల్నా? ఇక్కడి నుండి ఎగిరిపోయి పొడుస్తున్న సూర్యుడిని సమీపించి ఆయన పడమటి కొండ చేరే లోపల నేను ఆకడికి పోయి ఆయన నెత్తిమీద వున్నప్పుడు ఎదురు రావాల్నా? అక్కడి నుండి భూమ్మీద దిగకుండా ఇక్కడికి రాగలను".

"నా బలవేగంతో ఆకాశాన సంచరించే వాటినన్నిటినీ దాటి పోగలను. నువ్వు గింజంత తునకలయ్యేట్లు భూమిని చీల్చాలా? సముద్రాన్ని ఎండబెట్టాలా? పర్వతాలను చేతులతో పిండి-పిండిగా దంచాలా? తొడల వేగంతో భయంకరమైన సముద్రాన్ని నావెంట వచ్చేట్లు చేయాల్నా? భయంకరమైన దేహం కల ఆంజనేయుడిని ఏమని అనుకుంటున్నారు? మనలాంటి బక్క కోతే కదా అనుకుంటున్నారా? రివ్వున ఆటలో తిరిగినట్లే చక్కగా ఆకాశంలో పోతుంటే, తీగల్లో, చెట్లలో, వున్న పూలు ఆ వేగానికి తటాలున తెగి నా వెంట వస్తున్నప్పుడు నేను పోయే మార్గం నక్షత్రాలతో దీర్ఘమైన ఆకాశంలాగా చూసేవారికి కనిపిస్తుంది. ఆకాశంలో పైకి ఎగురుతూ, కిందికి దిగుతూ నేను పోయేటప్పుడు ప్రాణికోటులన్నీ ఆశ్చర్యంతో స్పష్టంగా నన్ను చూడగలవు. పెద్ద మేఘం ఆకాశాన్ని కప్పినట్లు మేఘమంత శరీరం కలవాడినై ఆకాశాన్ని ఆవరించి దాన్ని మింగేవాడిలాగా పోతుంటే వానరులారా మీరే చూస్తారు. పర్వతాలను గడ-గడ వణికేట్లు చేస్తూ, సముద్ర జలాలను సల-సల వుడికేట్లు చేస్తూ, మహా వేగంగా మేఘాలను అదరగొట్టుతూ వానరులారా! నేను సముద్రాన్ని దాటుతాను. మీరు చూస్తూ వుండండి".

"బలంలో, వేగంలో వాయువుకు, గరుత్మంతుడికి సమానుమైన వాడిని. నా వెంట పక్షిరాజైన గరుత్మంతుడు, వాయువు తప్ప మరెవ్వరూ రాలేరు. నేను నిమిషంలో ఆకాశానికి ఎగిరి నిరాధారంగా సముద్రాన్ని దాటేటప్పుడు త్రివిక్రమావతారుడైన విష్ణుమూర్తి లాగా ప్రకాశిస్తాను. సీతాదేవిని చూడలేక పోయామే అన్న విచారాన్ని వదలండి. అపాయం లేదు. సంతోషంగా వుండండి. నా అంతఃకరణం ఉత్సాహంగా వుంది. అంతఃకరణం నిర్మలంగా వుంది, ఉత్సాహపూరితంగా కార్యం అవుతుందని చెప్పితే తప్పక జరుగుతుంది. వాయువేగ, గరుడవేగాలకంటే అధికమైన వేగంతో వెయ్యి యోజనాల సముద్రాన్నైనా దాటగలనని భావిస్తున్నాను. అలాంటప్పుడు నూరు యోజనాలు ఒక లెక్కా? స్వయంభువైన బ్రహ్మ, వజ్రాయుధం ధరించిన ఇంద్రుడి చేతిలో వున్న అమృతాన్నైనా నా భుజబలంతో బలాత్కారంగా తేగలను. పునాదితో సహా

లంకానగారాన్ని కూడా పెరికి ఈడ్చుకుని రాగలనని సందేహం లేకుండా తోస్తున్నది".

ఈ విధంగా మేఘగంభీరధ్వనితో చెప్తున్న వానరాదిపతిని, మహాతేజుడిని చూసి, వానరులంతా ఆశ్చర్యపడి చాలా సంతోషించారు. అప్పుడు జాంబవంతుడు హనుమంతుడిని చూసి, "జగత్ప్రాణకుమారా! వీర సమూహంతో స్తోత్రం చేయబడే వాడా! కేసరి పుత్రా! బంధువుల శోకాన్ని ఆర్పావు. నాయనా! మేలు–మేలు. కాబట్టి నీ మేలు కోరుతున్న ఈ వానర మండలమంతా నీకు కార్యసాధనకై, నీకు మంచి దీవెనలు ఇస్తున్నది. మునుల అనుగ్రహ ప్రభావం వల్ల, వానర వృద్ధుల అభిప్రాయం వల్ల, గురువుల దయ చేత, కపిశ్రేష్టా! నువ్వీ మహాసముద్రాన్ని దాటి కీర్తితో ప్రకాశిస్తావు. నువ్వు చేయబోయే కార్యం తపస్వులకు, సాధువులకు సంతోషమైనది. కాబట్టి వారు నిన్ననుగ్రహిస్తారు. కులానికి కీర్తి తేబోతున్నావు కాబట్టి కులవృద్ధులు నిన్నుగ్రహిస్తారు. ఇలాంటి మహాత్ముడు మనకు శిష్యుడయ్యాడు కాబట్టి గురువులు నీమీద దయ చూపుతారు. ఈ బలంతో నువ్వు సముద్రాన్ని దాటుతావు. కీర్తి సంపాదిస్తావు".

మహేంద్రాద్రి ఎక్కిన హనుమదాదులు

"హనుమంతా! నువ్వు వచ్చేదాకా మేం ఒంటి కాలుమీద ఇక్కడే కాచుకుని వుంటాం. ఈ వానర సేనా సమూహాల ప్రాణాలన్నీ నీ అధీనంలో వున్నాయి. నువ్వు మళ్లీ తిరిగి వచ్చి ఎవరి ప్రాణాలు వారికివ్వాలి" అని సంతోషంతో అన్నాడు జాంబవంతుడు.

అప్పుడు ఆంజనేయుడు వానరులతో అన్నాడిలా. "నేను దాటే వేగానికి భూమి కొంచెమైనా సహించలేదు. ఆ మహేంద్ర పర్వత శిఖరాలు రమ్యంగా కదలికలేని రాళ్లతో నిండి వున్నాయి. అనేక వృక్షాలతో నిండి వున్నాయి కాబట్టి, శ్లాఘించే రీతిలో వున్నాయి. ధాతువుల నుండి స్రవించు రసంతో మనోహరంగా వున్నాయి. కఠినంగా కూడా వున్నాయి. కాబట్టి నూరామడ సముద్రాన్ని దాటడానికి నేను ఉత్సాహంగా కాళ్లతో తొక్కినప్పుడు అవి సహించగలవు". అని కొండమీదికి వానరులతో సహా పోయాడు.

అక్కడ నానారకాల చెట్లతో, పొదలతో, సకల రకాల మృగాలతో, ఫల–పుష్పాల చెట్లతో, జల ప్రవాహాలతో, సింహాలు, పులులు తిరుగుతూ వున్న,

పక్షుల కోలాహలంతో నిండిన, మదించిన ఏనుగులున్న గొప్ప ప్రదేశంలో హనుమంతుడు సంచరించాడు. ఆంజనేయుడి పదఘట్టనతో పీడించబడి, సింహంతో కొట్టబడ్డ ఏనుగులాగా, ఆ పర్వతం వుంది. ఆ పర్వతం తారుమారై, చెదిరిన రాలుగలదై, నీటి వంకలను కక్కింది. భయపడిన మృగాలు, కదులుతున్న చెట్లు, ఎగిరిపోయే పక్షులు, మధుపానసక్తులైన గంధర్వ నాగ దంపతులు, బొక్కల్లో దూరే పాములు కలిగి, దొర్లుతున్న రాళ్లు ఒకదానితో ఒకటి తగులుతుంటే అవి చాలా బాధపడి నిట్టూర్పులు విడిచాయి. ఆ పర్వతం ధ్వజంతో కూడిన దానిలాగా భయం కలిగించాయి. ఆ పర్వతాలు ఒంటరిగా చిక్కిన బాటసారిలాగా వున్నాయి. అప్పుడు వానరశ్రేష్టుడైన హనుమంతుడు లంకకు పోవాలని నిశ్చయించుకున్నాడు.

కిష్కింధాకాండాంత పద్యాలు

మాయాతీతా నిజగురు, మాయాకలితావతార మాయావిమహా
మాయాథఃకరణచణా, మాయామయదివ్యదేహ మాయామోహా

"ప్రకృతిని అతిక్రమించిన వాడా! స్వసంకల్పానుసారంగా అవతరించే వాడా! మోసగాళ్ల మోసాలను అణచడంలో సమర్థుడా! ఆశ్చర్యకరమైన అప్రాకృతమైన దివ్య శరీరం కలవాడా! ప్రకృతితత్త్వంతో జీవతత్త్వాన్ని మోహించేట్లు చేసేవాడా!

స్నిగ్ధ జనపాలనవి శిష్టసుచరిత్రా! ముగ్ధతరజీవిచయ మోహపరితప్తా
దిగ్ధనిదివాస బుధ తోషణవిదగ్ధా దిగ్ధసరసీజసమ దృగ్ధర రమేశా!

భామా భయదా కృ పాళువరా
భూమిరుహచారి పుంగవహా
రామైకశిలాపు రాశ్రయణా
సోమాననబింబ సోమనుతా

జానకీ రఘురామ చరణసేవాసక్త చిత్తుడై తత్కృపా సత్తికతన
వామలూరూద్భవు పాదముల్ తలదాల్చి, ప్రత్యక్షబ్రహ్మాత్మ భవున కెరగి
యభివాదనము సల్పి యాచార్యులకు నెల్ల, వ్యాఖ్యాతలకును సా ష్టంగ మెరగి
పరమ భక్తులను బ్రపన్నులు ముదమొంద, స్వాంధ్రవాల్మీకి రా మాయణమున

ఘనతరంబైన వనచర కాండమునకు, వాసుదాసుండు రచియించి వ్యాఖ్య దీని
మందరమనంగ శ్రీరామ చంద్రవిభువ,కర్పణంచేసె జన్మంబు సార్థకముగ
తన పాదభక్తుల తనయునిగాజేసి, యనుకంప వీక్షించె జననమంద
ఆవల దా లక్ష్మణార్యుడై రక్షించి రామాయణం బను గ్రహము చేసె
స్వీయమంత్రంబును జేట్లూరి నరసింహ, దేశికుండై యుప దేశ మిచ్చె
ఏకశిలానాగ రౌకుడై గ్రహియించి, యాంధ్రవాల్మీకిరా మాయణంబు

వ్యాఖ్య దానికిపుడు వ్రాయించు కొనియెను, గరిమతో వనచర కాండమునకు
వాసుదాసుచేత స్వప్రభావంబును, బ్రకటపరుప రామ భద్ర విభుడు.

కిష్కింధాకాండ సమాప్తం

నమోస్తు రామాయ స లక్ష్మణాయ, నమోస్తు దేవ్యై జనకాత్మజాయై
నమోస్తు వాతాత్మభువే వరాయ, నమోస్తు వల్మీక భవాయ తస్మై





వనం జ్వాలా నరసింహారావు తండ్రి వనం శ్రీనివాసరావు గారు – పరమ భాగవతోత్తములు. శ్రీరామ భక్తులు.. తన 83వ ఏట 1998లో పరమపదించారు. తల్లి వనం సుశీలమ్మ గారు– సహస్ర చంద్ర దర్శనం చేసుకొని నవంబర్ 2013లో తన 90వ ఏట మరణించారు. స్వగ్రామం – జన్మస్థలం – ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలం, వనం వారి కృష్ణాపురం గ్రామం, ఆగస్ట్ 15, 1947 న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాదికి. ఆగస్ట్ 8, 1948న జననం. ఒక అక్క, ఇద్దరు చెల్లెళ్ళు, నలుగురు తమ్ములు, విద్యాభ్యాసం. సొంత గ్రామంలో మాధ్యమిక, ఉన్నత పాఠశాల చదువు ఖమ్మంలో కళాశాల చదువు ఖమ్మం, హైదరాబాద్ లలో విశ్వవిద్యాలయం చదువు ఉస్మానియా, నాగపూర్ లలో.. లెక్కలు, భౌతిక రసాయన శాస్త్రాల్లో డిగ్రీ అడ్మిని స్ట్రేషన్ లో ఎంఏ లైబ్రరీ సైన్స్ లో డిగ్రీ. వివాహం, ఏప్రియల్ 30, 1969న (స్వర్గీయ) అయితరాజు రాంరావు – రాధ గార్ల కుమార్తె విజయలక్ష్మీతో నివాహం. ఇద్దరు ఆడపిల్లలు (ప్రేమ మాలిని, కిన్నెర), ఒక కొడుకు (ఆదిత్య). ఆరుగురు (యశ్విన్, మిహిర, అన్ష్ , మేథ, కనక్ , ఇరా) మనుమలు, మనుమరాళ్లు.

ఉద్యోగాలు – ఇతర వ్యాపకాలు, లైబ్రేరియన్ గా జీవనయానం ప్రారంభం ... గవర్నర్ కుముద్ బెన్ జోషి దగ్గర ప్రాజెక్టు అధికారిగా, (మాజీ) ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నా రెడ్డి దగ్గర పౌర సంబంధాల అధికారిగా... హస్తకళల అభివృద్ధి సంస్థలో కొన్నాళ్లు... మర్రి చెన్నా రెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో కొంత కాలం ... అత్యవసర సహాయ సేవల సంస్థలో మరికొంతకాలం.... ఇలా అక్కడా ఇక్కడా... ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి దగ్గర ప్రధాన ప్రజా పౌర సంబంధాల అధికారిగా. ఆంగ్లంలో పుస్తకాలు – హైదారాబాద్, చెన్నై, గోవా (స్టర్లింగ్ పబ్లిషర్స్), ఎ సింక్రోనస్ హిస్టరీ స్క్రాప్ బుక్, యాన్ ఎజెండా ఫర్ డెవెలప్మెంట్ ఆఫ్ ఏపీ, గవర్నెన్స్ విత్స్ డిఫరెన్స్, 51 మంత్స్ ఆఫ్ కేసీఆర్ గవర్నెన్స్ విత్ డిఫరెన్స్, తెలుగులో తిలక్ జ్ఞాపకాలు, అనుభవాలే అధ్యాయాలుగా, ఇదీ సుపరిపాలన, సుందరకాండ మందర మకరందం, బాలకాండ మందర మకరందం, అయోధ్య కాండ మందర మకరందం. అరణ్యకాండ మందర మకరందం, ధర్మధ్వజం, ఇది సుపరిపాలన – 51 నెలల కేసీఆర్ ప్రభుత్వం.

Kishkindhā-Kāṇḍa MANDARA MAKARANDAM

Written by: *Vanam Jwala Narasimharao*

Published by: *Darshanam Devotional Magazine*